


# ప్రేమించాక ఏమైందంటే..!

బలభద్రపాత్రుని రమణి

# ప్రేమించాకా ఏమైందంటే....!

క్షీరసాగరమథనం అప్పుడు బయటపడ్డ చంద్రుడూ, లక్ష్మీదేవీ, కామధేనువూ, కల్పవృక్షమూతోబాటు పైకివచ్చిన మరో అద్భుతంలా వుంది ఆ ఆసుపత్రి.

వరండా మెట్లు పాలతో కడిగారా అన్నట్లు తెల్లగా, స్వచ్ఛంగా మెరుస్తున్నాయి. రాజహంసల్లా తెల్లని యూనిఫారాల్లో నర్సులు ఏ భావం లేని మొహాలతో సాలభంజికల్లా కనిపిస్తున్నారు. తెలుపు- శాంతికి చిహ్నం, మృత్యువుకి సమీపం. అందుకే చనిపోగానే తెల్లబట్ట కప్పుతారు.

అక్కడ ఎటుచూసినా తెలుపే. నక్షత్రాల ఆస్పత్రి తీవిగా వుంది.

ఆపరేషన్ థియేటర్ అని వ్రాసున్న బోర్డుమీద ఎర్రలైటు వెలుగుతోంది.

లోపల బెడ్‌మీద పడుకున్న యువకుడికి ఆక్సిజన్ పెట్టారు. కార్డియోగ్రాఫ్‌లో హార్ట్‌బీట్ ఆగిపోవడం కనిపిస్తోంది. క్షణాలు నిశ్శబ్దంగా దొర్లిపోతున్నాయి. అతని గుండె నెమ్మది నెమ్మదిగా ఆగిపోతోంది.

డాక్టర్ల మొహంలో ఉద్వేగం కనిపిస్తోంది. నుదుటిమీద పట్టిన చిరుచెమట వారు ఆ ప్రాణాన్ని కాపాడ్డానికి పడుతున్న తపనని పుట్టిస్తోంది. అయినా లాభం కనిపించలేదు. అతని గుండె స్పందనలేని ఘనపదార్థంలా స్తంభించింది.

బయట రెడ్‌లైట్ ఆరిపోయింది.

అతని తాలూకువాళ్ళు అందరూ బయట గోల్లుమన్నారు.

డాక్టర్ బయటికి రాగానే చుట్టుముట్టారు.

"ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్" అంటున్న ఆయన పరిగెత్తుకొంటూ వస్తున్న అమ్మాయిని చూసి ఆగిపోయాడు.

ఆమె ఎంతో దూరంనుండి పరుగెత్తుకు వస్తున్నట్లు ఆమె ఆయాసం చెపుతోంది. వగరుస్తూనే— "డాక్టర్ ఎక్కడ....నా రాజు ఎక్కడ?" అని అడిగింది.

"హి ఈజ్ నో మోర్!" బాధగా చెప్పాడు డాక్టర్.

"నో...." ఆమె పెద్దగా పెట్టిన కేకకి అనువర్తి ప్రతిధ్వనించింది.

"రాజూ....రాజూ....నే వచ్చేసా...." అంటూ ఆమె లోపలికి పరిగెత్తింది.

నర్స్ అప్పుడే రాజు మొహంమీద తెల్లని బట్ట కప్పబోతోంది.

ఆమె ఒక్క ఉదుటున అతని మొహంమీద బట్ట తొలగించి, మొహంలో మొహంపెట్టి కన్నీళ్ళు కారిపోతుండగా అంది— "కళ్ళు తెరు రాజూ! నాకోసం....మన ప్రేమకోసం.... నువ్వు బ్రతకాలి. నువ్వు బ్రతికి ప్రేమని గెలిపించాలి. ఐ లవ్ యూ.... ఐ లవ్ యూ.... ఐ లవ్ యూ!"

ఆ మాట దిగంతాలవరకూ వ్యాపిస్తోంది.

సముద్రాలు....గిరులు....ధరులు అన్నీ ఒక్కపెట్టున ఘోషించాయి. విచిత్రంగా అతని హార్ట్‌బీట్ స్టార్ట్ అవడం గ్రాఫ్‌లో కనిపించింది.



ఆమె వెనకనుండి డాక్టర్ కూడా కీచుగా కేకలు పెట్టడం వినిపించింది.

నర్స్ మూర్ఛవచ్చినట్లు చేతులు, కాళ్ళు ఆడిస్తూ అరిచింది.

రాజులో కదలిక ప్రారంభమయింది.

ఆ అమ్మాయి జపంలా అదేమాట అంటూ అతని ముఖాన్ని ముద్దులతో నింపేస్తోంది.

"ఐ లవ్‌యూ....రాజూ....ఐ లవ్ యూ!"

రాజు కళ్ళు తెరిచాడు.

ఆమె ధారాపాతంగా కన్నీళ్ళు కారిపోతుండగా అతని గుండెలమీద వాలింది.

రాజు ఆమె తలమీద చేతిని వేసి "మన ప్రేమ గెలిచింది రాణీ!" అన్నాడు.

సినిమా తెరమీద 'శుభం' అని పడింది.

అప్పటిదాకా వేరుశనక్కాయలు తింటూ చూస్తున్న కీర్తి భుజంమీద తన చెయ్యేసి గట్టిగా నొక్కుతూ మైత్రి "వావ్!" అంది.

కీర్తి ఆమె మొహంలోకి చూసింది.

ఆమె ఇంకా ఏవో అద్భుతలోకాల్లో తేలిపోతున్నట్లు కళ్ళు అరమోడ్చి చూస్తోంది.

"పద" అంటూ కీర్తి లేస్తుంటే ఒళ్ళోంచి ఎకనామిక్స్ బుక్ జారిపడింది.

"ముప్పైరూపాయలు. ఎకానమీ ప్రకారం నష్టం" అని గొణిగింది కీర్తి.

సినిమా హాల్లోంచి బయటకొస్తున్న జనమంతా గంభీరంగా వున్నారు. నడివయసు దాటిన మగాళ్ళు కొందరు మాత్రం పెద్దగా నవ్వుతూ ఏదో కామెంట్ చేస్తున్నారు.

అమ్మాయిలంతా హీరోయిన్ తమలో పరకాయప్రవేశం చేసినట్లుగా గర్వంగా చూస్తూ తమదికాని పద్ధతిలో వయ్యారంగా నడుస్తున్నారు.

అబ్బాయిలు బోలెడు కాన్షస్‌గా దొంగచూపులు చూస్తూ అమ్మాయిల్ని తాకడానికి ప్రయత్నిస్తూ నడుస్తున్నారు.

కీర్తి, మైత్రి బస్‌స్టాప్ కొచ్చారు.

మైత్రి బస్‌స్టాప్‌లో జనాన్నీ, కాస్త దూరంలో అడుక్కుంటున్న బిచ్చగత్తెనీ చూస్తూ "గైడ్ కొనడానికి అమ్మ యిచ్చిన పాతిక రూపాయలూ పోయాయని చెప్పనా?" అని అడిగింది.

కీర్తి వెంటనే "ఒద్దు అబద్ధం చెప్పకు" అంది.

మైత్రి సిగ్గుపడి "నాకూ చెప్పాలనిలేదు కానీ" అని నసిగింది.

"అబద్ధాలు చెప్పాల్సిన రోజులు ముందు ముందు ఇంకా చాలా వస్తాయి. వేస్ట్ చెయ్యకు" తత్వవేత్తలా చెప్పింది కీర్తి.

మైత్రి నవ్వేసింది.

"ఏం చెప్పమంటావు? మొన్ననే క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు చూస్తున్నామని ఒక క్లాసు తీసింది. మళ్ళీ వెళ్ళానని చెప్తే తిడుతుంది" అంది.

"ఫర్లేదు. తిట్టాల్సినపనేగా చేసాం. అయినా అమ్మేగా తిట్టేదీ" అంటూ కీర్తి క్యాడ్‌బరీస్ చాక్లెట్ సగం కొరికి మిగతా సగం మైత్రికి అందించింది.

మైత్రి చాక్‌లెట్ తింటూ "కీర్తీ.... సినిమా అద్భుతంగా వుంది కదూ?" అంది.

"అద్భుతమే మరి! చచ్చిపోయినవాడు ఐ లవ్ యూ అనగానే లేవడం....అది అంత సులభమయితే ఇన్ని స్టార్ హాస్పిటల్స్, ఇంతమంది డాక్టర్స్ ఎందుకో!" హేళనగా అంది కీర్తి.

మైత్రి చిరాగ్గా "ఛీ! నీకు స్పందనలేదు" అంది.

కీర్తి చెయ్యి చాపుతూ "గిచ్చి చూడు" అంది.

మైత్రి గట్టిగా గిచ్చింది.

కీర్తి కెవ్వున అరిచి "ఈ స్పందన చాలు" అంది.

మైత్రి నవ్వుతూ— "లవ్ కెన్ డూ మిరకిల్స్.... ఒప్పుకోమరి" అంది.

"సరే....ఇంక మామూలు ప్రపంచంలోకి వస్తావా? ఇప్పుడొస్తున్న బస్ నిండుగా, పూర్ణంకూరిన కజ్జికాయలా వుంది. నువ్వు పీ.టీ ఉషలా.... నేను ఉషార్‌లా పరిగెత్తి క్యాచ్ చెయ్యాలి. లేదా ఇంట్లోవాళ్ళ లవ్ మొత్తం మనమీద తిట్ల రూపంలో గుమ్మరిస్తారు. రెడీ.... వన్.... టూ" అంటూ



కీర్తి పరుగు అందుకుంది.

ఆమె వెనకాలే మైత్రి కూడా బస్‌కోసం పరుగెత్తింది.

మొదటి మెట్టుమీద కాలు పెట్టడమే వాళ్ళ వంతయింది. ఆ తరువాత ఆటోమేటిగ్గా ముందు వాళ్ళచేత తోయబడుతూ ఎక్కడికో వెళ్ళిపోయారు. కారాకిళ్ళీ, చెమటా, జోన్న.... అన్నీ కలిసిన వింత వాసన ముక్కుల్ని అలరిస్తోంది!

కీర్తి ఒంటికాలిమీద నిలబడి, పట్టుకునే ఆధారం దొరక్క అటూ ఇటూ చూసి పైన రాడ్ అందుకుంది.

"లాస్ట్ సీన్ మాత్రం హైలెట్. వందరోజులాడించేస్తుంది" మైత్రి కూడా ఒంటికాలిమీద నిలబడి, రష్యన్ సర్కస్ చేసే అమ్మాయిలా మాట్లాడేస్తోంది.

కీర్తి ఆమె చెవిలో "నా బ్యాగ్ ముందు అరలో చెయ్యిపెట్టి ఒక నీలిరంగు కాయితం వుంటుంది తియ్యి" అంది.

"బస్ పాసా?" అడిగింది వెతుకుతూ మైత్రి.

"కాదు! మా బావ రాసిన ఉత్తరం" అంది కీర్తి.

"హే!" చిన్నగా కన్నుకొట్టి మైత్రి నీలిరంగు కాయితాన్ని బయటికి తీసింది

"దొరికిందా....చదువు" అని పైనున్న రాడ్‌ని చెయ్యి మార్చుకుంది కీర్తి.

"ఇప్పుడా?" మైత్రి ఇబ్బందిగా చూసింది. ఆమె వెనకాల నిలబడ్డ కుర్రాడు కావాలనే మీదపడి వీలైనంతగా ఆమె శరీరాన్ని తాకుతూ ఆనందిస్తున్నాడు. వీళ్ళు తూలినప్పుడల్లా ముందర నిలబడ్డ ముసలమ్మ గొణుగుతూ ఏదో తిడుతోంది.

కాలేజీ అమ్మాయిల్ని చూస్తే వయస్సుడిగిన వాళ్ళకి అకారణ ద్వేషం!

"కీర్తి నెమ్మదిగా, గట్టిగా పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్‌లా అక్కర్లేదు. నెమ్మదిగా చదువుకో" అంది.

మైత్రి రెండు వేళ్ళమధ్య దాన్ని పట్టుకుని కష్టపడి చదివింది.

"నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు చెప్పేది వింటాను. నువ్వు

చెయ్యమన్నది చేస్తాను. నీకోసం ప్రార్థిస్తాను. హైల్!"

చదవడం ఆపి "చాలా రొమాంటిగ్గా వ్రాసాడే మీ పప్పుముద్ద! కానీ.... చివర్లో ఈ హైల్ అన్న పదమే అర్థంకాలేదు, నీ ముద్దు పేరా?" అంది.

కీర్తి "ఏదీ చూపించు" అంటూ ఆ కాయితాన్ని చూసి పెద్దగా నవ్వింది.

వెనకనున్న కుర్రాడు ఏదో కామెంట్ చేసాడు. అందరూ తలలు తిప్పి వీళ్ళవంక వింతగా చూసారు. ఆ త్రిశంకు స్వర్గంలో వేళ్ళాడుతూ నవ్వుకోగలిగినందుకు ఈర్ష్య కాబోలు!

"ఏమిటే ఆ నవ్వు?" అంది మైత్రి.

"అది నా హిస్టరీ నోట్స్‌లో పేజీ. హైల్ అంటే...." కీర్తి మళ్ళీ నవ్వి "నా ప్రియతమ నాయకుడా అని హిట్లర్‌ని సంబోధించే పదం." అని నవ్వడం కొనసాగించింది.

మైత్రి ఆశ్చర్యంగా "రోజూ ఇలా ప్రార్థించేవారా?" అంది.

"ఆ.... చివరికి పిల్లలు స్కూల్ నుండి ఇంటికొచ్చి తల్లిదండ్రుల్ని 'హైల్ హిట్లర్' అని విష్‌చేసే పరిస్థితి కూడా వుండేదిట! ఏదైనా ముదిరితే పర్వెర్షన్‌గా మారుతుంది. ఇంకో కవరుంటుంది. అది తియ్యి" అంది కీర్తి.

మళ్ళీ మైత్రి గాల్లో ఒంటికాలిమీద నిలబడి కీర్తి బ్యాగ్‌లో చెయ్యి పెట్టి. "ఉండరా...." అంది వెనక అబ్బాయిని.

అతను కంగుతిన్నట్లు చూసి పక్కకి జరిగాడు.

"పన్లో వున్నాను కదా.... అలా మీద పడిపోతావే" కీర్తితో గట్టిగానే అంటూ కవర్ బయటికి తీసింది.

ఆ అబ్బాయి తలవంచుకుని వెనక్కి వెళ్ళిపోయాడు.

కీర్తి మళ్ళీ గట్టిగా నవ్వింది.

మైత్రి కీర్తి బావ వ్రాసిన ఉత్తరాన్ని మనసులో చదువుకుంది.

"కీర్తీ బావున్నావా? నా ట్రెయినింగ్ పీరియడ్ పూర్తయింది. నాగ్‌పూర్ పోస్టింగ్ వేస్తారట. బహుశా నీ ఫైనల్ ఇయర్ పరీక్షల ముందే మన పెళ్ళి జరుగుతుందనుకుంటా! పరీక్షలయ్యేదాకా మీ ఇంట్లోనే



వుంచి, అయ్యాకా ఇక్కడికి తెచ్చుకుంటాను.... మావయ్యకి చెప్పి ఒక ఫ్రిస్టేజీకుక్కర్ కొనిపించు! నేను ఇస్త్రీ పెట్టికొన్నాను. దాంతో బాగా అదా అవుతోంది. మా అమ్మ శకుంతల అక్కయ్య దగ్గరే వుందిట. ఆదివారం వెళ్ళి చూసిరా. వెళ్ళేటప్పుడు మా అక్కయ్య కొడుక్కి ఫైవ్‌స్టార్ చాక్‌లెట్, మా అమ్మకి కర్జూరం కొనుక్కెళ్ళు. అత్తయ్యకీ, మావయ్యకి నమస్కారాలు చెప్పు.

-ఉదయ్."

చదివి కీర్తి మొహంలోకి చూసి ఒక నిట్టూర్పు విడిచింది.

కీర్తి నవ్వి "ఏం అర్థమైంది?" అంది.

"ఆదివారం నీకు కాబోయే అత్తగారి దగ్గరికి వెళ్తావని" అంది మైత్రి.

"ఇదే జీవితం!" కీర్తి కాలు మార్చుకుంటూ అంది.

"అంటే?" మీద పడుతున్న ముసలాయన్ని మోచేత్తో వెనక్కి నెడుతూ అడిగింది మైత్రి.

కీర్తి గంభీరంగా చెప్పింది. "తొంభై తొమ్మిది శాతం జీవితాల్లో అద్భుతాలు జరగవు! మామూలుగానే ఒక అమ్మాయికీ, అబ్బాయికీ వయసు రాగానే పెళ్ళవుతుంది, పిల్లలు పుడతారు. వాళ్ళు పెద్దవాళ్ళు అవుతారు. వీళ్ళు ముసలాళ్ళు అవుతారు.... చివరికి పోతారు" ఒంటికాలి మీద నిలబడి నిండుబస్సులో సంవత్సరాల తరబడీ తపస్సు చేసిన జ్ఞానిలా చెప్పింది.

మైత్రి టక్కున "నాకు మాత్రం అలాంటి రొటీన్ లైఫ్ ఒద్దు!" అంది.

"మే గాడ్ బ్లెస్‌యూ!" అంది కీర్తి.

"పద...." అని ముందుకి నడుస్తూ, వెనకనున్న వాళ్ళతో "ఇంక సరిగ్గా నిలబడచ్చు. మేం దిగిపోతున్నాం. బొత్తిగా పరాధార జీవులు!" అని తిట్టుకుంటూ నడిచింది మైత్రి.

ఇద్దరూ గజఈతగాళ్ళల్లా అందర్నీ తోసుకుంటూ, తొక్కుకుంటూ వచ్చి క్రింద భూమిమీద కాలు ఆన్చి, ముక్కులనిండా స్వచ్ఛమైన గాలి పీల్చి వదిలారు.

"స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మనవాళ్ళు ఇలాగే ఫీలయివుంటారు"

అంది కీర్తి.

మైత్రి నవ్వేసి "కీర్తి....ఒకమాట అడగనా?" అంది.

"పర్మిషన్ గ్రాంటెడ్" చెప్పింది కీర్తి.

"నీకు మీ బావని తలుచుకోగానే ఏమనిపిస్తుందే?"

"ఎప్పుడో మాకు పెళ్ళయిపోయి....సంవత్సరాల తరబడీ కాపురం చేసి, ఒకరికొకరం పాతబడిపోయాం అనిపిస్తుంది" సిన్సియర్‌గా చెప్పింది కీర్తి.

"ఏదో మిస్ అవుతున్నాం అనిపించడంలేదూ?" జాలిగా అడిగింది మైత్రి.

"ఏం మిస్ అవుతున్నాం?" ఎదురుప్రశ్న వేసింది కీర్తి.

"పంతొమ్మిదేళ్ళ వయసులో ఒక ఆడపిల్ల అడగాల్సిన ప్రశ్నేనా ఇదీ?" మందలింపుగా అంది మైత్రి.

కీర్తి ఎప్పటిలా హాయిగా నవ్వేస్తూ "మీ ఇల్లొచ్చేసింది. గైడ్ డబ్బుల గురించి ఏం చెప్పుకోవాలో ఆలోచించుకో. నే వస్తా బై!" అని ముందుకి సాగిపోయింది.

ఎవడో సైకిల్‌మీదవెళుతూ "హాయ్ సోనాలీబింద్రే" అని కామెంట్ చేసి కన్నుకొట్టాడు.

మైత్రి ప్రశ్న గుర్తుచేసుకుంది కీర్తి.

తనేం మిస్ అవుతోంది? ఈ వయసులో అందుకోవాల్సిన ప్రేమ లేఖలూ...షికార్లూ....సినిమాలూ....ఇవేనా?

తండ్రి గుర్తొచ్చాడు.

కుటుంబాన్ని లాగి లాగి ఆయన వీపు ఒంగి ఒంగి పోయింది. తన చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ కష్టపడి ఒక దారికి తెచ్చేసరికి ఆయన పిల్లలు ఎదిగి కూర్చున్నారు.

కీర్తి వెనక ఇంకా ఒక తమ్ముడూ, చెల్లెలూ వున్నారు. కీర్తి కోసం సంబంధాలవేట మొదలెట్టక్కరలేకుండానే అక్కయ్య కొడుకు ఉదయ్ చేసుకుంటాననడం ఆయనకి ఓ వరంలా వుంది! కీర్తికి మాత్రం ఉదయ్ లాంటి ఇంజనీర్ వరుడు, కానీ కట్నం లేకుండా ఎక్కడినుంచి వస్తాడూ?

ఉదయ్....చాలా మంచివాడు!



పక్కపొడి వేసుకునే అలవాటు కూడా లేనంత సద్గుణ సంపన్నుడు. ఇవి అతని గురించి గొప్పగా అనుకునే మాటలు. బుద్ధిమంతుడు. అత్తయ్య గీసిన గీటు దాటడు అని తండ్రి తరచూ అంటూ వుంటాడు. ఎప్పుడూ కాలిక్యులేటర్‌తో లెక్కలు వేస్తూ వుంటాడు. 'జాగ్రత్తపరుడు' అని తల్లి సర్టిఫికేట్ ఇచ్చింది 'పిసినారిబావ' అని తమ్ముడూ, చెల్లెలూ కీర్తిని ఆటపట్టిస్తారు.

'భయస్తుడు' అని కీర్తి నవ్వుకుంటుంది.

కీర్తి ఇంటి గేట్ తెరుస్తుండగా "ఇంత ఆలస్యమయిందే తల్లీ?" అనడిగాడు సాంబమూర్తి.

"మైత్రీ, నేనూ సినిమాకెళ్ళాం నాన్నా" అంది కీర్తి.

"అమ్మ నీకు ఇష్టమని అరటికాయ బజ్జీలు చేసింది. త్వరగా కాళ్ళు కడుక్కో" అన్నాడు!

కీర్తి ఇంట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుంటూ తనని ఒక్కమాట కూడా అనని తండ్రిని తలుచుకుని గర్వంగా ఫీలయింది.

'మైత్రి ఇంట్లో వాళ్ళ అమ్మ దాన్ని తిట్టితిట్టి ఈపాటికి బీపీ తెచ్చుకుని వుంటుంది. ఆ సినిమా చూడకపోతేనేమంటే అది వినదు. ప్రేమకథా చిత్రాలంటే చాలు పరుగులు పెడుతుంది. అసలు ఈ ప్రేమంటే ఏవిటో" అనుకుంది కీర్తి.

తల్లి బజ్జీల ప్లేటుతో వచ్చింది.

నోట్లో వేసుకోగానే కరిగిపోయేటట్లు గుల్లగా, రుచిగా వున్నాయి బజ్జీలు. కీర్తి తింటుంటే, తల్లి ప్రేమగా తల నిమిరింది. 'ఇంతకన్నా రుచైనదా ప్రేమ?'

• • • •

ఆకాశంలో పేదరాశి పెద్దమ్మ నూలు వొడుకుతున్నట్లుగా తెల్లని మబ్బులు ముద్దముద్దలుగా పోగులు పడుతున్నాయి.

పిట్టగోడకి ఆనుకుని తదేకంగా చూస్తున్నాడు సిద్ధార్థ. అతని తెల్లని లాల్చీ గాలికి రెపరెపలాడుతోంది. మొహంమీద జుట్టు చిందరవందరగా పడుతోంది. అలా ఆకాశాన్ని తదేకంగా ఎంతసేపైనా చూస్తూ గడపగలడతను. చిన్న అపశృతిలా ఓ నక్షత్రం జారిపడింది. అతను కళ్ళు

మూసుకున్నాడు. చిన్నప్పుడు తాతయ్య చెప్పేవాడు చుక్క నేలరాలడం చూడకూడదని.

ఏం చెడు జరుగుతుందటా?

అతను వెనక్కి తిరిగాడు.

తండ్రి ఇందాక గంభీరస్వరంతో చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"ఆదివారం నువ్వు ఆ అమ్మాయిని....అదే శృతకీర్తిని చూస్తున్నావు. ఆ అమ్మాయి అయితే మన రెండు కుటుంబాలకీ బాంధవ్యం కలుస్తుంది. విశ్వనాథం నా ప్రాణస్నేహితుడు. వాడి మేనకోడల్ని చేసుకుంటే మరింత దగ్గరౌతాడు. అమ్మాయికి నా అన్నవాళ్ళు విశ్వనాథం తప్ప ఎవరూ లేరు! పాపం....ఆ అమ్మాయిని చేసుకుంటే ఓ మంచిపని చేసినట్లవుతుంది" అన్నాడు రాజారావు.

సిద్ధార్థ చేతులు కట్టుకుని "ఆ అమ్మాయి పేరుమీద కోట్ల ఆస్తి వుందని విన్నాను. నిజమేనా డాడీ?" అన్నాడు.

రాజారావు గతుక్కుమన్నట్లు చూసి సర్దుకుని "నీకు ఆ మాత్రం ఆస్తిపరురాలు ఎక్కడయినా దొరుకుతుంది. కానీ విశ్వనాథం మేనకోడలైతే మన రెండు కుటుంబాలూ ఏకమౌతాయి" అన్నాడు.

సిద్ధార్థ చిన్నగా నవ్వాడు. "మిత్రత్వానికే మీరు చెప్పే కారణాలు సరయినవేమో కానీ వివాహానికి కాదు నాన్నా. అసలు ఓ అమ్మాయిని చూడగానే నాకే తెలీకుండా నాలో స్పందన కలిగి ఆమెని చేసుకోవాలన్పించేటంత వరకూ నా ముందు పెళ్ళిప్రసక్తి తీసుకురాకండి. ఇట్స్ మై పర్సనల్ ఎఫైర్. నిర్ణయం తీసుకునే హక్కు నాకు వదిలిపెట్టండి" కాస్త కటువుగా చివరి మాటలని బాబా మీదకి వచ్చేసాడు.

ఆదివారం శృతకీర్తిని తీసుకుని విశ్వనాథం అంకుల్ వస్తాడు, అసలు ఆమెని చూడడానికే సిద్ధార్థ మనసు నిరాకరిస్తోంది. పెళ్ళనేది ఇలా యాంత్రికంగా ఆస్తులు చూసో, బంధుత్వాలకి విలువనిచ్చో చేసుకోవడం అతనికి అసలు ఇష్టంలేదు.

బాధల మేఘాలలో కప్పబడిన అతని మనోవీధిలో మినుకుమనే భావ నక్షత్రం ఒకటి మెరిసి మాయమైనట్లుంది. ఆవేదనే ఆనందంకన్నా



గొప్పదీ, సుందరమైనదీ. ఎందుకంటే, అది ఎప్పుడూ ప్రియతములవల్లే కలుగుతుంది" అన్నాడు.

సిద్ధార్థ గాలికి వూగుతున్న సన్నజాజితీగని చూశాడు. అది స్వతంత్రంగా, స్వేచ్ఛగా బాల్కనీ పిట్టగోడని అల్లుకుని మధురోహల సువాసనల్ని గుబాళిస్తోంది.

పెళ్ళి అనే బంధంలో బలవంతంగా కలపబడిన రెండు శరీరాలు ఒక అనుభవపు శయ్యపై ఒకటిగా కలపడం ఎంత నీచం!

అలా కాకుండా ప్రేమ అనే బంధంతో ఏకమై విడివిడిగా వున్నా జీవితం ఆనందమయమే అనుకున్నాడు. అతను చూడని, అతన్ని చూడని ఒక అజ్ఞాతప్రేయసికై అతను అన్వేషిస్తున్నాడు. అతనికి అనుభవంలోకి రాని ప్రేమని అతనూహిస్తున్నాడు. ఆమె పూల గుబురుల్లోని పాలపిట్టలా ఏదో ఒకనాడు బయటపడుతుందని అతని వూహ!

సిటీలో పేరెన్నికగన్న చార్టెడ్ ఎకౌంటెంట్‌గా, ఆడిటర్‌గా అతని తండ్రికి చాలా పేరు. అదే బిజినెస్‌ని వారసత్వంగా అందుకున్న సిద్ధార్థ రెండు చేతులా సంపాదిస్తున్నాడు. కానీ తండ్రి భావాల్ని మాత్రం వారసత్వంగా అందుకోలేకపోయాడు. ఎదుటి మనిషిని అంకెలుగా మార్చి ఎంత పలుకుతాడో అంచనా వేయడం అతని మనసుకి నచ్చనివని.

"ప్రేమంటే ఏవిటో నీకు తెలుసా కన్నా!" తల్లి తన మెత్తని వడిలో చేర్చుకుని అతన్ని అడిగేది.

ఆమె అందమయిన మోములో ఎప్పుడూ వర్షపునీటిలో కదలాడే శ్రావణమేఘాలే అతనికి కనపడేవి.

"ప్రేమంటే....అకస్మాత్తుగా మనకి ఓ వ్యక్తి గుర్తొచ్చి చిరునవ్వు నవ్వడం, దిగులేసి కన్నీళ్ళు పెట్టుకోవడం, వారితో కలిసి ప్రయాణించే దారి ముళ్ళతో నిండివున్నా ఆనందంగా అడుగులేయడం."

సిద్ధార్థకి దిగులేసి కన్నీళ్ళొచ్చాయి.

ప్రేమించడం నేర్పిన ఆ అద్భుతమూర్తి అది లభించక ఆర్తిగానే కన్నుమూసింది.

తండ్రి లోహాలనీ, కరెన్సీ కాయితాలనీ ప్రేమించడంలోనే జన్మంతా గడిపేస్తున్నాడు. 'ఆదివారం శృతకీర్తిని తప్పించుకోవడానికి ఏదైనా వెళ్ళి

పోవాలి' అని స్థిరంగా నిర్ణయించుకున్నాడు సిద్ధార్థ.

* * * *

కీర్తి మార్కెట్ దగ్గర ఆగి అత్తయ్యకి ముంత ఖర్జూరం కొంది. డిపార్ట్‌మెంటల్ స్టోర్ దగ్గర ఆగి శకుంతల వదిన కొడుక్కి ఫైవ్‌స్టార్ చాక్‌లెట్ కొంది. ఆమె బస్‌కోసం వడివడిగా అడుగులేస్తుంటే చెప్పు టప్పున తెగింది. ఉస్సూరుమంటూ చెప్పులుకుట్టే మనిషికోసం కళ్ళతోనే వెదికింది. ఎదురుగా చెట్టుక్రింద కనిపించాడు.

ఆమె చెప్పు కుట్టించుకుంటుండగా—

"నువ్వు....సాంబమూర్తిగారి అమ్మాయివి కదూ....?" అని వినపడింది.

కీర్తి తలతిప్పి చూసింది.

గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళద్దాలు పెట్టుకున్న ఒక వ్యక్తి "మీ నాన్నగారు నాకు స్నేహితుడే. ఒకసారి వచ్చి కలవమనమ్మా. చిన్న పనుంది" అని తన జేబులోంచి ఓ కార్డ్ తీసి "నా ఫోన్ నెంబర్ ఇది. ఫోన్‌చేసి రమ్మను. మీ అమ్మా, మిగిలిన పిల్లలూ బావున్నారా?" అని కుశలప్రశ్నలేశాడు.

ఆమె అన్నింటికీ వినయంగా జవాబులు చెప్పింది.

చెప్పులుకుట్టే అతడికి రూపాయి ఇచ్చి ఆయనతో కలిసి అడుగులు వేస్తూ ఆయన తన తండ్రి మంచితనం గురించి చెపుతుంటే వింది.

ఇదంతా ఎదురుగుండా వున్న కాంప్లెక్స్ దగ్గర ఆగివున్న ఎస్టీమ్ కార్లోంచి ఒక వ్యక్తి గమనిస్తున్నాడని ఆమెకి తెలీదు.

"వెళ్ళొస్తానమ్మా! మీ నాన్నని ఫోన్‌చేసి రమ్మను" అని ఆయన మరోసారి చెప్పి వెళ్ళిపోయాక ఆమె తన చేతిలోని విజిటింగ్‌కార్డ్‌వంక చూసి ఆ పేరు చదివింది.

విశ్వనాథం....లీగల్ ఎడ్వైజర్ అని వుంది.

కీర్తి పర్స్ తెరిచి ఆ కార్డ్ లోపల పెట్టేసి బస్ రావడంతో ఎక్కేసింది.

కారు స్టార్ట్‌చేస్తున్న సిద్ధార్థ విశ్వనాథం తన మేనకోడలితో ఇప్పుడు తప్పకుండా తన ఇంటికే వెళతాడు కాబట్టి కాసేపు ఇంటిఛాయలకి వెళ్ళ



కూడదనుకున్నాడు.

నెమ్మదిగా వెళుతున్న కార్లోంచి బయటికి చూస్తుంటే ఇందాక విశ్వనాథంతో కన్పించిన అమ్మాయి గుర్తొచ్చింది.

తెల్ల ఓణీ, ఆకుపచ్చ పరికిణీలో వున్న ఆ అమ్మాయిని ఇంకోసారి చూడాలన్పించింది. ఎందుకో....అతని ఊహకి అందలేదు. గబుక్కున కారు తిప్పి వెనక్కి ఇంటికి వెళ్ళిపోదామా అని కూడా అన్పించింది కానీ కష్టంమీద నిగ్రహించుకుని ముందుకే పోనిచ్చాడు.

అతని చెవుల్లో గాలి మంగళ మంత్రాలు చదువుతున్నట్లు సవ్వడి చేస్తోంది.

'ఫర్లేదు....విశ్వనాథ్ అంకుల్ మేనకోడలు అందగత్తే' అనుకున్నాడు సిద్ధార్థ.

* * * *

ఉదయ్ తల్లి కీర్తిని దగ్గరకి తీసుకుని చెంపలు నిమిరి, ముద్దుపెట్టుకుంది. శకుంతల కొడుకు పరిగెత్తుకొచ్చి ఒళ్ళో కూర్చున్నాడు. శకుంతల వంట గదిలో కాఫీ కలుపుతోంది. ఆమె భర్త వివేకానంద కీర్తిని ఆప్యాయంగా పలకరించాడు. వృత్తిరీత్యా పొలిటికల్ సైన్స్ లెక్చరర్ అయిన ఆయనతో పాలిటిక్స్ చర్చించడం కీర్తికి చాలా ఇష్టమైన పని!

సామాన్యమైన మనిషి యొక్క ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం యొక్క సమర్థతని నిరూపిస్తుంది" అన్నాడాయన. మధ్య తరగతి ఇల్లాలికి ప్రతి రోజూ కూరలు కొనడం అనే విషయం ఎంతటి ఆలోచన కలిగించి ప్రతి రోజూ ఎంత ప్రొడక్టివ్ టైం వేస్ట్ చేస్తుందో ఆమెకి తెలుసు! ఖరీదులు చూడకుండా ఇష్టమయిన కూర కొనుక్కు తినే హక్కు ప్రతి ఒక్కరికీ ఈ దేశంలో వచ్చినప్పుడే నిజమైన ప్రగతి!

కీర్తి, వివేకానంద చాలా సీరియస్‌గా రాజ్యాంగం, పౌరహక్కులూ, ధర్మం, చట్టం గురించి మాట్లాడుకుంటూ వుండగా శకుంతల ఉప్మా ప్లేట్లతో వచ్చింది.

"దాన్ని మాతో మాట్లాడనిస్తారా?" అంది.

"డెమోక్రసీగా....అలాగే కానీ!" అన్నాడాయన.

శకుంతల కీర్తికి టిఫిన్ ప్లేటు అందిస్తూ "ఈ మధ్య ఉదయ్ ఏమైనా ఉత్తరాలు వ్రాసాడా?" అడిగింది.

"అలాంటివి పబ్లిక్‌లో అగడకూడదు." ఉప్మాలో జీడిపప్పుకోసం తీవ్రంగా గాలిస్తూ అన్నాడు వివేకానంద.

శకుంతల ఉడుక్కుంటూ "ఏం వ్రాసాడూ అని అడగలేదుగా నేను?" అంది.

కీర్తి నవ్వేసి తన పర్సులోంచి మడతపెట్టిన కాయితం తీసి అందించింది.

"ఒద్దు. మా గురించి ఏమైనా వ్రాస్తే చెప్పు చాలు!...." అంది శకుంతల. కీర్తి క్లుప్తంగా చెప్పింది.

శకుంతల కొడుకు కార్తీక్ "మామయ్యకి ఈసారి ఉత్తరం వ్రాసేటప్పుడు నాకు రిమోట్ కంట్రోల్ కారు కొనమని చెప్పు కీర్తీ....!" అన్నాడు.

"కీర్తి ఏమిట్రా? అత్తయ్యా అనలేవూ....?" మందలించింది శకుంతల.

వివేకానంద నవ్వుతూ "అలా పిలిస్తేనే గ్లామరస్‌గా వుంది. ఏం కీర్తీ?" అన్నాడు.

"ఔను!" నవ్వింది కీర్తి.

"త్వరగా ఆ మూడుముళ్ళూ పడిపోతే రామా....కృష్ణా....అనుకుంటూ మీ దగ్గర పడివుంటానే కీర్తీ!" అంది శకుంతల తల్లి.

ఎంతైనా ఆడపిల్ల దగ్గర వుండటం ఆవిడకి ఇబ్బందిగానే అనిపిస్తోందనుకుంటా. ఇంకో శతాబ్దం గడిచినా మనుషుల అలంకరణలో, ఆడంబరాలలో తప్ప ఆలోచనల్లో మార్పు వచ్చే సూచనలేం లేవు. ఉదయ్ బడ్జెట్ అందుకు అనుమతిస్తుందా? అని ఆలోచించింది కీర్తి.

మధ్యాహ్నం అంతా శకుంతల కుట్టుపనుల గురించీ, వంటల గురించీ కబుర్లతో గడిచిపోయింది. సాయంత్రం అవుతుండగా కీర్తి "ఇంక నే వెళ్ళొస్తాను అత్తయ్యా! అని బయల్దేరింది.

"మీ అమ్మ అన్నలు కనిపించడంలేదు. అప్పుడే పెళ్ళి పనులు మొదలెట్టేసిందా?" నిష్ఠూరమాడింది అత్తయ్య.



"వచ్చే ఆదివారం వస్తానంది అత్తయ్యా" సంజాయిషీగా చెప్పింది కీర్తి.

శకుంతల చిన్నగా గొంతు సవరించుకుని "మావయ్య....నిశ్చితార్థానికి డేట్ ఫిక్స్ చేయించాడా?" అంది.

కీర్తి తల వంచుకుంది. ఆమె మెదడులో ఆ రోజుకి కొనాల్సిన వస్తువులు మెదిలాయి. ఆడపిల్లల కుటుంబ పరిస్థితుల గురించి అవగాహన, తల్లిదండ్రుల ఆర్థిక స్థితి గురించి ఇంత ఆలోచనా వుండడం పెద్ద కష్టమే అనిపించింది.

"కళాంజలిలో కొందాం చీరలు" నర్మగర్భంగా ఏదో ఒక చీరకొని పెట్టేస్తే వూరుకునేదిలేదని శకుంతల హెచ్చరించింది.

"ఎక్కడ కొన్నా దాన్ని చీర అనే అంటారు. పదమ్మా! నిన్ను డ్రాప్ చేస్తాను" స్కూటర్ బయటికితీస్తూ అన్నాడు వివేకానంద.

"ఒక్కగానొక్క ఆడబిడ్డవి. నీ ముచ్చట్లకి లోటు చేస్తాడా మామయ్యా!" సూచనలా అంది అత్తయ్య.

అన్నీ మౌనంగా విని తలాడించి, వివేకానంద వెనకాల స్కూటర్ మీద కూర్చుంది కీర్తి.

ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ఆగినప్పుడు కాస్త తల వెనక్కితిప్పి అడిగాడు వివేకానంద." కీర్తీ! ఉదయ్ అంటే నీకు ఇష్టమేనా?"

కీర్తి ఆ ప్రశ్నకి ఆశ్చర్యంగా "ఆ!" అంది.

అతను ఆమెకి వినిపించలేదనుకుని మళ్ళీ అడిగాడు. "ఉదయ్ అంటే నీకు ఇష్టమేనా? అంటే మీ ఇద్దరిమధ్యా పెళ్ళి చేసుకునేటంత ఇష్టం వుందా?"

ఆమె విచిత్రంగా చూస్తూ "ఎందుకలా అడిగారు?" అంది.

"ఇందాక నువ్వు ఉదయ్ వ్రాసిన ఉత్తరం సంకోచించకుండా శకుంతల చేతికి అందివ్వబోయినప్పుడు నాకు డౌట్ వచ్చింది. పెళ్ళిచేసుకోబోయే జంట బాహాటంగా అలా ఉత్తరాలు ఇతరులకు చూపించుకునే పరిస్థితి వుండదే! మే బీ ఐయామ్ రాంగ్....అనుమానం రాగానే అడిగేశాను. ఏమీ అనుకోకు" అని స్కూటర్ స్టార్టు చేశాడు.

"ఏమీ అనుకోను" అంది కీర్తి.

ఆమెని ఇంటిదగ్గర దింపాక అన్నాడు "నా ప్రశ్నకి సమాధానం చెప్పలేదు నువ్వు. నీకు ఉదయ్ అంటే ఇష్టమేనా? సమయం మించిపోలేదు. లేకపోతే నాతో ధైర్యంగా చెప్పు. పిరికితనాన్ని మించిన అంగవైకల్యం లేదు!"

కీర్తి తల అడ్డంగా ఆడిస్తూ "నాకు ఉదయ్ అంటే అయిష్టంలేదు. పెళ్ళి చేసుకోడానికి ఎటువంటి అభ్యంతరం, సంకోచంలేదు" అంది.

"గుడ్!" సంతృప్తిపడి అతను వెళ్ళిపోయాడు.

ఇంట్లోకి వచ్చాకా సాంబమూర్తి అడిగాడు "మా అక్కయ్య ఎలా వుంది?"

"బీపీ ఇప్పుడు నార్మల్‌గానే వుందట" అని కీర్తి వంటింట్లో వున్న తల్లి దగ్గరికీ వెళ్ళి ఆమెని మేనత్త చూడాలనుకుంటున్నట్లు చెప్పింది.

"వెళితే....నిశ్చితార్థం గురించి అడుగుతారు. మీ నాన్నగారింకా ముహూర్తం పెట్టించలేదు. ఏం చెప్పనూ?" బేలగా అంది సుభద్ర.

'ఆడపిల్ల తల్లిదండ్రులు మగపిల్లాడి తలిదండ్రులతో మాట్లాడానికి జంకడం, ఏదో తప్పు చేసినట్లు తప్పించుకు తిరగడం ఎప్పుడు మానేస్తారో ఈ దేశంలో' అనుకుంది భారంగా కీర్తి. ఆమెకి విశ్వనాథం గుర్తొచ్చి తండ్రికి చెప్పడానికి హాల్లోకి వెళ్ళింది.

• • • •

"నీకోసం శృతకీర్తిని తీసుకొని విశ్వనాథ్ వచ్చాడు. చాలాసేపు వెయిట్‌చేసి వెళ్ళాడు" నిష్ఠూరంగా అన్నాడు రాజారావు.

సిద్ధార్థకి విశ్వనాథ్ పక్కన నడుస్తూ వెళ్ళిన అమ్మాయి రూపం గుర్తొచ్చింది.

"అమ్మాయి చాలా బావుంది తెలుసా?" అన్నాడు రాజారావు.

"అమ్మాయి బావున్నప్పుడూ, అంత ఆస్తి వున్నప్పుడూ నేనే కాదు....ఎవరయినా చేసుకుంటారు నాన్నా! అంత ఒద్దన్నవాళ్ళని ఒప్పించడం ఎందుకూ?" అని గదిలోకి వెళ్ళిపోయాడు సిద్ధార్థ.

అతని మనసులో ఎటువంటి భావచలనమూలేదు. ఈ పెద్దవాళ్ళు తమ వ్యాపారాలకీ, వ్యవహారాలకీ అనుగుణంగా వుండేటట్లు పెళ్ళిసంబంధాలు కుదిర్చి ఈ వివాహాలని చట్టబద్ధమైన జూదాలు చేస్తున్నారు అన



కోడం మినహా ఈ విషయం గురించి పెద్దగా ఆలోచించలేదు.

• • • •

"నువ్వు ఈరోజు నాతో ఒక చోటికి రావాలమ్మా!" అన్నాడు సాంబమూర్తి కీర్తితో.

"నేను మైత్రీ వాళ్ళింటికి వస్తానని చెప్పాను నాన్నా! నోట్స్ రాసుకోవాలి" అంది కీర్తి.

"ఈరోజు సాయంత్రం వెళ్ళు. ఇప్పుడు నాతో రా....పనుంది. విశ్వనాథాన్ని అర్జెంటుగా కలవాలి" అన్నాడు.

"సరే నాన్నా!" వెంటనే ఒప్పుకుంది కీర్తి.

"The philosophy of one century is the commonsense of the next..." ఈ విషయం తండ్రిని చూస్తే నిజమనిపిస్తుంది కీర్తికి. పిల్లల్ని చిన్నప్పటినుంచీ ఏ ఆంక్షలూ లేకుండా పెంచాడాయన. 'చదువుకోండి' అని చెప్పడం కూడా ఎన్నడూ చెయ్యలేదు. తల్లి చెపుతున్నా "వాళ్ళకి తెలుసు సుభద్రా!" అనేవాడు. పిల్లలమీద అంత నమ్మకం వుంచాడు.

ఎన్నడూ పిల్లల్ని స్కూల్ ఎక్స్‌కర్షన్‌లకి కానీ, తోటిపిల్లల ఇళ్ళకిగానీ వెళ్ళొద్దని నియంత్రించలేదు. కీర్తి స్నేహితులతో సినిమాకి వెళ్ళి వచ్చి స్పెషల్ క్లాసు జరిగిందని అబద్ధం చెప్పే పరిస్థితి ఎన్నడూ కలిగించలేదాయన

"స్వేచ్ఛ....గాలీ నీరూ ఆహారంకన్నా మిన్న!" అనేవాడు. పిల్లలకి తమకి కావల్సినవి చదువుకోడానికీ, అభిరుచుల్ని పెంపొందించుకోడానికీ పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. కీర్తి కవితలు వ్రాసినా, ప్రీతి బొమ్మలు వేసినా. వంశీ క్రికెట్ ఆడుతున్నా....ఆయన వాళ్ళతో చేరి ఆ ఆనందాన్ని పంచుకునే ప్రయత్నం చేసేవాడు. ఇలా ఎంతమంది తల్లిదండ్రులు చెయ్యగలుగుతున్నారూ?

సుభద్ర మాత్రం అప్పుడప్పుడు "ఆడపిల్లలకి అంత స్వేచ్ఛ ఇవ్వకూడదు!" అంటుంది.

"స్వేచ్ఛ వస్తువు కాదే....ఒకరిస్తే తీసుకోడానికి!" అంటాడాయన ఆవిడ అమాయకత్వానికి జాలిపడుతూ.

ఆవిడ పాతకాలం ఇల్లాలు. ఇంకా స్వేచ్ఛ తల్లిదండ్రులు ఇస్తే తీసుకునేది అనుకుంటోంది. తరువాతి తరం పిల్లలు అసలీ డిస్కషన్ రా వ్వరు. ఏం చేస్తున్నారో వాళ్ళు చేసేసాకగానీ తల్లిదండ్రులకి తెలియదు బహుశా!

కీర్తి, సాంబమూర్తి వెళ్ళేసరికి విశ్వనాథం ఇంట్లో లేడు. ప వాళ్ళు కూర్చోమని చెప్పి మర్యాదలు చేశారు. ఇంటిముందు తోటలో ర రకాల పువ్వులున్నా, ఆ ఇంట్లో ఇంటీరియర్స్‌కి ప్లాస్టిక్ గడ్డి, ప్లాస్టి పువ్వులూ అమర్చడం కీర్తిని ఆశ్చర్యపరిచింది. మానవుడు కృత్రిమత నికి ఎంతగా అలవాటుపడిపోతున్నాడూ!

"తోట చూసొస్తాను నాన్నా...." అని కీర్తి బయటికి నడిచింది

క్రమబద్ధంగా పెంచిన తోటలో ప్రతి పువ్వూ ఏదో చెప్పబోతు న్నట్లు నవ్వుతూ కనిపించాయి. అందమైన సీతాకోకచిలుకల రెక్క వింజామరలు గాలికి పరవశిస్తూ తలలూపుతున్నాయి. పుక్కిట మధిర పుక్కిలిస్తే పుష్పించే పొగడలూ, చెంపకి చెంప అనిస్తే వికసించే చేమ తులూ, కొనగోట మీటితే వికసించే మాలతీ లతలు, పాదతాడనంతో పర శించే అశోక తమాల వృక్షాలూ, అలనాటి పుష్పలావికలూ జ్ఞప్తికొచ్చాయి రంగురంగుల విద్యుద్దీపాల్లా కనిపించాయి బాటకి ఇరువైపులా వున్న క్రోటన్స్ చెట్లు. ఆమె ఆ తాదాత్మ్యతలని కళ్ళు అరమోడ్చి తనివితీర అనుభవిస్తుండగా, ఎవరో పిలిచినట్లయింది. నెమ్మదిగా రెప్పలు విప్పి చూసింది.

స్ఫురద్రూపి అయిన యువకుడు ఒకడు చేతిలో ఏదో కవర్ పట్టుకుని ఆమెని పలుకరిస్తున్నాడు.

"మిస్....మిమ్మల్నే....విశ్వనాథ్ అంకుల్ వున్నారా?"

కీర్తి అప్రయత్నంగా తలవూపుతూ "లేరు. నేనూ...." అని చెప్పబోయింది.

అతను చిన్నగా నవ్వాడు. "అంకుల్ వస్తే....ఈ కవర్ రా రావుగారు పంపారని చెప్పండి. వస్తాను" అని వెనక్కి తిరిగాడు.

కీర్తి తెప్పరిల్లి "మీ పేరూ?" అంది.

"సిద్ధార్థ!" అని ఆమె ముఖంలో భావాల కోసం వెదికాడు.



అప్పుడే వికసించిన గులాబీలా ముగ్ధమోహనంగా వున్న ఆమె ముఖంలో ఎటువంటి కుతూహలం, ఆనందం అతనికి కనపడలేదు. చాలా మామూలుగా తలవూపింది.

సిద్ధార్థ కారు స్టార్ట్‌చేస్తూ మళ్ళీ ఇంకోసారి ఆమెని చూశాడు.

ప్రతి పువ్వునీ పలకరిస్తూ, వాటితో మౌనంగా ఊసులాడుతున్నట్లు ఆమె అలౌకికమైన స్థితిలో కనిపించింది.

సిద్ధార్థ స్లోగా డ్రైవ్‌చేస్తూ ఆమె రూపాన్ని మననం చేసుకున్నాడు. ఓణీ....ఆకుపచ్చ పరికిణీ....మొన్నటి డ్రెస్సే! మెడలో కనీ కనిపించనట్లున్న సన్నని చైన్. చేతికి ఓ బంగారు గాజూ....శృతకీర్తి ఇంత సింపుల్‌గా వుందంటే ఆమె వ్యక్తిత్వం ఏమైయుంటుందీ? తండ్రి చెప్పిన ప్రకారం ఆమె ప్రముఖ సిటీల్లో స్టార్ హోటల్స్‌కి యజమానురాలు. ఒక కారు ప్రమాదంలో తల్లితండ్రుల్ని కోల్పోయిన ఆమెకి విశ్వనాథం గార్డియన్. తను విన్నదానికీ ఆమె ఆహార్యానికీ ఎక్కడా పొంతన కుదరడంలేదు. తల ఆడిస్తూ 'షీ ఈజ్ ఏ పజిల్' అనుకున్నాడు.

ఆఫీసులో మధ్యాహ్నం కుండీలో పసుపు గులాబీలు అమరుస్తున్న సెక్రటరీని చూస్తే మళ్ళీ ఆమె గుర్తొచ్చింది.

'షీ ఈజ్....ఫ్రాగ్రెన్స్ ఆఫ్ బ్యూటీ' అనుకున్నాడు.

సాయంత్రం కారు విశ్వనాథం ఇంటివైపు వెళదామని మొరాయిస్తుంటే 'షీ ఈజ్ ఎ మేగ్నెట్' అనుకున్నాడు.

రాత్రి నిద్రపడుతుండగా వచ్చి కుదిపి లేపి ఆమె తాలూకు ఊహలు సతాయిస్తుంటే 'షీ ఈజ్ వెరీ....స్పెషల్' అనుకున్నాడు.

పొడవాటి జడ వూగుతుండగా, పైటకొంగు నడుంచుట్టూ తిప్పి దోపి, ఆమె నడుస్తున్నప్పుడు వెనక నుంచి కనిపించిన భంగిమ గుర్తొస్తేనే అతనికి ఒళ్ళంతా ఒకింత పులకింత కలిగింది. ఆర్చీల్లాంటి కనుబొమలెత్తి పెద్దవైన కళ్ళని ఇంకా పెద్దవి చేసి చూసిన ఆమె చూపు....ఎక్కడో గుచ్చుకున్నట్లయ్యి తియ్యని బాధ కలిగింది.

'బహుశా....ఐయామ్ ఇన్ లవ్!' అనుకున్నాడు.

కవ్విస్తూ వచ్చి ఏడిపించి పోయేదే ప్రేమ!

ప్రతి ఒక్కరికీ జీవితంలో ఏదో ఒకసారి ఈ స్థితి తప్పక అనుభవ

మౌతుంది. ఈ స్థితిలో రోజూ చూసే ఎండా, నీరూ, గాలీ, పూలూ అన్నీ అకస్మాత్తుగా అత్యంత అపురూపంగా, నేలకి స్వర్గం దిగివచ్చినట్లుగా తోస్తాయి.

పాతికేళ్ళ వయసులో ఆ భావాల జడికి తడిసి ముద్దయిన సిద్ధార్థకి, తన అందమైన రూపాన్ని చూడమంటూ కనుపాపల్లో తిష్టవేసుకుని కూర్చున్న రాత్రి.... వేకువఝామున ప్రత్యూషానికి భయపడి పరిగెడుతూ ఆఖరి చుక్కని అతని పక్కన తియ్యని స్వప్నంగా మార్చింది.

'నీలమేఘాలపై గాలిలో తేలేటి
నక్షత్ర కాంతులలో నీ రూపు కన్నాను
నేలపై ఉరికేటి....చిరునవ్వు చిందేటి
చిన్నారి పూలలో నీ సొంపు కాంచాను....'

* * * *

"నేను విశాలి పెళ్ళికి విజయవాడ వెళుతున్నాను" అని కీర్తి చెప్పగానే తల్లి –

"మీ నాన్న సరే అన్నారా?" అని అడిగింది.

"కాదు అనాల్సిన సంగతా?" అడిగాడు సాంబమూర్తి.

సుభద్ర ముఖం అప్రసన్నంగా పెట్టుకుని "వచ్చేవారం ఉదయ్ వస్తున్నాడు. అతనికి ఇష్టం వుంటుందో లేదో!" అంది.

"అప్పుడే అది వాడి ఇష్టాలకి అనుగుణంగా నడుచుకోవాలా?" అడిగాడు సాంబమూర్తి.

కీర్తి కళ్ళల్లో భయం కదలాడింది. తండ్రి మంచం మీద కూర్చుని "నాన్నా.... పెళ్ళైతే స్వేచ్ఛ అనేదే వుండదా?" అని అడిగింది.

"మీ అమ్మకి స్వేచ్ఛ వుందో లేదో కనుక్కో" ఆయన నవ్వుతూ అన్నాడు

"అందరూ నీలా వుండరుగా" అంది కీర్తి.

"పెళ్ళైతే ఎవరూ మనకి నిబంధనలు విధించక్కర్లేదు. మనమే కొన్నింటికి నిబంధనలు విధించుకుంటాం. ఇవన్నీ -కనిపించని సంకెళ్ళు!" సుభద్ర పక్కనే కూర్చుని టీవీ చూస్తున్న ప్రీతినీ, వంశీనీ చూపిస్తూ అంది.



"ఆ సంకెళ్ళకి సంతోషాలనీ, బంధాలకి అనుబంధాలనీ ముద్దుపేర్లు" చెప్పాడు సాంబమూర్తి.

కీర్తి లేచి తన గదిలోకి వెళ్ళింది. పెళ్ళంటే మొదటిసారిగా భయం కలిగింది. ఎదురింటి ఆవిడా, పక్కింటి పిన్నిగారూ మాట్లాడేటప్పుడు అక్తమానం, "ఆయనకి అలా ఇష్టం వుండదు వదినా" అనో "ఆయన ఒప్పుకోరు అక్కా" అనో అనడం ఆమె వింటూ వుంటుంది. ప్రతిదానికీ ఆయన ఒప్పుకోవటం, ఆమోదముద్ర వెయ్యడం ఎందుకో? భర్త అంటే యజమానీ, భార్యంటే బానిసా అన్న భావన ఈ శతాబ్దంలో కూడానా? ఆలోచనలతో ఆమె అంతరంగం అలసిపోయింది.

మర్నాడు మైత్రి మొహం గంటుపెట్టుకుని వచ్చి విశాలి పెళ్ళికి వెళ్ళడానికి ఇంట్లోవాళ్ళు ఒప్పుకోలేదని చెప్పింది. పైగా ఆ రోజునే దాన్ని చూసుకోడానికి పెళ్ళివారు వస్తున్నారట.

"ఛీ! లవ్ మేరేజ్ చేసుకోవాలనుకున్నాను. ఈ పెద్దాళ్ళు ఒట్టి విలన్లు" అని చిరాకుపడింది.

"కీర్తి చిరాకుపడి "ఆ వచ్చిన అబ్బాయి బాగుంటే లవ్ చెయ్యి. ఆ తర్వాత మేరేజ్ చేసుకో! నీ మనసూ వాళ్ళ మాటా రెండూ చెల్లినట్లవుతాయి" అంది.

మైత్రి కీర్తిని కోపంగా చూస్తూ.

"అసలు నీకు లవ్ అంటే తెలుసా? తెలిస్తే ఇలా మాట్లాడవు" అంది.

"నీకు తెలిస్తే చెప్పు...." సన్నజాజి మొగ్గలు అల్లుతూ అంది కీర్తి.

"అనుకునీ, ఆలోచించుకునీ చేసేదాన్ని లవ్ అనరు. అడ్జస్ట్‌మెంట్ అంటారు. లవ్ అంటే అసంకల్పితంగా, అనాలోచితంగా, అకస్మాత్తుగా–అనిర్వచనీయంగా...."

"అపూర్వంగా జరిగేది అనంటావు. అంతేనా? సరే కానీ! ఈ పూలు పెట్టుకో" కీర్తి ఆమె జడలో పువ్వులు పెడుతూ అంది.

"నీకు....నీకు అలాంటి అనుభూతులు కావాలనిపించదా కీర్తీ?" కుతూహలంగా అడిగింది మైత్రి.

"ఎందుకు అనిపించదూ? ఉదయ్ నన్ను ప్రేమిస్తున్నాడుగా?"

మామూలుగా అనేసింది.

"పెద్దలు చిన్నప్పటినుంచీ అనుకుంటున్నారు కాబట్టి ఒకరకంగా అది ఒప్పందం" అంది మైత్రి.

"కీర్తి నవ్వి "ఎవరినైనా పెళ్ళిచేసుకున్నాక చేసేది కాపురమే. పెళ్ళికి ముందు జరిగే ఓ చిన్న ప్రహసనానికి ఎందుకింత ఇంపార్టెన్స్? ఆ విషయంమీద ఇన్ని కథలూ, సినిమాలూ ఎందుకూ? దానికోసం రోజూ బోలెడుమంది ఎందుకు ఆత్మహత్యలు చేసుకోవడం? నాకు అర్థంకాదు" అంది.

మైత్రి చాలా గంభీరంగా వింటూ వుండిపోయింది.

కీర్తి నవ్వుతూ "అలా వుండిపోయావేం? నా మాటలు బాలేదా?" అంది.

మైత్రి నవ్వకుండా గంభీరంగానే "కీర్తీ....నీకు అదేమిటో....లోక మంతా దానికోసం ఎందుకు పిచ్చివాళ్ళయిపోతారో అర్థం కాకపోవడమే మంచిది. నువ్వు ఈ మాటమీదే జీవితాంతం వుండాలి. అప్పుడే సుఖంగా వుంటావు. కీప్ ఇట్ అప్" అంది,

"నా జీవితంలో ఆ అద్భుతమైన ప్రేమ అనే తారకమంత్రం రాకూడదని శపిస్తున్నావా....లేక దీవిస్తున్నావా?" అడిగింది కీర్తి.

"ఆకాంక్షిస్తున్నాను" చెప్పింది మైత్రి.

శకుంతల దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. ఉదయ్ వచ్చినప్పుడే లగ్న పత్రిక వ్రాయించెయ్యాలని వాళ్ళమ్మ అభిప్రాయమట."

"నిజమే. కుదిరాక ఎక్కువరోజులు వుంచుకోవడం మంచిదికాదు. వెంటనే ముహూర్తాలు పెట్టించండి" అంది సుభద్ర.

"అలాగే!" అన్నాడు సాంబమూర్తి.

ఉదయ్ వస్తున్నాడని సుభద్ర రెక్కలు ముక్కలు చేసుకుని అరిశలూ, సున్నుండలూ, జంతికలూ, మైసూర్‌పాక్ చేసింది.

కీర్తి వంటగది శుభ్రం చెయ్యడంలో తల్లికి సహాయం చేసింది.

"బావ కోసమని అక్క సాయం చేస్తోంది. లేకపోతే నాకు పరీక్షలు చెయ్యను పొమ్మనేది" అని అట పట్టించింది ప్రీతి.

వంటగట్టు కడుగుతూ 'అతనికోసం నేను కష్టపడుతున్నానా? ఎందుకూ? అతనంటే నాకు ప్రేమా?" అని ఆలోచించింది కీర్తి.



"నువ్వు సాయంచెయ్యబట్టి ఇప్పటికైనా అయింది తల్లీ" నుదుట పట్టిన చెమట్లు తుడుచుకుంటూ అంది సుభద్ర.

'నాకు అమ్మంటే ప్రేమ. అందుకే చేశాను' అనుకుంది కీర్తి. ఆమెకి మనసంతా అసంతృప్తిగా మారింది.

తెల్లవారితే అట్లతద్దె. రాత్రి మైత్రి వచ్చింది గోరింటాకు తీసుకుని. పెరట్లో వెన్నెల ఒలికి పాలు పారబోసుకున్నట్లుంది. గోరింటాకుని కీర్తి, మైత్రి వంతులు వేసుకుని రుబ్బారు. ఇక చూడనైనా చూడని పెళ్ళికొడుకు గురించి ఎన్నెన్నో కబుర్లు చెప్తోంది మైత్రి.

ఒకరి జ్ఞానాన్ని ఒకరికి ఇవ్వడం కొంతవరకూ సాధ్యంకానీ ఒకరి అనుభవాన్ని ఇంకొకరికి ఇవ్వడం అసాధ్యం. సాలార్‌జంగ్ మ్యూజియంలో ముసుగులోంచి కనపడే సుందర సౌందర్యాన్ని తనివితీరా గ్రోలే ఒక వ్యక్తి ఆ రసికత లేని వ్యక్తికి ఆ అనుభవాన్ని అందించలేడు. పై పెచ్చు పిచ్చివాడనిపిస్తాడు.

'నాకు దానిలా చెప్పుకోడానికి ఏమైనా కబుర్లున్నాయా?' అని ఆలోచించింది కీర్తి.

చిన్నప్పుడు బ్యాటరీ కారు కొనుక్కున్న ఉదయ్ దానితో ఆడుకోడానికెళితే 'మీ నాన్నచేత మళ్ళీ బ్యాటరీ కొనిపిస్తావంటే ఆడుకోనిస్తా' అనేవాడు. అది గుర్తొచ్చి కీర్తి పెదవులమీదికి నవ్వొచ్చింది.

"ప్రేమంటే....సంతోషంలో వున్నప్పుడు ఒక వ్యక్తి గుర్తొచ్చి దిగులెయ్యడం....విచారంలో వున్నప్పుడు ఆ వ్యక్తి తలంపుకొచ్చి చిరునవ్వు రావడం. నీకంత విచారం ఏమొచ్చిందని నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?" అడిగింది మైత్రి.

తనకేం గుర్తొచ్చిందో చెప్పింది కీర్తి.

"ఔను....ఇప్పుడు కూడా అలా చేస్తాడేమోనని విచారించాల్సిందే. మావయ్యకి ముందుగానే చెప్పు. నీకు పుట్టబోయే ఆడపిల్లల పెళ్ళిళ్ళకి డబ్బు దాచమని" అంది వేళాకోళంగా మైత్రి.

రుబ్బుతున్న గోరింటాకు దాని చెంపకు పూసేసింది కీర్తి.

"రేపు పెళ్ళిచూపుల్లో ఆ పెళ్ళికొడుకు తనని చూడగానే నా బుగ్గల్లో

"గులాబీలు పూశాయనుకుంటాడు పాపం" అంది మైత్రి.

కీర్తీ, మైత్రీ, ప్రీతీ గోరింటాకు పెట్టుకుని డాబామీద వెల్లకిలా పడుకున్నారు. ఎవరెన్ని నక్షత్రాలని లెక్కపెడతారో అని పందేలు కాసుకున్నారు.

నల్లని మేఘుడొచ్చి పక్కింటి మామిడికాయల్ని దొంగచాటుగా కోసుకుపోతున్నట్లు చేతికందిన చుక్కల్ని కోసుకుపోతున్నాడు. చుక్కరాలిపడుతుంటే మైత్రి కళ్ళు మూసుకుని అటు చూడద్దంటోంది. నిజంగా అది ఎంత అద్భుతమైన అనుభవం! కళ్ళముందున్నది రెప్పపాటులో మాయమవడం....

అంత భ్రాంతి అనిపించేట్లు అంతదాకా మెరుస్తూ మైమరపించిన చుక్క బలమైన శక్తేదో గుంజుతున్నట్లు టప్పున రాలి పడిపోవడం.

సుభద్ర గిన్నెలో గోంగూర పచ్చడి అన్నం కలిపి మీగడ పెరుగు నంజుకోడానికి తీసుకుని ఆయాసపడుతూ మెట్లన్నీ ఎక్కి పైకొచ్చింది.

ఎవరు ప్రోద్బలం చేశారని ఈ స్త్రీ ఇంత అలసిపోయి కూడా పిల్లల కోసం మళ్ళీ కష్టపడుతోందీ! ఈ కష్టంలో ఏ సుఖమూ లేకపోతే ఎందుకు చేస్తుందీ?

సుభద్ర పిల్లలకి కలిపి ముద్దలుపెడుతూ తన చిన్ననాటి ముచ్చట్లు చెప్తోంది.

"నేనూ, భవానీ ఇలాగే గోరింటాకులు పెట్టుకుంటుంటే మా అన్నయ్యలు వచ్చి వాళ్ళకీ పెట్టమనేవారు. పెట్టలేదనే కోపంతో మేము నిద్రపోతుంటే మా అరిచేతుల్లో చీపురుపుల్లతో కోతి అని వ్రాసేవారు. అది తెల్లారి లేచి చూసుకుంటే అలాగే పండేది" ఆమెకి గతస్మృతులు లేని ఓపిక తెప్పించాయి.

ఉత్సాహం....ఉల్లాసం....ఇవన్నీ పెళ్ళి మింగేస్తుందా? కీర్తి ఆకాశంకేసి చూసింది.

చుట్టూ చుట్టాలని కూర్చోపెట్టుకుని మురుస్తున్నట్లు ఎంతో నందడిగా వుంది చుక్కలతో జాబిలి.

ఎందుకో కీర్తికి అమాంతం దిగులేసింది. తల్లి ఒడిలో తలపెట్టుకుని పడుకుంది.



"ఏమిటీ మా బుజ్జిపాపాయి గారాబం పోతోంది" అంది సుభద్ర.

"ఎంతో దిగులుగా వుంది" అంది కీర్తి.

"ఇవన్నీ పెళ్ళయ్యేవరకే. ఆ తర్వాత మేమెవ్వరం గుర్తుకురాము" అంది తల్లి.

ఆ మాట వినగానే దిగ్గునలేచి తన ముఖాన్ని ఆమె పొట్టకేసి ఇంకా గట్టిగా అదుముకుంది.

'దూరం అవడం....చూడకుండా వుండడం అనే విషయాలు ఇంతగా బాధించడమేనా ప్రేమంటే.... అయితే లోకంలో ఎవరైనా ఎక్కువగా ప్రేమించేది అమ్మానాన్నలనే' అనుకుంది.

"నన్ను చూడాలనిపించదా పెళ్ళయితే?" ప్రీతి అల్లరిగా అడిగింది.

"రేపు నీకైనా అంతే! ఆ పక్కన కూర్చుని నవ్వుతోందే కోతిపిల్ల ఆ మైత్రి అయినా అంతే!" సుభద్ర నవ్వుతూ అంది.

వెన్నెల చీకట్లని పారద్రోలుతూ కళ్ళని ముద్దాడుతోంది. హృదయాన్ని మాధుర్యంలో ముంచెత్తుతోంది.

అమ్మ ఒడిలో పడుకుని ఆకాశంకేసి చూస్తుంటే కీర్తికి ప్రేమకి అర్థం తెలిసినట్లనిపిస్తోంది.

ఎంతో శాంతి....ఎంతో ఆనందం.... మాటలకందని మధురభావన ప్రేమంటే!

• • • •

మరునాడు ఉదయ్ వచ్చాడు. కీర్తికోసం 'సందేశ తరంగిణి' అనే వివేకానంద ఉపన్యాసాల పుస్తకం తీసుకొన్నాడు.

కీర్తి ఎదురెళ్ళి "బావున్నావా బావా?" అనడిగింది.

"కీర్తీ....కాస్త చిక్కావు. నీకు పుస్తకాలంటే ఇష్టంకదా అని ఇది కొన్నాను. కొత్తదే. ఎవరో అమ్మేశారనుకుంట. పేవ్‌మెంట్స్‌మీద కొన్ని సార్లు మంచి పుస్తకాలు కూడా దొరుకుతాయి" అన్నాడు.

సాంబమూర్తి రావడంతో టాపిక్ అతని ఉద్యోగంవైపూ, పెళ్ళివైపూ మళ్ళింది.

"త్వరగా చేసుకోవాలి మావయ్యా.... భోజనానికి చెడ్డ ఇబ్బందిగా

వుంది. ఎంత డబ్బుపోసినా క్వాలిటీ వుండటంలేదు" అన్నాడు.

సాంబమూర్తి కీర్తివైపు చూశాడు.

ఆమె ముఖంలో ఏ భావమూ లేకుండా తల్లికి వంటలో సాయం చేస్తోంది.

"ఉదయ్ చాలా ప్రాక్టికల్ మనిషమ్మా" ఆయన కీర్తి తనవైపు చూడగానే అన్నాడు. కీర్తి ఫీలయిందేమోనని ఆయన బాధ. అలాంటి సున్నితమైన, సూక్ష్మమైన ఊరడింపులే తండ్రంటే ఆమెకి రోజురోజుకీ అభిమానం పెరిగేలా చేస్తుంటాయి.

"కీర్తీ....వెళ్ళి అబ్బాయితో మాట్లాడుతూవుండు. నేను చూసుకుంటాలే ఈ పని" అంది గారెలు వేస్తూ సుభద్ర.

కీర్తి, ఉదయ్ గదిలో కూర్చున్నారు. ఉదయ్ సున్నుండ తింటూ అన్నాడు "కీర్తి....నాకు క్వార్టర్స్ ఇస్తారట. పెరట్లో కొత్తిమీర, పచ్చిమిరపా, టమాటా, ఆకుకూరలూ వేసావంటే చాలా ఖర్చు కలిసొస్తుంది."

కీర్తి మామూలుగా వింది అతను అలా కాకుండా ఇంకోలాగా మాట్లాడితేనే ఆమె వింతగా ఫీలవుతుంది.

ఉదయ్ ఆమెతో "ఆ దక్షిణంవైపు నిలబడితే గాలొస్తుంది. ఫ్యాన్ వేసుకోక్కర్లేదు" అంటే ఆశ్చర్యంగా వుండదు.

"ఆ దక్షిణంవైపు మలయమారుతం నీ కబుర్లు మోసుకొచ్చి తనువుని తన్మయపరుస్తోంది సఖీ" అంటే తప్పకుండా అతని ఒంట్లో బాలేదేమోనని ఆమెకి అనుమానం వస్తుంది.

అందరూ గొడవ గొడవగా హాల్లో కూర్చుని పెళ్ళి మాటలు మాట్లాడుకుంటుంటే, కీర్తి, ఉదయ్ పెరట్లో జామచెట్టు క్రింద కూర్చుని మాట్లాడుకున్నారు. ఆమె విశాలి పెళ్ళికి విజయవాడ వెళుతున్నట్లు చెప్పింది.

"ఉదయ్ విన్నాడో లేదోగానీ నాగపూర్‌లో కన్‌ఫర్మ్ అయ్యాకా నాకింత శాలరీ వస్తుంది" అంటూ లెక్కలువేసి చూపించి ఎంత ఖర్చవుతుందో చెప్పి ఎంత ఆదా చెయ్యాలో కూడా చూపించాడు.

'ఆదా అనేది మిగిల్తేకదా చెయ్యడం' అనే మాట కీర్తి నోటిదాకా వచ్చి ఆగిపోయింది.



"సొరకాయతో హల్వా చెయ్యటం వచ్చా నీకు? చాలా చవకగా చేసుకోవచ్చు. నువ్వొచ్చాక చుట్టుపక్కలవాళ్ళు పార్టీ అని ప్రాణంతీస్తారు" అన్నాడు.

కీర్తికి హఠాత్తుగా "పెద్దాడికి స్కూలు జీతం కట్టాలి. చిన్నాడికి నీళ్ళవిరేచనాలు....డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలి" అని కొన్నాళ్ళకి మాట్లాడుతుంటాంకదా అన్న ఫీలింగ్‌వచ్చి దిగులుగా అనిపించింది.

"కాస్త చిక్కావు" ఆమెని పరీక్షగా చూస్తూ అన్నాడు.

ఆమెకి కాస్త ఉపశమనంగా అనిపించింది.

ఉదయ్ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని వేళ్ళు విరుస్తూ "నువ్వంటే నాకు...." అని ఆగిపోయాడు.

అతను చెప్పబోయే దానికోసం ఆమె ఉత్సుకతగా ఎదురుచూసింది.

"చిన్నప్పటినుండీ స్వతంత్రం కీర్తీ! పెళ్ళంటే కాలేదు కానీ నా భార్యవనే అనిపిస్తావు" అన్నాడు.

కీర్తికి అలా అనిపించటంలేదు. వేరేవిధంగానూ అనిపించటంలేదు. ఏమీ అనిపించకపోవడం బాధగా మాత్రం అనిపిస్తోంది!

* * * *

అక్కడ వాతావరణం చాలా సందడిగా వుంది. పరువం పరుగులెత్తుతోంది. ఉత్సాహం ఉరకలేస్తోంది. అందం ఆరబోసినట్లుంది. ఆనందం అంబరాన్నంటుతోంది.

సిద్ధార్థకి ఎవరూ ఒకంతట నచ్చరని అతడి అభిప్రాయం.

"ఈమధ్య మందకొడిగా వుంటున్నాడు. ప్రేమలో పడేవుంటాడు" బ్రహ్మం తీర్మానించాడు.

సిద్ధార్థకి విశ్వనాథ్ పక్కన నడుస్తూ వెళ్ళిన ఆకుపచ్చ ఓణి అమ్మాయి గుర్తొచ్చింది. మరుక్షణం తల విదిలించాడు.

"ఏరా? ఎవరైనా తగిలారా?" చనువుగా అడిగాడు జాన్.

'ఎవరైనా మన ప్రమేయం లేకుండా బలవంతంగా మన మది తలుపు తోసుకుని తలపుల్లోకి జొరబడితే....దాన్ని ఏమంటారు?' అని అడగాలని ఆగిపోయాడు సిద్ధార్థ.

"మీ డాడీ చూసిన అమ్మాయినే ప్రేమించెయ్యరా, కోట్ల ఆస్తి దక్కుతుందీ!" మూడో రౌండ్‌లో వున్న బ్రహ్మం అన్నాడు.

"ఎవరూ ప్రేమించాలీ అనుకుని ప్రేమించలేదురా! రవళిని నేను ఎంత ఏక్సిడెంటల్‌గా కలిసానో తెలుసా? మా కజిన్‌కి చూస్తున్నారని తెలిసి వాడి ప్రోద్బలంతో ఆమె గురించి వాకబు చెయ్యడానికెళ్ళాను. అలా వెళ్ళినవాడిని చూడగానే పడిపోయాను."

రవళి రాకేష్‌ని మోచేత్తో పొడిచింది.

"ఇంక లేవలేవు కూడా!" అన్నాడు జాన్.

"ఔను. అనాలోచితంగా, అసంకల్పితంగా ఒక మనిషి మీద ఇంట్రెస్ట్ ఏర్పడటమే ప్రేమ" సోడా గ్లాసులో పోస్తూ అన్నాడు సిద్ధార్థ.

"అలా ఎవరిమీదైనా ఏర్పడిందా?" అడిగాడు రాకేష్.

సిద్ధార్థ తల అడ్డంగా ఊపబోయి ఆగిపోయాడు.

అతని మనసులో మళ్ళీ గులాబీల మధ్య ముగ్ధగా నిలబడ్డ ఒక అమ్మాయి కదలాడింది.

"బహుశా!" అన్నాడు.

"ఆ!" అందరూ ఒకేసారి అరిచారు.

సిద్దార్థ నవ్వాడు.

"నైన్టీనైన్‌పాయింట్ నైన్ నైన్....పర్సెంట్ ఐ యామ్ ఇన్ లవ్" అన్నాడు.

* * * *

కీర్తి తల వంచుకుని కూర్చుంది. ఆకుపచ్చ పట్టుచీర కట్టి జడనిండా పూలు పెట్టుకుని బుట్టబొమ్మలా వుంది.

ఉదయ్ వైట్ లాల్చీ, పైజామాలో అందంగా కనిపిస్తున్నాడు.

'తెలుపు శాంతికి చిహ్నం' మనసులోని అలజడిని అణిచిపెట్టుకుంటూ అనుకుంది కీర్తి.

శకుంతల కీర్తికి బొట్టుపెట్టి చీరా, జాకెట్టూ, ఉంగరం, రాళ్ళ బుట్టలూ అందించింది.

వివేకానందా, సాంబమూర్తీ తాంబూలాలు మార్చుకున్నారు.

పురోహితుడు లగ్నపత్రికలో కీర్తి పేరూ, ఉదయ్ పేరు



వ్రాస్తూంటే....కీర్తికి నవ్వొచ్చింది. 'ఇప్పటినుండీ అతని పేరు నా పేరు చివర పైటకొంగులా వేళ్ళాడుతుంటుంది కదా! కీర్తీఉదయ్' అని నవ్వుకుంది.

ఇద్దర్నీ పీటలమీద పక్కపక్కన కూర్చోపెట్టారు.

'ఇలాగే బారసాల పీటలమీదా, షష్టిపూర్తి పీటలమీదా కూడా కూర్చుంటాం' అనుకుంది.

"అమ్మాయికేం పెడ్తున్నారూ? కట్నం లేదుగా?" దూరపు బంధువు ఒకావిడ ఆరాలు తీసింది.

వివేకానందా, సాంబమూర్తీ, ఇంకా నలుగురు మగాళ్ళు ప్రపంచ యుద్ధం రాబోతోంది అన్న లెవెల్‌లో పాలిటిక్స్ గురించి మాట్లాడేసుకుంటున్నారు.

"నల్లపూసలు మీరే చేయించండి అత్తయ్యా. మేము అమ్మ పెద్ద గొలుసు మెరుగు పెట్టించి పెడతాము. డాబుగా వుంటుంది" శకుంతల గొప్పగా చెప్తోంది.

పెళ్ళంటే పట్టుచీరలూ.... నగలూ.... పెట్టుపోతలూ.... సంప్రదాయాలూ....విందులూ....విస్తరాకులేనా?

చిన్నపిల్లలు కొందరు అనవసరంగా కేకలేస్తూ పరిగెత్తి ఆడుకుంటున్నారు. వాళ్ళ మొహాల్లో ఏ దిగులూ లేదు.

మైత్రి వచ్చి ఉదయ్‌కి కంగ్రాట్స్ చెప్పి కీర్తికి ఓ రాధాకృష్ణుల బొమ్మ ప్రెజెంట్ చేసింది.

ఇంతలో భోజనాల హడావిడి మొదలయింది.

ఉదయ్ విస్తట్లోంచి కీర్తికి ఎంగిలి తినిపించాలని ఎవరో పట్టుపట్టారు.

"నాకు ఎంగిలి ఇష్టం వుండదు" అంది కీర్తి.

"అబ్బో! అందరం ఇలా అన్నవాళ్ళమే" అని ఒకావిడ అనగానే అందరూ గొల్లున నవ్వారు.

ఉదయ్ వెంటనే "ఒద్దులే అయితే" అన్నాడు.

దేనికీ పెద్దగా హర్ట్ అవడు. అదో సుకృతం.

మైత్రి భోజనాలయ్యాక చెప్పింది" మీ జోడీ బావుంది. కానీ నువ్వు కాస్త ఉత్సాహంగా వుంటే యింకా బావుండేది."

'నేను ఉత్సాహంగా లేనా?' కీర్తికి ఆశ్చర్యంగా అనిపించింది. అర చేతుల్లో ఎర్రగా పండిన గోరింటాకుని చూసుకుంది. 'మందారంలా పూస్తే, మంచి మొగుడొస్తాడూ....' అన్న మాట గుర్తొచ్చింది.

ఉదయ్ చా....లా....మంచివాడు! నేనెందుకు ఉత్సాహంగా లేమా? అని ప్రశ్నించుకుంది.

రాత్రి ఇంటికి వెళ్ళేముందు ఉదయ్ కీర్తిని ఒంటరిగా కలిసి గట్టిగా కౌగిలించుకున్నాడు.

ఆమె గింజుకుంటుంటే బుగ్గమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె నిర్భావమైన స్థితిలో శిలలా వుండిపోయింది.

నెమ్మదిగా ఆమెను వదిలిపెడుతూ "చెవి జూకాలు తీసి దాచిపెట్టు. లేకపోతే రాత్రి నిద్రలో అవి పత్తుకుపోయి పాడయిపోతాయి" అన్నాడు.

రాత్రి జూకాలు తీసి పెట్లో దాచిపెడుతూ 'ఇంక అన్నీ అతను నిర్దేశించినట్లు చేసుకుపోవడమేనా జీవితమంటే?' అనుకుంది.

* * * *

సాంబమూర్తి ఇంట్లోకి వచ్చి చెప్పులు విడిచి "కీర్తీ! కాసిని మంచి నీళ్ళు తీసుకురా తల్లీ!" అని మంచంమీద కూర్చున్నాడు.

కీర్తి మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ తండ్రి ఏదో దీర్ఘాలోచనలో ఉండటం గమనించింది.

"ఏమిటి నాన్నా! ఏం ఆలోచిస్తున్నారూ?" అని అడిగింది.

గుడికెళ్ళి వస్తున్న సుభద్ర "వచ్చేసారా?" అంటూ దగ్గరకొచ్చి కీర్తికీ, భర్తకీ నుదుట కుంకుమపెట్టి ప్రసాదం పెట్టింది.

"నీ దేవుడ్ని ఏం కోరి వస్తున్నావు సుభద్రా?" చిరునవ్వు నవ్వుతూ అడిగాడాయన.

"మీరూ పిల్లలూ క్షేమంగా వున్నదాంట్లో మనం సంతృప్తిగా వుండాలనీ!" అందావిడ.

"లక్షల ఆస్తి కావాలని కోరలేదుగా?" అడిగాడాయన.

ఆవిడ తెల్లబోయినట్లు చూసింది.



"ఈ గుమాస్తా మొగుడూ, తీరీ తీరని కోరికలూ, చాలీచాలని ఆదాయం ఇవన్నీపోయి....లక్షలొచ్చి పడితే బావుణ్ణనుకున్నావా....?" అన్నాడు.

ఆవిడ చప్పున ఆయన నోటికి తన చెయ్యి అడ్డుపెట్టి "ఏం మాటలండీ అవి? మీరు ఎదురుగా వుంటే, పిల్లలు నవ్వుతూ వుంటే నాకు అదే కోట్ల ఆస్తితో సమానం" అంది.

"నిజంగా కోరుకోలేదుగా?" రెట్టించాడాయన.

"లేదండీ!" ఆవిడ స్థిరంగా అంది.

"ఏమిటి నాన్నా ఇదీ? అమ్మని ఎందుకలా పరీక్షిస్తున్నారూ?" నవ్వుని ఆపుకోలేక కీర్తి అడిగింది.

సాంబమూర్తి దీర్ఘంగా నిట్టూర్చి "నా కుటుంబంలో అందరి ఆలోచనలూ నా ఆలోచనలతో కలుస్తున్నాయో లేదో అనిపించిందమ్మా! కీర్తీ.... ఒక తప్పు నీ తండ్రి చెయ్యడం ద్వారా మనకు లక్షల ఆస్తి వస్తుందంటే నువ్వేమంటావమ్మా?" అని అడిగాడు.

"ఆ తప్పుని తుడిచి పారెయ్యడానికి వందల కోట్లవల్ల కూడా సాధ్యం కాదంటాను. కేరెక్టర్‌ని మించిన ప్రాపర్టీ ఏముంది నాన్నా?" తడుముకోకుండా అంది.

ఆయన కళ్ళల్లో వెలుగు కనిపించింది. "ఐత్తొకటి వేస్తే....చెట్టొకటి వస్తుందా తల్లీ! నా మనసులో మాటలే చెప్పావు. ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ!" అన్నాడు.

"ఇంతకీ మీరిద్దరూ దేని గురించి మాట్లాడుతున్నారు?" సుభద్ర అర్థంకాక అడిగింది.

"అదే చెప్పబోతున్నాను. మా పెదనాన్నకి మా వూళ్ళో పొలాలూ, ఇళ్ళూ వున్నాయి. పిల్లలులేరు. మా పెద్దమ్మ తాలూకు బంధువుల అబ్బాయి వీళ్ళిద్దరూ మంచంలో పడితే ఇన్నాళ్ళూ కనిపెట్టుకునుండి, సేవలు చేసి, ఆస్తి వ్యవహారాలు చూసాడు. మా పెదనాన్న ఎవరి పేరా ఏమీ వ్రాయకుండానే పోయాడు. ఇప్పుడు విశ్వనాథం, క్లైమ్ చేస్తే ఆ ఆస్తి మొత్తం మనకు వచ్చేట్లు చేస్తానంటున్నాడు. ఆ ఇద్దరూ పక్షవాతంతో మంచానపడి వున్నప్పుడు....మనం ఒకసారి వెళ్ళాం....గుర్తుందా సుభద్రా?" అడిగా

డాయన.

సుభద్ర గుర్తుతెచ్చుకుంటూ "ఔను! అన్నీ మంచంలోనే....పాపం ఆ అబ్బాయీ, భార్య అసహ్యం అనుకోకుండా వాళ్ళకి సేవలు చేస్తూ కని పెంచారు" అంది.

"మళ్ళీ మనం ఇన్నేళ్ళూ తిరిగి చూడలేదు. వాళ్ళు అలా పదేళ్ళు బ్రతికిపోయారు. పదేళ్ళపాటు ఆ కుటుంబం ఇద్దరు రోగిష్టి వృద్ధుల్ని భరించి సేవ చేసింది. ఇప్పుడు వాళ్ళకేదో ముట్టజెప్పి, బయటికి పంపేసి నన్ను ఆస్తి తీసుకోమంటున్నాడు విశ్వనాథం. నువ్వేమంటావు...." అన్నాడు.

సుభద్ర ఆలోచించలేదు" అన్యాయం అండీ!" అంది.

ఆయన కీర్తివంక చూసాడు

"మనకి హక్కు లేదు నాన్నా! చట్టంకన్నా ధర్మం గొప్పది అని మహాత్ముడు అనేవాడుట" అంది.

"లక్షల ఆస్తి....దాదాపు యాభై లక్షలదాకా పలుకుతాయా పొలాలు" మరోసారి ఆలోచించుకోమన్నట్లు చెప్పాడాయన.

"వాటిని సాగుచేసింది మనం కాదు. దున్నేవాడిదే భూమి!" అంది కీర్తి.

ఆయన స్తిమితపడినట్లు వెనక్కివాలి "మీ ఆలోచనలకి, అభిప్రాయాలకి విలువనివ్వకుండా నిర్ణయం నా ఇష్టప్రకారం తీసుకోవడం సరైన పని కాదనిపించి అడిగాను తల్లీ! అచ్చు నాలాగే ఆలోచించిన భార్యనీ, కూతుర్నీ చూసుకున్నాకా లక్షలు నాకెందుకూ....కోట్లకన్నా ఎక్కువైన ఆస్తిని సంపాదించుకున్నాను అనిపిస్తోంది" అన్నాడు.

"కాఫీ తెస్తాను" సుభద్ర వంటగదిలోకి నడిచింది.

కీర్తి తండ్రి కాళ్ళదగ్గర కూర్చుని ఆయన కాళ్ళమీద చెయ్యేసింది. "ఎదుటివారి అభిప్రాయాల్ని గౌరవించడం ఎంత గొప్ప వ్యక్తిత్వం నాన్నా! ఒకవేళ అమ్మ మిమ్మల్ని సమర్థించకపోయి వుంటే...." అని అడిగింది.

"నేను చెప్పేదాంట్లో న్యాయం వుంటే ఎవరినైనా ఒప్పించగలను అని మనస్ఫూర్తిగా నమ్ముతానమ్మా నేను. కానీ మీ అమ్మ నా ఆలోచనని



పెదవుల మీదకి రాకముందే కళ్ళల్లో చదివేస్తుంది. భార్యాభర్తలంటే ఒకే ఆత్మ, రెండు దేహాలమ్మా! అందుకే మా ఇద్దరికీ మీమీదున్న ప్రేమలో హెచ్చుతగ్గులుండవు. మీరూ మా శరీరాల్లో భాగాలే అనిపిస్తుంది...." అన్నాడు.

'భార్యాభర్తలంటే....ఒకే ఆత్మ....రెండు శరీరాలా! ఒకేలా ఆలోచించి ఒకేలా స్పందిస్తే సంసారంలో ఎన్ని ఒడుదుడుకులొచ్చినా ఆనందంగా తట్టుకోవచ్చా? మరి నేనూ....ఉదయ్....ఒకేలా ఆలోచించాలా?" కీర్తి ఆలోచనలో పడింది.

పండు వెన్నెల్లో ఆరుబయట పడుకున్నప్పుడు "కీర్తి....రాత్రంతా ఇలా పడుకుంటే జలుబు చేస్తుంది. ఆస్ప్రిన్ కొనాల్సొస్తుంది. దండగఖర్చు. క్రిందకి పోదాం పద" అంటాడేమో....తనూ అందుకు తగినట్లు నడుచుకొంటుంది. కానీ అది సర్దుకుపోవడమా! అతని అభిప్రాయాలతో ఏకీభవించడమా! నో....తను ఏకీభవించలేదు.

"ఏమిటమ్మా....అంత గంభీరమైన ఆలోచన?" తండ్రి ప్రేమగా ఆమె తలమీద చెయ్యేసి అడిగాడు.

"మొదటిరోజునుండీ అమ్మ ఇష్టం నీ ఇష్టం ఒకటేనా నాన్నా! అసలెప్పుడూ అభిప్రాయభేదాలే రాలేదా?" అడిగింది.

"మంచి ప్రశ్న!" ఆయన లేచి కూర్చున్నాడు.

"ఎదుటివారిని మనం, మనని మనం ప్రేమించుకున్నదానికంటే ఎక్కువగా ప్రేమించగలిగితే అది సాధ్యం అవుతుందమ్మా! ఆమె చెప్పేదాంట్లో అతనికీ, అతను చెప్పేదాంట్లో ఆమెకీ అంతా సమంజసమే కనిపిస్తుంది. ప్రేమ ఐకమత్యమనే తాడుమీద క్రింద పడిపోకుండా నడిపిస్తుంది" అన్నాడు.

"ప్రేమ....వివాహం అయ్యాక కలుగుతుందా నాన్నా?" అమాయకంగా అడిగింది

"ఒక వ్యక్తిని జీవితంలో ఒకటి రెండుసార్లు కలిసినప్పుడు 'ఈ వ్యక్తి లేకపోతే జీవితం కష్టం' అని భావన కలగడమే ప్రేమ. మీ అమ్మని పెళ్ళికాకముందు ఒకసారి చూశాను. అప్పుడే అలాంటి భావన కలిగింది. ఆమెకీ అలాగే అనిపించిందట!" ఆయన గర్వంగా చెప్పాడు.

'ఉదయ్ కూడా అదే మాట చెప్పాడు. మరి నాకూ అలాగే అనిపించాలికదా?' అనుకుంది కీర్తి.

కీర్తి మనసులో సంఘర్షణని పసిగట్టేసినట్లు తండ్రి అడిగాడు– "ఉదయ్‌ని చూస్తే నీకూ అలాగే అన్పిస్తూ వుండాలే?"

"భరించలేను అని మాత్రం ఎప్పుడూ అనిపించలేదు నాన్నా" కీర్తి లేచి లోపలికి వెళుతూ అంది.

'ఏమిటీ జవాబూ? నా కూతురు పరిస్థితులకి తలవంచుతోందా.... ఆమెకి ఇష్టమైనవిధంగా ఆమె జీవితం సాగడంలేదా?. అని ఆలోచించసాగాడు సాంబమూర్తి.

సుభద్ర కాఫీగ్లాసుతో వచ్చి నవ్వుతూ "మీ కూతురికి ఎంత శ్రద్ధ వచ్చిందో చూడండి. అరిశలు చెయ్యడం నేర్పించాలట. ఎందుకంటే ఉదయ్‌కి ఇష్టమట" అంది.

అతని ఇష్టాలని కష్టపడైనా తీర్చాలనుకోవడం ప్రేమేగా! ఆయనకి మనశ్శాంతిగా అనిపించింది.

• • • •

'తను కష్టపడైనా ఇతరులని సుఖపెట్టాలనుకోవడంలో ఎంత ఆనందం వుంది.' ఆ ఇతరులు పరాయివారైతే దాని పేరు త్యాగం అవుతుంది. స్వంతవారయితే దాని పేరు అనురాగం అవుతుంది.

తను ప్రయాణంలో కష్టపడకూడదని సెకండ్ ఏ.సీ.లో రిజర్వ్ చేయించిన తండ్రిని తలుచుకుంటే, ఏం చేసి ఆయన్ని ఆనందపరచగలనూ? అనుకుంది కీర్తి.

ఆనందపరచడం మన చేతుల్లో లేకపోవచ్చు. కానీ బాధపెట్టడం మాత్రం మన చేతుల్లోనే వుంటుంది. అది చెయ్యకుండా వుంటేచాలు అనుకుంది.

సూట్‌కేస్ సీటు క్రిందపెట్టి సర్దుకుని కూర్చున్నాకా కిటికీలోంచి బయటికి చూసింది. చాలామంది వీడ్కోలిస్తూ కనపడ్డారు. అప్పటిదాకా ఎన్ని కబుర్లు చెప్పినా ట్రైన్ కదులుతుంటే మాత్రం సన్నని గుబులు ప్రతివారి మనసుల్లో కలుక్కుమని కలగక మానదు. మనిషికి ఎంత స్వార్థం–తనకి ఇష్టమైనవన్నీ తననే అంటిపెట్టుకుని వుండాలనీ!



విశాలి పెళ్ళి గుర్తుకొచ్చింది. అది ఎంత ఆనందంగా వుంది.... మూడేళ్ళ క్రితం ఇంటర్‌మీడియట్ అయిపోయిన సెలవల్లో వాళ్ళ మేడ మీద అద్దెకి దిగిన రాంబాబుని ప్రేమించానంది. అతనితో సినిమాలకీ, షికార్లకీ వెళ్ళింది. అస్తమానం అతని కబుర్లే చెప్పేది. భవిష్యత్తు అతనితో వూహించి ఎన్నో గాలిమేడలు కట్టుకుంది ఓనాడు అది వాళ్ళ అమ్మమ్మగారు వూరు వెళ్ళివచ్చేలోగానే అతను రూం ఖాళీచేసి వెళ్ళిపోయాడు. తనకీ, మైత్రికీ చెప్పుకుని భోరుమంది.

"నీ ప్రేమని అపాత్రదానం చేశావే....ఆడదాని మనసు విలువ ఆ పురుషజాతి ఎప్పటికీ తెలుసుకోలేదు" అని ఓదార్చింది మైత్రి.

"రేపటినుంచీ అతను లేకుండా నేనెలా బ్రతకాలి?" అని వెక్కిళ్ళ మధ్యన అడిగింది.

కీర్తి ఆశ్చర్యంగా చూసింది. 'రేపటినుండీ కిడ్నీలు లేకుండా ఎలా బ్రతకాలీ? అన్నట్లు అడుగుతుందేమిటీ' అనుకుంది కూడాను.

"కష్టమే....కానీ మిగిలిన శక్తిని కూడగట్టుకొని బ్రతకాలి. ప్రేమ విఫలం అయితే అది మరణంతో సమానం అని నాకు తెలుసు" అంది తనూ కన్నీళ్ళు పెట్టుకుంటూ మైత్రి.

"ప్రేమ విఫలం అవడం అంటే?" అమాయకంగా అడిగింది కీర్తి.

"సఫలం కాకపోవడం" అంది విశాలి.

"సఫలం అంటే?" అడిగింది కీర్తి.

"పెళ్ళి జరగకపోవడం!" విసుగ్గా చెప్పింది మైత్రి.

"పెళ్ళి జరగడమే ప్రేమ సఫలమవడం అయితే మొదటే పెళ్ళి చేసుకోవచ్చుగా?" అంది తేలిగ్గా కీర్తి.

ఆ ఇద్దరూ ఆమె వంక 'ఓసి అమాయకపు పక్షీ!' అన్నట్లు చూశారు.

"హుం! నీకర్థం కాదులే. ఒక మనిషి తలపులు అనుక్షణం వెంటాడటం, అతని సాహచర్యం కోసం అణువణువూ తపించడం....అటువంటి వ్యక్తితో కలిసి జీవన ప్రయాణం చెయ్యడం అదంతా ఒక అద్భుతమైన అనుభూతి" అంది విశాలి.

"ఆ వ్యక్తి గొప్పవాడయితేనే కదా అటువంటి భావన కలిగేదీ....

మరి నువ్వు ప్రేమించిన రాంబాబు నిన్ను శుభ్రంగా ఎంజాయ్ చేసి పారిపోయిన దొంగ వెధవ కదా....అయినా దాన్ని ప్రేమనే అనుకుంటున్నావా? అతనితో అయితే నీ జీవన ప్రయాణం ఆనందమయం అయ్యేది అని భావిస్తున్నావా?" నిలదీసింది కీర్తి.

అతను నన్ను మోసం చేసినందుకే బాధపడుతున్నాను."

"ఎలా బ్రతకాలీ అటువంటి అద్భుతవ్యక్తి సమక్షం లేకుండా అని కాదుగా?" లా పాయింట్ పట్టేసింది కీర్తి.

'కాదు" అంది విశాలి.

"అయితే ఏదీ ప్రేమకాదు! నీ ప్రేమవిఫలం అవలేదు. నువ్వు లేచి ముఖం కడుక్కో. రవీంద్రభారతిలో ఏసుదాస్ కచ్చేరీ వుంది. నాన్నగారు పాసులు తెచ్చారు" అంది కీర్తి.

"నిజంగానా? వెళ్దామే" ఉత్సాహపడింది మైత్రి.

ఇద్దరూ కలిసి ఒప్పించిన మీదట విశాలి రావడానికి ఒప్పుకుంది.

చాలాసేపు మూడీగా కూర్చున్న తరువాత ఆమె కూడా వాళ్ళతో కలిసి ఆనందించింది. సంగీతం, ప్రకృతీ ఒకదానితో ఒకటి ముడిపడుతున్నాయి. ఈ రెంటినీ ఆనందించనివాళ్ళు వుండరేమో. ఉంటే....వాళ్ళు లేనివాళ్ళతోనే సమానం.

ప్రోగ్రాం అయ్యాకా ఆయన దగ్గర ఆటోగ్రాఫ్ తీసుకోడానికి వెళ్ళారు విశాలీ, మైత్రీ.

వెలిగిపోతున్న మొహంతో వచ్చి "అంతటి మహానుభావుడ్ని ఇంత దగ్గరినుంచి చూడ్డం, ఆటోగ్రాఫ్ తీసుకోవడం అంటే మాటలా? జన్మ ధన్యం అయినట్లుంది" అంది విశాలి.

'ఇన్ని ఆనందాలని వదిలిపెట్టి, ఇందాక ఎలాగే బ్రతకడం అని ఎందుకు ఏడ్చావు?' అని కీర్తి అడగలేదు కానీ మనసులో అనుకుంది. ఇటువంటి ప్రేమల్ని పుస్తకాలలో, సినిమాలలో కవులు అతిగా వర్ణించేస్తారు అని.

విశాలికి ఆమె తండ్రి బోలెడు ఖర్చుపెట్టి అమెరికానుండి వరుడ్ని దిగుమతి చేసి పెళ్ళిచేసాడు.

అతని గొప్పతనం, స్టేటస్, అత్తవారి ఆస్తిపాస్తుల గురించి చెప్పు



తుంటున్న విశాలికి ఒకప్పుడు వారి మేడమీద అద్దెకి దిగిన రాంబాబనే ఎలక్ట్రిషియన్ కుర్రాడు అస్సలు జ్ఞాపకం రావడం లేదనుకుంట. మరి అప్పుడు అహర్నిశలు అతని ధ్యాసే వుండేదే!

కీర్తికి అంతా యమా కన్ఫ్యూజింగ్‌గా అనిపించినా విశాలి ఆనందంగా వుండడం మాత్రం ఆనందం కలిగించింది.

ట్రైన్ కదుల్తుండగా మంచినీళ్ళ బాటిల్ కొంటే బావుండునని పించింది. హడావుడిగా డోర్ దగ్గరకు నడుస్తుండగా, ఎదురుగా వస్తున్న వ్యక్తికి డాష్ ఇచ్చేసింది. ట్రైన్ కుదుపుకి పక్కకి పడబోతున్న ఆమెని అతను ఎంతో అపురూపంగా పట్టుకొని ఆపాడు.

కీర్తి ఎంతో సిగ్గుగా 'సా....రీ' అని వదిలించుకుంది.

అతని కళ్ళల్లో ఎంతో ఆశ్చర్యం గమనించింది. ఆమెకీ ఎక్కడో చూసినట్లే అనిపించింది. గుర్తుకుతెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ తలుపువైపు వెళ్ళిపోయింది.

సిద్ధార్థ కూడా అంతే ఉత్సుకతతో ఆమెని గమనిస్తూ తన బెర్త్ దగ్గరికి వెళ్ళాడు. అతని సామాన్లు సీటుకింద పెడుతుండగా, ఎదురుసీటు మీదున్న సూట్‌కేస్ మీద 'కీ.... ర్తి....' అన్న పేరు కనిపించి, చిరునవ్వు నవ్వుకున్నాడు.

కీర్తి వాటర్‌బాటిల్ కొని డబ్బులిస్తున్నప్పుడు కూడా అతని గురించే ఆలోచించింది. ఆమెకి అతను తాకిన భుజంవైపు చూసుకుంటే, అదోరకంగా అనిపించింది. రెప్పపాటు కాలం మాత్రమే ఆమె అతని చేతుల్లో వుంది. ఆ చేతుల్లో అనిర్వచనీయమైన సుఖమేదో దొరికినట్లు తోచింది.

ఇంకా కొద్ది సెకన్లకాలం అలా వుండిపోతే బావుండేదేమో.... అన్న ఆలోచన రాగానే తల విదిలించేసింది, అప్రయత్నంగా కుడిచేత్తో చెంపలు వేసుకుంది.

అతని అందం, టీపీ, పర్సనాలిటీ ఇవి కావు ఆమె ఆలోచిస్తున్నది. ఆ కళ్ళల్లో ఏమిటంత ఆకర్షణ? ఆ చూపులు సూదంటురాళ్ళలా నన్నెందుకంతగా తనవైపు ఆకర్షిస్తున్నాయీ అని ప్రశ్నించుకుంది. ఏమిటో తెలియని గగుర్పాటు కలిగింది.

కీర్తి తన సీటుమీద కూర్చుంటుండగా ఎదురుసీటుమీదున్న అతను కనపడ్డాడు. అతని పెదవులు విచ్చీవిచ్చకుండా నవ్వుతున్నాయి.

కీర్తి చటుక్కున తల వంచుకుంది. 'అటువైపు చూడకుండా వుండడానికి నాకు శక్తినివ్వు భగవాన్' అనుకుంది.

తల వంచుకున్న ఆమెకి అతని కాళ్ళు, షూస్ కన్పిస్తున్నాయి. అతని చేతుల్లో 'ఇండియా టుడే' మేగజైన్ గుండ్రంగా చుట్టివుంది. బలమైన అతని చేతివేళ్ళు మేగజైన్‌ని చుట్టడం. విప్పడం చేస్తున్నాయి. 'ఈ వేళ్ళే నా భుజాల్ని పట్టుకున్నాయి' అన్న ఊహకే ఆమె ఒళ్ళు ఝల్లుమంది. గుండె లయ తప్పినట్లూ, శరీరం తేలికైపోయినట్లూ అనిపించసాగింది.

ఏవిటీ మత్తూ? ఈ క్షణాలు ఇంత మధురంగా వున్నాయేంటీ?

ఇతను నాకు ఇప్పుడే కనిపించాడా? లేదా ఇంకే జన్మలోనైనా పరిచయమా?

ఆ కళ్ళు....ఎందుకలా నన్ను చూడు అంటున్నాయీ? ఆ పెదవుల్లో ఏవిటా చిలిపి నవ్వు? ఆ స్పర్శలో ఏమిటింత పారవశ్యం....

"ఎక్స్‌క్యూజ్‌మీ" అన్న పిలుపుకి తలెత్తి చూసింది.

తెల్లచీరల్లో వున్న ఇద్దరు ఆడవాళ్ళు కనిపించారు. "మేడమ్! గుజరాత్ భూకంప బాధితులకి మీ చేతనైన సాయం చెయ్యండి. ఇల్లూ, వాకిలీ, ఆప్తులూ అందరూ తృటిలో పోయి, అనాథలైన ఆ దురదృష్టవంతుల్ని ఆదుకోవడం సాటి మానవులుగా మన కర్తవ్యం" పెద్దావిడ ఎంతో నెమ్మదిగా, మృదువుగా చెప్పింది.

కీర్తికి డొనేట్ చెయ్యాలనే వుంది. కానీ పర్స్‌లో అరవై రూపాయలకి మించిలేవు. ప్రొద్దుట ఆటోలో ఇంటికి వెళ్ళాలి. సరిపోతాయో లేవో. ఆమె ఆలోచిస్తుండగా ఆవిడ మళ్ళీ అంది.

"సందేహించకండి. మీ దగ్గర వున్నదీ, మీకు తోచిందీ దానం చెయ్యండి అడగకుండానే దాతలు ముందుకువచ్చి లక్షలిస్తున్నారు. ఈ పుణ్యం అంతా పరలోకంలో వున్న మన ఖాతాలోకి జమ అవుతుంది."

కీర్తి అతనివైపు చూసింది.

అతను నవ్వుతూ "పుణ్యం చెయ్యడానికి మంచి ఛాన్స్ అన్నమాట" అన్నాడు.



"నా దగ్గర ప్రస్తుతం...." అని ఆలోచించి పాతిక తీసుకోండి" అని లెక్కపెట్టి అందించబోయింది కీర్తి.

చటుక్కున అతని చెయ్యి ఆమె చేతిని పట్టుకుని ఆపింది.

ఆమె తెల్లబోయి చూసింది.

"మరీ....అంత తక్కువ ఇవ్వాల్సిన స్థితా మీది? కోట్లు మనం పోయేటప్పుడు మనతో రావండి. వచ్చేవీ....ఇలాంటి దానధర్మాలే" అన్నాడు సిద్ధార్థ.

"మీకు నా గురించి ఎంత తెల్సని ఇలా మాట్లాడుతున్నారు?" ఆమె విస్మయంగా అడిగింది.

"అంతా తెలుసు. మేడమ్! ఆవిడ తరపునా, నా తరపునా తలో వెయ్యి రాయండి" అని జేబులోంచి పర్సు తీశాడు.

"నో....వద్దూ....వెయ్యి చాలా ఎక్కువ" కంగారుగా అడ్డుకోబోయింది కీర్తి.

అతను ఆమెని ఆగమన్నట్లు సైగచేసి "రాయండి. ప్రస్తుతం ఆవిడ దగ్గర డబ్బు లేకున్నా ఫర్వాలేదు. నేనిస్తాను" అని నోట్లు లెక్కపెట్టి ఇచ్చాడు.

"దయామయులు, మీ పుణ్యం వృధాగాపోదు. గాడ్ బ్లెస్ యూ" ఆవిడ అందుకుంటూ అని-"థాంక్స్!" అని కీర్తికి చెప్పి ఇంకొకామెతో కలిసి వెళ్ళిపోయింది.

కీర్తి కోపంగా "ఎందుకు నా బదులు వెయ్యి ఇచ్చారూ?" అని సిద్ధార్థని అడిగింది.

"మీ ఇంటికొచ్చి నా రుణం వసూలు చేసుకుందామని" అతను నవ్వుతూ చెప్పాడు.

"వెయ్యిరూపాయలా" కీర్తికి తన ఆర్థిక పరిస్థితి గుర్తొచ్చి ముచ్చెమటలు పోసాయి.

"అది మీ స్తోమతకి చాలా తక్కువనుకోండి" అన్నాడు సిద్ధార్థ.

"చూడండి, నా గురించి మీకు తెలీదు" కీర్తి చెప్పబోయింది.

"మీ పేరు కీర్తికదూ?" అడిగాడు.

"ఔను!" ఆశ్చర్యంగా అంది.

"ఇంకేం చెప్పొద్దు, నాకు మీ గురించి విశ్వనాథంగారి ద్వారా అంతా తెలుసు. ఆయన మా ఫాదర్‌కి బాగా కావాల్సినవారు" అన్నాడు.

"మా ఫాదర్‌కి కూడా ఆయన కావలసినవారే. కానీ మా నాన్నగారు" అని చెప్పేలోగానే–

"టీసీ వస్తున్నాడు, టికెట్ చూపించండి ముందు" అన్నాడు.

టీసీ వెళ్ళాక అతను "బెర్త్ వాల్చనా....పడుకుంటారా?" అడిగాడు.

ఆమె లేచి నిలబడింది.

ట్రైన్ చిన్న జర్క్‌తో ముందుకి ఆగింది.

కీర్తి అతనిమీదకి ఒరిగిపడింది.

అతని చేతులు ఆమెను గట్టిగా పట్టుకున్నాయి. ఈసారి నడుము దగ్గర.

ఆమె టక్కున దూరంగా జరిగింది.

బెర్త్‌మీద పడుకున్నాక అనుకుంది.

'ఎందుకు కావాలని అతనిమీద పడ్డానూ. శరీరం ఇలా అదుపుతప్పి ప్రవర్తించడాన్ని ఏమంటారూ?'

* * * *

సిద్దార్థ మనఃస్థితీ అలానే వుంది. అనుకోకుండా ఆమెతో కలిసి చేస్తున్న ఈ ప్రయాణం మనసుని గిలిగింతలు పెడుతోంది. విజ్ఞతకాదని తెలిసినా ఆమెను లేపాలనీ, ఈ రాత్రి వ్యర్థమయిపోకుండా కాసిని మాటలు మాట్లాడాలనీ....ఆ కళ్ళల్లో బెరుకునీ....అధరపు అదురునీ చూడాలనీ పదే పదే అన్పిస్తోంది. కాలివేళ్ళు మాత్రమే కన్పించేట్టుగా ఆమె సర్దుకుని పడుకుంది. లేలేత ఎర్రని పల్లవాల్లా గోరింటపెట్టిన కాలివేళ్ళు మెరుస్తున్నాయి. గాలికి ఊగుతున్న ముంగురులు ఆమె పలుచని చెక్కిళ్ళమీద జాబిలిని మూస్తున్న మేఘమాలికల్లా తోస్తున్నాయి. మూసిన ఆమె కనుదోయి ప్రపంచంలోని అందాలన్నింటినీ తనలో దాచుకున్న ఖజానాలా వుంది. పెదవి వంపు సౌఖ్యశిఖరాన్ని అధిరోహించడానికి వేసిన మొదటిమెట్టులా వుంది. ఎంతో అమాయకంగా కనిపిస్తున్న ఆ ముఖంలో కోటేరు



ముక్కుకు తళుక్కుమంటున్న ఒంటిరాయి ముక్కుపుడక, ఎన్నో అనందాల్ని నేను కనులారా వీక్షించే సాక్షినికదా అన్నట్టు మిడిసిపడుతోంది. మిసిమి వన్నెతో మెరుగుపెట్టిన వెండి గిన్నెలా మెరుస్తోంది ఆ మెడ వంపు. ఇంకా క్రిందుగా....సోయగాల విందులన్నీ అమర్చి వాటిమీద దృష్టి తగలకుండా అరిటాకు కప్పినట్టుగా సన్నని పయ్యెద కప్పి వుంది. కలాన్ని తేనెలో ముంచి శృంగారనైషధాన్ని వ్రాసిన శ్రీనాథుడు అదాటుగా దాన్ని కుమారసంభవం మీదే అనేట్లు పెట్టినట్టుగా ఇరుకుగా వుంది పయ్యెద చాటు సోయగం.

భూమిని ఆలింగనం చేసుకోవడానికి వెలుగుచీర కట్టుకుని వచ్చిన పూలతో తడితడి కోర్కెతో ప్రభాతం విచ్చేస్తుంది. అరసి, విసిగి, వేసారి మధ్యాహ్నపు గాడ్పునించి ఉపశమనాన్ని కోరే వేళ....శీతల శాంతిసుధని నింపుకుని, మందలు విడిపోయిన ఒంటరి పచ్చిక బయళ్ళమీద బాటలేని దాపులవెంట చిరునవ్వుతో అలిసిన శరీరాన్ని సేదదీర్చడానికి సంధ్య నడిచి వస్తోంది.

'నువ్వే ఆకాశం, నువ్వే పృథ్వీ! ఆత్మని ఆలింగనం చేసుకునే అమరభావనే ప్రేమ!'

అతను ఆగలేనట్టు మోచేతిమీద తలఆన్చి ఆమె వైపు తిరిగాడు.

ఆదే సమయంలో కళ్ళు తెరిచింది.

నాలుగు కళ్ళు జతపడినప్పుడు కలిగే ఉలికిపాటు....పెదాల తడబాటు....శరీరం....గగుర్పాటు....ఇవన్నీ కలిసి ఏర్పాటు చేసేదే మోహం!

అతని పెదవులు నవ్వుతున్నాయి. రంగురంగుల సీతాకోక చిలుకలకి ఆ వలువలెవరిచ్చారూ? ఇన్ని రంగులూ, రాగాలూ, పరిమళాలూ ఎవరిచ్చారూ?

బహుశా ఈ నవ్వుని ఇతని పెదవులమీద చెక్కడానికి ఆ విశ్వకర్మకి ఎన్నో రాత్రిళ్ళు పట్టి వుంటుంది. అన్ని రాత్రులూ విరహవేదనలో రగిలిపోయిన విరించి రాణి విరహోత్కంఠిత అయి, కచ్ఛపిని శృతిచేస్తే మ్రోగిన స్వరం అతని కంఠంగా మారి వుంటుంది. ఒక్కసారి, ఒకే ఒక్కసారి అతని కంఠాన్ని వినాలన్పించింది కీర్తికి.

ఆమె మనసు పలికే మూగభాష అతని హృదయం విన్నట్టుగా

అతను మాట్లాడాడు.

"నా పేరు సిద్ధార్థ. కీర్తీ....ఐ లవ్ యూ!"

తటాలున ఓ రాయి విసిరితే ప్రశాంతమయిన కొలను కల్లోలమైనట్లు ఆమె ఉలిక్కిపడి చూసింది. ఓ రాత్రివేళ కలత నిద్దురై లేచిన కూజితం ఒక్కటి ముందే వస్తోంది. ఆకు నుంచి ఆకుకి ఆహ్లాదం విస్తరిస్తోంది. అంతులేని హర్షం అంతటా వర్షిస్తోంది. తీరాన్ని ముంచెత్తడానికి సాగరం అహోరాత్రులూ వుత్సాహంతో ఉరకలు వేస్తోంది. ఆనందార్ణవం అంతటా అలుముకుంటోంది.

నిస్సహాయమై, నిస్తేజమై, నిర్వీర్యురాలై....హఠాత్తుగా ఓపలేని భారం మీదపడిన దానిలా కనురెప్ప సైతం ఆర్పడం మర్చిపోయి కీర్తి అతన్నే చూస్తోంది.

లేచి నిలబడ్డ సిద్ధార్థ చెయ్యి మెల్లగా ఆమెవైపు రాసాగింది. మరు నిముషంలో అది తన కపోలాన్ని స్పృశిస్తుందని తెలుసు. దాన్ని మధ్యలోనే ఆపెయ్యాలని మనసు కోరుతోంది. శరీరం మాట వినడంలేదు. ఆ రెంటికీ మధ్య నలిగిపోతున్న దీనయై భయంగా చూస్తోంది కీర్తి.

ఒడ్డున ఇసుకలో ఆడుకుంటాం. సముద్రపు ఆల్చిప్పల్ని మన సొత్తులా ఏరుకుంటాం. గులకరాళ్ళని పోగుచేసి నీళ్ళలో వెదజల్లి చప్పట్లు కొడతాం. ఆ నీటి గర్భంలో వున్న ముత్యాల గురించిన ఆలోచనలే రావు. ప్రకృతిలోని ప్రతి సంపదమీదా మనకి హక్కుందనుకుంటాం. అలాగే అందంమీద కూడా....మన జోలికి రాని పువ్వుల్నీ, ఆరుద్ర పురుగుల్నీ, సీతాకోక చిలుకల్ని స్పృశించి పరవశిస్తాం.

వయసు రాగానే కలిగే ప్రేమభావనల్ని కూడా మానవుడు హక్కుగా భావిస్తాడు.

ఆమె అతని చెయ్యి తన చెంపని కట్టిన జడపాయ మీదుగా బుగ్గ మీదకి ప్రయాణంచేసి ఆ క్రిందకి జారుతుండగా కళ్ళు మూసుకుంది ఆ వెచ్చని స్పర్శకోసం. కానీ ఆ చేతివేళ్ళు ఎక్కడా ఆమె శరీరానికి అం... లేదు. అలా క్రింద దిశగా ప్రయాణం చేస్తున్నాయి. మెడ క్రిందుగా కలిగే చక్కిలిగింత కోసం ఆమె ఎదురుచూసింది.

ఇదే నీ హృదయానికి నా సందేశం. నీ ముఖాన్ని నాకనుగుణంగా



వుంచావు. నీ మేను పరవశిస్తున్నట్లుగా కంపిస్తోంది. సన్నగా నా కళ్ళలోకి చూస్తున్నాయి నిస్సంకోచంగా నీ కళ్ళు. నా హృదయం మాత్రం నీ అందమయిన కాంతిని ప్రసరించే నల్లని కళ్ళనుంచి మెరిసే కపోలాల నుంచి విరిసిన అందాలనుంచి నాజూకుతనం ప్రోది చేసుకున్న నడుమునుంచి సుఖాల నిధుల నుంచి ప్రయాణం చేసి లావణ్యంతో ఒద్దికగా వినమ్రంగా వున్న నీ పాదాల్ని తాకింది.

అతని చెయ్యి ఆమె శరీరానికి అంగుళం మీదుగా ప్రయాణంచేస్తూ ప్రతి అంగాన్ని తడుముతున్నట్లుగా ఎక్కడా విశ్రమించకుండా, ఎక్కడా ఆ స్పర్శ ఆమెకి తగలకుండా జాగ్రత్తపడుతూ పాదాలమీదకి వచ్చి నిలిచింది.

ఆమె తనువంతా వేణువుగా మారి ఊపిరి బిగపట్టి వేలవేలరాగాలు ఊపటానికి సిద్ధమై చూస్తోంది.

అతని వేళ్ళు ఆమె పాదాల్ని తాకాయి. ఆ ఒక్క స్పర్శ, వేలవేల శరాఘాతాలయినట్లు....ఆమె కంపించింది. అతని చేతివేళ్ళు ఆమె వ్రేలి కొనల్ని మీటాయి.

"కీర్తీ....నిన్ను ఇప్పుడు కాదు....మొదటిసారి చూసినప్పుడే నాకు అనిపించింది నువ్వు నా స్వంతం అని....ఐ లవ్ యూ!"

కీర్తి కళ్ళు గట్టిగా మూసుకుంది. తను కల కంటున్నాననీ వెంటనే మెలకువ రావాలనీ ఆమె కోరుకుంది. ఇది వాస్తవమైతే మాత్రం కాదనే శక్తి బహుశా నాకు లేదు' అనుకుంది.

"మొదటిసారి చూసింది. బహుశా ఈ జన్మలో కూడా కాదేమో" అతని కంఠం మంద్రంగా పర్వతాల సానువులనుంచి జారిపడుతున్న హిమపాతంలా వుంది.

"భగవాన్....ఏమిటీ పరీక్ష?" అనుకుంది.

"నాకు నీ గురించి విన్నప్పుడు ఇంట్రెస్ట్ కలగలేదు కానీ చూసిన తరువాత అసలు నువ్వు పుట్టిందే నా కోసం అనిపిస్తోంది."

'కాదు....కాదు....కాదు' అంతరాత్మ అరిచింది. అయినా ఆమె పెదవి విప్పలేదు. కనుకొలకుల్లోంచి కన్నీళ్ళు నిలిచాయి. అదేమిటో భరించలేని ఆనందం కలిగినా దుఃఖం కలిగినా వచ్చేవి కన్నీళ్ళే!

అతని చెయ్యి కాలివేళ్ళనుంచి కొంచెం మీదుగా ప్రయాణంచేసి ఆమె మువ్వల పట్టీని తడిమింది.

"మాట్లాడవేం కీర్తీ! నీకూ నేనంటే ఇష్టమేగా. డూ యూ లవ్ మీ!" అడిగాడు.

కీర్తి నెమ్మదిగా కనురెప్పలు విప్పి చూసింది.

"అసంభవం....ఇంపాజిబుల్!" కాళ్ళు వెనక్కి తీసుకుంది.

అతను నిశ్చేష్టుడై చూశాడు.

"మీరు నా గురించి ఏమనుకుంటున్నారో నాకు తెలీదు కానీ ఈ లవ్....ప్రేమా అదీ నాతో అసంభవం!" ఆ చివరి మాట చెప్పేటప్పుడు జారిపడుతున్న కన్నీళ్ళని ఆపడానికి వ్యర్థప్రయత్నం చేసి ఆమె మొహం తిప్పుకుని ఇంకో పక్కకి తిరిగి పోయి పడుకుంది.

సిద్ధార్థ శిలలా నిలబడిపోయినవాడల్లా, ఎవరో లేస్తున్న అలికిడికి కదిలి దూరంగా వెళ్ళిపోయాడు.

అప్పటిదాకా ప్రకృతి, పుడమీ కలిసి పాడుతున్న మంగళగీతం అర్థాంతరంగా ఆగిపోయినట్టు, వాతావరణమంతా నిశ్శబ్దంగా మారిపోయింది. అతని చెవులు ఘుళ్ళుపడ్డాయి.

"అసంభవం....ఇంపాజిబుల్!" ఆమె కంఠం మాత్రం ఆ నీరవ నిశీధిలో ప్రతిధ్వనిస్తున్నట్టుగా వుంది.

అతనికి తల్లి జ్ఞాపకం వచ్చింది.

"ప్రేమలో విఫలమవడం బాధాకరం. కానీ ప్రేమించడం నరక సదృశం" అనేది.

అప్పుడే పుట్టిన అతని ప్రేమ పురిట్లోనే మరణించిందని అతను నమ్మలేకపోతున్నాడు కానీ....తను భరించరానంతగా ప్రేమలో పడ్డానన్న భావన మాత్రం నరకయాతన పెడుతోంది. ఆమెని చూడకుండా, మాట్లాడకుండా వుండడం దుర్లభంగా వుంది.

ఆమె కాళ్ళు రెండూ పట్టుకునైనా తన ప్రేమను అంగీకరించమని అడగాలనుంది. జేబులోంచి సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుంటూ అనుకున్నాడు.

'శృతకీర్తి అలా ఎందుకు అంటోందీ? ఆమె మనసులో వేరెవరైనా



వున్నారా?'

ఆ ఊహకే అతని మనసు చేదు తిన్నట్టయింది.

"నో....అలా జరగదు" తనకు తనే చెప్పుకున్నాడు. అలాంటిదేదైనా వుంటే విశ్వనాథ్ అంకుల్‌తో కలిసి తన ఇంటికెందుకు వస్తుంది? ముఖ్యంగా ఆ చూపులో మెరుపు, ఆ ఇష్టాన్ని తను గుర్తుపట్టకుండా వుండడానికి గుడ్డివాడు కాదుగా! బహుశా కంగారుపడి వుంటుంది. అవును! అంతే అయి వుంటుంది. అని సర్దిచెప్పుకున్నాక కాస్త రిలీఫ్‌గా అనిపించింది.

* * * *

రాత్రంతా కీర్తి కళ్ళు ఆగకుండా వర్షిస్తూనే వున్నాయి.

అతనెవరో తనకి తెలియదు. అతనేమంటున్నాడో తనకి తెలుస్తోంది. ఆ బలమైన ఆకర్షణశక్తి నుంచి తనను వెనక్కి తీసుకోవడానికి శరీరంలోని సమస్త శక్తినీ కూడదీసుకోవాల్సి వస్తోంది. అప్పటిదాకా ఎరుగని వింతయిన అనుభూతి....అతని చూపు, అతని స్పర్శ, అతని లాలన, అతని మాటలు, అతని సామీప్యం జన్మజన్మలుగా నువ్వు నాకు తెలుసు అంటున్నాయేమిటి? ఇది....ఇదేమిటి? ప్రేమంటే ఇదా?

అతను కొన్ని అడుగుల దూరంలో వున్నాడన్న ఫీలింగ్, అంత దుఃఖంలోనూ ఎంతో బావుంది.

మరొక్కసారి వస్తే బావుండును. మాట్లాడితే బావుండును. ఇందాక చెయ్యి వేసినట్టు చెయ్యి వేసి....

ఆమె లేచి కూర్చుని కాలివేళ్ళని ఆప్యాయంగా తడుముకుంది.

అవి ఎంత భాగ్యం చేసుకున్నాయి? అనుకోగానే ఆమె గుండె ఝల్లుమంది.

ఎక్కడో వెలుతురు రేకు విచ్చుకుంది.

గువ్వలు కువకువలాడుతున్న ధ్వని.

'వద్దు....వద్దు....నాకివన్నీ' కీర్తి సూట్‌కేసు తీసుకుంటూ అనుకుంది.

అతనే....అతనే....నా అంతరాంతరాలలోని వ్యక్తి.

అచేతనమైన హృదయతంత్రులను మీటి సుఖదుఃఖ గీతాలని పాడించాడు. నా పాదాలు స్పృశించి అగాథ రహస్య స్పర్శతో నన్ను మేల్కొలిపాడు.

అతన్ని మళ్ళీ చూడకపోవచ్చు. లేదా చూడవచ్చు నాకేమీ అతను కాకపోవచ్చు. లేదా కావొచ్చు.

ఏది ఏమైనా అతనే నా హృదయాన్ని మొదటిసారిగా కలవరపరిచిన వ్యక్తి. ఒక భయంకరమైన మోహం అనే శక్తికి నేను లొంగిపోయేటట్లు చేసిన వ్యక్తి. నాకు భగవంతుడు ప్రత్యక్షమయితే నేను ఒకటే కోరుకుంటాను. నాకు ఇంద్రియ నిగ్రహాన్ని దయచేయమని.

ఇంతకాలం నా శరీరం, నా మనసూ నా ఆధీనంలో వున్నాయి. నా మాటే వింటాయి అన్న నా అహంకారానికి ఒక సంఘటనతో వేటు పడింది.

సర్వం మరిచి వివేకాన్ని అటకెక్కించి సమన్వయాన్ని చంపి పారేసి అతని స్పర్శకోసం ప్రాకులాడింది దేహం.

అన్నింటినీ మించి ఆత్మ అతన్ని వీడి రానంటోంది.

ఒక అపరిచితుడితో ఈ ప్రయాణం అనంతరం కలిసి వెళ్ళిపోదామన్నా 'సై' అంటోంది ఈ బుద్ధిలేని మనసు.

దీన్ని ఏమంటారు?

ఒక అజ్ఞాతవ్యక్తి ఒకే ఒక్క పరిచయంతో ఒకే ఒక్క చూపుతో ఒకే ఒక్క స్పర్శతో నాలోని సమస్త జ్ఞానాన్ని పట్టుకెళ్ళిపోయాడు. ఒకే ఒక్క వాంఛతో నేను వేగిపోయేట్లు చేశాడు.

అది అర్పణ!

పువ్వు తన పరిమళంతో గాలిని మధురితం చేస్తుంది. అటువంటి అర్పణేనా దీనికి పరాకాష్ఠ?

"అక్కొచ్చింది....అక్కొచ్చింది...." వంశీ పరిగెత్తుకుంటూ ఆటో దగ్గరకొచ్చి సూట్‌కేస్ అందుకున్నాడు.

కీర్తి ఆటో అతనికి డబ్బులిచ్చి లోపలికి వస్తుంటే- "అక్కా.... నాకేం తెచ్చావు?" ప్రీతి వచ్చి చుట్టుకుంటూ అడిగింది.

తల్లి వంట ఇంట్లోంచి కొంగుతో చేతులు తుడుచుకుంటూ హడా



విడిగా ఎక్కడ పని అక్కడ వదిలేసి వచ్చింది. ఆవిడ మొహంలో ఎన్నో ఏళ్ళుగా తప్పిపోయిన కూతురు తిరునాళ్ళల్లో దొరికినంత ఉత్సాహం.

తండ్రి నవ్వుతూ కళ్ళతోనే ఆహ్వానించాడు. ఆ కళ్ళల్లో పంథొమ్మిదేళ్ళుగా పెంచుకున్న నమ్మకం....దాన్ని మించి పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో పెరిగిన కూతురన్న గర్వం.

"అబ్బా! మూడు రోజులకే ఇల్లంతా బోసిపోయిందే తల్లీ! రేపు నీ పెళ్ళయి వెళ్ళిపోతే ఎలాగో!" సుభద్ర కాఫీ తీసుకొచ్చి అందిస్తూ అంది.

కీర్తి తల్లి కళ్ళల్లోకి చూసింది.

'నాకేమీ అనిపించదే? వీళ్ళందరినీ వదిలి ఎలా వుండాలన్న దిగులు పటాపంచలయిందేమిటి? పైపెచ్చు వీళ్ళంతా నన్ను వదిలిపెట్టి పోతే బావుండ్ను. హాయిగా ఒక్కదాన్నే గది తలుపు వేసుకుని పడుకుని అతని గురించి ఆలోచించుకోవచ్చును అనిపిస్తోందేమిటి? వీళ్ళు నన్నూ నా ఆలోచనలనూ వదిలిపెట్టిపోరా? ఆలోచించుకునే పాటి స్వతంత్రమైనా నాకు వుంటే బావుండ్ను!' అనుకుంది.

"ఉదయ్ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది" అన్నాడు తండ్రి.

కాఫీ కప్పు కిందపెడుతూ "ఏం రాశాడు?" నిర్భావంగా అడిగింది కీర్తి.

"నువ్వు లేకుండా మేం ఎందుకు విప్పుతాం తల్లీ?" అన్నాడాయన.

"ఉత్తరం కావాలంటే ముందు లంచం ఇవ్వాల్సిందే" ప్రీతి అక్క ముందు ఉత్తరం అందిస్తూ అల్లరిగా అంది.

కీర్తి లేచి ఆమెని తప్పించుకుని లోపలికి వెళ్ళబోయింది.

"బావ ఉత్తరం వద్దా?" ఆశ్చర్యంగా అడిగింది ప్రీతి.

"ముందు స్నానం చెయ్యాలి!" అంది కీర్తి.

"వెళ్ళమ్మా. పెళ్ళి బాగా జరిగిందా?" అడిగింది తల్లి.

"ఆ!" అని కీర్తి లోపలికి వెళ్ళిపోయింది.

ప్రీతి నీలంరంగు కవర్ తీసుకెళ్ళి కీర్తి మంచంమీద పెట్టి ఇవతలికి వస్తుంటే అది ఎగిరిపోయి మంచం క్రింద పడిపోయింది. ప్రీతి వచ్చి మంచం మీదపెట్టి దిండుని దానిమీద బరువుగా పెట్టి వెళ్ళింది. బరువుకి రెపరెపలాడుతూ ఆగిపోయింది ఉత్తరం!

బాత్‌రూమ్‌లో గడియ పెట్టుకోగానే కీర్తి శరీరానికీ, మనసుకీ ఒక్కసారిగా రెక్కలొచ్చినట్లు అనిపించింది. ఆమె మొదటగా చేసిన పని తన కాలివేళ్ళనీ, మువ్వలపట్టీని అపురూపంగా తడుముకోవడం. ఆ తర్వాత శరీరానికి స్వేచ్ఛ ప్రసాదిస్తూ....ఒక్కొక్క ఆచ్ఛాదనే తొలగిస్తూ....మనసుని ఇన్నాళ్ళూ మూసిపెట్టి వుంచిన ఒక్కొక్క రెక్క తొలగించింది.

నీళ్ళల్లో చెయ్యి పెట్టగానే అతను అక్కడున్నాడన్న భావన తనని అంటిపెట్టుకుని ఇన్నాళ్ళూ పెరిగిన తనువుని సరికొత్తగా చూసుకుంటున్న అనుభూతి!

ప్రతి అణువూ ప్రత్యేకమైన అందంతో ఎగసిపడుతున్న తీరుపట్ల విస్మయం! శరీరాన్ని నీళ్ళు చల్లార్చలేని తాపం....

అదోలాంటి దాహం....

ఇన్ని ఏళ్ళుగా ఈ భావాలకి దూరంగా వున్నానన్న పశ్చాత్తాపం!

"నువ్వు పుట్టిందే నాకోసం అనిపించింది."

అతని స్వరం ఆమె చెవుల్లో మార్మోగుతోంది.

మళ్ళీ మళ్ళీ పునశ్చరణ చేసుకుంటున్నకొద్దీ ఒకటే పులకింత. నీళ్ళు ధారగా పడుతుంటే....అతని కళ్ళల్లో కనిపించిన ఆరాధనకి.... పరవశం! అతను స్పృశించిన శరీరాన్ని తడుముకున్నకొద్దీ కలిగే మైమరపు! ప్రపంచం అంతా మాయమై....అతన్నీ తనని ఒక దీవిలో ఒంటరిగా వుంచేస్తే ఎంత బావుండున్నా అనిపిస్తోంది.

"కీర్తీ... కీర్తీ....ఎంతసేపే, టిఫిన్ చల్లారిపోతోంది?" తలుపుమీద దబదబా బాదుతూ తల్లి పెట్టిన కేకలు. తన కలల సామ్రాజ్యాన్ని పతనం చెయ్యడానికి శత్రుసైన్యం ప్రయోగించిన రణభేరిలా వినిపించింది.

కీర్తి బొమ్మలా బట్టలు వేసుకుని బయటికి వచ్చింది.

"దోశెలు చల్లారితే బావుండవు. తిను!" తల్లి ప్లేటు చేతికిచ్చింది.

ఈ టిఫిన్లూ....భోజనాలూ అన్నీ ఇంత ముఖ్యమా ఇప్పుడు అనిపించింది కీర్తికి.

"ఏం రాశాడమ్మా బావ?" తండ్రి ఆఫీసుకి వెళ్ళబోతూ వచ్చి అడిగాడు.



దోశెముక్క గొంతులో అడ్డుపడ్డట్లయింది. ఇంతవరకూ ఆ ఉత్తరాన్ని విప్పి చదవనేలేదు. మంచినీళ్ళు తాగి "ఇంకా చదవలేదు నాన్నా! చాలా అలసటగా వుంది" అంది.

గోరుచిక్కుడుకాయలు తెచ్చుకుని వలుచుకుంటూ సుభద్ర.... "ఏం నగలు పెట్టారు విశాలికి? బాగా వున్నవాళ్ళే అనుకుంటాను పెళ్ళికొడుకు వాళ్ళు" అంది.

నగలూ... చీరలూ.... వంటలూ.... బాధ్యతలూ.... లాంటి లౌకికమైన విషయాలన్నీ మాయమైతే.... అనిపించినా మౌనంగా వూరుకుంది కీర్తి.

"వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. అలా వున్నావేమిటే? ఎవరైనా ఏమైనా అన్నారా? ఏం జరిగిందసలూ?" ఆవిడ కంగారుగా అడిగింది.

'ఏం జరిగిందంటే....' కీర్తి మనసు ఆమె మాట వినే స్థితిలో లేదు. అదోలాంటి ట్రాన్స్‌లో వుంది. ఆమె బలవంతంగా ఆ మైకంనుండి బయటపడడానికి ప్రయత్నిస్తూ, చిరునవ్వు నవ్వి—

"అంతా బాగానే జరిగిందమ్మా.... ఎంతో బాగుంది. చాలా.... చాలా....హాయిగా అనిపించింది! ఆ....కాసేపు పడుకుంటాను" అని ప్లేటు సింక్‌లో పడేసి చెయ్యి కడుక్కుని తన గదిలోకి నడిచింది.

"ఈ ఈడులో ఎవరి పెళ్ళిచూసినా ఆడపిల్లలకి తమ పెళ్ళి ఊహలే పూరిస్తుంటాయి....సహజం!" అని సుభద్ర నవ్వుకుంది.

అలసిపోయిన తనువూ, మనసూ త్వరగానే నిద్రలోకి జారిపోయాయి.

ఎవరో చెవిలో నోరుపెట్టి గుసగుసలాడుతున్నారు. 'ఐ లవ్ యూ కీర్తీ....నువ్వు పుట్టిందే నాకోసం....ఈ పరిచయం ఈ జన్మది కాదు!'

అతను.... చాలా దగ్గరగా .... శరీరాన్ని మొత్తంగా అంటిపెట్టుకున్నంత దగ్గరగా....

కానీ ఆమె చేతులకి దొరకడంలేదు. అందినట్లే అంది దూరమైపోతున్నాడు. జాగ్రదావస్థలో.... స్వప్నావస్థలో సైతం ఆమెని వీడిపోవట్లేదు....

"ఈ శూన్యమైన హృదయంలో ఎందుకు రంగురంగుల చిత్రాలు

చిత్రిస్తున్నావు? నా బాధే నీకు విలాసమయితే....బాధపడ్తాను. ఎంత బాధైనా ఓర్చుకుంటాను."

"కీర్తీ....కీర్తీ" మొహంమీద చల్లగా తగిలి కళ్ళు విప్పింది.

నీళ్ళు జల్లుతూ మైత్రి నవ్వుతూ కనిపించింది.

"నువ్వా?" లేచి కూర్చుంది కీర్తి.

"ఏమిటే నిద్రలోనే డ్యూయెట్ లేసుకుని స్విట్జర్లాండులూ, సింగపూర్‌లూ తిరిగేస్తున్నావు? నన్ను దగ్గరగా లాక్కుని నా బుగ్గని.... అబ్బా చెప్పలేనే బాబూ....నేను కాబట్టి సరిపోయింది. అదే మీ అమ్మగారైతేనో!" మైత్రి ఆటపట్టించింది.

"చాల్లే....ఊర్కో!" వుడుక్కుంది కీర్తి.

"ఏవిటంత పులకింత? ఉదయ్‌గానీ సడెన్‌గా శృంగార పురుషుడై ఏమేమో రాసిపారేసాడా ఉత్తరంలో?" అంది మైత్రి.

కీర్తికి ఉత్తరం సంగతి గుర్తొచ్చింది. "ఛీ! ఛో!" అంటూ పుత్తరం కోసం వెతికింది.

"ఏమిటే వెతుకుతున్నావు?"

"ఉదయ్ రాసిన ఉత్తరం."

"ఇదిగో.... నువ్వు దిండుతోపాటు దాన్ని నలిపి పారేశావు. పాపం అక్కడ అతని మనసెంతగా నలిబిలి అయిపోయి వుంటుందో!" మైత్రి దాన్ని సాపుచేస్తూ అంది.

ఆ మాటలకి కీర్తి మనసులో కలుక్కుమంది. ఉత్తరం అందుకుని చింపి చదివింది.

"డియర్ కీర్తీ! ఇన్నాళ్ళూ ఏమోగానీ ఇంక ఒక్క నిముషం కూడా నిన్ను వదిలి వుండలేననిపిస్తోంది. మొన్న నిన్ను కౌగిలించుకుని, బుగ్గమీద పెట్టిన ముద్దు నన్ను రాత్రుళ్ళు ఊరికే వుండనీయక నీ దగ్గరకి పదమని వేధిస్తోంది. నీకేమనిపిస్తోంది? సిగ్గుని పక్కకినెట్టి నిజాన్ని సిన్సియర్‌గా చెప్పు....నీకూ అంతే తొందరగా వుందికదూ? ఈ మూడునెలలూ ఎలా నెట్టాలో అర్థంకావడంలేదు. ఎంత ఖర్చయినా సరే రోజూ మల్లెపూలు మాత్రం కొంటాను, నువ్వు మల్లెపూలు పెట్టుకుని నా పక్కన పడుకోగానే నిన్ను అమాంతం దగ్గరకి లాక్కుని...."



కీర్తి ఆపేసింది. ఆమె మనసులో ఏదో చెప్పలేని బాధ కలిగింది.

"ఏమైందే? ఆపేశావేం?" అడిగింది ఆశ్చర్యంగా మైత్రి.

అప్పైన చదవలేనట్లు కీర్తి ఉత్తరాన్ని మడిచి దిండుకింద పెట్టేసింది.

"అంత బాధాకరమైన విషయాలేం వ్రాశాడే?" కీర్తి కన్నీటి తెర చూస్తూ అడిగింది మైత్రి.

కీర్తి ఉత్తరాన్ని మైత్రికి అందించింది. మైత్రికి ఉత్తరం చదవడం మొదలుపెట్టగానే ఆమె మొహం విచ్చుకుంది. సన్నగా విజిల్‌వేసి కీర్తికేసి చూసి కన్నుకొట్టింది. అప్పటికే కీర్తి కళ్ళనుండి కన్నీరు జాల్వారింది.

మైత్రి ఆశ్చర్యంగా "ఏమైందే? ఆనందించాల్సిన విషయానికి ఏడుస్తావెందుకూ?" అని అడిగింది.

కీర్తి కళ్ళు తుడుచుకుని "ఉదయ్‌కి నామీద చాలా....ప్రేమ" అంది.

"అయితే ఏడవటం ఎందుకూ?"

"అతనికి అనిపించినట్లుగా నాకు అతని గురించి అనిపించనందుకు" చెప్పింది కీర్తి.

మైత్రి జవాబు చెప్పలేనట్లు చూస్తుండిపోయింది. కీర్తి కళ్ళు తుడుచుకుని "మైత్రీ! నోట్స్ డిక్టేట్ చేస్తాను రాస్తావా?" అని అడిగింది.

"సరే!" అంది మైత్రి. ఆమెకి అర్థమైంది. మనసుని మరల్చుకోడానికి కీర్తి చదువుని ఆశ్రయిస్తోందని. లేకపోతే ఆమెకి మరొకరి సహాయం అవసరంలేదు.

మైత్రి ఎంతో అలజడి పొందుతున్న కీర్తి భుజంమీద చెయ్యివేసి నొక్కింది. "కీర్తీ! ఒక్క విషయం."

"ఏమిటీ?"

"ఇంకెప్పుడూ మీ బావ రాసిన ఉత్తరాలు నాకు చూపించకే. పెళ్ళికాని ఆడపిల్లలు అలాంటివి చదవకూడదు. ఇంతకుముందైతే ఫరవాలేదు కానీ ఇప్పుడు" అని ఆపేసింది.

"అవును. పెళ్ళికాని అమ్మాయిలకి చాలా విషయాలు తెలియకూడదు. అనుభవంలోకి అస్సలు రాకూడదు. అలా అయితే ప్రమాదం!" లోతుగా అంది కీర్తి.

* * * *

బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గర కూర్చున్న రాజారావు ఆశ్చర్యంగా చూస్తున్నాడు సిద్ధార్థని. సిద్ధార్థ శాండ్‌విచ్‌కి పక్కనే వున్న సీసాలోని ఆవకాయని రెండువైపులా నైఫ్‌తో రాస్తూ ఆలోచనలో వున్నాడు.

కారం అంటే ఆమడ దూరంలో వుండేవాడు. ఇలా ఎందుకు చేస్తున్నాడో ఆయనకి బోధపడలేదు. వంటమనిషి నాయర్ రెండుసార్లు "చిన్నబాబూ....ఏమిటా పని?" అన్నాకూడా అతను వినిపించుకోలేదు.

ఇంకా చిత్రంగా దాన్ని టీలో ముంచుకు తినడం ప్రారంభించాడు.

"రేయ్....ఏమిట్రా ఏమైంది నీకు?" రాజారావు ఆగలేక అరిచాడు.

సిద్ధార్థ వినిపించుకోలేదు. దాన్ని మొత్తం తిని నైట్ డ్రెస్‌తో బయటికి నడిచాడు.

"ఎక్కడికిరా?" అడిగాడు తండ్రి.

"ఆఫీసుకి" అన్నాడు.

"ఈ డ్రెస్‌లోనా?" ఆయన ఆశ్చర్యపోయాడు. సిద్ధార్థ తనవైపు చూసుకుని "టై పెట్టుకోవడం మరిచిపోయానా?" అని తన రూంలోకి నడిచాడు.

రాజారావు భయంగా నాయర్ వైపు చూశాడు.

"వీడికేం అయిందో అర్థంకావడంలేదు" అన్నాడు.

పైనుంచి మ్యూజిక్ వినపడసాగింది. "ముస్కరా కర్....మిలా కరో హమ్‌సే....కుచ్ కహో ఔర్ సునా కరో హమ్‌సే...."

రాజారావు అయోమయంగా లేచి అటు నడిచాడు.

సిద్ధార్థ నేలమీద బోర్లా పడుకుని వున్నాడు.

"దోస్త్ బన్‌కర్ రహా కరో హమ్‌సే....

ముస్క్ రా కర్ మిలా కరో హమ్ సే...."

సిద్ధార్థ లేచి వాజ్‌లోంచి రోజెస్ తీసుకున్నాడు. వాటి రెక్కలు నేల మీద వరసగా పేర్చసాగాడు. 'కీర్తి! సిద్దూ!'

రాజారావు నిశ్శబ్దంగా అంతా గమనించి వెనుతిరిగాడు.

సిద్ధార్థ ఓ గంట తరువాత గదిలోంచి బయటికి వచ్చి ఆఫీసుకి బయల్దేరాడు.



షేవ్ చెయ్యని గెడ్డంతో తన కొడుకు ఆఫీసుకి వెళ్ళడం మొదటిసారిగా చూశాడాయన. ఏదో అర్థమయినట్లనిపించింది.

నాయర్ వచ్చి "మధ్యాహ్నం చిన్నబాబుకి భోజనం పంపించమంటారా?" అని అనుమానంగా అడిగాడు.

రాజారావు గంభీరంగా చూశాడు. పేపర్‌మీద పెన్‌తో వ్రాస్తూ—

"ప్రేమ+డబ్బు=సుఖం.

డబ్బు-ప్రేమ=కష్టం.

ప్రేమ-డబ్బు=వ్యర్థం" అన్నాడు.

నాయర్ తల గోక్కున్నాడు.

"మీ చిన్నబాబు విషయంలో మొదటిదే అవ్వాలని కోరుకో!" అన్నాడు.

నాయర్ నవ్వుతూ తల వూపాడు.

* * * *

సిద్ధార్థ రిసీవర్ చెవి దగ్గర పెట్టుకుని అవతలినుంచి వినపడే ఆమె స్వరంకోసం ఊపిరి బిగపట్టాడు.

"హలో!" మగకంఠం వినపడింది.

"నేను....సిద్ధార్థని...."

"చెప్పు బాబూ....నేను విశ్వనాధ్‌ని...." ఆయన ఆనందంగా అన్నాడు.

"అదే....కీర్తి....కీర్తితో మాట్లాడదామని" తడబడ్డాడు సిద్ధార్థ.

ఆయన ఆనందంగా అన్నాడు. "వాట్ ఎ ప్లెజెంట్ సర్‌ప్రైజ్. బట్ ఇంట్లోలేదు. ప్రొద్దుటే ఎక్కడికో ఇంపార్టెంట్ మీటింగ్ వుందని వెళ్ళింది. పోనీ....నిన్ను కాంటాక్ట్ చెయ్యమననా?" అడిగాడాయన.

"వద్దు....నేనే మళ్ళీ చేస్తాను. ఉంటానంకుల్" పెట్టేశాడు ఎంతో నిరుత్సాహంగా.

ప్రతి ఫైలులోంచీ, పేపర్‌లోంచీ కీర్తి తొంగిచూస్తూ అతని మనసు మనసులో వుండకుండా చేస్తోంది.

తలక్రింద మోచెయ్యి ఆన్చుకుని, కాలుమీద కాలు వేసుకుని ఒద్దికగా పడుకున్న ఆ రూపం కళ్ళల్లోంచి మాయమవడంలేదు. ఆమెని

చూస్తుంటే భరించలేని కోరిక కలగడంలేదు. ఆపుకోలేని అనురాగం కలుగుతోంది. ఆ జడా, నవ్వూ, నడకా, అన్నీ చాలా పరిచితంగా వున్నాయి. ఎదురుగా కూర్చుని రెప్పవాల్చకుండా చూస్తూ వుండిపోవాలనిపిస్తోంది.

మధ్యాహ్నం లంచ్ టైంలో ఇక వుండలేక ఇంటికి బయలుదేరి వెళ్ళిపోయాడు.

నాయర్ భోజనానికి పిలవడానికి వెళ్ళేసరికి "డోంట్ డిస్టర్బ్" అనే బోర్డు తలుపుకి తగిలించి వుంది.

సిద్ధార్థ మంచంమీద పడుకుని చేతులూ, కాళ్ళూ కట్టేసినట్లు ఊపిరాడక ఇబ్బంది పడ్డాడు.

'నన్ను బంధించిన ఈ గొలుసుల్ని ఎవరు తయారుచేసారూ?' అని ఆశ్చర్యపోయాడు.

'ఈ సమయంలో ఆమె ఏంచేస్తూ వుండి వుంటుందో!' అని ఆలోచించి, ఆలోచించి అలిసిపోయాడు.

'నీకేం ఒక చూపుతో అన్నీ మూటగట్టుకుని వెళ్ళిపోయావు. నేనూ అర్థంలేని పనులూ....నిదురలేని రాత్రులూ స్నేహితులమయ్యాం.'

'పుట్టాకా గడిచిన ఎన్నో క్షణాల్లో నిన్ను చూసిన క్షణం కూడా ఒకటి. కానీ అదెందుకు నాలో శాశ్వతమయిపోయింది. నడుస్తూ, నిలబడుతూ, మౌనాన్ని ఆస్వాదిస్తూ, మాట్లాడుతూ, పనిచేస్తూ, చెయ్యకుండా, నిద్రలో, మెలకువలో, ప్రతి ఆలోచనా ముందూ వెనుకా, మధ్యలో, నువ్వెందుకు గుర్తు వస్తున్నావు?'

"సిద్ధూ...."

తండ్రి కరతం వినిపించింది.

సిద్ధార్థ సర్దుకు కూర్చుని "ఏంటి నాన్నా?" అన్నాడు.

"ఎనీ ప్రాబ్లమ్?" అడిగాడాయన.

"నో....! అబ్సల్యూట్‌లీ నో ప్రోబ్లెం డాడ్....!" అన్నాడు సిద్ధార్థ.

"ఒక్కరోజులో పది లంఖణాలు చేసినవాడిలా తయారయ్యావు. చూసుకున్నావా?" అడిగాడాయన.

సిద్ధార్థ అద్దంలో చూసుకున్నాడు.



నవ్వుతోన్న కీర్తి రూపం కనిపించింది.

"విశ్వనాథ్ ఫోన్ చేశాడు. కీర్తితో మాట్లాడాలన్నావుట!" అన్నాడాయన.

సిద్ధార్థ బిడియంగా చూశాడు.

"కీర్తిని చూశావా?" అడిగాడాయన చిరునవ్వుతో.

"ఎస్ డాడ్!"

"నచ్చిందా?"

"ఆమె లేకుండా బ్రతకలేను."

"మరి ఆలస్యం ఎందుకు? ముహూర్తాలు పెట్టించమని విశ్వనాథ్‌తో చెప్తాను. ఎగిరి గెంతులేస్తాడు" సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిపోతూ అన్నాడాయన.

సిద్ధార్థ లేచి కిటికీవైపు నడిచాడు.

ఒక మలయమారుతం, మాలతీసుమం, జమిలిగా తాకిన వైనం చిన్నగా కంపించి- "ముహూర్తాలు మానవులు నిర్ణయించేవికావు నాన్నా! చూసిన మొదటిక్షణంలో....ఆ వ్యక్తి లేకపోతే జీవితమే లేదనిపించే మధురభావనే సుముహూర్తం" అన్నాడు.

"నీ భాషలో దానికి అర్ధమేమైనా మా భాషలో మాత్రం పెళ్ళి అంటాం....మరి ఆ ఏర్పాట్లయినా పెద్దలకి వదిలిపెడతారా....?" అడిగాడాయన.

సిద్ధార్థ తల వంకిస్తూ నవ్వాడు, ప్రేమపదసోపానంలో నిచ్చెన చివరంటా ఎక్కినవాడిలా.

* * * *

కీర్తి కాలేజీకి వెళ్ళడానికి తయారయి బయలుదేరుతుండగా ఆటోలోంచి పిల్లాడితో శకుంతల దిగింది.

"ఉన్నావా....అత్తయ్యకి ఈ సంచి ఇవ్వరా!" అని పిల్లాడికి సంచి యిచ్చింది.

కీర్తి అది అందుకుని, వాడి చెయ్యి పట్టుకుని లోపలికి నడిచింది.

శకుంతల ఆయాసపడుతూ "అమ్మ పిండీ వడియాలు పంపించింది. అలా వున్నావేమిటే? ఒంట్లో బావుందా?" అంటూ లోపలికొచ్చింది.

"బానేవుంది వదినా" అని కీర్తి కుర్చీవేసి, ఫ్యాన్ ఆన్‌చేసింది.

సుభద్ర పూజ మధ్యలోనే ఆపుచేసి వచ్చి "శకుంతలా! బావున్నావా మా అబ్బాయి రాలేదా?" అని ప్రశ్నించింది.

"రాలేదు అత్తయ్యా! మావయ్య లేరా?" అడిగింది శకుంతల.

కీర్తి మంచినీళ్ళు తీసుకొచ్చి అందించింది.

"రేపు ఆదివారం సత్యనారాయణవ్రతం చేసుకుందామనుకుంటున్నాము అత్తయ్యా. ముందురోజు రాత్రే కీర్తిని పంపితే నాకు సాయంగా వుంటుంది" అంది శకుంతల.

"అలాగే! తాళంటే మీ తమ్ముడు కట్టలేదు కానీ. అది మీ పిల్లే!" ఆనందంగా అంది సుభద్ర.

తన శరీరంమీదా, తన మనసుమీదా తనకే అధికారమూ లేనట్లు మాట్లాడుకోవడం చూస్తుంటే కీర్తికి మొదటిసారిగా ఆశ్చర్యం కలిగింది.

"అమ్మా.... నేను బయల్దేరుతాను. కాలేజీకి టైమవుతోంది" అంది.

"ఈ పూటకి మానేస్తేనేం? నిన్ను తీసుకుని మోండా మార్కెట్‌కి వెళ్ళాలనుకుంటున్నాను" అంది శకుంతల.

"పరీక్ష వుంది వదినా" అంటూ తల్లి ఏమీ చెప్పకముందే అక్కడ్నుంచి బయల్దేరబోయింది.

"నువ్వొస్తావనుకుని మీ అన్నయ్యని వద్దన్నాను. అన్నీ ఒక్కదాన్నే మోసుకెళ్ళాలి" నిష్ఠూరంగా అంది శకుంతల.

"అక్కర్లేదమ్మా, నేను వస్తాను. వంట చేసేసి ఆ బట్టలు కాసినీ ఉతికి ఆరేసానంటే నా పని అయినట్లే. ఈలోగా నువ్వు ఫలహారం చెయ్యి" అంది సుభద్ర.

'కీళ్ళ నెప్పులతో బాధపడే తల్లి ఈ త్యాగం తనకోసం చేస్తోంది' అనుకోగానే కీర్తికి తన ఆడపుటకమీద ఎంతో విరక్తి కలిగింది. 'ఎందుకు అమ్మాయిని ఇచ్చుకునేచోట ఈ అణిగిమణిగి వుండటాలూ, అగ్గగ్గలాడటాలూ' అనుకుంది.

"పోనీ నేనే వెళ్తాలే అమ్మా" అంది వెనక్కి వస్తూ.

"మరి పరీక్ష?" అడిగింది సుభద్ర.

"క్లాసు పరీక్షలేగా, ఫరవాలేదులే అత్తయ్యా...." శకుంతల



చెప్పింది.

తమ వస్తువుమీద తమకి పూర్తిహక్కు వుంది అన్నట్లుగా వుంది ఆమె తీరు.

సుభద్ర శకుంతలకి కొబ్బరి చట్నీచేసి ఇడ్లీలు పెట్టింది. కీర్తి కార్తీక్‌ని తీసుకుని తన గదిలోకి వెళ్ళింది.

"ఉదయ్ ఉత్తరం రాశాడటగా? చెప్పలేదేం?"

శకుంతల బజార్లో కూరలు కొంటున్నప్పుడు అడిగింది.

"ఆఁ.... రాశాడు.... అన్నీ మామూలే...." చింతకాయలు ఏరుతూ అంది కీర్తి.

"అమ్మని పెళ్ళయ్యాకా మీ దగ్గర వుంచుకునే విషయం ఏమైనా రాశాడా?" ఆమె కుతూహలంగా అడిగింది.

కీర్తి విస్మయంగా చూసి "లేదు" అంది.

"హుఁ!" నిట్టూర్చింది శకుంతల. ఆ తర్వాత రూపాయి తగ్గించి యివ్వమని కూరలమ్మే మనిషితో బేరాలాడి, వాదించి చివరికి విజయోత్సాహంతో వెనక్కి తిరిగి- "మంచి గుమ్మడికాయ ఒకటి చూడు.... ధప్పళం అంటే అమ్మకి ప్రాణం" అంది.

కీర్తి ఆమె చెప్పినట్లు వింటూ, మరబొమ్మలా ఆమె వెనక కదిలింది.

శకుంతల ప్రతి వస్తువునీ గిచ్చి, వాసన చూసి, ఎంపికచేసి, బేరాలాడి, వాళ్ళచేత నాలుగు మాటలు అనిపించుకునిగానీ కదలడంలేదు. ఇదంతా కీర్తికి చాలా ఇబ్బందిగా వుంది. అయినా ఆమె వెనకాల పిల్లాడి చెయ్యి పట్టుకునీ, బుట్ట పట్టుకునీ నడవక తప్పడంలేదు. మిస్ అయిన ఎకనామిక్స్ పరీక్ష గుర్తొచ్చింది. నా ఇష్టాలకి ప్రాముఖ్యత లేదా అనుకుంటే ఉక్రోషం అనిపిస్తోంది.

ఇద్దరూ బస్‌స్టాప్‌కి వచ్చారు.

కూరల బుట్ట చెయ్యి మార్చుకుంటున్న కీర్తికి తమ ముందునుండి లైట్‌గ్రీన్ జెన్ వెళ్ళడం కనిపించింది. అందులో కనిపించిన వ్యక్తి.... అతనే సిద్ధార్థ.

తృటిలో కారు కనుమరుగైపోయింది.

కానీ ఆమెకి కాళ్ళలోంచి తలలోకి ఒక్కసారిగా రక్తప్రసారం ఆగిపోయినట్లయింది.

'అతనే....అతనే....

ఎంతమందిలో వున్నా, ఎంత దూరంలో వున్నా ఈ కళ్ళు గుర్తుపడ్తాయి. ఈ మనసు గమనించి గువ్వలా ఎగిరిపోతుంది' అనుకుంది.

శకుంతల ఏదో చెప్తూనేవుంది. "రవ్వ శుభ్రం చేసిపెట్టమని చెప్పొచ్చాను. రాత్రికి రవ్వలడ్డూలు చెయ్యాలి. ఏవిటీ....ఏం ఆలోచిస్తున్నావ్?"

చివరికి తన ఆలోచనలమీద కూడా ఆమె ఆధిపత్యం చూపించడం కీర్తి భరించలేకపోతోంది.

"ఊ...." అన్యమనస్కంగా ఆమె చెప్పేది విన్నట్లు నటిస్తోంది.

అయిపోయింది. కనిపించాడు....మాయమైపోయాడు. రోడ్డుమీదకి రావడానికి మనసు ఆరాటపడటానికి కారణమే అతను! అతను ఎక్కడో. ఎప్పుడో తప్పక కనిపిస్తాడని ఆమె నమ్మకం!

"పెళ్ళయ్యాక అమ్మ మీతోనే వుండాలనుకుంటోంది. ఉదయ్‌కి ఈ విషయం నువ్వే నెమ్మదిగా చెప్పి ఒప్పించు. ఏవిటీ? వింటున్నావా?" శకుంతల చెపుతోంది.

గ్రీన్ కలర్ జెన్ డివైడర్ చుట్టూ తిరిగి వెనక్కి వస్తోంది.

కీర్తి కళ్ళు కాంతివంతమయ్యాయి. పది అడుగుల దూరంలో అతను కనిపించాడు. స్టీరింగ్‌మీద అతని బలమైన వేళ్ళు కదులుతున్నాయి. మధ్యవేలికున్న డైమండ్ రింగ్ కూడా మెరుస్తూ కనిపిస్తోంది....అతనే!

"పద....బస్సొచ్చింది...." హఠాత్తుగా కీర్తి చెయ్యి పట్టుకుని లాగుతూ అంది శకుంతల.

కీర్తికి ఆ భల్లూకపు పట్టునుండి వదిలించుకుని రోడ్డుకి అవతలవైపుకి పరిగెత్తాలని వుంది. "ఉండు వదినా!" అంది.

"అయ్యో! బస్ వెళ్ళిపోతే మళ్ళీ నలభై రూపాయలు ఆటోవాడి మొహాన పొయ్యాల్సొస్తుంది" అని శకుంతల కీర్తి చేతిని విడవకుండా బస్ వైపు లాక్కుపోతోంది.

కీర్తి దగ్గరౌతున్న కారుని నిస్సయంగా చూస్తూ ఆమె వెనక అడుగులు వేసింది.



బస్ అడ్డం వచ్చినందుకు హారన్ మోగిస్తూ చిరాగ్గా చూస్తున్నాడు సిద్ధార్థ.

"ఎక్కు" వెనకనుండి తోస్తూ అంది శకుంతల.

కీర్తి జీవంలేని కట్టెలా బస్‌లో పాదం మోపింది. సీతని పంచవటిలోంచి ఎత్తుకుపోతున్న మాయ సన్యాసిలా అనిపించింది బస్సు.

ఆపకుండా హారన్ మోగిస్తున్న సిద్ధార్థ బస్ పక్కనుండి దూసుకుపోతుంటే, కిటికీలోనుండి కీర్తి కళ్ళు నీటి కుండలయి చూశాయి.

"అత్తయ్యా....ఇది వలిచిపెట్టు...." కార్తీక్ వేరుశనక్కాయలు అందించాడు.

'అక్కడే వుండిమాత్రం నేనేం చెయ్యగలను? అతనికి దూరంగా వుండటమే మేలు! మంచిదయింది చూడలేదు. చూస్తే పలకరించకుండా వదిలిపెట్టడు. పలకరిస్తే శకుంతల ఆరాలకీ, అనుమానాలకీ అంతుండేవి కావు' అని నిట్టూర్చింది కీర్తి.

"పిల్ల లేచిపోయింది సినిమా చూశావా?" కిటికీలోంచి సినిమా వాల్ పోస్టర్లు చూస్తూ ఒళ్ళు మరచిపోయిన శకుంతల అడిగింది.

కీర్తికి దుఃఖం వచ్చింది. బస్సుమీదా, దగ్గరికొస్తున్న కండక్టర్ మీదా, ప్రశ్నలతో విసిగిస్తున్న కార్తీక్‌మీదా, శకుంతల మీదా, తల్లిదండ్రుల మీదా, అందరిమీదా కోపంగా వుంది. కళ్ళు తుడుచుకుంటూ బయటికి చూస్తుంటే, నవ్వుతూ తుళ్ళుతూ కాలేజీలకి వెళుతున్న ఆడపిల్లల్ని చూస్తుంటే ఈర్ష్యగా వుంది. వీళ్ళకి ఇలాంటి బాధలు లేవా? ఎవరిమీదా ఇంత ఇష్టం లేదా? ఉంటే వాళ్ళు లేనప్పుడు అంత ఆనందంగా ఎలా వుండగలరూ అనిపించింది.

"మీ అన్నయ్య ఇంగ్లీషు సినిమాలు తప్ప చూడరు. 'వాత్స్యాయన మంచివాడు' సినిమా చూపించమని వారం రోజులుగా అడుగుతున్నాను. ఓ ముద్దూ ముచ్చటా లేదనుకో. అయినా ఆడవాళ్ళం అలగకూడదు. నోరెత్తకూడదు!" భర్తమీద చాడీలు చెపుతోంది శకుంతల.

'అట్లాస్ ష్రగ్డ్' నవల గురించీ, 'అన్నా కెరీనా' గురించి మాట్లాడే వివేకానందకి 'పిల్ల లేచిపోయింది' సినిమా గురించి మాట్లాడే భార్య దొరికింది. విధి బలీయం కాదు....విధి పైశాచికమైనది...." అనుకుంది కసిగా

కీర్తి.

కీర్తి రెండు కళ్ళూ అరసెకను విశ్రాంతి లేకుండా రోడ్డుకి ఇరువైపులా వెతుకుతూనే వున్నాయి.

బస్ దిగి నడుస్తుండగా అడిగింది శకుంతల.

"ఏవిటలా వెతుకుతున్నావు? ఏమైనా పారేసుకున్నావా?"

కీర్తి పెదవి విరిచి నవ్వింది. మనసులో మాత్రం 'ఔను. పారేసుకున్నాను. చేజేతులారా పారేసుకున్నాను. ఇంక దొరకని....జాలితలచి కూడా ఎవరూ వెనక్కి ఇవ్వనిది, అపురూపమైనది....బ్రతుక్కి అర్థం చెప్పేది!' అనుకుంది.

ఎవరో లాఘవంగా వేణువులోంచి రాగాలను తస్కరించినప్పుడు మారే కొయ్యముక్కలా నిర్జీవంగా ఇంట్లోకి నడిచింది కీర్తి!

* * * *

నీలిరంగు స్విమ్మింగ్ పూల్ లో పరువంతో మిడిసిపడే చేపపిల్లలా వుందామె. ఆరోగ్యంతో మిసమిసలాడుతున్న శరీరం, ఒంటికి పూసినట్లున్న బట్టల్లో అందాలని ఆరబోస్తోంది.

"కమాన్ యార్....చాలా లేట్ అయింది...." గట్టుమీద నిలబడ్డ అమ్మాయిలు పిలిచారు.

ఆమె గట్టు దగ్గరకొచ్చి గుండెలనిండా ఊపిరి పీల్చి వదిలి తల గట్టిగా విదిలించింది.

"ఏయ్...." అంటూ ఆ తుంపర్లకి తడిసిన అమ్మాయిలు వెనక్కి జరిగారు.

"దీనికి అల్లరెక్కువైందే! అందుకే వీళ్ళ అంకుల్ త్వరగా పెళ్ళి చెయ్యాలని చూస్తున్నాడు" అందొక అమ్మాయి.

"శృతీ....మీ అంకుల్ దగ్గర్నుంచి ఫోన్" ఒక అమ్మాయి సెల్ తీసుకొచ్చి అందించింది.

పైకొచ్చి ఫోన్ అందుకుని అంది శృతకీర్తి "హాయ్ అంకుల్...గుడ్ ఈవినింగ్."

"శృతీ....నీకో గుడ్‌న్యూస్" ఆనందంగా అన్నాడు విశ్వనాథ్

"ఆ షాలీమార్ వాళ్ళు హోటల్ అమ్మటానికి ఒప్పేసుకున్నారా?"



ఆత్రంగా అడిగింది శృతి.

"ఎప్పుడూ బిజినెస్ గొడవలేనా తల్లీ?"

"ప్రతి సిటీలో మన పేరుమీద స్టార్ హోటల్స్ వుండాలి అంకుల్. అదే నా ఎయిమ్. షాలీమార్ వున్న లొకేషన్ చాలా బావుంది. మంచి సెంటర్. ఎత్తు ప్రదేశంలో వుండి అందర్నీ ఆకర్షిస్తుంది" అంది.

"ఓ.కె! అది పక్కన పెడితే ఇంకో మంచి విషయం చెప్తాను" అన్నాడు.

"శృతి కావాలనుకున్నది సాధించేవరకూ నిద్రపోదుగా అంకుల్" నీకు తెలుసుగా అన్నట్లు అంది.

"ఐ నో డియర్....నువ్వు సాధిస్తావు. అందుకే ఆ సిద్దూ నీకోసం వెంపర్లాడుతున్నాడు" అన్నాడు.

శృతి కనుబొమలు ఆశ్చర్యంగా పైకి లేపి "ఎవరు ఆ గౌతమ బుద్ధుడా? డబ్బూ దాబూ ఆనందాలు ఇవ్వలేవు అనే ప్రవరాఖ్యుడా? నన్ను చూడడానికి కూడా ఒప్పుకోలేదుగా!"

"అదే....ఏం చేశావనే అడుగుదామని చేశాను" అన్నాడు.

"ఇంకా ఆ విషయం నేను సీరియస్‌గా తీసుకోలేదంకుల్. అందుకే ఏం చెయ్యాలో ఆలోచించలేదు. రిజెక్ట్ చేశాడనే బాధ వుందిగానీ....నన్ను చూడకుండానే పాపం ఒద్దన్నాడు కదా అని వదిలిపెట్టేశాను. మీరు కానీ నా ఆస్తి వివరాలన్నీ చెవిలో ఊది ఒప్పించారా?" అంది.

"చెప్పినా ఒప్పుకోలేదమ్మా అతనూ....అలాంటిది వాళ్ళ నాన్నతో చిన్న ముహూర్తాలు పెట్టించమన్నాడట. నువ్వేమంటావు?"

"ఊ....బ్రిలియంట్ అని తెలుసు. ఫోటో చూశానుగా....స్మార్ట్‌గా. అబ్జెక్షన్ ఏం లేదు. కానీ అతనికి నా గురించి తెలియాలిగా!"

"పెళ్ళయ్యాక అదే తెలుస్తుందమ్మా. నువ్వు ఎలా డీల్ చేస్తావో నాకు తెలీదూ!"

ఆమె నవ్వింది. "ఓ.కె! మీ ఇష్టప్రకారమే కానివ్వండి. అతను ఒకవేళ నన్ను చూడాలనుకుంటే ఏర్పాటు చెయ్యండి."

"అదంతా ఎంగేజ్‌మెంట్ రోజునే. ఇంక నేను పెట్టేస్తున్నానమ్మా

5)

ఫోన్...చాలా పనులున్నాయి. బోలెడు మందిని పిలవాలి. బోలెడు ఏర్పాట్లు చేయాలి."

"ప్రొసీడ్....బై అంకుల్" శృతకీర్తి ఫోన్ పెట్టేసి, టవల్ తీసుకుని తల తుడుచుకుంటుండగా దగ్గరకొచ్చిన ఫ్రెండ్స్ అడిగారు.

"ఏమైనా గుడ్‌న్యూసా శృతి?"

"ఎస్....నా పెళ్ళి" చెప్పింది.

"అరె....అంత సడెన్‌గానా? మాతో చెప్పనేలేరే?"

"డెసిషన్స్ తీసుకోవడంలో, వాటిని ఆచరణలో పెట్టడంలో లేట్ చేస్తే ఇన్ని స్టార్ హోటల్స్ కాదు....పాక హోటల్స్ కూడా మేనేజ్ చేసేదాన్ని కాదు!" ఆమె దర్పంగా చెప్పింది.

•   •   •   •

అతను చేతులు కట్టుకుని నిలబడ్డాడు. ఏసీ రూమ్‌లో కూడా చెమ టలు కారుస్తున్నాడు. అతని వయసు యాభైపైనే వుంటాయి. అతను పెట్టు కున్న వంగనామాలకీ, మెళ్ళో కట్టుకున్న హైకీ అస్సలు మేచ్ అపడ లేదు. అతని పేరు రామనాథం.

రివాల్వింగ్ చైర్‌లో కూర్చున్న శృతి, పెన్‌ని రెండు చూపుడు వేళ్ళ మధ్య ఆడిస్తూ అడిగింది.

"ఫుడ్ ఇన్స్‌పెక్టర్ మీకు ఎంత ముట్టజెప్పాడు పోయిపసారి?"

ఆయన కంగారుగా "స్వామివారిమీద ఒట్టు....అలాంటివేం నమ్ కండి. మీ తండ్రిలాంటివాడ్ని" అన్నాడు.

"షటప్! నాకు సెంటిమెంట్స్ లేవు. నేను స్టేట్స్‌లో చదువు నొచ్చాను. వయసుకి మర్యాద ఇవ్వాలనే సంస్కృతిలో పెరిగినదాని కాదు. తిరుమలలో వుంటూ ప్రొద్దుటే వంగనామాలు పెట్టుకుని ఆయని దర్శించుకునే మీకు లేని సెంటిమెంట్స్ నాకెందుకు?" కోపంగా అం

రామనాథం బెరుకుగా చూశాడు.

"రెండుసార్లుగా ఫుడ్ పాయిజనింగ్ అంటూ గొడవ చేసి కే బుక్ చేసి కొట్టేశారు. ఇలా మన హోటల్లోనే ఎందుకవుతుందో అనుమా వచ్చి మిమ్మల్ని అడుగుతున్నాను. చెప్పండి, ఫుడ్‌లో ఏం కలుపుతున్నా అందుకు ఏం తీసుకుంటున్నారు?" నెమ్మదిగా చీల్చే కత్తిలా వుంది అ



కంఠం.

"నాకేం తెలీదు. నమ్మండి" అతను మొండిగా అన్నాడు.

"ఐ.సీ...." శృతి బెల్ కొట్టింది.

బ్లాక్‌సూట్ వేసుకున్న ఓ నడివయస్కుడు ఆ గదిలోకి వచ్చాడు.

"ఈయన్ని చూసిన గుర్తుందా?" మెత్తగా అడిగింది.

అతన్ని చూడగానే రామనాథం గుండెలవిసిపోయాయి. అమాంతం చేతులు జోడించి ఆమె ముందు మోకరిల్లుతూ "నన్ను క్షమించండమ్మా! రక్షించండి. ఈ ఒక్క తప్పు కాయండి. బుద్ధి గడ్డితిని ఆ పని చేశాను" అని ఏడుస్తూ ప్రాధేయపడ్డాడు.

శృతి ఐస్ వాటర్ తీసుకుని గుటకేసి చెప్పింది.

"నిన్న రాత్రి మిమ్మల్ని ఫాలో అయి....ఈ ఏరియాకి కొత్తగా వచ్చిన క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా అబద్ధమాడమని నేనే చెప్పాను ఈయనతో. మిస్టర్ రామనాథం....మొదటిసారిగా మీరు కంగారుగా మన హోటల్‌లో ఫుడ్‌లో పాయిజనింగ్ అయిందని చెప్పినప్పుడు....ఎలాగో అలా వాళ్ళ చేతులు తడిపి కేస్ మాఫీ చేయించమని నేనే చెప్పాను. కానీ రెండు నెలలకే మళ్ళీ ఫుడ్ పాయిజన్ అయింది అని మీరు ఫోన్ చేశారు. మళ్ళీ మీకదే సలహా ఇచ్చాను. కానీ ఈ మూడు నెలల్లో మా వాళ్ళు మీ వివరాలన్నీ సేకరించారు. మొదటిసారి మీరు మీ మొదటి అమ్మాయి పెళ్ళి చేశారు రెండోసారి మీరు మీ రెండో అబ్బాయిని ఫారిన్ పంపించారు. ఇప్పుడు మీకు అల్లుడి వ్యాపారానికి పెట్టుబడి పెట్టడానికి ఇరవై లక్షలు కావాల్సి వచ్చింది. ఈసారి నాటకమాడటానికి నేను నియమించిన మనిషి పది లక్షలు అడిగితే....మీరు ముప్పై అని అందుకే చెప్పారు. అవునా?"

రామనాథం మొహంలో కత్తి వేటుకి నెత్తురుచుక్క లేదు. అవాక్కయిపోయి ఆ అమ్మాయి వంక చూడసాగాడు.

శృతి లేచి నిలబడింది. "మిమ్మల్ని కటకటాల వెనక్కి పంపడానికి నాకు నిముషం పట్టదు. కానీ వానపాముల్ని చంపడానికి కర్ర అవసరం లేదు. అందుకే మిమ్మల్ని ఉద్యోగం నుండి తీసి పదిలేస్తున్నాను. ఇంకా ఇద్దరు మీ మీద ఆధారపడి చదువుకుంటున్న పిల్లలున్నారని నాకు తెలుసు. వెళ్ళండి....వెళ్ళి వాళ్ళకి మీ మొహం ఎలా చూపెడతారో చూపెట్టండి....

గెట్ అవుట్!" అంది.

"అమ్మా.... ఈ ఒక్కసారికీ.... క్షమించండి ప్లీజ్!" ఆయన కాళ్ళు పట్టుకోబోయాడు.

"కొండ ఎక్కడానికి ఉపయోగించే మెట్ల దారి దగ్గర కూర్చుని ఈ పని చేస్తే ఏదైనా ఉపయోగముంటుంది. అక్కడ దయగల దాతలు వేస పడతారు. నాలాంటి దయలేని వాళ్ళని పట్టుకుంటే డబ్బులు కాదు పళ్ళు రాలతాయి" చెప్పి చెయ్యి చూపించింది వెంటనే వెళ్ళమని.

అతను కన్నీళ్ళు చేతితో తుడుచుకుంటూ ఆ గదిలోంచి బయటికి నడిచాడు.

అతను వెళ్ళిపోయాక బ్లాక్ సూట్ అతను అడిగాడు.

"ఇతనే ఫుడ్‌లో ఏదో కల్పిస్తున్నాడని మీకు అనుమానం ఎలా వచ్చింది మేడమ్?"

"అతను శనివారం ఉపవాసం వుంటాడు. మూడుసార్లూ ఫుడ్ పాయిజనింగ్ శనివారంనాడే జరిగింది. పెద్దకూతురి పెళ్ళి.... రెండో కొడుకు అమెరికా ప్రయాణం సంగతి అతను స్టాఫ్‌తో చెప్పినప్పుడల్లా నేను నోట్ చేసిందే తప్ప ప్రత్యేకమైన టాస్క్‌ఫోర్స్‌నేం నియమించ లేదు. చాలా నెట్‌వర్క్ వుంది దీని వెనక అని నమ్మిస్తే కానీ కొన్ని నిజాలు బయటికిరావు" చిన్నగా నవ్వుతూ చెప్పింది.

"ఎంతైనా స్టేట్స్‌లో చదువుకొచ్చారు కదా మేడం! మీ తెలివి ఇంటర్నేషనల్ స్టాండర్డ్‌లో వుంటుంది" మెచ్చుకున్నాడు అతను.

"చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలనీ, పగ, పంతం వచ్చిన చోట ఎంత నష్టమొచ్చినా వెనక్కి పోరాదనీ రాయలసీమలో పుట్టి పెరిగిన మా నాన్నగారు చెప్పారు. స్టేట్స్‌లో చదువుకున్న చదువు చెప్పలేదు" అంది.

"యూ ఆర్ గ్రేట్ మేడమ్!"

"ఎస్.... ఐ నో దట్!" అని లేస్తూ చెప్పింది. "బైదిబై మిస్టర్ జయరాం ...అన్నింటికీ పొగడడం మానెయ్యండి. అలా పొగిడేవాళ్ళే త్వరగా తప్పులు చేస్తారని నా అనుభవం నేర్పింది" అని బయటికి నడిచింది.



ఆమె గోధుమరంగు సూట్‌లో నడుస్తుంటే జరజరా పాకుతున్న త్రాచుపాము పిల్లలా కనిపించింది అతనికి.

* * * *

ఆదివారం శకుంతల ఇంట్లో సత్యనారాయణ వ్రతానికి దగ్గర బంధువులందరూ వచ్చారు. నిమిషం కూర్చోకుండా పనిచేస్తున్న కీర్తిని చూసి "వరలక్ష్మమ్మకి మంచి పనిమంతురాలైన కోడలు దొరికింది" అని పొగిడారు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక "కీర్తీ.... ఒక పాట పాడవే...." అంది ఉదయ్ తల్లి

కీర్తికి చాలా అలసటగా వుంది. ఎంత త్వరగా ఇంటికి వెళ్ళిపోదామా అనిపిస్తోంది.

"ఇప్పుడు పాడలేను అత్తయ్యా!" అంది.

"మా అమ్మ అడిగినప్పుడు కాదనకూడదు" ఆకులకి సున్నం రాసుకుని వేసుకుంటూ అంది శకుంతల.

"ఇప్పుడే భోంచేసిందికదా....బలవంతం చెయ్యకు" అన్నాడు మందలింపుగా వివేకానంద.

"పాడడం వచ్చుకాబట్టి అడిగాము. దానికే అంత బెట్టు చెయ్యాలా?" అంది శకుంతల.

ఆమె ధోరణి అలా నిందారోపణగా ఎందుకుంటుందో కీర్తికి అర్థం కాదు.

"పాడు తల్లీ" అంది సుభద్ర.

ఆ సూచన వెనుక దాగివున్న భయం అర్థంచేసుకోగలదు కీర్తి. నెమ్మదిగా గొంతు సవరించుకుని పాడడం ప్రారంభించింది.

"మరుగేలరా.... ఓ రాఘవా...." అందరూ ఆమె మధురమైన కంఠాన్ని ఆస్వాదిస్తూ వుండిపోయారు.

"అన్ని నీవనుచు.... అంతరంగమున.... తిన్నగా వెదికి.... తెలిసి కొంటినయ్యా...."

కీర్తికి కార్లో అలా కనిపించి ఇలా మాయమైన అతని రూపం గుర్తొచ్చింది. ఇంతమంది మాయమై అతను ఒక్కడే తన ఎదురుగా

కూర్చున్నట్లుగా భావించుకొంది.

"నిన్నెగాని మది....నెన్న జాల నొరుల...."

అతని రూపం మనసుని వీడిపోనంటోంది. జ్ఞాపకాలని దొంతర్లు దొంతర్లుగా మదిలో ఏర్పడిన ఒక రహస్యపుటరలో పేర్చుకుంటోంది. ఎగిరిపోకుండా వత్తు పెట్టటానికి దుఃఖాన్ని అరువు తెచ్చుకుంటోంది.

"నన్ను బ్రోవుమయ్యా...." ఆర్తిగా.... ఆతృతగా.... ఎంతో దుఃఖంతో....అదే సమయంలో గొంతుకి తెరగా అడ్డుపడే అనురాగంతో ఆలపిస్తోంది. అతనికి తన మనసు తెలిసి....తన కోరిక తెలిసి....తనంతట తనే వచ్చి తనని పరిగ్రహించాలని ఆమె కోరిక. అదే తాదాత్మ్యత అనాడు త్యాగరాజు అనుభవించి భగవంతునితో అనుసంధానం ఏర్పరచుకున్నాడు. భక్తికీ, ప్రేమకీ ఏమిటి తేడా? ఒకక్షణం అయినా మనసునీ, తనువునీ వీడని జ్ఞాపకాల పరిమళాలు....అనుక్షణం నన్ను గుర్తుపెట్టుకో. నీకున్న అనేక పనుల్లో పడి నన్ను విస్మరించకు అనే దీనాలాపనలేగా ప్రార్థనలు....అవేగా ప్రేమగీతాలు!

పాట పూర్తయినా కీర్తి వెంటనే ఈ లోకంలోకి రాలేకపోయింది.

అందరూ చప్పట్లుకొట్టి అభినందిస్తుంటే తెప్పరిల్లి కన్నీటిని కొనగోట తుడుచుకుని తల వంచుకుంది.

"మొత్తానికి ఉదయ్ అదృష్టవంతుడు" దూరపు బంధువు ఒకాయన బొజ్జ నిమురుకుంటూ అన్నాడు.

సంతలో బేరంచేసిన గేదెని చూసి తృప్తిపడిన వ్యాపారిలా అన్పించాడు కీర్తి కళ్ళకి.

"అందుకే ఎంత కట్నం వచ్చినా బయట సంబంధం వద్దనుకున్నది" అంది వరలక్ష్మమ్మ.

ఆ మాట కీర్తికి చివుక్కుమంది. కట్నం లేకుండా చేసుకుంటున్నామని ఇప్పుడు మళ్ళీ చెప్పాల్సిన అవసరం వుందా? ఇప్పటికి అవకాశం వచ్చిన ప్రతిసారీ చెప్తూనే వున్నారుగా....

"అయిన సంబంధం చేసుకుంటే కనీసం మేనత్త అన్న అభిమానం అన్నా వుంటుందేమోనని మా తమ్ముడు ఆలోచించాడు. ఈ రోజుల్లో చూస్తున్నాం భర్త తరపు వాళ్ళని గుమ్మంలోకి కూడా రానివ్వడంలేదు!"



వ్యంగ్యంగా నవ్వుతూ అంది శకుంతల.

"అదేం మాట శకుంతలా? ఊరోక్క-" అని వివేకానంద అక్కడినించి లేచి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"ఏమ్మా మరదలా....మా ఉదయ్ గుర్తొస్తున్నాడా? పాట పాడి కలల్లో తేలిపోతున్నావు?" వరుసకి వదినగారొకావిడ పరాచికమాడ్తోంది.

'కాదు....కాదు' కీర్తి హృదయం ఘోషిస్తోంది. ఇది తనకి చెందని లోకంగా....వీళ్ళంతా వేరే గ్రహవాసుల్లా తోస్తున్నారు!

కీర్తి లేచి వివేకానంద పుస్తకాల అలమర దగ్గరకెళ్ళి నిలబడింది. శరత్‌చంద్ర పుస్తకాల్లో 'తీరని కోరికలు' ఆమె కంటపడింది. దాన్ని చేతుల్లోకి తీసుకుని పేజీలు తిరగేస్తుంటే హృదయం భారంగా మూల్గింది.

సమాజానికి భయపడి మనసులో ఆరాధిస్తున్నవాడిని తల్లి బలవంతంమీద 'అన్నా' అని పిలవాల్సొస్తుంది.

తన ఇష్టాన్ని ఎలా వ్యక్తీకరించాలో తెలీక తన ప్రతిఘటనని ఎలా వ్యక్తపరచాలో తెలీకా....ఏకాదశిపూటా అతని విస్తరిలో వదిలేసిన ఎంగిలి మెతుకులని తల్లి ముందే ఏరుకుని నోట్లో వేసుకుంటుంది హేమనళిని. ఎంతటి ఘాటైన నిరసనా....ఎంత సున్నితమైన తీరులో చూపెట్టిందీ!

"కీర్తీ...." వివేకానంద పిలిచాడు.

కీర్తి వెనక్కి తిరిగి చూసింది.

"అలా వున్నావేం? శకుంతల తెలిసీ తెలీకా ఏమైనా అందా?" మృదువుగా అడిగాడు.

'అవన్నీ లెక్కచేసే స్థితిలో నేను లేను....ఇదో అలౌకికమైన స్థితి!' అని చెప్పాలనిపించింది ఆమెకి.

"ఏమిటా పుస్తకం? తీరని కోరికలా?" ఆమె చేతిలోని పుస్తకం తీసుకుని చూస్తూ అన్నాడు.

"ఎన్నోసార్లు ఈ పుస్తకం చదివాను అన్నయ్యా! ఏమీ అనిపించలేదు. ఇవాళ ఎందుకో ఇందులో ప్రతి పేజీ శరత్ ఎంతో మథనపడి నలిబిలి అయి రాసాడనిపిస్తోంది" అంది నెమ్మదిగా.

"అలా అనిపిస్తోందా? అతను ఆశ్చర్యంగా చూసాడు.

"అంటే వీటిని అర్థం చేసుకోగలిగే మనస్థితి నీకిప్పుడు వస్తోందన్న మాట! ఏమిటమ్మా ఆ కన్నీళ్ళు....పుస్తకం చదివిన అర్ద్రతేనా ఇదీ! హా! ఎంత బాధాకరం అమ్మా! స్పందించే హృదయాన్ని అర్థం చేసుకునే వారు జీవిత భాగస్వాములవకపోవడం- చాలా....చాలా బాధాకరం!" నిట్టూర్చాడు అతను.

ఆ మాత్రం ఆలంబనకే స్వాధీనం తప్పిన మనసు అధారపడి పోవాలనుకున్నట్టుగా కీర్తికి జలజలా కన్నీళ్ళు పొంగుకు వచ్చేసాయి.

"మనకి మిఠాయిలంటే చాలా ఇష్టం అనుకో. సడన్‌గా సుగర్ వ్యాధి వచ్చిందే అనుకో, అప్పుడేం చేస్తాం? తినలేనందుకు చింతిస్తూ పని మానేసి కూర్చోంగా— మనకింతే ప్రాప్తం అని సరిపెట్టుకుంటాం. జీవితంలో చాలా సందర్భాల్లో అలాగే సర్దుకుపోవాలి!" అతను అనుభవజ్ఞుడిలా చెప్పాడు.

కీర్తి పెదవి వంపు తిరిగేట్లు నవ్వింది. "శరీర విషయంలో అది సరైన పోలికే.కానీ మనసు మాటేమిటి? సరిపెట్టుకుంటుందా? ఫలానా కోరికలవల్ల నీకు జబ్బుచేస్తుంది. ఒద్దు అంటే ఆలోచించడం మానేస్తుందా?" అంది.

అతను జవాబు చెప్పలేనట్లు ఖిన్నుడై చూశాడు.

అప్పటికే ఎక్కువగా మాట్లాడేశానేమో అన్న అనుమానం వచ్చిన కీర్తి గబగబా వెనుతిరిగి వెళ్ళిపోయింది.

శకుంతల అతని దగ్గరికి వచ్చి "ఈ నెక్లెస్ ఎలా వుంది? ఎరుపు రంగు చీరమీదకి బావుందా? అయినా చాలా నచ్చిందిలెండి" అంది తృప్తిగా అద్దంలో చూసుకుంటూ.

"రాళ్ళనీ, లోహాలనీ, సొమ్మునీ ప్రేమించగలిగేవాళ్ళు చాలా అదృష్టవంతులు. ఎటువంటి సామాజిక కట్టుడులూ, ఆంక్షలూ వుండవు వారిమీద.

"చెప్పరేమండీ?" అని గట్టిగా అడిగింది.

"ఎదుటివారి అభిప్రాయం అడిగి వారు చెప్పేలోగానే "నాకు మాత్రం చాలా బావుంది. అయినా మీకిలాంటివేం తెలుస్తాయిలెండి?" అని తీర్మానాలు చేసేవారికి నిజమైన అభిప్రాయం చెప్పాలంటావా?" చిన్నగా



నవ్వుతూ అడిగాడు.

"నిజమైన అభిప్రాయం, అబద్ధం అభిప్రాయం అని రెండురకాల అభిప్రాయాలుంటాయా? అయితే అబద్ధంగానే చెప్పండి" కోపంగా అంది.

"చాలా బావుంది....నీ అభిరుచికి వంకలేపెట్టలేం" చెప్పి లోపలికి వెళ్ళిపోయాడు.

శకుంతల పట్టించుకోలేదు. మెడలో నెక్లెస్ సరిచూసుకుంటూ వుండిపోయింది.

• • • •

"విశాలి పెళ్ళికి వెళ్ళి వచ్చినప్పటినుండీ నువ్వు అదోలా వుంటున్నావు. మారిపోయావు. అక్కడ ఏమైనా జరిగిందా?" కాలేజీకి వెళ్ళేటప్పుడు అడిగింది మైత్రి.

మనసును ఎవరో బలంగా నొక్కి నొక్కి చూస్తున్న ఫీలింగ్ కలిగింది కీర్తికి.

"ఏం జరగలేదు. నేను మామూలుగానే వున్నానుగా అని మాత్రం అబద్ధమాడకు. ఎందుకంటే అబద్ధాలు ఆడే సందర్భాలు ముందు ముందు చాలా రావచ్చు" ఎప్పుడూ కీర్తి చెప్పిన మాటలే తిరగగొట్టినట్లు చెప్పింది.

కీర్తి తల ఎత్తి చూసింది.

ఎదురుగా ఆకుపచ్చ జెన్ వస్తోంది. ఆమె పక్కనున్న మైత్రి చేతిని ఆధారం కోసం అన్నట్లు గట్టిగా పట్టుకుంది. ఒళ్ళంతా కళ్ళు చేసుకున్నట్లుగా దానివైపు చూస్తుండిపోయింది. అది ఆమెని దాటుకుని ముందుకి వెళ్ళిపోయింది. ఎవరో పెద్దాయన డ్రైవ్ చేసుకుపోతున్నాడు. ఒక భారమైన నిట్టూర్పు తో మైత్రి చేతిని వదిలిపెట్టింది.

"కీర్తీ! నువ్వు దారుణంగా ప్రేమలో పడ్డావు కదూ?" ఆగి మరీ అడిగింది మైత్రి.

కీర్తి కంగారుగా చూసింది.

"దారుణంగా అని ఎలా చెప్పగలుగుతున్నానంటే ఇలా చూడు" తన మణికట్టు దగ్గర ఎత్తి చూపించింది.

అక్కడ ఎర్రగా రక్తప్రసారం ఆగిపోయినట్లుగా గుర్తుపడింది.

కీర్తి ఎంతో సిగ్గుగా, ఎంతో బాధగా తల వంచుకుని "సారీ!"

అంది.

మైత్రి అనునయంగా ఆమె భుజంమీద చెయ్యివేసి "నిన్ను నువ్వు నిగ్రహించుకోడానికి ఇంత బలంగా ప్రయత్నించావంటే మనసులో ఎంత నరకం పడుతున్నావో అర్థమవుతోంది. ఎవరే అతనూ?....నాకు తెలీకుండా ఇదెలా సాధ్యం? ఎంతకాలంనుండీ పరిచయం? అతనిలో ఏం చూసి ఇంతలా ప్రేమలో పడ్డావూ?" అని వరసగా ప్రశ్నలు వేసింది.

కీర్తి శుష్క మందహాసంచేస్తూ అంది.

"నాకు అతని గురించి ఏమీ తెలీదు. ఒకే ఒక్క పరిచయం. అతనిలో ఏం నచ్చటానికి సరిపోయేటంత కాలం మేము కలిసుండలేదు. కానీ....అతని కళ్ళల్లోకి చూడగానే అదొక అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. ఇతనే....ఇతనే ఎన్నో యుగాలుగా నేను అన్వేషిస్తున్న వ్యక్తి అనే భావన కలిగింది. తప్పో....ఒప్పో తెలీడంలేదు. అతని రూపం, పేరూ, స్పర్శా, పలకరింపూ నా మనసును ఒంటరిగా ఒక్క నిమిషం కూడా వుండనీయడంలేదు."

ఇంక ఒక్క అడుగు వెయ్యడానికి కూడా శక్తి చాలదన్నట్లు కీర్తి బస్‌స్టాప్‌లో కూర్చుండిపోయింది.

"నా మీద నాకే చెప్పలేనంత కోపం వస్తోంది. ఏ లాజిక్కూ లేకుండా తెలీని ఒక మనిషిమీద ఇంత ఇష్టం ఏమిటని? అతని తలపులకి దూరంగా వుంచే శక్తిని ఇమ్మని భగవంతుడ్ని ప్రతిరోజూ ప్రార్థిస్తున్నాను. కానీ దైవం ముందు కూర్చున్నా, భగవంతుని ముఖంలో అతని రూపమే కనిపిస్తోంది. నేనేం చెయ్యను మైత్రీ?" కీర్తి దీనంగా అడిగింది.

"ఈ స్థితి నీకు రాకూడదనే అభిలషించాను కీర్తీ! అయినా తప్పలేదు చూశావా?" మైత్రి ఆమె పక్కనే కూర్చుంటూ విచారంగా అంది.

ప్రేమలో పడ్డవాళ్ళను అభినందించాలి. కానీ నీ పరిస్థితి తెలిసిన నేను....ఏమని అభినందించనూ?" అంది.

కీర్తి ఆమె చేతిని పట్టుకుని తన నెత్తిమీద వుంచుకొని "ఎవరితోనూ, ఎటువంటి పరిస్థితుల్లోనూ ఈ విషయం చెప్పనని ప్రమాణం చెయ్యి" అంది.

"చెయ్యను. ఇంతకీ అతను ఎక్కడ వుంటాడూ?" అనడిగింది.



"ఈ వూళ్ళోనే" కీర్తి ముఖంలో మళ్ళీ కాంతి ప్రవేశించింది. "ఈ గాలి తప్పకుండా అతన్ని స్పర్శించే వస్తుంది. పగలు ఈ ఎండ....రాత్రి కాసే వెన్నెల. అన్నీ అతనూ అనుభవిస్తుంటాడు. ఈ రోడ్లమీద అతను ఎప్పుడో ఒకప్పుడు తిరిగే వుంటాడు. ఇవన్నీ తలుచుకుంటుంటే ఎంత ఆనందంగా వుందో తెలుసా?" అంది.

'భరించలేని ఆనందాన్నీ, సహించలేని బాధనీ ఏకకాలంలో బహూకరించేదే ప్రేమ.'

"కీర్తీ! అదంతా సరే! ఇప్పుడేం చెయ్యాలనుకుంటున్నావు?" జాలిగా అడిగింది మైత్రి.

"మైత్రీ! ఇన్నాళ్ళూ యాంత్రికంగా పుట్టాం కాబట్టి బ్రతకాలి అన్నట్లు బ్రతికేసాను. తరువాత జీవితం గురించి కూడా నాకెప్పుడూ ఎలాంటి కలలూ లేవు. ఉదయ్‌ని చేసుకుని....పిల్లల్ని కని....పెంచి పెద్ద చేసి పోతానని అనుకునేదాన్ని. కానీ....ఇప్పుడు నా జీవితానికి ఒక అర్థం వుందనిపిస్తోంది. ఈ మనసుకి స్పందనా, ఆలోచనలూ, ఈ శరీరం మీద శ్రద్ధా, ఒక మనిషికోసం ఎదురుచూపూ....ఓహ్! ప్రతి ఉదయం, ప్రతి రాత్రి ఎంతో ఆశగా, ఏదో కొత్తగా వుంది. ఈ స్థితి అనుభవించాలే కానీ నేను వర్ణించలేను."

మైత్రి ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది.

"అతను నన్ను ప్రేమిస్తున్నానన్నాడు, ఆ మాట పెదవి చివర వించి అనలేదు. మనసు లోతుల్లోంచి ఆ కళ్ళు చెప్పాయి. పైగా నువ్వు నాకు ఎన్నో ఏళ్ళుగా పరిచయం అన్నాడు. నా పేరు కూడా చెప్పకుండానే తెలుసుకున్నాడు. నన్ను....నన్ను స్పర్శించినప్పుడు నాకెలా అనిపించిందో తెలుసా? మొత్తంగా ఈ ప్రాణాలన్నీ అతను నాలోంచి లాగేసుకుంటే బావుండును. నేనూ అతనిలోనే వుండిపోవచ్చనిపించింది. ఈ శరీరం ఎంతో బరువుగా వుంది మైత్రీ! అలా చూస్తావేం? ఉదయ్ కూడా నిన్ను ముట్టుకున్నాడు కదా అనా! అప్పుడు నాకసలు ఏమీ అనిపించలేదు. మైత్రీ! నువ్వు ముట్టుకున్నప్పుడు స్నేహంగా ఎలా అనిపిస్తుందో అలాగే అనిపించింది. ఉదయ్ నన్ను ముద్దుపెట్టుకున్నాడు. అనుభూతించలేని ఆ చర్యకి 'ముద్దు' అన్న పేరు పెట్టుకోవచ్చా? నాకు తెలీదు. కానీ సిద్దార్థ

నన్ను ముట్టుకున్నాడు. ఇక్కడ....ఇక్కడ....ఇక్కడ పాదాలమీద.... ఆమె ఆ స్థలాలు అపురూపంగా చూపించింది. "ఇంకా అక్కడ ఆ ముఖం నిలిచివున్నట్లే అనిపిస్తోంది మైత్రీ! భగవంతుడనేవాడు నా ఎదురుగా వస్తే, ఇంకొక్కసారి అతని స్పర్శ కావాలని కోరుకోవాలనిపిస్తోంది. తప్పని మనసు చెపుతోంది కానీ అంతరాత్మ దాన్ని ప్రతిఘటిస్తోంది. ఇదేమిటి మైత్రీ....అమ్మా నాన్నలకి తెలిస్తే కొంపలు మునిగిపోతాయనికూడా తెలిసీ ఈ ఆలోచనలు? ఒక అపరిచిత వ్యక్తికోసం ఇంత పిచ్చిపడడం....ఓహ్! ఇలా ఎందుకు జరుగుతోందీ....నేను ఎంత ప్రయత్నించినా ఆపలేకపోతున్నాను. ఐయామ్ హెల్ప్‌లెస్!"

"కొన్ని ప్రమాదాలు చెప్పి వస్తున్నా నివారించుకోలేం. అందులో ప్రేమ ప్రధానమైనది. నీకెలా వుందో కానీ కీర్తీ నీ పరిస్థితి చూస్తుంటే నాకు చాలా భయంగా వుంది. గెడసాని తాడెక్కి నడుస్తుంటే చూస్తూ గుండెలు అవిసిపోతున్న చిన్నపిల్లలా వుంది నా పరిస్థితి" మనస్ఫూర్తిగా అంది మైత్రి.

"నాకు భయం కూడా వెయ్యడంలేదే....అదే చిత్రంగా వుంది" అంటున్న కీర్తిని చూస్తే మైత్రికి ఇంకా భయం వేసింది.

"ఎల్లకాలమవాయాస్యయే మదీయ హృదయమున
ఎన్నడేని నీ వదన చంద్రకాంతి తోచునేని,
ఆ క్షణమునందు మాత్రము చతుర్దశీరాత్రి మాక్కినుండు."

అన్నట్లుగా దీన వదనయై కనిపించింది కీర్తి.

ప్రేమ గురించి రాయనివాడు కవే గాడు. స్వానుభవము లేనివాడు రాయనేలేడు. ఇంతమందిని బొమ్మలుచేసి కనిపించని దారాలతో ఆడించే ఆ విధి గురించి ఆలోచించే వయసు లేకపోయినా, పెనుగాలి తాకిడికి అల్లల్లాడుతున్న లేత లతలాంటి తన నేస్తాన్ని ఎలాగైనా కాపాడుకోగలిగితే బావుండున్న అనిపించింది మైత్రికి.

"పద....వెళ్దాం" అని లేవబోతున్న కీర్తికి తృటిలో అతని రూపం కనిపించింది. భ్రమేమోనని ఒక్కక్షణం రెప్పవాల్చకుండా చూసింది. ఎదురుగా వున్న స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోకి వెళుతూ కనిపించాడు.

"మైత్రీ....మైత్రీ.... అదుగో.... అక్కడ....వెళ్ళిపోతున్నాడు"



ఆమె భుజాన్ని కుదిపేస్తూ అంది.

"ఎక్కడ?" మైత్రి ఆత్రుతగా అడిగింది.

"వెళ్ళిపోయాడు" నిరాశగా మైత్రి భుజాన్ని వదిలిపెట్టేస్తూ అంది కీర్తి.

"పద చూద్దాం....అందులోకే వెళ్ళాడుగా!" అటువైపు లాగుతూ అంది మైత్రి.

కీర్తి అప్పటిదాకా ఆ ఆలోచనే లేనిదానిలా దిగ్భ్రాంతిగా చూసింది.

"పద!" ఆలస్యం చెయ్యకుండా అడుగులేస్తూ అంది మైత్రి.

ఇద్దరూ స్వప్నలోక్ కాంప్లెక్స్ వైపు నడిచారు.

"పద! లిఫ్ట్ దగ్గర చూద్దాం" చెప్పింది మైత్రి.

లిఫ్ట్ దగ్గర జనం ఎవరూ లేరు. బజర్ ప్రెస్‌చేస్తే లిఫ్ట్ క్రిందకి వచ్చింది.

"ఇన్ని అంతస్తుల్లో ఎక్కడని వెదుకుతాం చెప్పు!" అంది కీర్తి నిరాశగా.

"ఒక్కొక్క ఫ్లోరే చూసుకుంటూ వెళ్దాం" చెప్పింది మైత్రి.

మొదటి రెండు ఫ్లోర్లు గాలించేసరికే కీర్తికి అది వృథాప్రయాస అని అర్థం అయింది.

"ఎలా వుంటాడే?" ఆతృతగా అడిగింది మైత్రి.

'ఏం చెప్పను....? నా కళ్ళతో చూస్తే లోకంలో ఎవరికీ లేనంత అత్యంత అపురూపమైన రూపంతో కనిపిస్తాడు. మరి ఇతరులకి ఎలా వుంటాడో తెలీదు!' అనుకుంది కీర్తి.

"ఎలా వుంటాడంటే మాట్లాడవేం?" అడిగింది మళ్ళీ మైత్రి.

'అతని రూపం నేను వర్ణించలేను కానీ నా కళ్ళని ఆ రూపం వెలిగిస్తుంది. ఆ చిరునవ్వు హృదయాన్ని కట్టిపడేస్తుంది. ఆ విద్యుత్ స్పర్శ నా సమస్త శరీరాన్నీ అచేతనం చేస్తుంది. అతని అడుగులు....నా గుండె పరిచిన మనసు తివాచీమీద నుండి లోపలికి దూసుకువస్తాయి....' ఇవన్నీ అనాలనుకుంది. కానీ కన్నీళ్ళే వచ్చాయి. నోరు పెగలలేదు.

"ఐడియా!" అంది మెరుస్తున్న కళ్ళతో మైత్రి.

కీర్తి ఆశగా చూసింది.

"అతని కారుని గుర్తుపడ్తావుగా....అక్కడ వెయిట్ చేద్దాం" అంది.

కీర్తి కళ్ళు మెరిసాయి. అంతలోనే మళ్ళీ "సాయంత్రందాకా రాక పోతేనో!" అంది.

"వాచ్‌మెన్‌ని డిటైల్స్ అడుగుదాం. త్వరగా పద!" అని తొందర చేసింది.

ఇద్దరూ లిఫ్టుకోసం వెయిట్ చేస్తుంటే నిమిషమే గంటసేపుగా అనిపించింది.

లిఫ్టులోంచి క్రిందకి దిగగానే పార్కింగ్ ప్లేస్‌వైపు పరుగులు పెట్టారు. ఆ పరుగులో మధ్యలో ఎంతోమందికి డాష్ యిచ్చారు. సారీ కూడా చెప్పుకునే వ్యవధి లేనట్లు పరుగుతీసారు.

అప్పుడే స్టార్ట్ అవుతున్న ఆకుపచ్చ జెన్‌ని చూస్తూనే "అదిగో అదిగో" అని కేకలుపెట్టింది కీర్తి.

సిద్దార్థ అప్పటికే కారు స్టార్ట్ చేసేసాడు.

మైత్రి ఎలాగైనా ఆపాలన్నట్టుగా గేట్‌వైపు పరుగు ప్రారంభించింది.

కారు గేట్‌లోంచి రోడ్డువైపు దూసుకుపోతుంటే చేతలుడిగినదాన్లా నిలబడిపోయింది కీర్తి. రోడ్డు రాజకుమారుడి ప్రాణాలని పట్టుకుపోతున్న రాక్షసబల్లిలా అనిపించింది. సిద్దార్థ జనంలో కలిసిపోయాడు.

అసలు కనిపించకపోతే ఫరవాలేదు. ఇలా కనిపించి....మాయమై, దాగుడుమూతలు ఆడటం ఎందుకు?

ఆమెకి రోషం, దుఃఖం ఎగదన్నుకువచ్చాయి.

మైత్రి వచ్చి భుజంమీద చెయ్యివేసి ఓదార్పుగా అంది "ఏదైనా ఒక్క క్లూ చెప్పు. ఎక్కడ వుంటాడో వెదుకుదాం" అని.

కీర్తికి అతని పేరు తప్ప ఏమీ తెలీదు.

"కారు నంబర్ గుర్తుపడతావా?" ఆశగా అడిగింది మైత్రి.

కీర్తి కన్నీళ్ళతోనే తల అడ్డంగా వూపుతూ, "ఈసారి తప్పకుండా నోట్ చేస్తాను" అంది.

మైత్రి జాలిగా చూస్తూ "మళ్ళీ కనిపిస్తాడనా అని అడగను. కానీ



మళ్ళీ కనిపించినప్పుడు కూడా కలుసుకోలేమనా అని అడుగుతున్నాను"

కీర్తి బాధగా చూసింది.

"ఒకవేళ కలిసాడే అనుకో....ఏం మాట్లాడదామనే?" ఉత్సుకతగా అడిగింది మైత్రి.

"ఒక్క నిమిషం నీ పక్కన కూర్చునే చనువు నాకిమ్మని అడుగుతాను!" ఆలోచించకుండానే చెప్పింది కీర్తి.

మైత్రి దిగ్భ్రమగా చూసింది.

"ఆ తర్వాత....జన్మలో నాకు కనపడి అలజడి పెట్టవద్దని వేడుకుంటాను" ఎంతో దిగులుగా చెప్పింది.

అందమైన ఆ కళ్ళల్లో చీకటి చూడలేనట్లు తల తిప్పుకుంది మైత్రి. 'ప్రేమంటే ఇంత అలుపెరుగని పోరాటమా!' అనుకుంది.

'నా చుట్టూ తిరుగుతూ నన్ను తప్పించుకుని పోతావెందుకూ? ఆ రోజు ఓ మాట తటాలున విసిరి నీ దారిన పోయావు....చూసావా అదెంత పని చేసిందో! నీకోసం దిక్కులేని ఒంటరిపక్షిలా దారులవెంట వెతుక్కుంటూ తిరుగుతున్నాను. నాకూ బిచ్చగత్తెకూ తేడా ఏముందీ? నీకేం పట్టనట్లు కులాసాగా ఎలా వుండగలుగుతున్నావు?' అని కీర్తి మనసు పరితపించింది.

* * * *

సిద్దార్థకి లోకం అంతా మసకేసినట్లు వుంది. ఎవరేం మాట్లాడినా చిరాగ్గా వుంది.

'కీర్తీ! ఎక్కడ వున్నావు? నీకోసం ఫోన్లు చేసినా, నీ ఇంటిచుట్టూ తిరిగినా కనపడవేం? కావాలని నాతో ఆడుకుంటున్నావా? మీ అంకుల్ రేపు వచ్చేస్తుంది అంటాడు, నువ్వు రావు. నీ సెల్ ఆఫ్‌లో వుంది. నీ రూపం మాత్రం నా కనురెప్పల్లో నాట్యం చేస్తోంది. మూసుకుంటే నా ఒక్కడికే స్వంతం. రెప్పలు తెరిస్తే ప్రపంచంలో ఎక్కడ చూసినా కీర్తే కనిపిస్తోంది. ఏ పనీ చేయబుద్ధి కాదు. వేరే ఆలోచనలే రానడంలేదు. నన్నింతలా కట్టేయాల్సిన అవసరం ఏముందీ? నేను ఇష్టంగా నీ బంధీనయ్యాను కదా! నీ ప్రేమ చిహ్నంగా ఇంత బాధను వదిలి వెళ్ళాలా?

ఫోన్ మోగుతోంది.

నిరుత్సాహంగా తీసి "హలో!" అన్నాడు.

"నేను విశ్వనాథ్‌ని" అన్నాడు.

"హలో అంకుల్!" ఎంతో ఆశగా అన్నాడు.

"గుడ్ న్యూస్! సింగపూర్ నుండి కీర్తి రేపు ఉదయం వస్తోంది. ఎంగేజ్‌మెంట్‌కి కార్డ్స్ ప్రింట్ చేయించాను. చూస్తావా?"

"వద్దు. ముందు కీర్తిని చూస్తాను" ఉచ్చితంగా అన్నాడు.

"ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాయి. ఇంక అమ్మాయి రావడమే ఆలశ్యం" అన్నాడాయన.

"నేను తనని కాంటాక్ట్ చెయ్యాలని ప్రయత్నిస్తున్నట్లు అసలు మీరు చెప్పారా లేదా?" కాస్త విసుగ్గా అడిగాడు.

"అమ్మాయి ఫోన్ చేసినప్పుడల్లా చెప్తూనే వున్నాను. నవ్వి వూరుకుంటోంది. వస్తానుగా.... ప్రత్యక్షంగానే మాట్లాడతాను అంది" అన్నాడు విశ్వనాథం.

సిద్దార్థ పెదవి కొరుక్కున్నాడు. 'నన్నింతగా ఉడికిస్తావా....ఎక్కడికి పోతావులే.... ఎల్లుండి ఎంగేజ్‌మెంట్ రోజునైనా కనపడకపోవు!' ఉక్రోషంగా అనుకున్నాడు.

"ఏది ఏమైనా ఇలా అంతా సజావుగా సాగిపోతే నా బాధ్యత తీరిపోతుంది. ఐయామ్ వెరీ హేపీ" అన్నాడాయన.

"ఉంటాను అంకుల్....బై!" అన్నాడు సిద్దార్థ.

"బై!" రిసీవర్ క్రెడిల్ చేసాడు విశ్వనాథం.

'ఎన్నాళ్ళని ఉడికిస్తుంది? రేపు ఉదయం నా కళ్ళముందు వుంటుంది' తృప్తిగా అనుకున్నాడు సిద్దార్థ.

• • • •

కీర్తి అదేం పట్టించుకునే స్థితిలో లేదు. వెళ్ళే కారునీ, వచ్చే కారునీ పట్టిపట్టి చూస్తోంది.

"ఆకుపచ్చ బెన్జ్ అన్నావుకదూ! అక్కడ ట్రాఫిక్ లైట్స్ దగ్గర ఒకటి ఆగి వుందే" అంది మైత్రి.

"ఎక్కడా?" గబగబా నడుస్తూ అంది కీర్తి.

ఇద్దరూ వెళ్ళి చూసారు.



"కాదు" అంది కీర్తి.

"అదిగో! కానీ ఇది డార్క్ గ్రీన్" అంది మైత్రి. అలా ఆశగా ప్రతి కారునీ చూస్తూనే వున్నారు.

ఎవరో బిచ్చగాడొచ్చి పైసలు అడుగుతున్నాడు.

తల తిప్పకుండానే "పో....పో....ఏం లేదు" అంది మైత్రి.

ఎవరో స్కూటరిస్ట్ పక్కకి తప్పుకోమని తిట్టి వెళ్ళాడు.

ఇంకెవరో అమ్ముకునే వాళ్ళొచ్చి కొనమని అడుగుతున్నారు.

ఆ ఇద్దరూ కదలకుండా అక్కడే నిలబడి కార్లు పరీక్షించడంలో బిజీగా వున్నారు.

"హలో....మిస్మల్స్" ఎవరో పిలుస్తున్నారు.

కీర్తి తల తిప్పలేదు.

"కీర్తీ....మిస్మల్స్" ఈసారి ఆ మృదువైన కంఠస్వరానికి అదిరిపడి తలతిప్పి చూసింది.

సిద్దార్థ నవ్వుతూ నిలబడి వున్నాడు.

అదే చూపు....హృదయాన్ని చీల్చుకుని లోపలికంటా దూసుకెళుతున్నట్లు.

"ఏం పోగొట్టుకున్నారూ? అలా వెతుక్కుంటూ రోడ్డు మధ్యలో నిలబడ్డారు?" అడిగాడు.

మైత్రి ఆ అగంతకుడ్ని విసుగ్గా చూస్తోంది.

కీర్తికి స్వప్నం సాకారమైనట్లు వుంది. ఏం చెప్పాలో అర్థంకాని పరిస్థితి. నిన్నే....నిన్నే నేను వెదుకుతున్నానని ఎలుగెత్తి అరవాలనిపించింది.

"నన్ను గుర్తుపట్టారా?" కవ్విస్తున్నట్లు అడిగాడు.

ఒక్కసారిగా ఆ గుండెలమీద వాలి రెండు గుప్పెళ్ళతో మోది, నన్నింత బాధిస్తూ, ఇలా కవ్విస్తావా? అని ఏడవాలనిపించినా నిగ్రహించుకుంది.

"ఎప్పుడొచ్చారూ? అరె....మాట్లాడండి!" అన్నాడు.

"ఎవరే?" మోచేత్తో పొడుస్తూ అడిగింది మైత్రి.

కీర్తి బ్లాంక్‌గా చూసింది.

"రండి. ట్రాఫిక్ జామ్‌కి కారణం మనం కావడం నాకిష్టం లేదు" పక్కకి నడుస్తూ అన్నాడు.

కీర్తి అతని వెనకాలే మంత్రముగ్ధలా నడిచింది.

"నా వెయ్యిరూపాయల కోసం అయినా మీ జాడ పట్టుకోవాల కున్నాను" అన్నాడు.

మైత్రి ఇద్దర్నీ మార్చి మార్చి చూసి "హలో....ఐయామ్ మైత్ మీరెవరూ?" అని అతన్ని అడిగింది.

"కీర్తినే అడగండి" తనూ నవ్వుతూ అన్నాడు.

అతని చనువు చూస్తుంటే బాగా తెలుసున్నవాళ్ళ అబ్బాయిలాగా వున్నాడు. ఆకతాయి కుర్రాడిలా కన్పించడంలేదు. చాలా జెంటిల్‌గా వైట్ కాలర్ ఫెలోలా వున్నాడు.

మరి కీర్తి రెస్పాన్స్ ఇవ్వదేమనుకుంటూ కీర్తిని చూసింది.

"అలా చూస్తారేం? ఆ రోజు ట్రెయిన్‌లో నేనిచ్చిన వెయ్యి రూ యలు బదులు తీర్చరా?" అడిగాడు.

మైత్రి కుతూహలంగా చూస్తూ—

"మొన్న విశాలి పెళ్ళి నుండి వస్తుం....టే" అని కీర్తి వైపు బ అన్నట్లు చూసింది.

కీర్తి కళ్ళతోనే ఔను అన్నట్లు సైగ చేసింది.

"మరీ కాబూలీవాలాని చూసినట్లు చూసి తప్పించుకోవాలనుకు న్నారా? నా అప్పెప్పుడు తీరుస్తారో చెప్తే వెళ్ళిపోతాను" అన్నాడు.

కీర్తికి ఈసారి కాస్త భయమేసింది. వెయ్యిరూపాయలు చ ఇచ్చే పరిస్థితా తనది. నాన్నకి తెలిస్తే ఎంత బాధపడతారో! అనుకుని—

"నా దగ్గర ఇప్పుడు లేవు" అంది.

"పోనీ చెక్ రాసిస్తారా?" చిలిపిగా అడిగాడు.

కీర్తి కాస్త కోపంగా చూసింది. "వెయ్యి రూపాయలు డొ చెయ్యాలని నేననుకోలేదు. మీరే ఇచ్చారు అనవసరంగా" అంది.

"మీరే అలా మాట్లాడితే ఇంక వేరేవాళ్ళు ఎలా ఇస్తారు చెప్ప సరే, తర్వాత వసూలు చేసుకుంటానుగానీ, మొదట ఎక్కడయినా చ



కూర్చుని ఫ్రూట్ జ్యూస్ తీసుకుందాం. మీ హోటల్స్ అంత గొప్పది కాక పోయినా ఓ మోస్తరుగా పెద్ద హోటల్ 'శిల్పా'కి వెళ్దామా?" అడిగాడు.

కీర్తికి అర్థం అయీ కానట్లు వుంది.

మైత్రి వెంటనే "పదండి" అంది. అతనెవరో తెలిసాక ఆమెకి ఆ అవకాశం కీర్తి ఎక్కడ జారవిడుస్తుందోనని భయంగా వుంది.

"మీరు ఎలా వచ్చారూ?" కారువైపు నడుస్తూ అడిగాడు.

"రెండు కాళ్ళతో నడిచి" చెప్పింది మైత్రి.

"థాంక్‌గాడ్! ఈ అబ్బాయికి లిఫ్ట్ ఇచ్చే అవకాశం దొరికింది" అంటూ డోర్ తెరిచాడు.

చటుక్కున వెనకాల తలుపు తెరవబోయిన కీర్తితో "నేను మీ డ్రైవర్‌ని అనుకుంటారేమో జనం. దయచేసి ముందు కూర్చోండి" అన్నాడు.

మైత్రి కళ్ళతోనే సైగచేసి వెనక డోర్ తెరుచుకుని ఎక్కి కూర్చుంది.

కీర్తికి అతని కారులో పాదం మోపుతూంటే వెన్నులోంచి వణుకు పుట్టింది. గుండె శబ్దం గట్టిగా ప్రతిధ్వనిస్తూ చుట్టుపక్కలవాళ్ళకి విన్పిస్తున్నట్లు తోచింది.

ఆమె కూర్చోగానే అతను ఆమె సీటుమీద చెయ్యివేసి "కాస్త వెనక్కి జరిపి రిలాక్సింగా కూర్చోండి" అన్నాడు.

ఆ చర్యతో ఆమెకి అతని దగ్గర నుండి ఏక్స్ పరిమళాలు వీచి తనువంతా ఆవరించాయి. తగ్గీ తగలనట్లుగా భుజం తగిలేసరికి సప్త స్వరాలూ పలికి ధాత్రి రాగరంజితమైనట్లు తోచింది.

"ఏదైనా మాట్లాడండి....ప్లీజ్....!" స్టార్ట్ చేస్తూ అర్థింపుగా అన్నాడు.

కీర్తి మస్తిష్కంలో తను ముందురోజు మైత్రితో అన్న మాటలు మెదిలాయి. "ఒకవేళ కలిసాడే అనుకో ఏం మాట్లాడతావు?"

"ఒక్కనిమిషం నీ పక్కన కూర్చునే చనువు నాకిమ్మని అడుగుతాను."

ఈవేళ అతని పక్కన తను....మనసంతా విరితోటతో ఊయల

లూగుతున్నట్లు మత్తుగా మారింది. కోయిల ఆమె పక్కగా వచ్చి చెవిలో కూజితాలని కూయిస్తున్నట్లు.... వెన్నెల ఆమె శరీరాన్ని తన మెరుపుతో ముంచెత్తుతున్నట్లూ....గాలి చెవుల్లో దూరి చిలిపి సన్నాయిపాటలు పాడుతున్నట్లనిపిస్తోంది.

"కీర్తీ....మీ మౌనం నా మనసుని కోస్తోంది" అతను బాధగా అన్నాడు.

పెదవి విప్పి ఏం మాట్లాడాలో కీర్తికి బోధపడలేదు.

మైత్రి చిన్నగా దగ్గి "కీర్తి మొదటి నుంచి చాలా మితభాషేనండీ. అసలు మీకెలా పరిచయమయిందో నాకు అర్థంకావడంలేదు" అంది.

"నేను మీ ఫ్రెండ్ గురించి విన్నది పూర్తిగా వేరు. కానీ చూస్తున్నది వేరుగా వుంది. అయినా నాకు తెలిసిన కీర్తి ఇలాగే మౌనంగానే వుంటుంది, మొదటిరోజు కూడా ఇలాగే....పువ్వుల మధ్య తనూ ఒక పువ్వుగా మూగకళ్ళతో వూసులాడుకుంటుంటేనే చూసాను. విశ్వనాథ్ అంకుల్ ఇంటిముందు తోటలో....చూడగానే గొప్ప భావుకురాలు అనిపించి నవ్వుకున్నాను" అన్నాడు.

కీర్తి ఉలిక్కిపడి చూసింది. ఆమెకి ఏదో గుర్తొచ్చినట్లయింది. విశ్వనాథ్ అంకుల్ ఇంటిముందు గులాబీల మధ్య తను తిరుగుతుండగా ఒక యువకుడు వచ్చి ఏదో కవర్ ఇవ్వడం, తను తీసుకోవడం అంతా గుర్తొచ్చింది.

అతనే ఇతనా? ఆశ్చర్యంగా చూసింది.

"అందుకా....మీరు ట్రెయిన్‌లో కలవగానే నన్ను గుర్తుపట్టారు?" అంది.

"ఔను. మీరు మీ లోకంలో వుండి నన్ను గమనించలేదు అందుకే గుర్తుపెట్టుకోలేదు. కానీ నేనుమాత్రం మిమ్మల్ని గుర్తుంచుకున్నాను అనడంకంటే మరచిపోలేకపోయాను అనడమే సబబు!" సిన్సియర్‌గా అన్నాడు.

'ఎంతగా అతనికోసం వెదికింది తనూ....ఇలా మూగగా కూర్చోడానికా' కీర్తి మనసంతా వికలమయిపోయింది. 'ముందు తెలిపెనా ప్రభూ- మందిరమిటులుంచేనా.... వేరొక మూర్తికి చోటిచ్చేదాన్నా' అనుకుని



భారంగా నిట్టూర్చింది.

తను పార్కింగ్‌ప్లేస్‌లో కారు ఆపి "దిగండి" అన్నాడు.

కీర్తి, మైత్రి దిగి నిలబడ్డారు.

మైత్రి కళ్ళల్లో సంతోషంతో కూడిన నవ్వు కదలాడుతోంది. నెమ్మదిగా "కారు నెంబర్ నోట్ చేస్తానన్నావుగా!" అంది.

"రండి" అతను పచ్చాడు.

అతని పక్కన నడుస్తున్న కీర్తికి ఇదంతా స్వప్నంగా, ఒక్కసారిగా కరిగి మాయమౌతుందేమోననిపించింది.

"ఒక్కసారి ఫోన్ చెయ్యొచ్చుగా. ఎందుకు చెయ్యలేదూ....?" అడిగాడు.

కీర్తి తెల్లబోయి చూసింది.

స్వింగ్‌డోర్ నెట్టి "కమాన్....అ కార్నర్ టేబుల్ దగ్గర కూర్చుందాం" అన్నాడు.

ఆ మసక చీకటిలో....చల్లని వాతావరణంలో సైతం కీర్తికి ముచ్చెమటలు పోశాయి. మంద్రమైన ధ్వనిలో పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది.

"కీర్తీ! విశ్వనాథ్ అంకుల్ మీ గురించి చాలా చెప్పారు. ఫాస్ట్‌గర్ల్ అనీ....ఒంటిచేత్తో తన బిజినెస్సులన్నీ చూసుకుంటుందనీ, పారిస్‌లో చదువుకొన్న తెలివితేటలనీ....ఇంకా ఏదేదో చెప్పారు. కానీ నేను చూస్తున్న కీర్తిలో అమాయకత్వం, ముగ్ధత్వం తప్ప ఏమీ కనిపించడం లేదు. ఐయామ్ డేమ్ కన్‌ఫ్యూజ్‌డ్" అన్నాడు.

కీర్తి గొంతు ఎండుకుపోయినా మంచినీళ్ళు కూడా తాగడానికి జంకు కలిగి, అతనివైపు చిత్తరువులా చూసింది.

మైత్రి కలగజేసుకుని "సిద్ధార్థగారూ! మా కీర్తి ఫారిన్‌లో...." అని చెప్పబోయింది.

వెయిటర్ తీసుకొచ్చిన మెనూకార్డ్ చూపిస్తూ "ఆర్డర్ చెయ్యండి" అన్నాడు సిద్ధార్థ.

"కాఫీ చాలు!" వెంటనే చెప్పింది మైత్రి.

"నో! స్వీట్‌గా ఏదైనా ఆర్డర్ చెయ్యండి. ఇది చాలా మధురమైన రోజు. సో స్వీట్‌గా ఐస్‌క్రీమ్" అని కీర్తివైపు చూశాడు.

"మీరు అనుకుంటున్నదంతా తప్పు" అంది కీర్తి.

"ఐస్‌క్రీమ్ తియ్యగా వుంటుందనుకోవడం తప్పా?" టీజింగ్‌గా అడిగాడు.

"ఓ.కే! మూడు కసాటా" తనే చెప్పేసింది మైత్రి.

వెయిటర్ వెళ్ళిపోయాడు.

"ఇప్పుడు చెప్పండి....ఏం చెప్పాలనుకుంటున్నారో?" ముందుకి వంగి కీర్తి కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"మీరు అనుకుంటున్నట్లుగా నేను ఫారిన్‌లో చదువుకుని రాలేదు. మాకేం బిజినెస్సులూ, ఆస్తులూ లేవు! మా నాన్నగారుఓ ప్రైవేటు కంపెనీలో క్యాషియర్. మేము మధ్యతరగతి వాళ్ళం. భూకంప బాధితులకి వెయ్యి రూపాయలు విరాళంగా ఇవ్వాలని కోరిక వున్నా, ఇచ్చే పరిస్థితి కాదు నాది" కీర్తి గడగడా చెప్పేసింది.

"గుడ్ జోక్" అంతా విని నవ్వుతూ అన్నాడు సిద్ధార్థ.

మైత్రి కోపంగా "అది కమలానెహ్రూ కాలేజీలో బి.ఏ. ఫైనల్ ఇయర్ చదువుతోంది. కావాలంటే ఐడెంటిటీ కార్డూ, బస్‌పాసూ చూసుకోండి....చూపించవే కీర్తీ!" అంది.

కీర్తి పుస్తకాల బ్యాగ్ తెరిచి బస్‌పాస్ తీసి అతనిముందు పెట్టింది.

సిద్ధార్థ కళ్ళముందున్న మంచు విడిచిపోయినట్లయింది. కాళ్ళక్రింద నున్న నేల కదులుతున్నట్లు అనిపించింది. 'మైగాడ్! శృతకీర్తి, విశ్వనాథ్ అంకుల్ ఈ అమ్మాయి మాట్లాడడం, ట్రైన్‌లో కలవడం, ఎంగేజ్‌మెంట్ ఫిక్స్ చెయ్యమనడం' అతని మనసులో రీళ్ళలా గిరగిర తిరిగి మతిపోయి నట్లయింది.

ఇదంతా తెలీని వాతావరణం చల్లగా వుంది. ఐస్‌క్రీమ్స్ వచ్చాయి.

"వదవే....వెళ్ళిపోదాం. థాంక్యూ" అని కీర్తి వెళ్ళిపోవడానికి ఉద్యుక్తురాలైంది.

సిద్ధార్థ ఆమె చెయ్యి పట్టుకుని "సారీ! ఏదో ఆలోచిస్తూ వుండిపోయాను. కూర్చోండి. ప్లీజ్!" అన్నాడు.

కీర్తికి అతను చెయ్యి పట్టుకోగానే మళ్ళీ అదే ఝల్లుమన్న భావన. అలాగే నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది.



సిద్ధార్థ ఆమె చేతిని వదిలిపెడుతూ, ఆమెని పరికించి చూశాడు.

తెల్లని చుడీదార్‌లో అప్పుడే విరిసిన దానిమ్మమొగ్గలా వుందామె. అతి మామూలుగా ఎటువంటి భేషజాలూ, ఆడంబరాలూ లేకుండా....స్నిగ్ధంగా, ముగ్ధంగా....తూరుపు వాకిట్లో విరిసిన సంధూరపు పువ్వులా వుంది. ఈమె....శృతకీర్తి అని తనెలా పొరపడ్డాడూ? ఏవిటీ తికమక? సడెన్‌గా తనెంత ప్రమాదంలో ఇరుక్కున్నాడో అతనికి తట్టింది.

"ప్లీజ్! తీసుకోండి" వాళ్ళ ముందుకి ఐస్‌క్రీమ్‌లు జరిపి, సెల్ తీసి తల వెనక్కి వాల్చి, రహస్యంగా మాట్లాడాడు.

"డాడీ! నేనే సిద్ధూని!"

"ఆ....సిద్ధూ! కీర్తి వచ్చింది. రేపటి ఎరేంజ్‌మెంట్స్ బ్రహ్మాండంగా చేశాడు విశ్వనాథ్ అంకుల్! కార్డ్స్ డిస్ట్రిబ్యూట్ చెయ్యడం మొదలుపెట్టెయ్యమంటావా? నువ్వొచ్చి చూసుకుంటావా?" ఆపకుండా మాట్లాడాడు తండ్రి.

"నో....అన్నీ ఆపెయ్యండి. ఎంగేజ్‌మెంట్ కాన్సిల్ చెయ్యమనీ, సారీ అనీ వెంటనే విశ్వనాథ్ అంకుల్ వాళ్ళకి చెప్పండి. దట్సాల్. మిగతావన్నీ నేనొచ్చి మాట్లాడతాను" అని సెల్ ఆఫ్ చేసేశాడు. తల ఎత్తేసరికి కీర్తి అతనివైపే చూస్తోంది.

అతను ఎంతో టెన్షన్‌లో వున్నట్లు ఆమె పసిగట్టేసింది.

"ఎనీ ప్రోబ్లెమ్?" కంగారుగా అడిగింది.

"చాలా పొరపాటు జరిగిపోయింది కీర్తీ!" అన్నాడు.

"ఏం?" ఆమె కళ్ళల్లో భయం కదలాడింది.

"మొదటిసారి మిమ్మల్ని విశ్వనాథ్ అంకుల్‌తో కలిసి నడుస్తూ వుండగా చూసీ, రెండవసారి వాళ్ళింట్లో పలకరించీ, మీరు ఆయన మేనకోడలనుకున్నాను...." అని ఆగాడు.

"అనుకునీ...." చెప్పమన్నట్లు చూసింది.

సిద్ధార్థ ఐస్‌క్రీమ్ తినమన్నట్లుగా సైగచేసి, తనూ తీసుకుంటూ— "అనుకుని పెళ్ళి చేసుకోడానికి ఎస్ అన్నాను. ఆయన మేనకోడలు పేరు కూడా కీర్తి....శృతకీర్తి!" అన్నాడు.

మైత్రి కళ్ళు కీర్తి మొహం పాలిపోవడం పసిగట్టాయి.

అతనికేసి చూస్తూ "నో...." అంది.

"రేపు మా ఎంగేజ్‌మెంట్ ఫిక్స్ చేశారు పెద్దవాళ్ళు" అన్నాడు.

కీర్తి తల వంచుకుంది.

"ఈ వార్త విన్నాక మీకు ఎలా అనిపించిందీ....?" అడిగాడు సిద్ధార్థ.

"మీరు ఎవరో అనుకుని పొరపడి, నన్ను ప్రేమించానన్నారు" అంది కీర్తి.

సిద్ధార్థ గట్టిగా నవ్వాడు.

కీర్తి తలఎత్తి చూసింది.

"కాదు! మీరనుకుని పొరపాటు పడి, ఎవరో నేను చూడని అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను. చూసారా ఇద్దరి అభిప్రాయాల్లో ఎంత తేడానో!" అన్నాడు.

"మరి....ఇప్పుడెలా?" మైత్రి గాబరాగా అడిగింది.

"మీరు ఇంకో ఐస్‌క్రీమ్ ఆర్డర్ ఇవ్వండి. ఏం కంగారులేదు. నేను ఎంగేజ్‌మెంట్ కాన్సిల్ చేసెయ్యగలను" నిశ్చింతగా అన్నాడు.

కీర్తి ఆనందంగా చూసి, అంతలోనే బాధగా తల వంచుకుని- "వద్దు! మీరు ఆ పని చెయ్యకండి. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోండి" అంది.

"మీరు కాదని తెలిసాక కూడానా? వై?" అతను ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎందుకంటే! మీకు ఎంగేజ్‌మెంట్ ఫిక్స్ అయింది అంతే. కానీ నాకు వేరొకరితో ఎంగేజ్‌మెంట్ అయిపోయింది" స్పష్టంగా చెప్పింది కీర్తి.

సిద్ధార్థ పిడుగుపాటు తిన్నట్లు చూశాడు.

నీటిపాయని చూసి ఎంతో దాహంతో పరిగెత్తుకువస్తే, అది ఎండమావి అని తెలిసినట్లు, అతను ఎంతో బాధగా చూశాడు.

మౌనం భయంకరమైన క్షణాల్ని బహుమతిగా చేస్తోంది.

ఎవరిమటుకి వాళ్ళకే ముందుగా అవతలివాళ్ళు ఏదో ఒకటి మాట్లాడేస్తే బాగుండుననిపిస్తోంది. ఆ తర్వాత తమ మనసులోది బయటపెట్ట



యచ్చు అని ఎదురుచూస్తున్నారు.

మైత్రి వాళ్ళ అవస్థని అర్థం చేసుకుని ఏకాంతంగా వదిలిపెట్టి క్రింద లాబీలో ఎదురు చూస్తుంటానని చెప్పి వెళ్ళిపోయాకా కనీసం అతనివైపు తలెత్తి కూడా చూడలేనట్లు కూర్చుంది కీర్తి.

సిద్ధార్థ సడెన్‌గా ముందుకి ఒంగి ఆమె చేతిమీద తన చేతిని వేసి- "కీర్తీ! మనం ప్రేమించుకున్నాం. ఔనా, కాదా?" అన్నాడు.

హఠాత్తుగా విద్యుద్ఘాతంలా తగిలిన ఆ ప్రశ్నకి ఏం జవాబు చెప్పాలో తోచనిదానిలా నిశ్చేష్టయై చూసింది.

"నిన్నటిదాకా ఏం జరిగిందో మనకి వద్దు. ఆ నిన్నని చెరిపేసెయ్. ఈ నిమిషం నుండీ నువ్వు నా దానివి!" అంటుంటే అతని కళ్ళల్లో పట్టుదలా, స్వరంలో తీర్మానం కనిపించాయి.

కీర్తికి ఆ క్షణం శాశ్వతమైతే బావుండునని ఎంతగానో అనిపించింది. తన చేతిని బలంగా బంధించి పట్టుజారిపోకుండా దగ్గరగా లాక్కుంటున్నాడు సిద్ధార్థ. ఇష్టమైన ఆ వ్యక్తి స్పర్శకి అచేతనమయ్యేదే కానీ.... ఆ నిమిషంలో ఎవరో చర్నాకోలాతో కొట్టినట్లుగా తండ్రి గుర్తుకొచ్చారు.

ఆయనకి తనమీద ఎంత నమ్మకం....తన పెంపకంమీద ఎంత గర్వం! తన రక్తం మీద అధికారం....తనపట్ల మమకారం....అన్నీ గుర్తుకొచ్చాయి.

నెమ్మదిగా అతని చేతిని తన చేతిమీద నుండి తొలగించింది.

"వద్దు....మనం ఇంక కలుసుకోవద్దు!" అంది.

ఈసారి సిద్ధార్థకి ఆమెని ఆవేశంగా దగ్గరకి తీసుకుని ఆ చెంపా ఈ చెంపా వాయించాలనిపించింది.

"మరి ఎందుకు నా కోసం వెతికావూ? అంతగా చూడాలని ఆరాటపడ్డావూ?" అని అడిగాడు.

కీర్తికి అప్పటికే కంటినిండా వూరిన నీటితో అతని రూపం అస్పష్టమైపోయింది. గట్టిగా కళ్ళు మూసుకుని శ్వాస పీల్చుకుంది.

సిద్ధార్థ చేతిమీద ఆమె కన్నీటిబొట్టు జారిపడింది.

అతను ఆ వెచ్చదనంలోని గాఢతని అనుభూతిస్తూ ఆమె ఆంతర్యాన్ని పసిగట్టడానికి ప్రయత్నించాడు.

"జవాబు చెప్తాను....!" ఆమె కళ్ళు తుడుచుకుని ఒక నిర్ణయానికి వచ్చినట్లు అంది.

"రెండు కోరికలతో మిమ్మల్ని కలవాలనుకున్నాను. మొదటిది తీరింది. రెండవది మీరు తీరుస్తారు!"

"ఏమిటవి?" అతను ఆత్రంగా అడిగాడు.

"మీ ప్రక్కన రెండు నిముషాలు కూర్చునే అదృష్టం కావాలనుకున్నాను. అది తీరింది!" ఆ మాట అనేటప్పుడు కాస్త సిగ్గూ, కొంచెం ఆనందం, ఎంతో తృప్తీ, మరెంతో దుఃఖం....ఆమె గొంతులో పలికాయి.

"రెండవదీ?" ఆలస్యం తట్టుకోలేనట్లు అడిగాడు.

"నన్ను జీవితంలో కలవద్దనీ, కలిస్తే భరించలేననీ చెప్పి మిమ్మల్ని ఒప్పించాలన్నది!" అంది.

"కీర్తి...." వినకూడని మాట విన్నట్లుగా చూశాడు. అతని చెయ్యి అసంకల్పితంగా ఆమె చెంపమీద కారుతున్న కన్నీటిబొట్టుని తుడవబోయింది.

ఆమె అతనికి అందకుండా వెనక్కి జరిగి "ప్లీజ్....తీరుస్తారు కదూ!" అంది.

"నాకోసం విషం తాగుతారు కదూ....అని అడిగివుంటే ఒప్పుకునేవాణ్ని!" కోపంగా అన్నాడు.

కీర్తి దీర్ఘంగా నిట్టూర్చి అతని తల మీదుగా దూరంగావున్న ఎక్వేరియం వైపు చూసింది. రంగు రంగుల చేపపిల్లలు స్వేచ్ఛ తప్ప మాకింకేం అక్కర్లేదు అన్నట్లు నిరంతరాన్వేషణలో ఆ ఇరుకు తొట్లో అలుపెరగకుండా సంచరిస్తున్నాయి. ఆ సమయంలో ఆమె మనసు కూడా ఇరుగ్గా వున్న ఓ చట్రంలో అలాగే చంచలంగా వున్నట్లు తోచింది.

"నేను బందీని. నా చుట్టూ ఆప్యాయతానురాగాలనే ఇనప సంకెళ్ళున్నాయి. అవి ఛేదించడానికి నా శక్తి చాలదు! నామీద ప్రాణాలు పెట్టుకున్న తల్లిదండ్రుల్ని, నా వాళ్ళనీ....స్వసుఖం కోసం బాధపెట్టే ఆలోచన కూడా చేసే సాహసం నాలో లేదు! అందుకు నన్ను క్షమించండి. దయచేసి నన్ను కలుసుకునే ప్రయత్నం చెయ్యకండి!" బేలగా ఆమాటలు



పలకకుండా వుండడానికి సర్వశక్తులా కూడగట్టుకుంటూ గట్టిగా, ధాటిగా అంది.

"నేను చాలా మొండివాడిని. నాకు కావలసింది దొరక్కపోతే వూర్కోను" ఆమె చేతిని గట్టిగా పట్టుకుంటూ అన్నాడు సిద్ధార్థ.

"నా ఇష్టం లేకుండా యిలా ప్రవర్తించి నన్ను బాధపెడతారా....?" వాడిగా అడిగింది.

"సారీ!" చప్పున ఆమె చేతిని వదిలేశాడు.

"థాంక్స్!" కర్చీఫ్‌తో కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది.

"కన్నీళ్ళతోనైనా హృదయం తేలికపరుచుకోలేని నామీద నాకే కోపంగా వుంది! అలాగని నిన్నేం అనలేకపోతున్నాను కీర్తీ....ఇది మన జీవితం. పెద్దవాళ్ళు కాదు, రేపు జీవితాంతం కలిసి బ్రతికేది. నా మాట విను...." అతను నచ్చచెప్పబోయాడు.

ఆమె ఆపమన్నట్లు చెయ్యి చూపిస్తూ లేచి నిలబడింది.

"మీరేం చెప్పబోతున్నారో నాకు తెలుసు! నేను వినదలుచుకోలేదు. మనకి ఈ జీవితాలు ప్రసాదించిన పెద్దవాళ్ళకి మన జీవితాలమీద హక్కు లేదంటే నేను ఒప్పుకోను! మనకి ఈ పరిస్థితి రావడం మన బలహీనత!

"కాదు....ప్రేమ బలహీనత కాదు...." అతను కూడా లేస్తూ అన్నాడు.

"ఏదైనా అనుకోండి. కానీ ఒక్కసారిగా వాళ్ళకి మనమీదున్న ఆశలనీ, అంచనాలనీ తల్లక్రిందులుచేసే హక్కు మనకి లేదని నావిశ్వాసం. ప్లీజ్....మీరు కూర్చోండి. నేను క్రిందకి వెళ్ళిన అయిదు నిమిషాల తర్వాత క్రిందకి రండి. నేను కోరిన రెండో కోరిక కూడా తప్పక తీరుస్తారనే నమ్మకంతోనే వెళ్ళిపోతున్నాను. బై!"

కీర్తి వెళ్ళిపోతుంటే తన జీవితంలో వుండే ఆశలని చిన్నాభిన్నం చేస్తూ వెళ్ళిపోతున్నట్లు అనిపించింది సిద్ధార్థకి. ఒక్కసారిగా ఎంత ఆవేశం వచ్చిందంటే, పరిగెత్తుకువెళ్ళి ఆమె రెండు భుజాలు పట్టుకుని.

"ఆగు. నా జీవితాన్ని నా నుండి దూరం చేసి ఎక్కడికి వెళ్తున్నావు?" అని ఆపాలనిపించింది.

కానీ ఆమె మాటకి ఎదురుచెప్పే శక్తిలేనట్లు నిస్సహాయంగా

కూర్చుండిపోయాడు.

ప్రేమకి చాలా శక్తి వుంది! ఎదుటివారిని ఆయుధం ఉపయోగించకుండా గాయపరచగలదు. నిర్వీర్యుల్ని చేయగలదు!

ఒకటి.... రెండు.... మూడు.... నాలుగు.... ఐదో నిమిషం ఎప్పుడు పూర్తవుతుందా.... ఎప్పుడెప్పుడు క్రిందకి అఘమేఘాల మీద వెళ్దామా అని వాచ్ చూస్తూ గడిపాతను.

ఐదో నిమిషం పూర్తవుతుండగానే ట్రేలో ఐదువందల నోటుపేసి పరిగెత్తున్న అతన్ని తొంభై రూపాయల బిల్లు తీసుకొచ్చి పెట్టిన వెయిటర్ ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

* * * *

సిద్దార్థ హడావిడిగా కారిడార్లోంచి పరిగెత్తి గేట్లో నిలబడి అందినంత దూరం కళ్ళు చించుకొని చూశాడు. ఆమె వెళ్ళిపోయిందన్న వూహ మనసుకి తగలగానే అతనికి తనెంత తప్పుచేశాడో తెలిసొచ్చింది.

పేరు తప్ప ఏమీ తెలీదు. అడ్రస్‌గానీ, ఫోన్‌నెంబర్‌గానీ తీసుకోలేదు. ఐదు నిమిషాలదాకా కదలొద్దు అంటే ఆ ఆజ్ఞకి కట్టుబడి అలాగే కూర్చుండిపోయాడు. అతి కఠినమైన నిబంధన 'ఇంకెప్పుడూ నన్ను కలిసే ప్రయత్నం చెయ్యొద్దు.'

'ఎలా.... అదెలా సాధ్యం?' లాఘవంగా తనలోంచి అతి ముఖ్యమైన మనసును పట్టుకుని నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోయిన ఆమెని మరవడం సాధ్యమా? కాదు.... కాదు.

గుప్పెళ్ళు బిగించి తన బాధని కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఆ తర్వాత నీరసంగా కారువైపు నడిచాడు.

అతని కారు గేట్లోంచి దూసుకుపోయేదాకా మైత్రి చేతిని బలంగా పట్టుకుని చాటునుండి చూస్తూ నిలబడ్డ కీర్తి బలంగా వూపిరి పీల్చుకుంది. అంతసేపూ ఆమె వూపిరి పీల్చడం కూడా మరిచిపోయి అతనినే చూస్తూ నిలబడింది.

"వెళ్ళిపోయాడుగా.... ఇంక పద!" అంది మైత్రి.

కీర్తి అడుగు కదిపే శక్తిలేనట్టు నీరసంగా నిలబడింది.

'ఏం చేసింది తను? అతన్ని జీవితంలో కలవద్దంది' ఇంక కలవనే



కలవదా! తను అతన్ని ఇంక చూడనే చూడలేనా? దుఃఖం కట్టలు తెంచుకుని బయటకి రావడానికి అవస్థ పడుతోంది.

మైత్రి ఆమె స్థితి గమనించి భుజంమీద చెయ్యివేసి నెమ్మదిగా నడిపించుకుంటూ తీసుకొచ్చింది.

"ఆగు" గేట్లో ఆగుతూ అంది కీర్తి.

"ఏం?"

"అతను ఇక్కడే కదూ ఇందాక నిలబడ్డాడూ!" అపురూపంగా తల వంచి నేలని చూస్తూ అంది.

"కీర్తి!" మైత్రి కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి.

"ఎందుకే.... ఇంత ప్రేమని దాచిపెట్టుకుని అతన్ని అలా...."

కీర్తి తల అడ్డంగా ఆడించింది. "నన్ను ఆపకు. బాధపడనీ.... చాలా బాధపడనీ. ఎంతో మధురంగా వుంది ఈ బాధ" తన ముంజేతివైపు చూసుకుంది. అతని వేళ్ళు ఇంకా అక్కడ వున్నట్టే వున్నాయి.

ఏదో కోల్పోయినట్టుగా కాదు, ఎంతో పొందినట్టుగా ఆమె అక్కడినుండి బయటికి నడిచింది.

వసంతం వెళ్ళిపోయాక వాడిన పూలభారంతో తలవంచి నిలబడ్డ తోటలా వుంది ఆమె ముఖం. తోడుగా మౌనం. నీడగా దుఃఖం అనుసరించి వచ్చాయి.

* * * *

పెరట్లో నవారు మంచం వాల్చి దానిమీద ప్లాస్టిక్ కాయితం వేసి వడియాలు పెడుతున్నారు సుభద్రా, పక్కింటి పార్వతమ్మగారు.

కీర్తిని చూడగానే "వచ్చింది వదినా, పెళ్ళికూతురు" అంది నవ్వుతూ పార్వతమ్మ.

సుభద్ర కూడా నవ్వుతూ "అత్తయ్య నీ పెళ్ళి పనులతో అలిసిపోతోంది గానీ.... వెళ్ళి కాఫీ కలిపి తీసుకురా!"

"నడుం వంగిపోయిందే కోడలా!" అంది పార్వతమ్మ.

"అప్పుడే అలా అంటే ఎలా వదినా? సీమంతం పనులకీ, బారసాల పనులకీ కాస్త సత్తువ దాచుకో!" అంటూ వుంటే సుభద్ర మొహం ఆనందంతో వెలిగిపోతోంది.

కీర్తి ఆ సందడిని ఆస్వాదించలేని దానిలా గబుక్కున లోనికి వెళ్ళిపోయింది.

"పిల్లలు పుడితే ఉదయ్ రంగువచ్చినా పోలికలు మాత్రం మన కీర్తివే రావాలి" అంటోంది పార్వతమ్మ.

కీర్తి తన చేతివైపు చూసుకుంది. ఈ చేతిని పట్టుకుని ఉదయ్ ఏడడుగులు నడుస్తాడు. ఆ తర్వాత పిల్లలు పుడ్తారు. ఆమెకి ఎంతో దుఃఖం వచ్చింది.

"విధివంచిత సీరియల్ చూస్తున్నావా వదినా? ఆ అత్త మహా గయ్యాళిది. కోడలు మరీ అంత మెతకైతే ఎలా చెప్పు? కొడుక్కి నోట్లో నాలికే లేదు మరీనూ" పార్వతమ్మకి ఇష్టమైన సబ్జెక్ట్ టీవీ సీరియల్స్. వాటి గురించి ఎదుటివాళ్ళ ఫీలింగ్స్ పట్టించుకోకుండా గంటలుగంటలు మాట్లాడగలదు.

సుభద్ర టీవీ ముందు కూర్చోవడం తక్కువ. కొందరు ఆడవాళ్ళకి నడుం వాల్చినా, స్థిమితంగా కూర్చున్నా వెంటనే ఏదో ఒక పని గుర్తొస్తుంది. అదొక వ్యాధి. ఎప్పుడూ రెస్ట్‌లెస్‌గా వుంటారు. సాధారణంగా రాత్రిపూట మంచి నిద్ర పట్టేటప్పుడు తలుపులు సరిగ్గా వేసామో లేదో అనో....గ్యాస్ లీక్ అవుతుందేమో చూడాలని అనో లేస్తుంటారు. అబ్సెసివ్ కంపెల్సివ్ డిసార్డర్ లాంటిది.

"టీవీలో మధ్యాహ్నం 'ఇదీ ఓ బ్రతుకేనా?' చూస్తున్నావా" అడుగుతోంది పార్వతమ్మ.

కీర్తి పొంగుతున్న పాలకేసి చూస్తూ నిట్టూర్చింది

* * * *

"ఏమిటి అంకుల్! అంతఅర్జంట్‌గా రమ్మన్నారూ?" విశ్వనాథాన్ని గుమ్మంలోనే అడిగింది శృతకీర్తి.

"ఎంగేజ్‌మెంట్‌కి చీర కొనుక్కున్నావా? ఎంతసేపూ నీ బిజినెస్ పనులు తప్ప స్వంత పనుల గురించి పట్టించుకోవా?" మందలింపుగా అడిగాడాయన.

శృతకీర్తి నవ్వింది. "చీరే కట్టుకోవాలా?" అంది.

ఆమె వేసుకున్న స్లీవ్‌లెస్ టీ షర్ట్, టైట్ జీన్స్‌వైపు చూస్తూ



"ఔనమ్మా. రేపొక్క రోజుకీ నా మాట వినాలి" అన్నాడాయన.

"నాకు నచ్చే చీరలు ఇక్కడ దొరుకుతాయా?" ఆమె సాలోచనగా అంది.

"చిటికెలో తెప్పిస్తాను. చెప్పమ్మా....కాంచీవరం పట్టు తెప్పించనా? గద్వాల్ కానీ ధర్మవరం కానీ...." అంటున్న ఆయన్ని మధ్యలోనే ఆపిందామె.

"చాందినీ....ఘర్ చోళా....తెలుసా?" అడిగింది.

ఆయన ఆశ్చర్యంగా తల అడ్డంగా వూపాడు.

"గుజరాత్‌లో ఫేమస్. అలాగే జందానీ తెలుసా? బెంగాల్‌లో దొరుకుతుంది. పటోలా సిల్కు తెలుసా? బెంగుళూరులో ప్రసిద్ధి. అస్సాం, ముంగా, బీహార్, బాకల్‌పురీ....మధ్యప్రదేశ్ చందేరీ, మహేశ్వరీ" అని ఆగింది.

ఆయన అయోమయంగా చూస్తూ నిలబడ్డాడు.

"అంకుల్" అంటూ ఆయన మొహం ముందు చిటికెలు వేసి నవ్వింది. "ఏది ఎక్కడ ఫేమసో, ఎలాంటి సరుకు మంచిదో తెలుసుకుని కాని ఏదీ కొనను" అని ఆయన దగ్గరగా వచ్చి "పెళ్ళికొడుకుని కూడా!" అంది.

విశ్వనాథ్ సోఫాలో కూర్చుని "వాళ్ళ గురించి కూడా అంత నాలెడ్జి వుందా?" అన్నాడు.

ఆమె సీరియస్‌గా చూసింది. "కర్నాటక అబ్బాయిలు సాఫ్ట్ బిహేవియర్‌తో వుంటారు. కానీ ప్రతిపనికీ కాస్త పుష్ చేస్తుండాలి. అహంకారం, గర్వం ఎక్కువగానే వుంటాయి. బేసిన్ లడ్డూలా తియ్యగా తినగానే నోరంతా పట్టుకున్నట్లు వుంటారు" అని కిసుక్కున నవ్వింది. "ఇంక మహారాష్ట్ర అబ్బాయిలు జిలేబీల్లా నోరూరిస్తూ కళ్ళు జిగేల్మనేటట్లు వుంటారు. బాగా ఫాస్టు. అతిశయం ఎక్కువ పాళ్ళల్లో వుంటుంది. సమస్యొస్తే మాత్రం తట్టుకోలేనట్లు డీలా పడిపోతారు. కేరళ కుర్రాళ్ళు మొరటుగా కనిపించినా మనసు మృదువుగా వుంటుంది. పట్టుదలా, ఓర్పు వీళ్ళ సొమ్ములు. ఏ సమస్యనైనా నెట్టుకుపోగలరు. తమిళం కుర్రాడు బాగా తెలివిగా, చాకచక్యంగా పనులు చేస్తుంటాడు. మొండితనం, ఆవేశం పాళ్ళ

చాలా ఎక్కువ. ఆకట్టుకునే గుణం మరీ ఎక్కువ. ఇంక మన ఆంధ్రులు పచ్చిమిరప ఘాటంత పొగరుంటుంది. బద్ధకం, మాటపట్టింపూ మరీఎక్కువ. ఇంద్రుడివీ చంద్రుడివీ అని పొగిడామా టక్కున పడిపోయి తమ శక్తికి మించిన పనులు చేసేస్తుంటారు. అందంలో మాత్రం ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మహారాష్ట్రీ తర్వాత మార్కులు మనవే."

విశ్వనాథ్ నోరంతా తెరిచి "ప్రతి విషయంలో ఇంత నాలెడ్జి ఎలా సంపాదించావమ్మా?" అనడిగాడు.

"అన్నింటి గురించీ అవగాహన వుంటేనేగా అంకుల్ మంచివి సెలక్ట్ చేసుకోగలం. బిజినెస్‌లో ప్రోడక్ట్ ఇవ్వడమే కాదు కొనడం కూడా వుంటుంది. అవి ఎంచుకోవడం ఒక కళ" అంది.

"సో....సిద్దార్థ మంచి ప్రోడక్టే అంటావు" ఆయన ఆటపట్టిస్తూ అన్నాడు.

ఆమె జవాబు చెప్పేలోగానే ఫోన్ మ్రోగింది.

"వన్ మినిట్" అంటూ విశ్వనాథ్ వెళ్ళి ఫోన్ అందుకుని.... "హలో....రాజారావా? నూరేళ్ళు....మీ అబ్బాయి గురించే మాట్లాడుకుంటున్నాం. మా శృతి పచ్చిమిరపకాయబజ్జీలాంటివాడని సర్టిఫికేట్ ఇస్తోంది" అని గడగడా చెప్పాడు.

శృతకీర్తి వెళ్ళి "నే మాట్లాడ్తాను" అంది.

"శృతితో మాట్లాడు" విశ్వనాథ్ ఫోన్ ఇచ్చేశాడు.

"అంకుల్....ఏమిటి? మీ అబ్బాయి నేను ఊళ్ళోకి వస్తే చూడడానికి రానేలేదు! నాకన్నా బిజీనా? ముంబైలో నిన్ననే ఓ హోటల్ కొన్నాను. జస్ట్ థర్టీఫైవ్ క్రోర్స్ అయింది. మీరెప్పుడు చూస్తారూ?"

అవతలివైపు రాజారావు నోరు కట్టేసినట్లుగా తడబడ్డాడు.

"అదీ....శృతీ....చూస్తానమ్మా. చూస్తాను. ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ డియర్. ఒకసారి విశ్వనాథ్‌కిస్తావా? ఆ! ఒద్దులే. నేను మళ్ళీ ఫోన్ చేస్తాను. సిద్దార్థచేత చేయిస్తాను. బై!" అని ఫోన్ పెట్టేశాడు.

"బై!" అని ఫోన్ పెట్టేస్తూ "అంకుల్, ముసలాయన కంగారు పడ్డాడంటావా? అలా ఫోన్ పెట్టేశాడూ." అంది.

"నీ స్పీడ్‌కి కంగారు కాదు, హార్ట్ఎటాకే వచ్చుంటుంది. థర్టీఫైవ్



క్రోర్స్, సిక్స్టీ క్రోర్స్ అని నువ్వు రాజారావుతో మాట్లాడకమ్మా దయ చేసి!" అని ఆయన చేతులు జోడించాడు.

"సో ఫన్నీ!" అంటూ శృతి పెద్దగా నవ్వింది.

"అక్కడ రాజారావు క్రిందపడి గిలగిలా తన్నుకుంటూ వుండి వుంటాడు పాపం!" అన్నాడు విశ్వనాథ్ కూడా నవ్వుతూ.

"మరి సిద్ధూ ఏం చేస్తున్నాడో?" ముద్దుగా అడిగింది శృతి.

• • • •

"ఈడియట్! థర్టీఫైవ్ క్రోర్స్ పెట్టి హోటల్ కొన్నానని బొమ్మ కొనుక్కున్నాను అన్నంత తేలిగ్గా చెప్పిందిరా ఆ పిల్ల! అలాంటి అమ్మాయిని వదులుకుని ఏం బావుకుందామనిరా ఎంగేజ్‌మెంట్ కాన్సిల్ చెయ్యమన్నావ్? ఇంకా నయం. నేను చెప్పలేదు కాబట్టి సరిపోయింది. మైగాడ్! అంత ఆస్తి....తలుచుకుంటేనే గుండె ఆగిపోయేట్లు వుంది" రాజారావు గుండెని చేత్తో తడుముకుంటూ అన్నాడు.

సిద్దార్థ నిజంగా సిద్దార్థుడిలా చూశాడు.

"చూశావా నాన్నా! డబ్బు ఎంత బాధపెడ్తుందో? బ్లడ్‌ప్రెషర్లూ, హార్ట్ ఎటాక్‌లూ అన్నీ దానివల్లే వస్తాయి. ఎందుకు నాన్నా....ఈ డబ్బు కోసం ఇంత వెంపర్లాట? ఎవరైనా కష్టపడేది తమ జానెడు పొట్టకోసమే. దానిలో పట్టేది ఎవరికైనా ఇంచుమించూ ఒకంతే! కోట్లున్నా అన్నమే తినాలి నాన్నా. రత్నాలూ, వజ్రాలూ తినలేము" అన్నాడు.

ఆయన కొడుకువైపు కోపంగా చూశాడు.

"నువ్వెలా పుట్టావురా నాకూ?" అని అరిచాడు.

"నాకూ అలాగే అనిపిస్తోంది" నిర్లిప్తంగా అన్నాడు సిద్దార్థ.

రాజారావు సిద్దార్థ దగ్గరకొచ్చి బతిమాలుతున్నట్లుగా అన్నాడు. "రేపు ఎంగేజ్‌మెంట్‌కి అన్ని ఏర్పాట్లూ అయిపోయాయిరా. ప్లీజ్ ఒప్పుకో!"

"డాడీ నాకు ఎంగేజ్‌మెంట్ ఒద్దు. ఐయామ్ ఎంగేజ్డ్!"

"వాట్?" ఆయన అదిరిపడి చూశాడు.

"ఏం మాట్లాడుతున్నావురా? మతిపోయిందా?"

"ఔను డాడీ! ఐయామ్ ఎంగేజ్డ్. అక్యుపైడ్! ఒక అమ్మాయిని ప్రేమించాను. ఆమెకి తప్ప నా జీవితంలో వేరొకరికి స్థానంలేదు. ఆమెని శృతకీర్తిగా పొరపడ్డాను. అందుకే విశ్వనాథం అంకుల్‌కి అప్పుడు అంగీకారం చెప్పమన్నాను. సారీ....ఇంతకన్నా ఏం చెప్పలేను. ఈ ఎంగేజ్‌మెంట్ చేసుకోలేను."

"సిద్దూ! సిరి రా, మోకాలు అడ్డడమంటే ఇదే! కోట్లతో వచ్చే లక్ష్మీదేవిని వద్దని ఏ దరిద్రురాలిని ప్రేమించావురా? దాన్ని షూట్ చేస్తాను. ఎదురుపడితే పీకనులిమి చంపేస్తాను" అని ఆవేశంగా అరిచాడు.

"ఆమెని ఏమైనా అంటే నేను సహించను డాడీ. ఇంట్లోంచి వెళ్ళిపోతాను" గట్టిగా అరిచాడు సిద్ధార్థ.

రాజారావు అతని దగ్గరదాకా వెళ్ళి "రేపు నీ ఎంగేజ్‌మెంట్ జరుగుతుంది. వెళ్ళి పడుకో....గుడ్‌నైట్!" అని గిరుక్కున తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"హూ!" సిద్ధూ మెడలోంచి టైతీసి గిరాటేస్తూ కోపంగా రూంలోకి నడిచాడు. రాజారావు చేతులు వెనక్కి పెట్టుకుని అతని వెనకాలే వచ్చాడు.

"రేపు ప్రొద్దుటే లేవాలి. త్వరగా పడుకో!" వెనకనుండి తండ్రి కంఠం వినిపించింది సిద్ధార్థకి.

సిద్ధార్థ జవాబు చెప్పడం ఇష్టం లేనట్లు మంచంమీద వాలాడు.

రాజారావు గది బయటకొచ్చి తలుపు వేశాడు. క్లిక్....మన్న చప్పుడు వినిపించింది.

"బాబుగారూ!" నౌకరు గొంతు ఆశ్చర్యంగా వినిపించింది.

"రేపు సాయంత్రందాకా అరిచి గీపెట్టినా తలుపు తీయొద్దు" అన్నాడు రాజారావు.

నౌకర్ ఆయన గదికి తాళం వేస్తుండడాన్ని ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

సిద్దూ చిన్నప్పుడు కూడా ఆ ఇంట్లో ఈ నౌకరే పనిచేస్తుండేవాడు. ఇలాగే అల్లరి చేసినప్పుడల్లా ఆయన పిల్లవాడ్ని గదిలో బంధించేవాడు. సిద్దూ మర్నాడు బయటకి రాగానే ఏదో ఒక విలువైన వస్తువుని బద్దలుకొట్టి తన ప్రతిఘటనని తెలియపరిచేవాడు. అలాగే పంతుపట్టు వయసుతోబాటు



పెరుగుతూ వచ్చింది.

రాజారావు అప్పటికి ఇప్పటికీ మారనేలేదు. కొడుకు కావాలన్నది తప్ప ఏమైనా ఇస్తానంటాడు. అంతకన్నా ఖరీదైనది కూడా! వారిద్దర్నీ కలిపి వుంచాల్సిన గొలుసులో నమ్మకం అనేచోట అతుకు వూడిపోయింది.

* * * *

వెయ్యి కన్నీటిధారల క్రింద కూడా 'నేమన్నాను' అనే ఓదార్పు గుండెని తేలికచేస్తుంది. అలాగే ఎంత కటిక చీకటైనా వేకువ పూసుకుని తిరిగి కాంతివంతమౌతుంది.

ఎప్పటిలాగే తెల్లగా తెల్లవారింది.

రాజారావు కాఫీ తాగుతుంటే భయంగా అడిగాడు నాయర్.

"బాబుగారూ....చిన్నబాబుకి కాఫీ ఇచ్చిరానా?"

రాజారావు గంభీరంగా వుండిపోయాడు.

"ఇది అన్యాయం బాబూ. బాబింకా చిన్నపిల్లాడు కాదు" అన్నాడు నాయర్.

"నో డ్యూటీ" విసుగ్గా కాఫీకప్పు ట్రేలో పెట్టేసి లేచి అటూఇటూ పచార్లు చేస్తూ ఆలోచించాడు రాజారావు. కాసేపటికి "పద....నేనూ వస్తాను" అని సిద్ధార్థ రూమ్‌వైపు నడిచాడు.

తాళంతీసి గదిలోకి అడుగుపెట్టి సిద్ధార్థ కోసం అటూ ఇటూ చూశాడు. బెడ్ అసలు కొంచెంకూడా నలిగినట్లు కనిపించలేదు.

"నాయర్! బాత్‌రూంలో చూడు" అన్నాడాయన.

నాయర్ వెళ్ళి చూసి "లేరు బాబూ!" అని వచ్చి రాజారావు దృష్టి పడ్డవైపు చూశాడు.

సిద్ధార్థ పడుకునే వైపున్న కిటికీ గ్లాసు పగలకొట్టి వుంది.

"హుం!" రాత్రే వెళ్ళిపోయినట్లున్నాడు" అన్నాడు రాజారావు.

'ప్రతిసారీ ఇలాగే ఏదో ఒక వస్తువు పగలకొట్టి పారిపోతాడు. ఈసారి నా గౌరవాన్ని' అనుకున్నాడు రాజారావు.

నాయర్ ఆయన దగ్గరకెళ్ళి పలుకరించే సాహసం లేనట్లుగా మౌనంగా నిలబడ్డాడు.

రాజారావు తల తిరిగిపోతోంది. శృతకీర్తి ఈ విషయాన్ని ఎలా

డైజెస్ట్ చేసుకుంటుందో అన్న ఊహే ఆయన్ని వణికిస్తోంది. పాతికేళ్ళ కొడుకు ఇంట్లోంచి పారిపోయాడని ఎలా చెప్పడం?

* * * *

"కీర్తీ....ఏవిటమ్మా అలా చిక్కిపోతున్నావు? నువ్వు తెలివైన దానివి తల్లీ! అలా రాత్రిళ్ళు మేలుకుని చదవక్కర్లేదు" సాంబమూర్తి కూతుర్ని గమనించి చూస్తూ ఆప్యాయంగా అన్నాడు.

"అంతా డ్రామా. అక్క అసలు చదవడమే లేదు నాన్నా" ప్రీతి అల్లరిగా నవ్వుతూ అంది.

"ఏవిటే పొద్దుటే దాన్ని ఆటపట్టిస్తున్నావు?" దువ్వెన తీసుకుని వచ్చి ప్రీతికి జడ విప్పుతూ అంది సుభద్ర.

"ఆటకి కాదు, నిజంగానే. కీర్తి చాలా నీరసంగా కనిపిస్తోంది. అసలు నీ పనే నీదితప్ప పిల్లని పట్టించుకుంటున్నావా సుభద్రా?" ఆయన భార్యని అడిగాడు.

"ఆడపిల్లలకి పెళ్ళి కుదిరేదాకా పెళ్ళి దిగులూ, పెళ్ళి కుదిరాక పుట్టింటి దిగులూ. రేపు పెళ్ళయ్యాక ఒక్కరోజు పుట్టింటికి వచ్చినా మొగుడిమీద దిగులూ మామూలేనండీ" నవ్వుతూ తేల్చేసింది సుభద్ర.

"సో! మొత్తానికి ఎప్పుడూ దిగులు మాత్రం తప్పదంటావు" అరిందలా అంది ప్రీతి.

"కీర్తీ....అలా మౌనంగా వున్నావేవిటమ్మా?" అడిగాడు తండ్రి.

కీర్తి ఏదో లోకాల్లో వున్నట్లుగా వుంది.

నెమ్మదిగా తలతిప్పి ఆయనవైపు బ్లాంక్‌గా చూసింది. ఆయన ఆమె దగ్గరగా వెళ్ళి నుదురుని తాకి చూస్తూ—

"ఒంట్లో బానేవుందా? ఏవైనా అనీజీగా వుంటే డాక్టర్ దగ్గరికి వెళదాం" అన్నాడు.

"ఒంట్లో బానేవుంది నాన్నా!" ఆమె లేస్తూ అంది.

"మనసులోనే బాలేదా?" ప్రీతి అడిగింది.

"నువ్వూరుకో! దానికి పరీక్షలొస్తే చిన్నప్పట్నుండీ అంతే.... తట్టుకోలేదు" అంది సుభద్ర.

సాధారణంగా ఇంట్లో ఆడవాళ్ళు అన్నింటికీ తమదగ్గర జవాబు



బున్నట్లు భావించి సర్దుకుపోతుంటారు. ప్రొద్దుట లేచిన దగ్గర్నుంచీ రాత్రి పడుకునేవరకూ కుటుంబంలో అందరి అవసరాలూ తీర్చే పనిలో వుండే వాళ్ళకి ఇలాంటివి పట్టించుకుంటే కుదరవు. అందుకే పట్టించుకోరు.

ఆకు కదిలితే....శీతాకాలపు చలిపల్లేమో అనుకుని చలించిపోయే భావుకత్వం— పట్టుపరికిణీల్లో, ఓణీల్లోనే వదిలేసి భర్త చిటికెనవేలు పట్టుకుని గృహిణులవుతారు. ప్రత్యూషాలూ.... శరదృతువులూ.... మంచు వానలూ....అలల నురుగులూ....గురించే ఆలోచించే సమయం లేకుండా అత్తారింట్లో చీపుళ్ళయి....ముంగిట్లో ముగ్గులై....వంటింట్లో తాళింపుమోతలై స్పందన కోల్పోతారు. అంతో ఇంతో మిగులూ తగులూ వుంటే పిల్లలు పుట్టి చీరలు తడిపి, చీపుళ్ళతో, బక్కెట్లతో పాకీపని చేయించీ, ఏడుపులూ, పేచీలతో ఆమె సున్నితత్వాన్ని పూర్తిగా హరించీ, కళ్ళు పెద్దవిచేసి, గొంతు చించుకుని అరిచే రాక్షసిలా తయారుచేసి కానీ వదలరు. ఆడపిల్లల తల్లులు ఇంకా నిస్తేజంగా.... సూర్యోదయం కన్యాకుమారిలో చూసినా ఆనందించకుండా. పెరుగుతున్న ధరల గురించో....అమ్మాయికి ఇవ్వాల్సిన కట్నం గురించో ఆలోచిస్తూ....హూ! ఇంకోరోజు మొదలయింది అని నిట్టూరుస్తారు.

తెల్లవారితే ఈరోజు చేయాల్సిన పని గురించీ, చీకటిపడితే మరునాడు చేయాల్సిన పనుల గురించీ ఆలోచిస్తూనే ఏళ్ళు గడిపేస్తుంటారు. మధ్యలో వచ్చే రోగాలూ, దుఃఖాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ కాస్త రొటీన్‌నుండి బయటపడేస్తుంటాయి మధ్యతరగతి ఇల్లాళ్ళని!

సాంబమూర్తి పిల్లలతో వున్న అటాచ్‌మెంట్‌వల్ల ఏ కొంచెం తేడా కనిపించినా ఇట్టే పసిగట్టేయగలడు. ఈ సునిశిత తత్వమే సాహిత్యంతో సంబంధం వున్న మనుషుల్ని, ఇతరుల్ని వేరుచేసి చూపిస్తుంది. మన భావాలేకాదు, ఎదుటివారి భావాల్ని కూడా పసిగట్టడమే సాహిత్యం!

కీర్తి గదిలోకి వెళ్ళిపోయాక ఆయన భార్యతో అన్నాడు.

"సుభద్రా,...కీర్తితో ఖాళీచేసుకుని కాసేపు మాట్లాడు. దాని మనసులో ఏమైనా వుందేమో కనుక్కో! నువ్వు గమనించలేదేమో కానీ.... అది నిన్నటినుంచి ఈవ్వాల్టివరకూ మనం అడిగితే తప్ప, తనంతట తను మాట్లాడనేలేదు" అన్నాడు.

"అలాగే!" ప్రీతి చెంపలు దువ్వి దువ్వెన తన తలలో దోపుతుంటూ అంది సుభద్ర.

"అలాగే అనేస్తే అక్కడితో మగాడు ఆ విషయం వదిలేస్తాడని మీ ఆడవాళ్ళ అభిప్రాయం. పిల్లల విషయం అంత లైట్‌గా తీసుకోకు. మధ్యాహ్నం వచ్చే 'అతుకుల బతుకులు' సీరియల్ చూడడం మానేస్తే ఏం కొంపలు ముంచుకుపోవు. ఆ టైంలో మాట్లాడు" అన్నాడు.

సుభద్ర చిరుకోపంగా చూసింది.

"అయ్యో....! మధ్యాహ్నాలు సీరియల్స్ చూసేపాటి తీరికా ఈ బతుక్కి! అరగంటసేపు నడుంవాల్చి ఎంతకాలమయిందో" అంది.

"అమ్మ అసలు చూడక్కరలేదు నాన్నా! చూసినాసరే పార్వతమ్మ అత్తయ్య మళ్ళీ అక్షరం అక్షరం చెపుతుంది. అదంతా వినాల్సిందే. లేకపోతే ఆవిడ అక్కడ పెళ్ళి పనులు చేయదు" నవ్వుతూ అంది ప్రీతి.

సాంబమూర్తి కూడా నవ్వాడు.

"ఆ టీవీలో కూడా వీళ్ళ తాలూకు గొడవలూ, ఏడుపులూ. అవీ వీళ్ళకి సంబంధించినవి వస్తేనే చూస్తారు. కాస్త నవ్వొచ్చేవీ, ఆహ్లాదమైనవీ వస్తే మనకోసం కాదనుకుని ఛానెల్ మార్చి కష్టాలకోసం వెతుక్కుంటారు" అని ఆఫీసుకి బయల్దేరాడు.

కీర్తి పుస్తకాలు సర్దుతూ ఆలోచిస్తోంది. తనకేదో అయిందన్న విషయం ఇంట్లో వాళ్ళకి తెలిసిపోతోంది. దాన్ని రోగం అనుకుంటున్నారు....అవును! మందులేని రోగం. ఒంటరిగా గంటలు గంటలు గడపాలనిపించే రోగం....మనసుకి హాయినిస్తూ శరీరాన్ని కాల్చేసే రోగం! అందుకే గాలిబ్ అన్నాడు 'జ్వాలయే దీపమునకు సర్వస్వమన్నట్లు... ప్రణయమే జీవితపు సర్వస్వమయ్యె' ఎందుకో దిగులు....ఏదో పోగొట్టుకుని నిస్సారంగా బతుకుతున్న భావన. గ్రీష్మంలో వర్షం కురిస్తే ఉష్ణం పెరిగినట్లు కన్నీరు ఎదని తడిపినప్పుడల్లా నన్నని మంట రేగుతోంది.

'నేనెంత పిచ్చిదాన్ని సిద్ధార్థా....నోటికి అందించిన సిద్ధాన్నాన్ని వద్దని పడదోసి, ఇప్పుడు ఉపవాసాలతో ఏడుస్తున్నాను. ఈ ఆకలి....అన్నంతో తీరుతుందా?'

కళ్ళు మూసుకుంటే....'కీర్తీ....నిన్నటిదాకా ఏం జరిగిందో మనకి



వద్దు. చెరిపెయ్....ఇకనుంచీ నువ్వు నా దానివి' అంటున్న అతని ముఖమే కనిపిస్తోంది.

కళ్ళు తెరిచి "సిద్దూ...." అని ఆ చెయ్యి పట్టుకోవాలని చూస్తే ఆ రూపం మసకేసిపోతోంది. నీ ఫోన్ నెంబర్, ఎడ్రస్, ఏవీ తెలుసుకోలేదు. చాలా నిగ్రహం కలదానని నాకు గర్వం. ఆ గర్వం ఇంత నరకాన్ని రుచి చూపిస్తుందని ఆనాడు అనుకోలేదు.

కీర్తి మంచంమీద వాలిపోయింది. బయట మబ్బులు దిగుళ్ళలా ఆకాశాన్ని ఆవరించాయి. అది వుండుండీ గుబులు గుబులుగా వురుముతోంది. దుఃఖాన్ని భరించలేక బయటికి వదిలిపెట్టినట్లు నెమ్మదిగా వర్షం ప్రారంభమయింది.

వర్షం....ఎంతో అందమయినది.

ఆనందంగా వుంటే మనసంతా చల్లబరిచి సేదతీరుస్తుంది. కానీ ఈ రోజు మాత్రం ఆ వర్షం తన హృదయంలో కురుస్తున్న కన్నీటి జాలులా వుంది. గుప్పిటలో ఇమిడే గుండెలో ఆకాశమంత విషాదాన్ని ఎలా దాచుకోనూ అనిపిస్తోంది. నావల్ల కాదు....నేను భరించలేను....భరించలేను....భరించాలి! భరించాల్సిందే! అనుకుంది.

* * * *

"భరించడం...సహించడం నా డిక్షనరీలోనేలేవు. ఇంత అవమానం ఎలా భరించమంటారు అంకుల్?" కోపంతో నిప్పులు కురిపిస్తున్నట్లు అడిగింది శృతి.

"ఏదో పెంకెతనం....వచ్చేస్తాడు వూర్కో" విశ్వనాథం ఆమెని చల్లబర్చాలని చూశాడు.

"ఏమనుకుంటున్నాడు ఆ సిద్ధార్థ? తనకన్నా అందగాడూ, అర్హత గలవాడూ నాకు దొరకడని ఎంచుకున్నాననుకుంటున్నాడా...ఇలాంటి వాళ్ళు నాకు కో అంటే కోటిమంది. మీరే....మీరే సిద్ధార్థ మంచి అబ్బాయి, తెలివయినవాడూ, నీకు భవిష్యత్తులో ఒక ఆడిటర్ తోడుగా వుంటే మనశ్శాంతిగా వుంటుందీ అంటూ నా ప్రాణాలు తోడారు. ఇప్పుడు నా ఫ్రెండ్స్ ముందు ఎలా తలెత్తుకోను? ఏం చెప్పుకోను? నన్ను చేసుకోవడం ఇష్టం లేక నా పెళ్ళికొడుకు ఇంట్లోంచి పారిపోయాడనా?" అటూ ఇటూ అవి

శ్రాంతంగా తిరుగుతూ అరుస్తోంది శృతి.

"శృతి!"

"నాకేం చెప్పొద్దు. అసలు నాకు పెళ్ళే వద్దు. నా ఆస్తంతా నా తదనంతరం అనాథాశ్రమాలకి రాసేస్తాను" అరిచింది.

"శృతి! అంతపని చెయ్యకమ్మా" అన్న కొత్త కంఠస్వరానికి ఆశ్చర్యంగా తలతిప్పి చూసింది.

రాజారావు చేతులు నులుపుకుంటూ ముందుకొచ్చాడు.

"నీకు ప్రత్యక్షంగా క్షమార్పణలు చెప్పుకుందామని వచ్చాను. ఆ పిల్లెవరో వాడికి మత్తుమందు పెట్టినట్లుందమ్మా....లేకపోతే నా మాట కాదనే ధైర్యం వాడికిలేదు." ఆయన ఇంకా చెపుతుండగానే శృతి కళ్ళు పెద్దవయ్యాయి.

"ఏమన్నారూ? పిల్లా? ఆమెవరు?" అంది.

ఆయన తల పట్టుకున్నాడు. "ఎవరో ఏవిటో ఏ వివరాలూ చెప్పలేదు- ప్రేమించాను....అంటున్నాడు. ఈ ప్రేమలు వాడికి వుండదానికి ఏ.సీ. బంగ్లాలూ, తిరగడానికి బెన్‌లూ, తినడానికి ఫైవ్‌స్టారు ఫుడ్సూ ఇవ్వవని తెలియగానే ఇంటికి వస్తాడు. ఎక్కడున్నా వాడిని తీసుకొచ్చే బాధ్యత నాదీ. అంతదాకా ఓపిక పట్టమ్మా" బతిమాలుతున్నట్లు అన్నాడు.

"ఓ! నన్ను కాదని ఎవరికో మనసిచ్చిన వాడిని నేను చేసుకోవాలా? ఎందుకూ?" నడుంమీద చేతులు పెట్టుకుని విలాసంగా అడిగింది శృతి.

ఏం జవాబివ్వాలో తెలీక తికమకపడ్డాడు రాజారావు.

"ఆల్‌రైట్! అతనికి ఆ అమ్మాయిలో నాకన్నా ఎక్స్‌ట్రా క్వాలిఫికేషన్స్ ఏం కనిపించాయో తెలుసుకోవాలని ఉత్సుకతగా వుంది. సిద్ధార్థ ఎక్కడికి వెళ్ళుంటాడో వూహించి చెప్పగలరా?" అడిగింది.

ఆమె కంఠంలో లీలలా వినిపించిన జీరకి విశ్వనాథం అదురుపాటుతో తల ఎత్తాడు.

వ్యాపారంలో ప్రత్యర్థులని దెబ్బతీసేటప్పుడు శృతకీర్తి గొంతులో వినిపించే జీర అది. పాము బుసలా....సన్నగా వినిపిస్తుంది.

"అసలు ఐడియా లేదు! కానీ రేపు సాయంత్రానికల్లా వచ్చేస్తాడు"



అన్నాడు రాజారావు.

"అదెలా!" ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

"నేను హాస్పిటలైజ్ అయినట్లు అన్ని వార్తా పత్రికల్లో ప్రకటనలిస్తాను. అది చూసుకుని వాడు వెంటనే వస్తాడు" అన్నాడాయన.

"సెంటిమెంట్స్‌కి అంత విలువిస్తాడా సిద్ధార్థ?" అడిగింది శృతి.

"ఇస్తాడు. నాకు లేనివీ, వాడికున్నవీ అవే!" అన్నాడు రాజారావు.

ఆమె సరే అన్నట్లు తల వూపింది.

ఓ గంట కూర్చుని సిద్దూది ఇంకా చిన్నతనం అనీ, వాడిని దారికి తెచ్చుకుంటే చాలా మంచివాడనీ, ఆమెకి కోపం తెప్పించినందుకు క్షమించమనీ....ఆమెని తప్ప వేరొక అమ్మాయిని కోడలిగా వూహించుకోలేననీ ఎన్నెన్నో చెప్పి ఆయన వెళ్ళిపోయాడు.

శృతి ఆయన వెళ్ళగానే విశ్వనాథం వైపు తిరిగింది.

"అంకుల్! సిద్దూ ఫోటో ఒకటి కావాలి. అతన్ని వెతకడం, తీసుకురావడం ఈ ముసలాయనవల్ల ఏం అవుతుందిలెండి" అంది.

విశ్వనాథం ఆశ్చర్యంగా "ఇంకా నీకు సిద్ధార్థని చేసుకోవాలనే ఆలోచన వుందా?" అని అడిగాడు.

"ఊ! నా ఈగో మీద కొట్టిన మగాడుకదా!" అని నవ్వింది.

ఆ నవ్వు చూస్తే, ఆయనకి స్వల్పంగా వెన్నులోంచి వణుకు పుట్టింది.

"పోనీ వదిలెయ్యకూడదూ! నీ కోసం చక్రవర్తి లాంటి వరుడ్ని తీసుకొస్తాను" అన్నాడు.

"ముందు ఈ సిద్ధార్థుడిని బుద్ధుడిగా మారకముందే ఇంటికి తీసుకురండి" అంది.

విశ్వనాథం అయిష్టంగానే ఆమెకి లోపలినుంచి తెచ్చి సిద్ధార్థ ఫోటో ఇచ్చాడు.

శృతి సిద్ధార్థ రూపాన్ని తదేకంగా చూసి, అతని గులాబీరంగు పెదవుల మీద వేలితో రాస్తూ అంది.

"స్మార్ట్ బోయ్! ఐ లైక్ హిమ్!"

విశ్వనాథం ఏదో చెప్పబోతే, చూపులతోనే అతన్ని వారించింది.

"నేను రెస్ట్ తీసుకోవాలి అంకుల్!" అంది.

ఆమె తన రూంలోకి వెళ్ళి బోల్ట్ బిగించుకుని, మంచంమీద వాలింది. ఇంద్రభవనం లాంటి ఇంట్లో హంసతూలికాతల్పం లాంటి మంచం మీద వాలి సిద్ధార్థ ఫోటోని చూసింది.

అతను మనోజ్ఞంగా నవ్వుతున్నాడు.

'ఎందుకిలా చేశావు? నేను కావాలనుకున్నందుకా? చెప్పు.... ఎందుకు? నాకన్నా ఎందులో ఎక్కువ నువ్వు ప్రేమించిన అమ్మాయి. హూ ఈజ్ దట్....బిచ్!' కసిగా అనుకుంది.

శృతకీర్తి దిండుని రెండు గుప్పెట్లతో కొడ్తూ వుండే ఆమె కళ్ళ ముందు తల్లీ, తండ్రిల శవాలు కనపడసాగాయి.

ఎందుకిలా?

చిన్నప్పటి నుంచీ నేనేం కోరుకున్నా ఆ భగవంతుడు దూరం చేస్తున్నాడు! ప్రతిసారీ ఓటమి లెక్క చెయ్యకుండా దావోప్ల. నవాబ్‌లా ఎదుర్కొంటూనే వుంది తను.

మళ్ళీ ఇన్నాళ్ళకి....పెళ్ళి వద్దన్న తను అంకుల్ మాట మీద సిద్ధూని చేసుకోడానికి ఒప్పుకుంది. తను ఇష్టపడేంతవరకూ ఓరిమి పట్టి ఒప్పుకోగానే తన పంజా విసిరింది విధి!

ఈ ఓటమిని కూడా భరించాలా?

నో....నో....నెవర్!

ఈసారి గెలుపు నీది కాకూడదు. కాదు....నాది!

సిద్ధార్థ ఫోటోని చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకుంది. 'నిన్నింత తేలిగ్గా వదలను, వేర్ ఆర్ యూ?' అనుకుంది.

* * * *

'లుటే కోయీ మన్‌కా నగర్ బన్‌కె మేరా సాథీ' మనసనే తన నగరాన్ని దోచిన ప్రియురాలి గురించిన పాట.

'కౌన్ హై ఓ....' లత స్వరంలోని తీయదనం తీగలుగా సాగి గాలిలో వ్యాపించి వస్తోంది. తెల్లవారుజామున ఆ పాట యింకా తీయగా అనిపించింది.

సిద్ధూ ఒక చిన్న రెస్టారెంట్‌లో కూర్చుని వున్నాడు. అతని



ముందు గాజు గ్లాసులో టీ తెచ్చిపెట్టాడు ఓ కుర్రాడు. దూరంగా అద్దాల అలమరలో సమోసాలు లాంటివి కనిపిస్తున్నాయి. నల్లగా మాసిన బనీన్, నిక్కర్ వేసుకున్న కుర్రాడొకడు అంతకన్నా మాసివున్న బట్టతో ఈగల్ని తోలుతున్నాడు. మహారాష్ట్రలోని చిన్న పల్లెటూరది.

టీ గ్లాసు పెదవులకి చేర్చుకుంటూ చిన్నగా నవ్వుకున్నాడు సిద్ధార్థ. బట్టలు మార్చుకుని ఇరవై నాలుగు గంటలు గడిచాయి.

జేబులో సెల్‌ఫోన్ లేదు.

ఎక్కి తిరగడానికి జెన్ లేదు.

పర్సులో క్రెడిట్ కార్డూ, కొంత డబ్బూ మాత్రం వున్నాయి.

ఇలాంటి స్థితి వస్తుందని ఎన్నడైనా అనుకున్నాడా?

ప్రేమ పుట్టినరోజు పండుగ జరుపుకున్న ఇరవై నాలుగు గంటల్లోనే తనని రోడ్డున పడేసింది. లక్షాధికారులని భిక్షాధికారులుగా, భిక్షాధికారిని లక్షాధికారిగా ఫీలయ్యేట్లు చేస్తుంది ఈ ప్రేమ!

బయట వర్షం కురుస్తోంది. లోపలికి వస్తున్న జనం తడిసిపోయి వుండడంతో, అదో మాదిరిగా వాసన వేస్తోంది. కొంతమంది గొడుగులు మడిచి తలుపు పక్కగా పెట్టడంతో, అక్కడ నీళ్ళు చిన్న కాలువగా ఏర్పడి పారుతున్నాయి. సిద్ధార్థ కళ్ళు మూసుకున్నాడు. తన ఏ.సీ. రూమ్, రూమ్ స్ప్రియర్, నాయర్ బలవంతంచేసి తినిపించే రుచికరమైన భోజనం గురించి అతను ఆలోచించడంలేదు.

కీర్తి గురించి ఆలోచిస్తున్నాడు. ఆమె రోజూ తన కాలితో స్పృశించే ఆమె ఇంటి గుమ్మం అదృష్టానికి అసూయపడుతున్నాడు. 'ముదిత కాలి గురుతులు ముద్దు పెట్టుకోవడం కోసం ఆ ఇంటి వాకిలి ముందు స్పృహతప్పి పడిపోయినట్లు నటించాను' అన్నాడు ఓ మహాకవి.

అతి ప్రాచీనమైన విషయం ప్రేమ. అతి సహజమైనది కూడా....

కానీ ఎన్ని సహస్రాబ్దులు గడిచినా ఇంకా ఆంక్షలుపెట్టే వాళ్ళూ, ఆటంకపరిచేవాళ్ళూ వుంటూనే వున్నారు. నాకిష్టమైన డ్రెస్ కొనుక్కుంటానంటే ఎవరూ ఏమీ అనరు. నాకిష్టమైన విధంగా ఇల్లు కట్టుకుంటానంటే ఏమీ పట్టించుకోరు. నాకిష్టమైన అమ్మాయితో ఆ ఇంట్లో జీవితం గడుపుతానంటే....ఒక్కసారిగా ఆ అమ్మాయి ఎవరూ? స్థితిగతు

లేమిటీ? సంప్రదాయం ఏమిటీ? ఎంత లాభం వస్తుందీ? లాంటి ప్రశ్నలు మొదలవుతాయి.

అదే ఇల్లు కొనుక్కుంటానంటే ఏ చెక్కతో గుమ్మాలు చేశారు! ఏ సిమెంట్‌తో కట్టారూ? అని విసిగించరు. ప్రాణమున్న మనిషనేటప్పటికి ఈ ప్రశ్నలన్నీ జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తాయి.

అతనికి ఆపుకోలేనంత ఉద్రేకం కలుగుతోంది. బతికే నాలుగు రోజులూ నా ఇష్టం వచ్చిన అమ్మాయిని చేసుకుని నా ఇష్టం వచ్చినట్లు బతికే ఫండమెంటల్ రైట్ నాకు లేదా? అని అరవాలనిపిస్తోంది.

కానీ, ఆ ఆలోచన కీర్తి బ్రేక్ చేస్తోంది. తన ప్రేమకి అంక్షలు పెడుతున్నది తన తండ్రో, ఆమె తండ్రో అయితే తను డీల్ చెయ్యగలడు. కానీ తన విషయంలో తన ప్రేమకి ఆంక్షలు పెడుతున్నది తన ప్రాణప్రదమైన కీర్తి. ఆమెని కాదనే బలం, ఎదిరించే శక్తి తనకు లేవు.

సిద్ధార్థ పెదవుల మీదికి మళ్ళీ చిరునవ్వు వచ్చింది. ప్రేమ అనే కనపడని సంకెలతో నా చేతులు రెండూ ఎంత లాఘవంగా బంధించావు! నేనేం చెయ్యలేని ప్రియ శత్రువయ్యావు. నిన్ను గుర్తుచేసుకోడానికీ, ఆ మధురస్మృతుల్లో కాసేపు వర్తమానాన్ని మరిచిపోడానికి కూడా నా దగ్గర నీ జ్ఞాపకాలేం వదిలిపెట్టలేదు. నీకు సంబంధించిన ఏదైనా ఒక విషయాన్ని నాకు ఇవ్వలేకపోయావా కీర్తీ!

ఇంతలో గట్టిగా వినిపించిన మాటలకి తల తిప్పాడు.

"అరే....చేంజ్ నయ్యే సార్....బిల్‌కుల్....సౌ కా నోట్ హై లేలో!" అంటున్నాడు కౌంటర్ దగ్గర ఓ అబ్బాయి.

"సుభే సుబే అపున్ కా పాన్ కైసా రహేగా సాబ్....ఏక్ చాయ్ కెలియే....సౌకా నోట్! హూ" విసుక్కున్నాడు హోటల్ ఓనర్.

దిల్లరలేని అబ్బాయి ఇబ్బందిగా వంద నోటు పట్టుకుని చుట్టూ చూస్తున్నాడు.

సిద్ధార్థ అతని పరిస్థితి గమనించి లేచి దగ్గరకెళ్ళాడు.

"దోనోంకా పైసాలేలో!" పది నోటు యిస్తూ ఆ అబ్బాయిని చూపించి హోటల్ యజమానితో చెప్పాడు.

ఆ అబ్బాయి కృతజ్ఞతగా చూశాడు.



హోటల్లో డబ్బులు చెల్లించాక ఇద్దరూ బయటికి నడుస్తుండగా అతను అన్నాడు. "థాంక్యూ వెరీమచ్ సార్....కహా జానా హై?"

సిద్ధార్థ దగ్గర జవాబులేని ప్రశ్న. ఎదురుగా రాయిమీద నాగపూర్ ఎనభై కిలోమీటర్లు అని రాసి వుండటాన్ని చూసి చెప్పాడు "నాగ్‌పూర్."

ఆ యువకుడి మొహంలో ఆనందం కనిపించింది. "ఆప్ హమారా కంపెనీ గాడీ మే ఆసక్తేసర్....హమ్ లోగ్ భీ ఉదర్ కా హై!"

"థాంక్యూ....థాంక్యూ...." అని అతన్ని అనుసరించాడు సిద్ధూ.

జీప్‌లో ఇంకో ఇద్దరున్నారు. వీళ్ళని చూడగానే తాగుతున్న బీడీలు కింద పారేశారు.

"ఆయియే...." అ అబ్బాయి జీప్‌వైపు నడుస్తూ అన్నాడు.

సిద్ధూ ఎక్కబోతూవుంటే తలకి టాప్ కొట్టుకుంది. "అమ్మా...." అన్నాడు చేత్తో తల పట్టుకుని.

అతను కంగారుగా చెయ్యి అందించాడు.

"ఫర్లేదు. ఇట్స్ ఓ.కె." సిద్ధూ చిన్నగా నవ్వి ఎక్కి కూర్చున్నాడు. శీతాకాలం చలి వణికిస్తోంది. డ్రైవర్ స్టార్టు చేశాడు. డ్రైవర్ పక్కనే కూర్చున్న ఆ అబ్బాయి నవ్వుతూ అడిగాడు "మీరు....తెలుగు వాళ్ళా?"

సిద్ధార్థ ఆశ్చర్యంగా తలతిప్పి చూశాడు. ఎన్నో గంటల తర్వాత వినిపించిన ఆప్యాయమైన తెలుగు పరామర్శ. మనసుకి వెన్నపూసినంత మృదువుగా అనిపించింది.

"ఔను....మీరు కూడానా?"

తలవూపి, "మీ పేరూ?" అడిగాడు ఆ అబ్బాయి.

"సిద్ధార్థ."

"నా పేరు ఉదయ్. ఇక్కడ ఎమ్.సి.ఐ. అనే ఆర్గనైజేషన్‌లో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను."

సిద్ధార్థకి ఆ యువకుడ్ని చూడగానే ఎందుకో సదభిప్రాయం కలిగింది. తన చేతిని అతని వైపుకి చాపాడు. సిద్ధార్థకి సిక్త్‌సెన్స్ ఏదో చెపుతున్నట్లుగా తోచింది ఆ క్షణం. ఉదయ్ సిద్ధార్థ చేతిని అందుకుని నొక్కుతూ చెప్పాడు "నైస్ మీటింగ్ యూ సర్....మీరేం చేస్తుం

టారూ?"

• • • •

ఏదో జరగబోతోందని వూహించిన సిద్ధార్థ "ఉదయ్" అని అతన్ని అప్రమత్తం చేయబోయి, అంత టైం లేక తనతో బాటు అతన్ని కూడా బలంగా లాగుతూ "జంప్" అని అరిచి దూకేశాడు.

ఉదయ్ ముందుకు చూసి పెద్దగా అరుస్తూ వుండగానే అతన్ని సిద్ధార్థ బయటికి లాగేశాడు.

ఇద్దరూ తుప్పల్లో స్లోప్‌గా వుండడంతో చాలాదూరం దొర్లుకుంటూ వెళ్ళిపోయారు. ఒళ్ళంతా రక్తాలు కారసాగాయి.

సిద్ధార్థ లేచి జీప్‌వైపు చూశాడు. అదుపుతప్పి అడ్డంగా వచ్చిన టాంకర్ జీప్‌ని కొట్టేసింది. అక్కడ పెద్దగా రేగిన మంటలు తప్ప ఏం జరిగిందీ తెలియడంలేదు, డ్రైవర్‌తోపాటు ఆ ఇద్దరూ కూడా అగ్నికి ఆహుతై పోయి వుంటారని అనిపించగానే సిద్ధార్థకి భయం, బాధ, జాలి, దుఃఖం ఏకకాలంలో కలిగాయి. ఆ షాక్‌నుండి తేరుకునేసరికి అతనికి కొంత టైం పట్టింది. అప్పుడు ఉదయ్ జ్ఞాపకం వచ్చి చుట్టూ చూశాడు. దూరంగా తెల్లగా అతని షర్టు కనిపించింది. అటు పరుగెత్తాడు.

ఉదయ్ స్పృహలో లేడు. తలలోంచి బాగా రక్తస్రావం అయి నల్లగా గడ్డకడుతోంది. పరిస్థితి ప్రమాదకరంగా మారుతోందని తెలిసిన సిద్ధార్థ ఆలస్యం చెయ్యలేదు. అతన్ని భుజాన వేసుకుని నడపడానికి ప్రయత్నించాడు. దారికి ముళ్ళమొక్కలు అడ్డువస్తున్నాయి. నిలువెల్లా గాయాలయి రక్తం కారుతుండటంవల్ల అడుగుతీసి అడుగు వెయ్యడం కష్టంగా వుంది. కళ్ళు చీకట్లుపుతున్నాయి. గొంతంతా పిడచకట్టుకుపోయి 'దాహం' అని అరిచినా ఫలితం వుండదని తెలుసు.

'హెల్ప్....హెల్ప్' అని అరవడానికి శతవిధాలా ప్రయత్నిస్తూ అడుగులు వేస్తున్నాడు.

ఒక్క మనిషి తనని పట్టించుకున్నా ఏదైనా వైద్యసహాయం ఉదయ్‌కి అందించవచ్చు అన్న ఆలోచన తప్ప ఆ నిమిషంలో అతని మెదడులో ఇంకో ఆలోచన లేదు.

అతి సుకుమారంగా పెరిగిన అతను నిలువెల్లా గాయాలతో ఇంకో



మనిషి బరువుని మోస్తూ ఆ ముళ్ళదారిలో పయనించడం అంత సులువుగా లేదు. పళ్ళు బిగపట్టి తనకి శక్తినిమ్మని డివైన్ పవర్‌ని వేడుకుంటూ అతను ముందుకు కదులుతున్నాడు.

ఉదయ్‌లో కదలికలేదు. అతని పరిస్థితి అంతకంతకూ క్షీణిస్తోంది.

చీకట్లు తొలగి అక్కడక్కడా వెలుతురు విచ్చుకుంటోంది.

'ఇతనెవరో నాకు తెలీదు. నా చేతుల్లో పోకుండా ఇతన్ని కాపాడు భగవాన్!' అనుకున్నాడు సిద్ధార్థ.

• • • •

కీర్తి ఉలిక్కిపడి లేచి కూర్చుంది. గుండె అంతా పట్టేసినట్లుగా వుంది. మంచినీళ్ళు తాగుదామని లేస్తుంటే కాలి మువ్వలు సవ్వడి చేశాయి.

ఆ శబ్దానికి కళ్ళు తెరిచిన సుభద్ర- "ఏమిటమ్మా, ఏం కావాలి?" అంది.

కీర్తి భయంగా తల్లిని చుట్టుకుపోయి. "అమ్మా....నాకు పీడకలొచ్చింది. చుట్టూ మంటలు, అందులో నాకు కావాల్సిన వాళ్ళెవరో వున్నారట. అంతా ఏడుపులు, పెడబొబ్బలు. భయం వేస్తోందమ్మా. చాలా భయం వేస్తోంది" అంటూ తల్లి భుజంమీద ముఖం ఆన్చి ఏడ్చేసింది.

"ఉదయ్ గురించి ఏమైనా పీడకలొచ్చిందా?" కూతురి వీపు నిమురుతూ అనునయంగా అడిగింది సుభద్ర.

కీర్తికి ఆ దృశ్యం భయానకంగా గుర్తొస్తోంది. కానీ ఆ ప్రమాదంలో చిక్కుకుని 'కీర్తీ....కీర్తీ....' అని అరిచిన రూపం ఎవరిదో తెలియడం లేదు.

"తెలీదమ్మా! ఎవరో నన్ను పేరుపెట్టి పెద్దగా కేకలు వేశారు" అంది.

"పీడకలలొస్తే వారిమీదున్న పీడ తొలగిపోతుందట. నువ్వు నిశ్చింతగా పడుకో. మంచినీళ్ళు ఇస్తాను" అంటూ సుభద్ర మంచినీళ్ళు తీసుకురావడానికి లేచి వెళ్ళింది.

కీర్తికి మొదటిసారిగా 'సిద్ధార్థ ఎక్కడుంటాడో తెలిస్తే ఎంత బావుండూ! అతనికి ఏమీ కాలేదన్న వార్త తెలుసుకునేదాన్ని' అనిపించింది.

సుభద్ర మంచినీళ్ళు అందించి "ఆంజనేయ దండకం చదువుకుంటూ పడుకో. భయం వెయ్యదు" అంది.

కీర్తి తల వూపి వెళ్ళి మంచం మీద పడుకుంది.

ఆమెకి ఆ రాత్రి త్వరగా తెల్లారిపోతే బావుండు అనిపిస్తోంది. ఎక్కడో బెకబెకలాడుతోన్న కప్పలన్నీ ఒక్కసారిగా మౌనం వహించాయి ఎంతో భయంకరంగా వుంది ఆ నిశ్శబ్దం.

ఆమె కళ్ళు తెరుచుకుని ఎదురుచూడసాగింది వెలుగుకోసం. లోకాన్ని నింపే వెలుగు కోసం. కళ్ళని ముద్దాడే వెలుగు కోసం. నేనున్నానని ధైర్యంగా చెప్పే వెలుగుకోసం. హృదయాన్ని ప్రేమమాధుర్యంలో ముంచే వెలుగు కోసం!

* * * *

కీర్తి వెళ్ళేసరికి మైత్రి ఇల్లంతా హడావిడిగా వుంది. మైత్రిని చూసుకెళ్ళిన పెళ్ళికొడుక్కి అది నచ్చిందట. పరీక్షలవగానే ముహూర్తాలు పెట్టుకుందాం అన్నారట. వాళ్ళింట్లో ఒకటే సంబరం.

ఆడపిల్లని వదిలించుకోవడం ఇంత ఆనందకరమైన విషయమా! అనిపించింది కీర్తికి.

మైత్రి కూడా ఆనందంగానే కనిపించింది. ఒంటికి పట్టినట్టున్న టీ షర్టూ, జీన్స్ వేసుకుని ఉల్లాసంగా కనిపించింది. ఒక ప్లేట్లో జాంగ్రీ, కలాకండ్ తెచ్చి కీర్తి ఎదురుగా పెట్టి తీసుకోవే" అంది.

కీర్తికి ఏం మాట్లాడాలో అర్థంకానట్లు మైత్రివైపు చూస్తూ కూర్చుంది. కిటికీ వూచలమీద పకపక నవ్వుతూ ఎగురుతున్నాయి పిచ్చుకలు.... స్వేచ్ఛగా....అమాయకంగా....ఆకుపచ్చ నీడల్లో....ఎండ చారల్లో ఎగిరే వాటిని చూస్తుంటే అలా ఆనందంగా వుండక....ఈ గుండె బరువెక్కించే భావాల్ని ఎందుకు నేర్చుకున్నారో మానవులు అనిపిస్తుంది!

మైత్రి కీర్తి కళ్ళల్లో భావాలు పట్టేసినట్లుగా అంది. "పద, బయటకెళ్ళి మాట్లాడుకుందాం.

ఇద్దరూ గమ్యం లేకుండా నడవసాగారు.

కీర్తి ఏమైనా చెపుతుందేమోనని చాలాసేపు చూసిన తర్వాత అంది మైత్రి. "ఎంత విచిత్రమో చూడు! హాయిగా పెళ్ళి నిశ్చయం అయింది.



చీకూ చింతా లేకుండా పెళ్ళి చేసుకుని కాపురం చేస్తావు. నేనేమో ఎవరినో ప్రేమించి మల్లీశ్వరిలో భానుమతిగానో....మరో చరిత్రలో సరిత లాగానో బాధ పడుతుంటాను అని వూహించుకునేదాన్ని. అంతా తారుమారు అయింది. పెళ్ళిచూపుల్లో మోహనకృష్ణని చూడగానే నా మనసు అతని వశం అయింది. నేను ఎదురుచూస్తున్నది అతని కోసమే అనిపించింది. అతను మళ్ళీ రెండవసారి నాతో మాట్లాడాలని వచ్చినప్పుడు బయటికి వెళ్ళాం. తిరిగి వచ్చేలోగా అతనితో ఘాటుగా ప్రేమలో పడిపోయాను. ఈ వారంలో రోజుకి మూడుసార్లు ఫోన్‌కాల్స్....రెండు ప్రేమలేఖలు....నాకు ఇష్టమైన క్యాసెట్లు గిఫ్ట్సగా పంపడం....ఇన్ని జరిగిపోయాయి. తర్వాత పెళ్ళిచేసుకోకుండా ఈ కాలం ఇలా పొడిగించబడితే బావుణ్ను అనిపిస్తోందే...." తన ధోరణిలో చెప్పుకుపోయింది మైత్రి.

కీర్తి హఠాత్తుగా ఆగి అడిగింది. "ప్రేమిస్తే అంత బావుంటుందా?"

మైత్రి సంతోషంగా చెప్పింది. "అతని ప్రతి పలుకూ ప్రేమ తంత్రుల్ని మీటుతున్నట్లూ విశ్వం తెరుచుకుని గాలి రివ్వున పరుగు తీస్తున్నట్లూ....భూమి పైన నవ్వు గంతులేస్తున్నట్లూ....ఆకాశంలో ఆనందం గొడుగు విప్పుతున్నట్లూ వుంటుంది."

కీర్తి కళ్ళనిండా నీళ్ళతో "నాకు అలాలేదే!" అంది.

మైత్రి పక్కనే వున్న బండరాయిమీద కూర్చుని కీర్తిని కూడా కూర్చోమని సైగచేసి అంది. "నిజానికి నీకు నాకన్నా అద్భుతంగా వుండాలి. ఎందుకంటే నువ్వు నాకన్నా ఎక్కువగా ప్రేమించబడుతున్నావు. ఎటువంటి హద్దులూ, ఎల్లలూ లేకుండా పెద్దవాళ్ళ ఆమోదాలూ....ప్రయోజనాలూ అనే చట్రంలో బంధింపబడని ప్రేమని నువ్వు పొందుతున్నావు. కీర్తీ....ఒక మనిషిని ప్రేమిస్తే ఎంత ఆనందంగా వుంటుందో చూడు. అనుక్షణం అతని గురించే తప్ప మన గురించి ఆలోచించే వ్యవధిలేదు" అంది.

"నాకు సిద్ధార్థని చూడాలని వుంది!" కళ్ళు తుడుచుకుంటూ అంది. కీర్తి.

మైత్రి నవ్వింది.

"ఇంకెప్పుడూ జీవితంలో కారసపడొద్దు అని అడిగిన నేను ఇప్ డెలా చూడాలనుకుంటున్నానా అని ఆశ్చర్యపోతున్నావా? నాకు కావాల్సింద అతన్ని నేను చూడడం. అతను నన్ను చూడడంకాదు. మైత్రీ! అత ఎక్కడుంటాడో తెలుసుకోవాలి.... ప్లీజ్....! లేకపోతే నేను బ్రతకలేన చచ్చిపోతాను" హృదయం పూడి వడిపోయినట్లుగా మాట్లాడింది కీర్తి.

మైత్రి ఒక్కక్షణం ఆలోచించింది.

"అతన్ని మనం వెతకలేమంటావా?" భయంగా అడిగింది కీ

మైత్రి నవ్వింది. "ప్రేమ....ప్రేమ....ప్రేమ...." అంది.

నేనేం అడిగానూ నువ్వేం చెపుతున్నావు?" భరించలేనట్లు అ గింది కీర్తి.

"నువ్వు ప్రేమ అనే మంత్రాన్ని జపిస్తూ వుండు. నేను అత చిరునామాని సాధించుకు వస్తాను" అంది నవ్వుతూ మైత్రి.

"ఎలా?" ఆశ్చర్యంగా అడిగింది కీర్తి.

మైత్రి తన చేతిలో ఒక నంబర్ రాసి చూపించింది. "ఇది అత గారి కారు నంబర్. దీనితో ఎడ్రెస్ సాధిస్తాను. కొంచెం టైం ఇయ్ అంది.

"ఎలా?" ఆతృతగా అడిగింది కీర్తి.

"ఊ! ఈ నంబర్ కారులో అబ్బాయి మా ఫ్రెండ్‌ని మోసం అతి విలువైన దానినొకటి దోచుకపోయాడని, మా కమీషనర్ అం దగ్గరికి వెళ్ళి కంప్లయింట్ ఇస్తాను. దాంతో అబ్బాయిని సాయంత్రాని పట్టుకుని సెల్‌లో వడేసి థర్డ్ డిగ్రీ ట్రీట్‌మెంట్ ఇస్తారు!" అల్ల అంది.

"ఒద్దు....అలా చెయ్యొద్దు!" కంగారుగా అంది.

"పోలీస్‌ల థర్డ్‌డిగ్రీ ట్రీట్‌మెంట్‌కంటే తక్కువ బాధేం లేదులే తల్లీ నువ్వు! అవతల నీ ఎడ్రెస్ తెలీక తనెంత బాధపడుతున్న పావం" అంది మైత్రి.

కీర్తి విచారవదనంలో కాస్త వెలుగొచ్చింది.

"తెలుసుకోగలవా మైత్రీ?" అని ఆశగా అడిగింది.



"తెలుసుకోలేకపోతే నా పేరు మార్చుకుంటానే!" చెప్పింది కీర్తి చేతిలో చెయ్యివేస్తూ మైత్రి.

* * * *

రాజారావు సాయంత్రం ఆఫీసునుండి వస్తూనే నాయర్‌ని అడిగాడు "బాబు ఫోన్ ఏమైనా చేసాడా?" అని.

నాయర్ దిగులుగా అన్నాడు. "రెండు రోజులయిపోయింది. మీరు పేపర్లో ప్రకటన ఇస్తూనే వున్నారు. అయినా సిద్ధూబాబు రాలేదు. నాకెందుకో భయంగా వుంది బాబూ!"

రాజారావుకి కూడా భయంగానే వుంది. తన పరిస్థితి ప్రమాదంగా వుందనీ, హాస్పిటల్లో వున్నాడనీ వెంటనే ఇంటికి రావలసిందిగా సిద్ధార్థ కోసం పేపర్లో ప్రకటన ఇప్పించాడు. రాకపోయినా, కనీసం ఫోన్ అయినా చేసి విషయం కనుక్కుంటాడని అనుకున్నాడు. కానీ సిద్ధూకేమయినా అయిందేమోనని భయం వేసింది రాజారావుకి.

"కాఫీ తాగుతారా బాబూ!" అంటున్న నాయర్ మాటలు వినిపించుకోకుండా మేడమెట్లు ఎక్కసాగాడు.

ఫోన్ మోగింది.

రాజారావు ఆశగా క్రిందికి దిగి రాబోయేలోగానే నాయర్ తీసాడు.

"హలో! ఎవరు కావాలమ్మా. సిద్ధార్థ బాబు లేరమ్మా. తమరి పేరూ...." అనేలోగానే అవతలవాళ్ళు పెట్టేసినట్లున్నారు. "ఎదవ సంత– పొద్దుటినుంచీ యిదో తంటా అయిపోయింది" అన్నాడు ఫోన్ క్రెడిల్ చేస్తూ.

రాజారావు నిరాసక్తంగా అడిగాడు. "ఎవరూ?"

"ఎవరో బాబూ! చిన్నబాబు కావాలని పేరు చెపుతున్నారు. నేను వాళ్ళ పేరు అడిగేసరికి చెప్పకుండా పెట్టేస్తోంది...." అని లోపలికెళ్ళిపోయాడు.

రాజారావు భృకుటి ముడిపడింది. సీరియస్‌గా ఆలోచించాడు. ఏదో అనుమానం మనసులో మెదిలి "నాయర్....నాయర్...." అని పిలిచాడు.

నాయర్ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"అమ్మాయి గొంతా?" అడిగాడు ఆతృతగా.

"ఔను బాబూ!"

రాజారావుకి సిద్ధార్థ ప్రేమించిన అమ్మాయే అయ్యుంటుందని ఖచ్చితంగా అనిపించింది. తనని చూడకుండా వుండగలదేమోకానీ ఆ అమ్మాయిని చూడకుండా వుండలేడని అనిపించింది. ప్రేమ పిచ్చి తలకెక్కినవాడు ఆ మత్తుకి దూరంగా ఇనుప గొలుసులతో బంధించినా తెంచుకొని పారిపోతాడు.

"ఈసారి ఫోన్‌చేస్తే నా సెల్ నెంబర్ సిద్ధార్థ నెంబరని చెప్పి[illegible] నే మాట్లాడుతా!" అన్నాడు.

"అలాగే బాబూ!" అన్నాడు నాయర్.

రాజారావు సిద్ధార్థ గదిలోకి నడిచాడు.

ఎంతో నీట్‌గా, ఆర్గనైజ్‌డ్‌గా వుంది కొడుకు గది. ఆయన అత వార్డ్‌రోబ్ తెరిచి బట్టలన్నీ క్రిందపడేస్తూ డైరీ లాంటిదేదైనా దొరుకుతుందేమో అని వెతకసాగాడు. చివరి అరలో చిన్న డైరీ కనిపించింది. గబగబా పేజీలు తిప్పాడు. అన్నీ ఆయనకి తెలిసున్న ఫ్యామిలీ ఫ్రెండ్స్, క్లయింట్స్ తాలూకు నంబర్లే రాసున్నాయి.

కీర్తి అని రాసున్నచోట కమలానెహ్రూ కాలేజ్ అని మాత్ర రాసుకున్నాడు.

ఆయన ఆలోచనగా తల పంకించాడు.

* * * *

"కీర్తీ! అత్తయ్యావాళ్ళు వచ్చారు, బయటికి రా!" సుభద్ర గదిలో వచ్చి పిలిచ్చింది.

కీర్తికి అస్సలు వెళ్ళాలనిలేదు. అలాగే పడుకుని మైత్రి కో ఎదురుచూడాలని వుంది. మైత్రి అతని ఫోన్ నెంబర్ తెలుసుకుని వస్తా వెళ్ళింది.

మైత్రి నంబర్ ఎప్పుడు తెస్తుందా, అతని గొంతు ఎప్పు వింటానా అన్నట్లు వుందామెకు.

శకుంతల గొంతు హాల్లో ఖంగున మోగుతోంది. "కీర్తి అత్తయ్యా? రమ్మనూ....అత్తగారూ వాళ్ళూ వచ్చారని చెప్పు."

ఇంక వెళ్ళక తప్పదని లేచి బయటికి నడిచింది.



వరలక్ష్మి మేనకోడల్ని చూస్తూనే "ఏమిటమ్మా ఇది? నా కోడల్ని ఇలా తయారుచేశావు? మొన్న శకుంతల ఇంట్లో వ్రతంనాడు విశేషంలా వుంది కదా!" అంది.

"బాగానే వున్నానత్తయ్యా! జడ వేసుకోకుండా బద్ధకించి పడుకున్నానంతే!" అంది ఆవిడ పక్కన కూర్చుంటూ కీర్తి.

శకుంతల కీర్తి జడ పట్టుకుని చూస్తూ "జుట్టు కూడా బాగా వూడిపోయినట్టుందే? ఇదంతా పెళ్ళి బెంగే!" అంది దీర్ఘంతీస్తూ.

"పెళ్ళయి మన అందరికీ దూరంగా వెళ్ళిపోవాలన్న బెంగ" సుభద్ర సరిదిద్దింది.

"ఏమైనా మా తమ్ముడికి ఇంకా మూడు నెలలు ఆ మెస్ తిండి తప్పదు. కీర్తీ....మీ అమ్మ దగ్గర అరటి పూచకూర వండడం నేర్చుకో! వాడికి చాలా ఇష్టం" అంది శకుంతల.

వరలక్ష్మి నవ్వుతూ "కుట్లూ, అల్లికలూ నేర్చుకోవే. ఇల్లు సవరించుకోడానికి పనికొస్తాయి! మా కాలంలోనే నయం, సంగీతం, వంటా, చేతి పనులూ వయసు రాగానే నేర్పేవారు" అంది.

కీర్తికి మనసులో తిప్పినట్లనిపించింది. 'నాకేం ఇష్టమో....ఎలా వుండాలనుకుంటున్నానో మీరు నన్ను అడిగారా? కనీసం మీ అబ్బాయి ఎప్పుడైనా అవి తెలుసుకోవాలనుకున్నాడా? సంగీతం మాష్టారి ఇల్లు దూరం కాబట్టి వచ్చేసరికి చీకటి పడుతుందని మాన్పించేశారు. కవితలు రాస్తుంటే అవి కడుపులు నింపుతాయా? అని చప్పరించి ఉత్సాహంమీద నీళ్ళు జల్లేశారు. నా ఒళ్ళూ, జడ, మూడ్స్ అన్నీ మీ ఇష్టప్రకారం వుండా అనుకుంటున్నారు. అసలు ఆడపిల్లకి ఓ హృదయం వుంటుందని మీరు గుర్తించరా? ఎప్పుడూ నన్ను మీ కొడుక్కీ, మీకూ వుపకరించే ఓ వస్తువులాగానే ఎందుకు చూస్తారూ? నాకూ ఇష్టాలున్నాయి. అస్సలిలా మీ ముందు కూర్చుని, మీ మాటలు వినాలని లేదు. అయినా లేచి వెళ్ళిపోలేను. వెళితే లక్ష అర్థాలు తీస్తారు. మా అమ్మానాన్నా మీకు సర్దిచెప్పలేక నానా అవస్థ పడతారు. అందుకని ఇవన్నీ భరిస్తున్నాను' అని అరవాలనిపించింది.

ఇంతలో పక్కింటి పార్వతమ్మ వచ్చింది. ఆవిడ రాగానే చర్చ టీవీ సీరియల్స్ మీదకి మళ్ళింది.

"అతుకుల బతుకులు ఇంక అయిపోవస్తోందనుకుంట వదినా!" అంది పార్వతమ్మ..

"కోడలు మొదలయింది చూశారా?" అడిగింది శకుంతల.

"కొత్త సీరియల్ అనుకుంటా. కథేమిటీ?" అడిగిందావిడ.

వరలక్ష్మి అందుకుంది. "నా బోటమ్మ ఎంతో మనసుపడి కోడల్ని తెచ్చుకుంటుంది. అదేమో పెళ్ళయిన మూడోనాటినుండే కొరివిలా మారుతుంది. ఆ అత్త కష్టాలు ఏమని చెప్పనూ!"

"అయ్యో! నేను చూడలేదు అక్కయ్యగారూ! ఏ రోజొస్తుంది?" పార్వతమ్మ ఉత్సాహంగా అడిగింది.

కీర్తికి ఆ టాపిక్ ముళ్ళు గుచ్చుతున్నట్లనిపించి లేచి వంటగదిలోకెళ్ళిన తల్లికి సహాయం చెయ్యడానికి వెళ్ళింది.

ఇదంతా నోట్సు రాసుకుంటూ వింటున్న ప్రీతి అడిగింది. "అత్తగారు సీరియల్‌లో కొత్తకోడల్ని రాచిరంపాన పెట్టడం బావుందా మీకు? నాకైతే అత్తని నిలువునా కాల్చిచంపినా తప్పులేదనిపించింది."

"ఓసినీ.... వేలెడంత లేవు.... ఎన్ని మాటలు నేర్చావే! మా కీర్తి నయం. నోట్లో నాలిక లేదు దానికి" అంది వరలక్ష్మి.

సుభద్ర పకోడీలు వేస్తుంటే గరిటెతో వాటిని తీస్తూ నిలబడింది కీర్తి.

"నువ్వెళ్ళమ్మా.... వాళ్ళతో మాట్లాడు, నేను తీసుకొస్తాను" అంది సుభద్ర.

"భావాలు కలవనిచోట కూర్చోవడం, ఆ డిస్కషన్‌లో పాలుపంచుకోవడం నరకంగా వుంటుందమ్మా. ఇక్కడే వుంటాను. నువ్వెళ్ళు" అంది కీర్తి.

సుభద్ర మొదటిసారిగా కూతురివైపు భయంగా, బాధగా చూసింది. వాళ్ళ దగ్గర ఓ గంట కూర్చోడానికి భావాలు కలవనిచోట వుండడం నరకం అనే పిల్ల రేపు పెళ్ళయ్యాక జీవితాంతం వాళ్ళతో కలిసి ఎలా వుండగలదూ?

సుభద్ర పకోడీల ప్లేట్లతో బయటికి నడిచింది. ఆమెకు తెలుసు మన దేశంలో పెళ్ళంటే అమ్మాయికీ, అబ్బాయికీ మాత్రమే సంబంధించి



అంతరంగిక విషయం కాదు! రెండు కుటుంబాలకీ, వారి సంప్రదాయాలకూ ఏర్పడే వంతెన! ఆ వంతెన నిర్మాణం ఎంత పటిష్ఠంగా వుంటే ఆ కాపురం అంత సక్రమంగా నడిచిపోతుంది. మధ్యలో బీటవారిందా, దానిని అతుకు పెట్టడం అంత తేలికకాదు!

పార్వతమ్మ కొత్తగా పెళ్ళయిన కూతురి కాపురం గురించి చెప్తోంది. "మా మాలతి అదృష్టవంతురాలు వదినా! అత్తగారూ వాళ్ళకి దాని పనీ పాటలు విపరీతంగా నచ్చాయి. ఒక్కరోజు అది పుట్టింటికి వస్తానన్నా విలవిలాడిపోతారు అనుకో! మొన్న పండక్కి అల్లుడు జాజిపిందెల నెక్లెసు చేయించాడు."

"ఎన్ని తులాలు?" శకుంతల కుతూహలంగా అడిగింది.

సుభద్రకి కీర్తి అక్కడ ఎందుకు వుండలేకపోతోందో అర్థమైంది. తమ ఇంట్లో ఎన్నడూ నగలగురించీ, గొప్పల గురించీ కూర్చుని మాట్లాడుకునే అలవాటులేదు. సాంబమూర్తి పిల్లలతో కూర్చుంటే ఆటలో, జనరల్ నాలెడ్జికి సంబంధించిన విషయాల గురించి చర్చో వుంటుంది. ఆర్థిక విషయాల గురించీ, సమస్యల గురించీ మాట్లాడాలంటే "సుభద్రా.... ఈరోజు గుడికి వెళ్దామా?" అంటూ బయలుదేరతీస్తాడు.

సుభద్రకి కూడా పిల్లల షోకులూ, నగలూ, పెట్టుపోతలూ, చుట్టాల విషయాలు గురించి మాట్లాడడం నచ్చదు. కాస్త గంభీరంగా చూస్తే చాలు పిల్లలు తమ టాపిక్ తల్లికి నచ్చడంలేదని తెలిసి మార్చేసేవారు. అసలు అలాంటి పరిస్థితి రావడమే చాలా అరుదు. కుటుంబ పరిస్థితుల గురించి పరిపూర్ణమైన అవగాహన ఏర్పరచుకుంటూనే అటువంటి చర్చలకి దూరంగా వుండడం కూడా అలవాటు చేసుకుంది కీర్తి. తండ్రి పిలిచి అభిప్రాయం అడిగితే తప్ప కల్పించుకుని మాట్లాడదు.

"మా అత్తయ్యకి నగలు చేయించుకుంటే బాగా డబ్బున్నవాళ్ళు అనుకుంటారని భయం! అందుకే ఆ పలకసర్లతోనే వుండిపోయింది" సుభద్రని ఎగతాళి చేస్తూ అంది శకుంతల.

"నగలు చేయించుకోవడానికి ఎలా కుదురుతుంది, నాకు ఇద్దరు ఆడపిల్లలు" అంది సుభద్ర.

"పోనీ వాళ్ళకయినా చేయించారా అంటే అదీ లేదూ...." అంది

మరదల్ని దెప్పిపొడుస్తూ వరలక్ష్మి.

వంటింట్లోంచి ఈ సంభాషణ అంతా వింటున్న కీర్తి అప్పుడు తల్లి ఎలా తలపంచుకుని వుంటుందో వూహించగలదు! ఒక్కసారిగా బయటికి వెళ్ళి 'అన్ని టీ.వీ సీరియల్స్ చూసి అందులో కష్టాలకి గంటల తరబడి కన్నీరు కార్చే మీరు....ఎదుటి మనిషిని బాధపెట్టేట్లూ, ఏడుపు వచ్చేట్లూ మాట్లాడడం తప్పని తెలుసుకోలేరా!' అని అడగాలనిపించింది.

పార్వతమ్మ మళ్ళీ తన ఇద్దరి కూతుళ్ళకీ ఎన్నెన్ని నగలు చేయిం చిందో చెప్తోంది.

కీర్తికి నవ్వొచ్చింది. అంత ఖర్చుపెట్టి నగలు చేయించగలవేమో కానీ నీ కూతురి కళ్ళల్లో కాంతి, పెదవిమీద చిరునవ్వు చేయించగలవా! అని అడిగితే ఆవిడ మొహం ఎలా మారుతుందో అనుకుంది.

పాపం మాలతిని గొప్పింటి సంబంధం అని తాహతుకి మించి కట్నం ఇచ్చి చేసి పంపారు. అక్కడ ఆ పిల్లని దాసీకన్నా కనాకష్టంగా చూస్తా రట. ఒక్కరోజు పుట్టింటికి వెళతానన్నా తమ అవసరాలకి ఇబ్బంది అయి పోతుందని పంపనే పంపరట! పెళ్ళి అనేది ఎందుకూ? ఒక కుటుంబ అవసరాలు తీరడానికా.... కొడుక్కి వయసు రాగానే పిల్లల్ని పుట్టించ డానికా? వీళ్ళ దృష్టిలో కోడలి స్థానం.... ఆమెవల్ల కలిగే ప్రయోజనం అంతే! కానీ....అసలు పెళ్ళి అనేది ఎప్పుడు జరగాలి? ఆ ఇద్దరూ మాన సికంగా, శారీరకంగా దూరంగా వుండలేక జీవితాంతం ఒక ఇంట్లోనే ఒకరి సమక్షంలో ఒకరు బ్రతకాలనీ, తమ ఆనందాలనీ, బాధలనీ కలిసి పంచు కోవాలనీ నిశ్చయించుకున్నప్పుడు.... సమాజం తప్పుపట్టకుండా అధర్మం, అనైతికం ప్రబలిపోకుండా వుండడంకోసం చేసుకునే ప్రమాణం వివాహం! కడదాకా ఒకరి బాటలో ఒకరు కలిసి చేసే ప్రయాణం వివాహం!

కీర్తికి ఉదయ్‌కీ, తనకీ పెళ్ళి జరిగిన తర్వాత జరిగే పరిణామాలు ఏవిటో తెలిసిపోతున్నట్లనిపించింది. తనకి చాకిరీ, ఉదయ్‌కి ఖర్చులు పెరుగు తుంటే చిరాకూ, అత్తయ్య చాదస్తంగా చెప్పే గొప్పలూ.... శకుంతల అలకలూ!

పెళ్ళిపీటలమీద ఉదయ్ మంగళసూత్రం చేతిలోకి తీసుకోవడం వూహించుకుంది. హఠాత్తుగా ఆ మూర్తి మారిపోయి.... అక్కడ సిద్ధార్థ



రూపం కనిపిస్తోంది.

'నువ్వు నా కోసమే పుట్టావు కీర్తీ!' అంటున్న పెదవులతో అతను ముందుకు ఒంగి తన మెడలో మూడుముళ్ళూ వేస్తున్నాడు. బాజాలు ఫెళ్ళున మ్రోగుతున్నాయి. అంతా గొడవ....సందడి!

"అయ్యో! పాలు పొంగిపోతుంటే కూడా పట్టించుకోకుండా ఆ పరధ్యానమేమిటే?" అంటూ వచ్చి స్టౌ ఆఫ్‌చేసింది సుభద్ర.

"పాలు పొంగితే శుభం వదినా! అనుకున్నది జరుగుతుంది" వెన కాలే వచ్చిన పార్వతమ్మ అంది.

కీర్తి మెరిసే కళ్ళతో ఆవిడవైపు చూసింది.

"కాఫీ నేను కలుపుతాగానీ నువ్వెళ్ళి మొహం కడుక్కుని జడ వేసుకో" అంది సుభద్ర.

కీర్తి అక్కడనుంచి కదుల్తూ ఇంకోసారి పెళ్ళిపీటల దృశ్యాన్ని వూహించుకుంది. ఆమె పెదవులమీద చిరునవ్వు మెరిసింది! అంతలోనే ఎవరో ఛెళ్ళున కొట్టినట్లు తండ్రి గుర్తొచ్చాడు.

"నా కూతురు ఎప్పుడూ పొరపాటు చెయ్యదే! స్వేచ్ఛ ఒక మనిషి తన మార్గాన్ని ఎంచుకోడానికి తోడ్పడేదే కానీ ఒక మనిషి పాడయిపోడానికి కాదు!" అన్న ఆయన మాటలు జ్ఞప్తికొచ్చాయి.

"కీర్తీ! రేపు కాలేజీకి వెళ్ళకు. నాతో షాపింగ్‌కి తీసుకెళతాను" అంటూ దగ్గరకొచ్చింది శకుంతల.

"నేను రాలేను వదినా!" అని గదిలోకి వెళ్ళిపోయిన కీర్తిని వింతగా చూస్తూ నిలబడిపోయింది శకుంతల.

* * * *

"సిద్ధార్థ వున్నారా?" ఆత్రుతగా అడిగింది కీర్తి.

రాజారావు ఆ నంబర్ నోట్‌చేశాడు.

"ఎవరూ కీర్తా?" అడిగాడు.

కీర్తి సంతోషంగా "సిద్ధార్థా?" అంది.

"కాదు....సిద్ధార్థ తండ్రిని."

ఆమె అనుకోని ఆ సంఘటనకి నిరుత్తరురాలయింది.

"మీరూ....మీరూ....నమస్తే?" తడబడుతూ అంది.

"సిద్ధార్థ మీ గురించి చెప్పాడమ్మా. మీ ఇల్లెక్కడా?" ఆయన నెమ్మదిగా అడిగాడు.

కీర్తి చెప్పింది.

"సిద్ధార్థ రాగానే ఫోన్ చేయిస్తానమ్మా. మీ నాన్నగారేం చేస్తారు?" అడిగాడు రాజారావు.

కీర్తి సాంబమూర్తి కంపెనీ పేరూ, చేసే ఉద్యోగం వివరాలన్నీ చెప్పింది.

"చాలా సంతోషం. మనం తొందర్లోనే కలుద్దాం అమ్మా!" ఆయన ఫోన్ పెట్టేశాడు.

కీర్తి అచేతనురాలై కూర్చుంది.

సిద్ధార్థ తండ్రితో తన గురించి చెప్పాడా? ఏమని చెప్పి వుంటాడూ?

ఆయన కలుద్దాం అన్నాడు. ఎందుకూ? తన తండ్రి వివరాలు అడిగాడు. కొంపదీసి పెళ్ళి విషయం మాట్లాడ్డానికి కాదుగదా? ఒకవేళ అలా జరిగితే తండ్రి ఎలా స్పందిస్తాడూ? తన గురించి ఏమనుకుంటాడూ?

ఆమెకి ఆలోచనలతో తల పగిలిపోతుందేమో అనిపించి పక్కమీద వాలి 'సిద్ధార్థా....ప్రశాంతంగా వుండే నా జీవితంలో ఎందుకు అలజడి సృష్టించావు? అసలెందుకు కనపడ్డావు?' అనుకుంది.

అంతలోనే ఏదో ఆశ మెల్లగా మదిలోకి చొరబడగా 'సిద్ధూ.... ఎక్కడున్నావు?' అనుకుంది.

* * *

"శకుంతలా....శకుంతలా...." వివేకానంద హడావిడిగా పిలుస్తూ లోపలికి వచ్చాడు.

శకుంతల వస్తూ "ఏవిటండీ! ఏం కొంపలు ముంచుకుపోయాయి అలా అరుస్తున్నారూ?" అంది.

వివేకానంద మొహం అంతా చెమట్లుపట్టి కంగారుగా కన్పించాడు. "మీ అమ్మగారు ఎక్కడా?" అన్నాడు.

శకుంతల ఆశ్చర్యంగా "టీవీ చూస్తోంది. ఏం? ఏమైందీ?" అంది.

వివేకానంద ఆమె భుజంమీద చెయ్యివేసి "ఘోరం జరిగిపోయింది శకూ! నేను చెప్పగానే నువ్వు అరిచి అల్లరి చేయకు. మీ అమ్మగారు



వింటే ప్రమాదం. నెమ్మదిగా చెప్దాం" అన్నాడు.

ఆమె వెంటనే నోరంతా తెరిచి "ఆ...." అని ఏం జరిగిందని అరవబోయింది.

అతను ఆమె నోటిమీద చెయ్యివేస్తూ అన్నాడు "ష్....అరవకు, చెప్పేది నెమ్మదిగా విను. మీ తమ్ముడికి ఏక్సిడెంట్ జరిగిందట...." అని ఆమె మొహంలోకి చూసాడు.

ఆమె కళ్ళనిండా నీళ్ళతో అతని చేతిని తన నోటిమీద నుంచి తొలగించి....

"ఇప్పుడెలా వున్నాడుట?" అని అడిగింది.

వివేకానంద భారంగా నిట్టూర్చాడే కానీ ఏమాటా చెప్పలేదు.

"మిమ్మల్నే! ఎలా వున్నాడుటా?" శకుంతల అతన్ని కుదుపుతూ ఏడ్చేస్తూ అడిగింది.

వివేకానంద ఆమెని దగ్గరగా తీసుకుంటూ "ఉదయ్, ఇంకో ఇద్దరు అసిస్టెంట్లతో కలిసి దగ్గర్లోని పల్లెటూరు నుంచి జీపులో వెళ్తూ వుండగా ఏక్సిడెంట్ జరిగిందట. డ్రైవరూ, ఇంకో యిద్దరూ అందులో దగ్ధమైపోయారుట పోలీసులు వెళ్ళేసరికి బూడిదే మిగిలిందట" అని ఆమెవైపు చూసాడు

"ఉదయ్ సంగతి చెప్పండి...."

ఆమె అతన్ని కుదుపుతూ ఏడుపుస్వరంతో అడిగింది.

వివేకానంద ఆమె తలమీద చెయ్యివేస్తూ "అదే తెలీడంలేదు. ఆ జీపులో ఉదయ్ కూడా.... అలా జరక్కూడదని భగవంతుడ్ని ప్రార్థించు" అన్నాడు.

శకుంతల ఏడుస్తూ క్రింద కూలబడి "ఇదంతా ఎప్పుడు జరిగిందండీ? నా తమ్ముడు.... నా తమ్ముడు మాకు అన్యాయంచేసి పోయాడా.... ఓరి భగవంతుడా....ఇదెక్కడ ఘోరం.... చేతికొచ్చిన నా తమ్ముడే నీకు కావాల్సి వచ్చాడా?" అని ఏడవసాగింది.

"ముందు మీ అమ్మగారితో ఈ సంగతి ఎలా చెప్పాలో ఆలోచించు" అన్నాడు వివేకానంద కళ్ళు తుడుచుకుంటూ.

శకుంతల గుండెలు బాదుకుంటూ "ఉదయ్.... నీకు అప్పుడే

"నూరేళ్ళు నిండిపోయాయిరా!" అని మళ్ళీ ఏడ్చింది.

"నేను రాత్రి బండికి బయల్దేరి వెళ్ళి అసలు ఏం జరిగిందో.... ఉదయ్ ఎక్కడైనా వున్నాడో, అన్నీ కనుక్కొస్తాను. నువ్వు ఏడవకు" అన్నాడు.

శకుంతల తల కుర్చీకోడుకేసి కొట్టుకుంటూ "వెంటనే మనకి ఎందుకు తెలియపర్చలేదుటా?" అని ఏడ్చింది.

"మీ తమ్ముడి అనవాళ్ళు జీప్‌లో మరణించిన బాడీల్లో కన్పించలేదుట. అందుకే అతను పోయాడో, వున్నాడో! ఉంటే ఎక్కడ వున్నాడో తెలీక వాళ్ళ ఆఫీసువాళ్ళు కంగారు పడ్తున్నారట. చుట్టుపక్కల హాస్పిటల్స్‌లో వాకబుచేసి మళ్ళీ ఫోన్ చేస్తామన్నారు. ఇప్పుడు నువ్వు చెయ్యవలసిందల్లా, ఫోన్‌లో మంచి వార్త వినిపించాలని ఆ దేవుడ్ని ప్రార్థించడమే" అన్నాడు వివేకానంద.

"అమ్మకి ఈ విషయం నేను చెప్పలేనండీ. నా వల్ల కాదు" అంది శకుంతల.

"మీ మావయ్యకి ఫోన్‌చేసి పిలిపిస్తాను. ఆయన పెద్దవాడూ.... చెయ్యాల్సింది ఆయనే చూసుకుంటాడు" ఫోన్ దగ్గరికి నడుస్తూ అన్నాడు వివేకానంద.

* * * *

కీర్తి జరుగుతున్న తంతుని నిస్తేజంగా చూస్తూ కూర్చుంది.

వరలక్ష్మమ్మ గుండెలమీద కొట్టుకుంటూ "నాయనా ఉదయ్....నీ చేతిలో నేను పుట్టి అవ్వాలనుకున్నారా నాయనా.... నువ్వు నా కడుపున అగ్గిపెట్టి పోయావ్రటా.... ఇంక నేనెందుకురా బతకడం....?" అని ఏడుస్తోంది.

"వదినా! ఉదయ్‌కి ఏమీకాదు. ఎక్కడో అక్కడ క్షేమంగానే ఉండి వుంటాడని నాకు అన్పిస్తోంది" సుభద్ర ఆవిడ మీద చెయ్యివేసి దుఃఖంతోనే ఆవిడ్ని ఓదార్చింది.

"వివేకానంద వెళ్ళాడుగా. ఫోన్ చేస్తాడు. మనకి దేవుడు అన్యాయము చెయ్యడు. నాకు నమ్మకం వుంది!" అక్కగారి పక్కనే కూర్చుని ధైర్యం చెప్తున్నాడు సాంబమూర్తి.



"బతికుంటే ఈపాటికి తెలిసేదిగా, నాకు అన్యాయం జరిగిపోయిందిరా. ఈ శోకాన్ని ఎలా భరించనురా సాంబ...." అని ఆవిడ, అతని మీద వాలిపోయి ఏడుస్తూనే స్పృహ తప్పిపోయింది.

శకుంతల తల్లికి గ్లూకోజ్ నీళ్ళు కలిపించి ఉపచర్యలు చేస్తూ, కీర్తి వైపు చూసింది.

కీర్తి మోకాళ్ళ చుట్టూ చేతులేసుకొని, నిస్తేజంగా చూస్తూ కూర్చుని వుంది.

ఆమె మొహంలో ఏ భావం కనిపించడంలేదు!

కీర్తి మనసులో మాత్రం సముద్ర ఘోషలా అంతా అలజడిగా వుంది! చెవులు ఘుళ్ళు పడ్డట్లుగా, చుట్టూ జరుగుతున్నది నమ్మాలో నాటకమో తెలియనట్లుగా అయోమయంగా వుంది.

ఆమె తన వ్రేలికున్న ప్రధానపు ఉంగరాన్ని చూసుకుంది. ఉదయ్ రూపం గుర్తుచేసుకుంది. తను అతనికి అన్యాయం చేసిందా....మనసులో ఒక్కనాడూ భర్తగా ప్రేమించలేకపోయింది. ఊహించలేకపోయింది. అందుకే ఇలా జరిగిందా? అన్నీ అర్థంలేని వూహలు. బిగ్గరగా ఏడవాలనిపిస్తోంది. కానీ అందుకూ శరీరం సహకరించడంలేదు! గాజుకళ్ళతో చూస్తున్నట్లు నిస్తేజంగా చూస్తూ కూర్చుంది.

"పాపం. మొన్ననే అబ్బాయికి నిశ్చితార్థం కూడా జరిగినట్లుంది" చూడ్డానికి వచ్చిన ఒక ఇరుగింటావిడ పరామర్శగా అంది.

శకుంతల ముక్కు చీది కొంగుతో తుడుచుకుని కీర్తికేసి అకారణ కోపంతో చూస్తూ "కొన్ని పాదాల మహిమలు ఇంత ఘాటుగా వుంటాయి. అంతా మా కర్మ!" అని నుదురు కొట్టుకుంది.

సుభద్రా, సాంబమూర్తీ తుళ్ళిపడి కీర్తి వైపు చూసారు.

తమ కూతురి మనసు పూలరేకుకన్నా సున్నితం అని చిన్నప్పటి నుంచీ ఒక్కమాట కూడా అనకుండా పెంచుకుంటూ వస్తున్న ఆ దంపతులు, ఈ మాటల ప్రభావం తమ కూతుర్ని ఏ ప్రమాదంలోకి నెట్టుతాయో అని భయం భయంగా చూశారు.

కీర్తిలో ఆ మాటలకి స్పందనలేదు. శకుంతల కళ్ళల్లోకి మాత్రం సూటిగా ఓసారి చూసి తల తిప్పేసుకుంది.

"జాతకాలు కలిశాయో లేదో చూసుకోవద్దటమ్మా! ఎంత మేనరికం అయితే మాత్రం" ఇంకో పెద్దాయన సాగదీశాడు.

చెయ్యని నేరానికి అపరాధ భావంతో తల దించుకున్నాడు సాంబమూర్తి.

సుభద్ర హృదయం రంపంతో పరపరా కోస్తున్నట్లనిపించి వదినగారిని వదిలి, కూతురి దగ్గరకొచ్చి ఆమెని దగ్గరగా తీసుకుంది.

"అ....మ్మా...." అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ కీర్తి సుభద్ర గుండెల్లో తల దాచుకుంది.

* * * *

సిద్ధార్థ తన ఎదురుగా అచేతనంగా పడుకుని వున్న ఉదయ్‌ని కన్నార్పకుండా చూస్తున్నాడు. వారం రోజులుగా గవర్నమెంట్ హాస్పిటల్లో ఉదయ్‌నే కనిపెట్టుకుని వున్నాడు. ఉదయ్ తలకి చాలా బలమైన గాయాలు తగిలాయి. కోమాలో వున్నాడు. చిన్న కదలిక కూడా లేదు. అతని గురించిన వివరాలేమీ సిద్ధార్థకి తెలీవు! తెలిసిన తోటి ప్రయాణీకులూ, డ్రైవరూ ప్రమాదంలో మరణించారు. సిద్ధార్థ ఉదయ్‌ని భుజాన మోసుకుంటూ వెంటనే రాకపోతే, రక్తస్రావం ఆగక ఉదయ్ కూడా మరణించి వుండేవాడు. అదృష్టవశాత్తూ సిద్ధార్థ బ్లడ్ గ్రూప్ ఉదయ్‌కి సరిపోయింది. అందుకే సమయానికి బ్లడ్ ఎక్కించగలిగారు.

సిద్ధార్థ నోట్లో సిగరెట్ పెట్టుకుని, వరండాలో పచార్లు చేస్తూ అనుకున్నాడు 'విధి బలీయమైనది. తిని కూర్చుని కులాసాగా వుండే తనని ఇతన్ని రక్షించడానికా ఇక్కడదాకా తరుముకొచ్చింది....ఎందుకు? ఇతను తనకి ఏమౌతాడని?" వదిలిపెట్టి తన దారిన తాను పోడానికి మనసొప్పలేదు. నెమ్మదిగా సిగరెట్ పొగ వదులుతూ, పెరిగిన గెడ్డాన్ని ఎడమచేత్తో ఒకసారి రాసుకున్నాడు.

"కీర్తి ఏం చేస్తోందో?" అనిపించింది. అతనికి నవ్వొచ్చింది.

సంసార బంధాల నుండీ....బంజాటాల నుండీ విముక్తి కావాలంటూ పారిపోయి హిమాలయాల్లో తపస్సు చేసుకుంటారుట మునులు. ఎక్కడికి పారిపోయినా తన దేహంతో కూడా వచ్చే ఈ మనో ఇంద్రియాన్ని ఎక్కడ వదిలించుకునిపోతారో చెపితే బావుండు.



"భాయ్ సాబ్!" అన్న పలకరింపుకి ఉలిక్కిపడి చూసాడు.

నల్లచీరలో తలమీదనుండి కొంగు కప్పుకున్న ఆ స్త్రీ ఉదయ్‌పక్క బెడ్‌మీద వుండే వ్యక్తి భార్య. చేతిలో వున్న ఫ్లాస్కు చూపిస్తూ భర్తకి కాఫీ తీసుకురావడానికి బయటికి వెళుతున్నాననీ, వచ్చేదాకా కాస్త అతను పిలిస్తే చూడమనీ హిందీలో చెప్పింది.

సిద్ధార్థ తలవూపి లోపలికి నడిచాడు.

పక్క బెడ్ అతనికి మెలకువ వచ్చినట్లుంది. పక్కకి ఒత్తిగిల్లి టేబుల్ మీదనున్న మంచినీళ్ళ సీసా అందుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

సిద్ధార్థ వెళ్ళి గ్లాసులో పోసి అతనికి అందించాడు.

అతను నీళ్ళు తాగి థాంక్స్ చెప్పాక సిద్ధార్థని అడిగాడు.

"అతను నీకు ఏమౌతాడూ?"

సిద్ధార్థకి నవ్వొచ్చింది. తాను నాగపూర్ దాకా లిఫ్ట్ ఇస్తానన్న వ్యక్తి....పైగా నేను ఐదురూపాయలు బదులిచ్చాను కూడా! అని చెప్తేనో అనిపించింది. కానీ నోరు తెరవగానే "నా ఫ్రెండ్" అన్నమాట బయటకొచ్చింది.

"పక్క బెడ్డుమీద వ్యక్తి తన పేరు మహేంద్ర అనీ, భార్య పేరు రష్మి అనీ వాళ్ళది ప్రేమ వివాహం, పెద్దల్ని ఎదిరించి చేసుకున్నందువలన ఎప్పుడూ గొడవలే అనీ చెప్పి....తలకి వున్న పట్టీ చూపిస్తూ....

"ఇది మా బావమరుదులపనే! మా అత్తమామలు వృద్ధులు, వాళ్ళకి కూడా నా భార్యమీద ప్రేమకన్నా పగ, పట్టుదలా ఇవే ఎక్కువ. ఒక్కొక్కసారి ఇలా పెద్దల్ని ఎదిరించి పెళ్ళిచేసుకుని ఏం సుఖపడుతున్నాం. ఇలా చెయ్యకుండా వుంటే కనీసం రష్మి అయినా సుఖంగా వాళ్ళ కులంలో ఏ శ్రీమంతుడి ఇల్లాలుగానో వుండేదిగా అనిపిస్తుంది. తప్పుచేసాం....భాయ్ సాబ్! ఈ పెద్దలున్నారు చూడండీ, వాళ్ళు పెంచిన మొక్కకి పూసిన పువ్వుని వాళ్ళు దానం చెయ్యాలేకానీ, ఎవరైనా అడక్కుండా కోసుకుంటే భరించలేరు. వాళ్ళ జీవితాలు నరకం చేసుకుంటూ పిల్లల జీవితాలూ నరకం చేస్తారు. వాళ్ళ సొత్తుని అపహరించినదొంగల్లా కనపడతారు. పిల్లలు ప్రేమించినవాళ్ళు వాళ్ళకి....చూడండి' ఎప్పుడూ కాల్లోతప్పు, కాలినడకన

బయట తిరగడం తెలీని అమ్మాయి నా భార్య. ఇప్పుడు మండుటెండలో తెగిన చెప్పులతో, భారంగా కాళ్ళీడుస్తూ నాకోసం కాఫీ తేవడానికి వెళ్ళింది. నిజంగా తనని నేను ప్రేమించి వుంటే ఈ విధంగా కష్టపెట్టేవాడినా...! నేను వట్టి స్వార్థపరుడ్ని. తను ఈ రకంగా నాకు సేవలు చేస్తుంటే, నాకు చచ్చిపోవాలనుకుంది" కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు మహేంద్ర.

సిద్ధార్థ దగ్గరికివెళ్ళి అతని భుజంమీద ఓదార్పుగా చెయ్యి వేసాడు.

కీర్తి మాటలు గుర్తొచ్చాయి. 'ఇన్నేళ్ళుగా మనల్ని పెంచిన పెద్ద వాళ్ళకి మనమీద ఏ హక్కూ లేదని మాత్రం అనకండి" అంది.

ఆమె మాటల్లో వాస్తవం వుంది. కానీ అనుభవంలేదు. తరతరాలుగా వయసొచ్చిన యువతీయువకులు ప్రేమించుకోవడం మానలేదు. వారి ప్రేమని ఈ పెద్దలు ఖండించడమూ మానలేదు.

రష్మి కాఫీ తీసుకొచ్చింది.

"థాంక్యూ భయ్యా!" అంది చిరునవ్వుతో.

మహేంద్రకి కాఫీ అందించి, తన కొంగుతో నుదుట పట్టిన చెమట తుడిచింది. మరాఠీలో ఏదో చెప్పి నవ్వుతోంది.

సిద్ధార్థ ఉదయ్ ఎదురుగా వున్న స్టూలుమీద కూర్చుని ఆమె ముఖంలోని ఆనందాన్ని గమనిస్తున్నాడు. ఇందాక మహేంద్ర చెప్పిన ఏ కష్టం ఆమెకి తాకినట్లుగా అతనికి అన్పించలేదు.

భువిలో వున్న ఆనందాలన్నీ తనకి స్వంతమైనట్లుగా ఆమె అతని మీద చెయ్యివేసి కూర్చుని కబుర్లు చెపుతోంది.

"భయ్యా...." రష్మి పిలిచి కాఫీ ఇచ్చింది.

ఆస్పత్రి ఆవరణలో వున్న సౌత్ ఇండియన్ హోటల్లో కాఫీ దొరుకుతుంది. మహేంద్ర కొన్నాళ్ళు మద్రాసులో వుండి ఉద్యోగం చేయడం వలన కాఫీ అలవాటయిందిట. రష్మికి కాఫీ సయించదు. అయినా అతని కోసం కాఫీనే తీసుకొస్తుంది.

"మీలాంటి స్నేహితుడు వుండడం అతని అదృష్టం! రాత్రింబగళ్ళు స్వంత వాళ్ళకన్నా ఎక్కువగా చూసుకుంటున్నారు. అతనికి ఎవరూలేరా?" అడిగింది రష్మి.

సిద్ధార్థకి ఏం చెప్పాలో తోచలేదు. "ఉన్నారు. ఇతనికి స్పృహ



వచ్చాక వాళ్ళకి తెలియచేస్తాను" అన్నాడు.

"సృష్టిలో తియ్యనిది స్నేహమని ఎందుకంటారో మిమ్మల్నిద్దర్నీ చూస్తే ఇప్పుడు అర్థమవుతోంది" అంది రష్మి.

సిద్ధార్థ కాఫీ తాగుతూ ఆలోచనలో పడ్డాడు.

అనుకోకుండా ప్రేమలో పడినట్లే తను అనుకోకుండా స్నేహంలో పడ్డాడు. ప్రతిదీ తన జీవితంలో ఏక్సిడెంటల్‌గా జరగడం వరమా, శాపమా! ఏం చెయ్యాలో, ఎక్కడికెళ్ళాలో నిర్ణయించుకోకుండా ఒక రాత్రివేళ ఇల్లు వదిలిపెట్టి వచ్చేసిన తనకి వారంరోజులుగా ఒక ఆశ్రయం లభించింది. స్పృహలోకి వస్తాడో రాడో తెలీని ఈ పేషెంట్‌ని వదలిపెట్టిపోదామనుకుంటే, మనసు ఒప్పుకోవడంలేదు. ఈ మారుమూల గ్రామంలో, ఇలా అతని ముందు కూర్చుని రాత్రీ పగలూ గడుపుతూ ఎన్నాళ్ళు?

అలసటగా అనిపించి తల వెనక్కి జారేసి గోడకి ఆనుకుని పడుకున్నాడు సిద్దు.

"ఇంకా మీ నుండి రక్తం తీయడం, డాక్టర్‌గా నేను చేయలేని పని. ఐయామ్ సారీ" హిందీలో చెప్పాడు సిద్ధార్థతో డాక్టర్.

"ఫరవాలేదు డాక్టర్! అతన్ని రక్షించండి" అర్థింపుగా అడిగాడు సిద్ధార్థ.

"మిస్టర్ సిద్ధార్థా! నాకు అతని ప్రాణం ఎంత విలువయిందో, మీ ప్రాణమూ అంతే! ముందు మీరు నర్స్ ఇచ్చే పండ్లరసం తీసుకోండి" అన్నాడు డాక్టర్.

సిద్ధార్థ నీరసంగా నవ్వి నర్స్ అందించిన జ్యూస్ తీసుకుని తాగుతుంటే అడిగాడు– "అతని తాలూకు వాళ్ళకి ఇన్‌ఫార్మ్ చేసారా?"

సిద్ధార్థ ఆందోళనగా చూసాడు.

"నాకయితే ఏమీ హోప్ కన్పించడంలేదు. ఒక న్యూరోసర్జన్‌గా ఇలాంటి ఏక్సిడెంట్ కేసులు చాలా చూసాను. బ్రతికేవాళ్ళు ట్వెంటీ పర్సెంట్ కూడా వుండరు. ఎందుకయినా మంచిది వాళ్ళకి తెలియజేయండి" డాక్టర్ లేచి వెళ్తూ అన్నాడు.

"అతను ఎక్కడ పనిచేస్తాడో చెప్పినట్లు గుర్తు. కానీ ఆ పేరు

సరిగ్గా గుర్తురావడంలేదు. గుర్తులు చేసుకుని వాళ్ళ ఆఫీసువాళ్ళకి తెలియ జేస్తాను డాక్టర్" అన్నాడు సిద్దార్థ.

"డాక్టర్ ఆశ్చర్యంగా "మీకూ అతనికి ప్రాణస్నేహమనుకుంటు న్నానే! ఎవరో స్ట్రేంజర్ గురించి మాట్లాడినట్లు మాట్లాడుతున్నారేమిటి" అన్నాడు.

"ప్రాణస్నేహమే....అతని ప్రాణం ప్రమాదంలో పడ్డాకా! అంత వరకూ స్నేహంలేదు. అప్పుడే అయిన పరిచయం తప్ప" అని సిద్దార్థ జరిగినదంతా ఆయనకి చెప్పాడు.

డాక్టర్ సంభ్రమంగా చూసాడు.

"పక్కింటివాడికి ప్రమాదం జరిగితే కూడా మనకెందుకులే అని మనుషులు తప్పించుకుపోయే ఈ రోజుల్లో ఎవరో తెలియని వ్యక్తికోసం రక్తదానంచేసి, ఇంత శ్రమపడి, ముఖ్యంగా మీరూ గాయాలతో వుండి కూడా అతన్ని భుజాన వేసుకుని ఇంతదూరం తీసుకొచ్చారే! మిమ్మల్ని ఏమనుకోవాలి? మానవత్వం ఇంకా బ్రతికే వుంది మనుషుల్లో అన్నదానికి ఉదాహరణ అనుకోవాలా?" అన్నాడు.

సిద్దార్థ చిన్నగా నవ్వాడు. "ఆ పరిస్థితుల్లో నేను వుండి, అతను నాలా వున్నా, అతనూ ఇలాగే రక్షించేవాడు. ఇందులో నన్ను పొగడ డానికేంలేదు డాక్టర్" అన్నాడు.

"నో.........నో.... యూ ఆర్ గ్రేట్."

డాక్టర్ అతని భుజంతట్టి "త్వరగా వాళ్ళ ఆఫీస్ పేరు గుర్తుతెచ్చు కోండి" అని వెళ్ళిపోయాడు.

సిద్దార్థ బెడ్‌మీద పడుకుని జ్ఞాపకం చేసుకోసాగాడు. ఉదయ్ చెయ్యి అందిస్తూ చెప్పిన ఆ కంపెనీ పేరు గుర్తురావడంలేదు.

తలంతా దిమ్ముగా అనిపించింది తల విదిలించి మళ్ళీ గుర్తుచేసుకో డానికి ప్రయత్నించసాగాడు. పోనీ పోలీస్ రిపోర్ట్ ఇద్దామా అని కూడా అనుకున్నాడు.

"డాక్టర్‌గారు మిమ్మల్ని పిలుస్తున్నారు" నర్సు వచ్చి చెప్పింది.

సిద్దార్థ లేచి ఆమెని అనుసరించాడు.

డాక్టర్ ఇంకా ఇద్దరు డాక్టర్లతో చర్చిస్తున్నవాడల్లా సిద్దార్థని చూసి



చెప్పాడు.

"సిద్దార్థా....ఉదయ్‌కి అర్జెంటుగా ఆపరేషన్ చెయ్యాలి. ఇక్కడ ఈ పల్లెటూరులో సరైన అనస్థటిస్ట్ కూడా లేడు. మీరు వెంటనే ఢిల్లీ తీసు కెళ్ళండి. అక్కడ డాక్టర్ నాయక్ వుంటారు. నేను లెటర్ రాసిస్తాను. ఈ రాత్రికే అంబులెన్స్‌లో పంపించడానికి ఏర్పాట్లుచేస్తాను. మీరు ఇక్కడ సంతకాలు పెట్టాలి" అంటూ ఓ రిజిస్టర్ ముందుకి తోశాడు.

సిద్దార్థ ఓ నిముషం ఆలోచించి అడిగాడు– "నాకు అతనితో ఏ రిలేషన్ లేదు. నేను ఆపరేషన్‌కి అంగీకారం తెలుపుతూ సంతకం పెట్ట వచ్చా?"

డాక్టర్ వెంటనే అన్నాడు- "మీ ఇద్దరి మధ్య వున్నది ఇప్పుడు రక్తసంబంధం అనుకో! ప్రాణం కాపాడడం ముఖ్యం అన్నప్పుడు సోదరు డిగా సంతకం చేయొచ్చు. ఆలోచించే వ్యవధి లేదు."

ఇంక సిద్దార్థ ఆలోచించలేదు. "అతని ప్రాణం నిలుస్తుంది అంటే అలాగే చేస్తాను డాక్టర్" అంటూ సైన్ చేశాడు.

ఆ రాత్రికే కదలికలేని ఉదయ్‌ని తీసుకుని సిద్దార్థ అంబులెన్స్‌లో ఢిల్లీ బయలుదేరాడు.

•   •   •   •

"ఒకటా, రెండా....ఆరు రోజులు గడిచిపోయాయి. పేపర్లో ప్రకటన ఇస్తూనే వున్నాను. అసలు వాడు ఈ దేశంలో వున్నాడా లేదా అని అనుమానం వస్తోంది. మరీ ఇంత మొండితనమా?" రాజారావు ఉద్రేకంగా అరిచాడు.

యాపిల్ జ్యూస్ తాగుతున్న శృతకీర్తి తలెత్తి సిద్దార్థ రూంని పరీక్షగా చూసింది.

"అసలు జరక్కూడనిది ఏదైనా జరిగిందేమోనని నాకు భయంగా వుంది విశ్వనాథం" రాజారావు భయంగా విశ్వనాథ్‌తో అన్నాడు.

"ఛ....ఛ....అలాంటిదేం జరిగి వుండదు. పోనీ, పోలీసు రిపోర్టు ఇచ్చి చూద్దాం" ధైర్యం చెప్పాడు విశ్వనాథ్.

శృతకీర్తి లేచి రాజారావు దగ్గరకొస్తూ అంది–

"పోలీసులకి తెలియకపోయినా, ఒక వ్యక్తికి తప్పకుండా మీ

అబ్బాయి ఎక్కడ వున్నదీ తెలుస్తుంది అంకుల్!" అంది.

రాజారావూ, విశ్వనాథ్‌లు ఒకేసారి ఆశ్చర్యంగా ఆమె వంక చూశారు.

"మీ అబ్బాయి ప్రేమించిన అమ్మాయికి" అని గ్లాసులో మిగిలిన జ్యూస్ సిప్ చెయ్యసాగింది శృతి.

"కానీ....ఆ అమ్మాయి అడ్రెస్ మనకి తెలియాలిగా!" అన్నారు విశ్వనాథం.

రాజారావు ఎర్రనైన మొహంతో అన్నాడు "నాకు తెలుసు."

శృతి తన కళ్ళు మాత్రం ఆయన వైపు తిప్పి చూస్తూ అంది. "మరైతే ఎందుకు వూరుకున్నారూ?"

"ఊరుకుని తప్పే చేశానమ్మా....ఇప్పుడే ఫోన్‌చేసి వాళ్ళ నాన్నతో మాట్లాడతాను" ఆయన ఆవేశంగా ఫోన్‌వైపు నడవబోయాడు.

శృతి ఆయన దారికి అడ్డుగా వచ్చి నిలబడి అంది-

"తొందరపడకండి అంకుల్! మీరు గట్టిగా అడిగితే వాళ్ళు తమకేం తెలియదనచ్చు. ఆ అమ్మాయి తండ్రి ఏం చేస్తాడో....అతని లెవెల్ ఏమిటో నాతో చెప్తే అటునుండి నరుక్కురావచ్చు."

రాజారావు ఆమె దూరదృష్టిని మెచ్చుకుంటున్నట్లుగా "ఎక్సలెంట్ ఐడియా బేబీ!" అన్నాడు.

శృతి నవ్వి అంది- "అన్నీ రహదారుల్లో వెళితే అయ్యే పనులే వుండవు అంకుల్....ఆ సూక్ష్మం గ్రహించగలిగాను కనుకే....ఇన్ని బిజినెస్సులు ఒక్కదాన్నే చూసుకోగలుగుతున్నాను. ఆ.... విశ్వనాథ్ అంకుల్‌కి ఏదో ముఖ్యమైన పని వుందన్నారు. ఆయన వెళ్ళిపోతారు. మనం డిన్నర్ చేస్తూ మాట్లాడుకుందాం" అని విశ్వనాథ్ వంక చూసింది.

ఆమె చూపుని గ్రహించినట్లుగా "ఎస్....ఎస్....నేనింక బయలుదేరతాను" అని విశ్వనాథం బయల్దేరి వెళ్ళిపోయాడు.

శృతి రాజారావు దగ్గరకెళ్ళి అంది. "చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. కోటీశ్వరుల అబ్బాయికి ఎరవేసిన ఆ మధ్యతరగతి తండ్రిని నేరుగా వెళ్ళి మీ అమ్మాయి ప్రేమించిన మా అబ్బాయిని ఎక్కడ దాచావు? అంటే చెప్పడు. ముందు అసలు ప్రేమించినందుకే పశ్చాత్తా



పడేలా చెయ్యాలి. ఇక ముందు వాళ్ళ అమ్మాయి ఎవర్ని ప్రేమించినా భయపడేలా చెయ్యాలి. యూ గాట్ ఇట్!"

రాజారావు అర్థం కానట్లు తల అడ్డంగా వూపాడు. "అర్థం అయ్యేట్లుగా చెప్తాను పదండి" అని డైనింగ్ టేబుల్ దగ్గరకి దారితీసింది.

* * * *

సాంబమూర్తి మూడు రోజుల తర్వాత ఆ రోజే ఆఫీసుకి వచ్చాడు. మనసంతా గజిబిజిగా వుంది. వెళ్ళిన వివేకానంద ఉదయ్ జాడ ఇంకా ఏమీ తెలియలేదనీ, బహుశా జీపుతోబాటు కాలిపోయే వుంటాడేమోననీ ఆఫీసువాళ్ళు అభిప్రాయపడుతున్నారని ఫోన్ చేశాడు.

ఉదయ్ గుర్తుకొస్తేనే సాంబమూర్తికి మనసంతా కన్నీటితో నిండిపోయి పొంగిపోవడానికి సిద్ధమైపోతోంది. సాధారణంగా మగవాడికి కన్న బిడ్డలకన్నా జీవితంలో ముందుకు వచ్చేది మేనల్లుళ్ళు, మేనకోడళ్ళు. అందుకే వారిమీద విపరీతమైన ప్రేమని పెంచుకుంటాడు. శకుంతలనీ, ఉదయ్‌నీ తను ఎంతగా ప్రేమించాడో, తన చేతులతో ఎత్తుకుని ఎలా పెంచాడో గుర్తుకువస్తే, తట్టుకోలేకపోతున్నాడాయన. అది ఒక కోణం. ఇంకో కోణం నుంచి చూస్తే, కీర్తికి కాబోయే భర్త. తన కూతురికి నిశ్చయమైన తన అల్లుడు. ఇంత బాధని కీర్తి చిన్న హృదయం ఎలా భరిస్తోందో అన్న ఆలోచనకే ఆయన హృదయం వెయ్యి ముక్కలైపోతున్నట్లుంది. జరిగిన అన్యాయం ఎలాగూ జరిగింది. ఆ ఆవేదననుండి కోలుకోకుండా, పలుగురూ అనే మాటలు ఆ లేతమనసుని ఎంతగా కలచివేస్తున్నాయో తలుచుకుంటుంటే 'సుభద్రలా నేనూ దాన్ని గుండెలకి హత్తుకుని పొగిలి ఏడిస్తే అయినా ఈ భారం తగ్గుతుందేమో' అనిపిస్తోంది. శకుంతల కీర్తి పాదమహిమవల్లే ఇలా జరిగింది అనడం మాత్రం ఎంత మరిచిపోదామన్నా ఆయన తండ్రి హృదయం మరవలేకపోతోంది.

తను బంగారు తల్లిది దురదృష్ట జాతకమా? ఆమెతో నిశ్చితార్థం అవడం వల్లనే ఉదయ్ అల్పాయుష్కుడు అయ్యాడా? బహుశా ఈ మాటలు వినడంకన్నా పెద్ద శిక్ష తల్లిదండ్రులకి ఇంకోటి వుండదు.

శకుంతల అన్న మాటలకి ఆయనకి ఆమెమీద పెద్దగా కోపం రావడంలేదు. కీర్తికీ, శకుంతలకీ ఆయన దృష్టిలో పెద్ద తేడాలేదు. ఇద్దరూ

అలోగా నేనే ఇక్కడినుంచి పోతాగానీ....ఎందుకు పెద్దాయనా! లక్ష్మీదేవి కాళ్ళ దగ్గరకు వస్తుంటే వద్దంటావ్? నీకు టైం ఇస్తున్నా. ఈ నెంబర్‌కి సాయంత్రంలోగా నీ మనసు మార్చుకుంటే ఫోన్ చెయ్యి....వస్తా. ఈసారి పది లక్షలున్న పెట్టెతో...." అని నవ్వి లేచాడు నాగరాజు.

"ఛీ! ఇంకెప్పుడూ ఈ ఆఫీసులో కాలుపెట్టకు. దౌర్భాగ్యుడా!" అరిచాడు సాంబమూర్తి.

నాగరాజు గెడ్డం మునివేళ్ళతో రాసుకుంటూ "పది లక్షలు....వస్తా" అని వెళ్ళిపోయాడు.

సాంబమూర్తి మొహమంతా చెమటలు పట్టాయి, ఎంతో అవమానం జరిగినట్లుగా ఒళ్ళంతా దహించుకుపోతోంది. అంత బాధ ఎందుకో శరీరమంతా రక్తం బదులు నీతి నిజాయితీ ప్రవహించే మనుషులకే అర్థం అవుతుంది. తన శరీరాన్ని గొడ్డలితో నరికినా ఫర్వాలేదు. కానీ ఆత్మ గౌరవాన్ని ముక్కలుచేసే మాటలంటే ఎలా తట్టుకోవడం? తను డబ్బుకోసం గడ్డితిని కంపెనీకి ద్రోహం చేస్తాడా? తన నిజాయితీమీద ఎంతో నమ్మకం వుంచి ఒక తండ్రిలా తనతో ప్రతిదీ సంప్రదించే ఎం.డి.గారికి అన్యాయం చేస్తాడా? అసలు ఆ నీచుడ్ని ఆ చెంపా ఈ చెంపా వాయించకుండా వదిలి పెట్టడమే తను చేసిన పాపం.

ఆయన జేబులోంచి కర్చీఫ్ తీసుకుని మొహానికి పట్టిన చెమట్లు తుడుచుకుంటూ ప్యూన్‌ని పిలిచాడు.

"నాగప్పా! మంచినీళ్ళు తెచ్చిపెట్టు."

నాగప్ప ఆయన మొహంవంక తేరిపార చూస్తూ అన్నాడు. "ఏం సార్! ఆ చెమట్లేంటి? ఒంట్లో బాగాలేదా? ఏదో కంగారుగా కనిపిస్తున్నారే. ఏదైనా ట్రబులా?"

ఆయన జవాబు చెప్పడానికి ఓపిక లేనట్లు తల అడ్డంగా ఆడిస్తూ "ముందు మంచినీళ్ళు తెచ్చిపెట్టు" అని జేబులోంచి బీపీ టాబ్లెట్లు బయటికి తీసాడు.

"ఇంత కంగారుగా....మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు సార్!" అని నాగప్ప నీళ్ళుతెచ్చి పెట్టాడు.

ఆయన టాబ్లెట్ వేసుకుని నీళ్ళు తాగాడు.



"సార్! మిమ్మల్ని ఎం.డి.గారు ఒకసారి రమ్మన్నారు" నాగప్ప మళ్ళీ వచ్చి చెప్పాడు.

ఆయన తల వూపి, రెండు నిమిషాలు బల్లమీద తల వాల్చుకుని పడుకున్నాడు. మనసంతా అసలే చికాకుగా వుండటం, ఆపైన ఈ అలజడీ ఆయన్ని బాగా కదిలించివేశాయి. నెమ్మదిగా శక్తి కూడదీసుకుంటూ ఎం.డీ. గారి రూంవైపు నడిచాడు.

* * * *

"ఆ తర్వాత కథ....మీరు" వూహించగలరనుకుంటానూ!" అంది శృతకీర్తి.

"ఆ నాగప్ప....ఆయన బ్యాగ్‌లో డబ్బు పెట్టడం ఎం. డీ. గారికి నాగరాజు తన దగ్గర లంచం తీసుకుని సాంబమూర్తి టెండర్‌లో కోట్ చేసిన ఫిగర్స్ లీక్ చేసాడని చెప్పడం.... డబ్బుతో ఆయన రెడ్‌హేండెడ్‌గా పట్టుబడడం....జరిగిపోయి వుంటాయి. దాంతో అతని వుద్యోగం పోయింది. సరే, ఇదంతా చేయిస్తే మనకేం వుపయోగం?" అడిగాడు రాజారావు.

శృతకీర్తి నవ్వింది.

"అతను రోడ్డున పడితే మనకేం వస్తుందీ?" అన్నాడాయన.

"అంకుల్! ఒక మనిషిని దెబ్బకొట్టాలనుకున్నప్పుడు అతని స్వభావం గురించి బాగా స్టడీ చెయ్యాలి. సాంబమూర్తి చాలా నిజాయితీపరుడు. స్వామిద్రోహం....డబ్బుకోసం గడ్డితినడం అతని వంశంలో, రక్తంలో లేనేలేదు. అతనిలాంటి వ్యక్తికి....లంచం తీసుకుని కంపెనీ సీక్రెట్ అమ్మేస్తున్నందుకుగాను ఉద్యోగం పోవడం అనేది భరించగలిగే విషయం కాదు. ప్రాణాలకన్నా ఆయనకి ఆత్మగౌరవం ఎక్కువ."

"కొంపదీసి ఆత్మహత్య చేసుకోడు కదా!" ఆయన కంగారుగా అడిగాడు.

"చేసుకోడు! చేసుకోకుండా అడ్డుపడాలి....!" శృతి గంభీరంగా అంది.

"ఎవరు అడ్డుపడాలి?" ఆయన ఆత్రంగా అడిగాడు.

"మీరే!"

"నేనా?"

"అవును. మీరు ఇప్పుడు ఆయన్ని కలవబోతున్నారు. కలిసి ఒక విషయం స్పష్టంగా ఆయనకి అర్థమయ్యేటట్లు చెప్తారు. అదేమిటో మీకు తెలుసు."

రాజారావుకి ఆమె అంచనాలకీ, ఎత్తుగడలకీ తనే తల తడుముకోవాల్సి రావడం ఆశ్చర్యంగా వుంది. 'ఔరా! ఇరవై ఏళ్ళ ఆడపిల్లకి వుండాల్సిన తెలివితేటలేనా ఇవి' అనుకున్నాడు.

శృతి సెల్ రింగ్ అయింది. ఆమె రిసీవ్ చేసుకుని "యా....ఓ.కే! అలాగే....గుడ్" అని పెట్టేసి, రాజారావుతో అంది–

"అంకుల్! నాగరాజు చేసాడు. బయల్దేరండి....మంచి సమయం!"

* * * *

అసలే చీకటి....దారంతా గతుకులు అన్నట్లుగా వుంది సాంబమూర్తి పరిస్థితి. పులిమీద పుట్రలా ఒకదానిమీద ఒకటిగా జరుగుతున్న సంఘటనలు ఆయన్ని పిడుగుపాటు తిన్న వ్యక్తిలా మార్చాయి.

ఎం.డి. అన్న మాటలు వెయ్యి శతఘ్నుల్లా గుండెలో మార్మోగుతున్నాయి.

"మిమ్మల్ని ఎంతగానో నమ్మి, ఇంతకాలం ఒక తండ్రిలా గౌరవించినందుకు మీరు చేసిన ప్రత్యుపకారం ఇదా? తిన్నింటి వాసాలు లెక్కపెడతారా? కుక్కకి ఒక ముద్ద పడేస్తే ఇంట్లో ఎవర్నీ రానీయకుండా కాపలా వుంటుంది కదండీ అలాంటిది మీరే ఇంటిదొంగలా నా కంపెనీని ముంచాలని చూస్తారా? మీరేం చెప్పకండి. సమర్థించుకోవాలని చూడకండి. నాగప్ప చెప్పాడు మీరు ప్రొద్దుటనించీ చాలా కంగారుగా, భయపడుతూ వున్నారని. అంత భయం ఈ డబ్బు మీ బ్యాగ్‌లో దాచుకోబట్టేగా. వద్దు, ఇంకా ఒక్కక్షణం ఈ గదిలో వున్నా, కంపెనీ ఆవరణలో వున్నా నేను పోలీసుల్ని పిలిపించాల్సి వస్తుంది. వెళ్ళిపోండి మీ గౌరవాన్ని కాపాడుకుని, మీరే వెళ్ళిపోండి....హూ! గౌరవం అంటే అర్థం తెలుసా?"

రోడ్డుమీద నడుస్తున్న సాంబమూర్తి శరీరం స్వాధీనం తప్పుతోంది. అడుగు తడబడుతోంది. ఎందుకిలా జరిగిందో అర్థంకాక మెదడంతా మొద్దుబారిపోయింది.



"అప్పుడే తాగి రోడ్డున పడ్డావా నాయనా! ఎందుకొస్తారయ్యా మీరు మా ప్రాణాలు తియ్యడానికి కాకపోతే" హారన్ మోగిస్తూ ఒక స్కూటర్ పెద్దమనిషి ఈసడించిపోయాడు.

సాంబమూర్తికి విరక్తితో కూడిన నవ్వొచ్చింది ఒకేరోజు చేయని పాపానికి దొంగనయ్యాను. తాగకుండానే తాగుబోతునయ్యాను. ఇంకా ఏం కావాల్సి వుందో?

"సాంబమూర్తిగారూ...."

ఆ పిలుపు మొదట తనని అనుకోలేదు. కాఫీ కారు పక్కనే ఆపి ఆయన డోర్ తెరిచి మరీ పిలుస్తుండడంతో తననే అని తెలిసింది.

గోల్డ్‌ఫ్రేమ్ అద్దాలతో, ఖరీదైన సూట్‌లో వున్న ఒక పెద్దమనిషి కారుదిగి దగ్గరకి వచ్చాడు.

"సాంబమూర్తిగారూ! మీతో మాట్లాడాలి. నాతో రండి" అన్నాడు.

"మీరెవరు?" నిర్భావంగా అడిగాడు సాంబమూర్తి.

"నా పేరు రాజారావు. ఇప్పటిదాకా జరిగినవన్నీ ఎందుకు జరిగాయో మీకు తెలియాలంటే, నాతో రండి" అన్నాడాయన.

సాంబమూర్తి అప్రతిభుడైనట్లు చూశాడు. అంతలోనే కళ్ళల్లోకి వెలుగు రాగా ఆయన్ని రెండు చేతుల్తో కుదుపుతూ ఆత్రుతగా అడిగాడు. "జరిగిన దాంట్లో నా తప్పేం లేదనీ, నేను లంచగొండినీ, దొంగనీ, స్వార్థపరుడ్నీ, స్వామిద్రోహినీ కాదని మీకు తెలుసా?"

రాజారావు చిద్విలాసంగా నవ్వి 'అవును' అన్నట్లు తల వూపాడు.

సాంబమూర్తికి కొత్త వూపిరి వచ్చినట్లయింది. "అయితే పదండి. మా ఎం.డి. సుశీల్‌కుమార్‌గారికి నామీద జరిగిన కుట్ర గురించి చెప్పి ఈ మోయలేని నిందనుండి నన్ను తప్పించండి. నాకు మళ్ళీ ఉద్యోగం అక్కర్లేదు. ఆయనకి నా నిజాయితీ తెలిస్తే చాలు. నా చర్మం ఒలిచి మీకు చెప్పులు కుట్టిస్తాను. జన్మంతా మీకు ఋణపడి వుంటాను. నాకు మీరే దేవుడౌతారు. పదండి" దుఃఖంతో, ఆవేశంతో ఆయాసపడుతూ అన్నాడు.

"అలాగే....అలాగే....రోడ్డుమీద ఆవేశపడకండి. మనం ప్రశాంతంగా కూర్చుని మాట్లాడుకుందాం. నాతో రండి" అన్నాడు రాజారావు.

సాంబమూర్తి కన్నీళ్ళతో తల అడ్డంగా అడించి చెప్పాడు.

"ముందు ఈ భరించలేని అవమానం నుండి కాపాడండి. ఈ మచ్చని చెరిపెయ్యండి. తర్వాత మీరు రమ్మన్నచోటుకి వస్తాను. ఏం చెప్పినా చేస్తాను ప్లీజ్! మీ కాళ్ళు పట్టుకుంటాను" సాంబమూర్తి రోడ్డు అనైనా చూడకుండా ఆయన కాళ్ళమీద పడిపోతూ అన్నాడు.

రాజారావు ఆయన్ని లేవనెత్తి "సరే, అలాగే వెళ్దాం. కానీ ముందు నేను చెప్పేది వినాలి. తర్వాతే మీరు చెప్పినట్టు నేను చేస్తాను. ఆలోచించకోండి. ఓ గంట మీది కాదనుకుని నాతో వస్తే, మీ ఎం.డి.ని నేనే స్వయంగా పిలిచించి, నాగప్పచేత నాగరాజు మీ బ్యాగ్‌లో డబ్బు పెట్టించాడని రుజువు చేస్తాను. నాగప్ప తనంతట తనే నిజం ఒప్పుకునేట్లు కూడా చేస్తాను. కానీ, ముందు మీరు నాతో రావాలి" కండిషన్‌లా చెప్పాడు.

సాంబమూర్తి సంతోషంగా చూశాడు. కళ్ళు తుడుచుకుంటూ "అయితే ఆలస్యం చెయ్యకండి....పదండి" అన్నాడు.

* * * *

"చెప్పండి....నాతో మీరేం మాట్లాడాలి?" ఆలస్యం భరించలేనట్లు ఉద్వేగంగా అడిగాడు సాంబమూర్తి.

ఆ ఏ.సీ. రూంలో చల్లదనం నరాల్ని ఒణికిస్తోంది. గోడకి తగిలించిన పంజా విసరడానికి సిద్ధంగా వున్నట్టున్న పెద్దపులి చిత్రం.... వెన్నులో జలదరింపు కలగజేస్తోంది.

రూం ఫ్రెష్‌నర్ కూడా ఘాటైన సువాసనల్ని వెదజల్లుతూ తనకి చెందని ప్రపంచంలోకి విసిరివేయబడ్డట్టుగా సాంబమూర్తికి వెరపు కలిగిస్తోంది.

రాజారావు పైప్ తాగుతూ గంభీరంగా పచార్లు చేస్తున్నవాడల్లా ఆగి సాంబమూర్తి వైపు చూశాడు.

"చెప్పండి, అసలు ఎవరు పన్నారు ఈ పన్నాగం? నా జీవితంతో చెలగాటం ఆడాల్సిన అవసరం ఎవరికి కలిగింది? పిచ్చుకలాంటివాడిని, బ్రహ్మాస్త్రం ప్రయోగించాలన్న క్రూరమైన ఈ ఆలోచన ఎవరిది?" సాంబమూర్తి గొంతు దుఃఖంవల్లా, నీరసంవల్లా ఒణికిపోతోంది.

రాజారావు తీవ్రంగా చూస్తూ అన్నాడు-

"మీ అమ్మాయి పేరు కీర్తేనా?" హఠాత్తుగా ఆయన అడిగిన



ప్రశ్నకి బిత్తరపోతూ- "అవును" అన్నాడు.

"నాకు ఒక్కడే కొడుకు. సిద్ధార్థ.... కోటీశ్వరుడు వాడు. నీ కూతురికి నువ్వు కష్టపడి ఒక ఆరువేలు నెలకి సంపాదించేవాడికో, లేదా అతి కష్టపడి ఓ పదివేలు సంపాదించేవాడికో ఇచ్చి పెళ్ళి చెయ్యగలవు. అంతకన్నా పైకి కలలు కనే స్తోమత కూడా లేదు. అవునా?"

"ఇదంతా ఎందుకు చెప్తున్నారు?"

"అవసరం కాబట్టే.... నీ కూతురు అందుకే తెలివిగా ప్రేమ అనే ఎత్తుతో నా కొడుకును వలలో వేసింది. కోట్లకి వారసుడు, నెలకి లక్ష పైగా సంపాదించే చార్టెడ్ ఎకౌంటెంటని గాలం వేసి లాగింది."

"రాజారావుగారూ" సాంబమూర్తి కంఠం ఆ గదిలో ప్రతిధ్వనించింది.

ఆ స్వరంలో పలికిన వాడికి ఒక్కక్షణం వులిక్కిపడి అంతలోనే సర్దుకుని "ఏం....మీకు ఇవన్నీ తెలీదా?" అన్నాడు రాజారావు.

సాంబమూర్తి ఉద్యోగం పోయినప్పుడు అవమానంతో కృంగిపోయినట్లు ఒంగిపోయి వున్నాడు. కానీ ఈసారి జరిగిన అవమానానికి రోషంతో ఆవేశంతో పడగ ఎత్తినట్లు ఒంట్లోని శక్తినంతా కూడగట్టుకుని సోఫాలోంచి లేచి రాజారావు దగ్గరగా వచ్చాడు.

"ఇన్నాళ్ళూ నా సేవలు వినియోగించుకుని నన్ను దొంగ అన్న మా ఎం.డి. మాటలకి నా గౌరవం పోయిందేగానీ, ఈ ప్రాణాలు పోలేదు. కానీ మీరు ఇప్పుడు నా ప్రాణానికి ప్రాణం అయిన నా కూతురి గురించి అంటున్న మాటలకి మాత్రం ప్రాణాలు పోతాయేమో అన్నంత బాధగా వుంది. ఈ అవమానం, నా శరీరానికే కాదు, నా నమ్మకానికి రాజారావు. నా కూతురి గురించి నీకు తెలీక ఇలా మాట్లాడుతున్నావు. అది నిప్పు. నా మేనల్లుడితో దానికి పెళ్ళి కూడా నిశ్చయమైంది. నా కీర్తి ఇలాంటి పని, నాకు తెలియకుండా ప్రాణం పోయినా చెయ్యదు. మీరు పొరపడ్తున్నారు అని చెప్పడానికి గర్విస్తున్నాను."

రాజారావు హేళనగా నవ్వాడు.

"మీ అమ్మాయి స్వయంగా ఫోన్ చేస్తేనే, నాకు వాళ్ళ ప్రేమ విషయం తెలిసింది. అయినా ప్రతి తండ్రీ కూతుళ్ళ గురించి చెప్పే

మాటలే ఇవి. ఆత్మవంచన చేసుకోకపోతే బ్రతకలేరు సాంబమూర్తీ....ఆ నిజం నాకు తెలుసు."

"హూ! నువ్వు అనునిత్యం చేసే పని అదేనేమో కానీ....నేనెన్నడూ చేసుకోలేదు. కేరెక్టర్ అనేది ప్రాపర్టీకన్నా విలువైనది అని నమ్మతాం మేము. నువ్వు ఇందాక చెప్పిన లక్షలు అప్పనంగా వస్తున్నాయన్నా, ఒక నిరుపేద కుటుంబానికి అన్యాయం జరుగుతుందని తెలిసి నా మొత్తం కుటుంబం ఆ ఆస్తిని తిరస్కరించాం. ఆత్మసంతృప్తికోసం డబ్బుని కాదనడం, బహుశా మీ డబ్బున్నవాళ్ళు వూహించనైనా వూహించరేమో కదూ! అటువంటి నా కూతురు, తనకి పుట్టినప్పుడే పెళ్ళి తన బావతో నిశ్చయమైపోయిందని తెలిసిన పిల్ల....నీ కొడుకుని ప్రేమించిందా....అని నేను నమ్మాలా హూ! జరగని పని. అదే జరిగితే, ఈ సాంబమూర్తి అన్నపానాదులు మానేసి బలవన్మరణం పొందుతాడు. ఇదే నా ప్రతిజ్ఞ."

"ప్రతిజ్ఞలు చెయ్యడానికి నువ్వు హరిశ్చంద్రుడివేం కాదుగానీ, ముందు నా కొడుకుని ఏం చేశారో, వాడు ఎక్కడున్నాడో చెప్పు. నీకు తెలియకపోతే నీ కూతుర్ని పంపించు. నాగరాజులాంటి గూండాలచేత నేను చెప్పిస్తాను. నాకు అట్టే సమయం లేదు. విసిగించకుండా నిజం చెప్పెయ్యి. దాంతో నీ పోయిన ఉద్యోగమూ వస్తుంది. నీ కూతురి పెళ్ళికి ఋణమో, పణమో నేనూ ఇస్తాను. ఇంతకన్నా దయచూపించడం నావల్ల కాదు. ఆలోచించుకో!"

సాంబమూర్తికి అతను అనే ప్రతి మాటా గుండెల్లో గుచ్చుకున్న గునపం పోటైంది. ఆయన గుండె పట్టుకుని బాధగా అన్నాడు. "నీ దయాదాక్షిణ్యాలతో నా కూతురి పెళ్ళి చెయ్యడానికి మేమేం బిచ్చగాళ్ళం కాదు. ముందు నువ్వు నీ కొడుకు గురించి పోలీస్ రిపోర్ట్ ఇచ్చుకో. అర్థం శుభం తెలీని నా కూతురిమీద నిందలు వెయ్యకు. పురుగులు పడిపోతావ్. ఛీ! కేవలం ఒక ఆడపిల్లమీద అనుమానంతో నీచమైన పన్నాగం పన్ని నేను ఇన్నేళ్ళుగా కూడగట్టుకున్న పరువు కొల్లకొడతావా? పరువు అనే మాటకి అర్థం తెలిస్తే అలా చెయ్యగలవా? అది నీ ఇనప పెట్టెలో నువ్వు దాచుకునే ముక్కిపోతున్న సొమ్ము కాదు, పోతే మళ్ళీ సంపాదించుకోడానికి. నీలాంటివాళ్ళు మనుష రూపంలో వున్న రాక్షసులు."



"షో ర్యుప్....నీతులు చెప్పకు. ఇంటికి వెళ్ళి నీ కూతుర్ని అడిగి నిజం తెలుసుకో! నా కొడుకు ఎక్కడున్నాడో చెప్పి, ఇంక వాడి దార్లోకి రానని నీ కూతురిచేత ఒప్పించు. నీ బాస్‌తో మాట్లాడి నీ ఉద్యోగం నీకు వచ్చేట్లు చేస్తాను. దట్సాల్!"

"రాక్షసుడా! నీ సహాయంతో వచ్చే ఉద్యోగం చేసేకన్నా అడుక్కుతినడం పరువైన పని. మళ్ళీ చెప్తున్నాను విను, నా కూతురు నిప్పు, అది ఈ ప్రేమలూ దోమలూ, గొప్పింటి కుర్రాడితో ఫోన్లూ, షికార్లూ చేసే పిల్ల కాదు! దాని పేరు కీర్తి."

"నీ పేరు కుబేరుడయితే....నువ్వు ధనవంతుడివైపోతావా....చాలు చాలు పెద్ద చెప్పొచ్చావు. వెళ్ళి నీ కూతుర్ని అడిగి నా కొడుకు ఎడ్రెస్ చెప్పు. మళ్ళీ నీ కూతురు నా కొడుకు పేరు ఎత్తకుండా చూడు. లేదా నీకు ఇంకా యిద్దరు పిల్లలున్నారు. వాళ్ళు ఈ పాపానికి అన్యాయంగా బలైపోతారు."

"బెదిరిస్తున్నావా?"

"అలాంటిదే....వినకపోతే అనుభవిస్తావు. రేపటిలోగా నీ కూతురిచేత నిజాలు కక్కించు. పో–ఇప్పటికే అనవసరంగా చాలా టైం నీతో గడిపేశాను" రాజారావు ఈ మాటలని, ఛీత్కారంగా చూసి విసురుగా గది తలుపు తీసుకుని వెళ్ళిపోయాడు.

అటూ ఇటూ నెమ్మదిగా వూగుతున్న స్వింగ్ డోర్‌ని చూస్తుంటే సాంబమూర్తికి జరిగినదంతా కలైతే బావుండ్ను అన్న ఆలోచన బలంగా కలిగింది. కానీ నిజమే అనడానికి సాక్ష్యంగా తనింకా ఆ ఏ.సీ. గదిలోనే వున్నాడు. బలహీనమైన శరీరంతో, ఛిద్రమైనటువంటి మనసుతో నెమ్మదిగా కాళ్ళీడిస్తూ బయటికి నడిచాడు.

'కీర్తీ....ఇన్ని నీలాపనిందలు నీకు ఎందుకొస్తున్నాయిరా తల్లీ!' అనుకున్నాడే కానీ, అది నిజమేమో అన్న వూహ కూడా అతని మనసులోకి ఒక్కసారి కూడా రాలేదు! అంత నమ్మకం....కూతురిమీద.

* * * *

మునుపెవరూ చూడని ఒక అలౌకిక అద్భుత ప్రపంచం పేరే స్వర్గం. ఆ స్వర్గానికి-ఈ భువికీ మధ్యన ఓ వారధి నిర్మించాలని భగవంతు

డికి కోరిక కలిగితే, దానికోసం కేవలం అనుభూతించగలిగేలా ముట్టుకుని ఆనందించలేనట్లుగా వుండే ఒక పదార్థం కోసం వెతికాడుట. దొరకలేదుట!

కానీ అతను సృష్టించిన మానవుడు ఆ వంతెన నిర్మించాడుట.... ప్రేమ అనే భావనతో.

'ప్రేమ స్వప్నానికీ, వాస్తవానికీ మధ్యన అమరే వంతెన!'

కీర్తి దుమ్ముపట్టిన గాజు సామాగ్రినీ, బొమ్మలనీ బట్టతో తుడుస్తూ ఆలోచిస్తోంది.

ఉదయ్, నిజంగా తన జీవితంలోంచి మాయమైపోయాడా? ఎందుకు? తనవల్ల ఏమయినా తప్పు జరిగిందా?

ఆమె దృష్టి తన కుడి ముంజేతిమీద పడింది. ఇంకా సిద్ధూ స్పర్శ అక్కడ వెచ్చగా తగులుతున్నట్లే వుంది. అప్రయత్నంగా చేతిని విదిలించింది. భళ్ళున శబ్దం చేస్తూ గాజుబొమ్మ ఒకటి క్రిందపడి బ్రద్దలైంది.

"ఏవిటే ఆ శబ్దం?" అంటూ సుభద్ర వంటింట్లో నుండి బయటికి వచ్చి చూసింది.

గాజు కుందేలు పిల్ల....సాంబమూర్తికి ఆయన చిన్ననాటి మిత్రుడొకడు చైనా నుండి తెచ్చి ప్రేమగా యిచ్చిన బహూమతి! అది ఆయనకి అత్యంత ప్రీతిపాత్రమైనది.

"వస్తువు ఎంత చిన్నది అన్నది కాదు, ఎంత దూరం నుండి మన కోసం భద్రంగా పట్టుకొచ్చారూ అన్న దానిమీద ఆ వస్తువు విలువ నిర్ణయింపబడుతుంది" అని ఆయన ఎన్నో సందర్భాల్లో చెప్పాడు. అందులోనూ, వస్తువు అతి జాగ్రత్తగా తేబడిన గాజుబొమ్మ!

"అయ్యో! మీ నాన్నగారికి ఎంతో ఇష్టమైన బొమ్మని బద్దలు కొట్టావు కదే, ఆయన ఈ విషయాన్ని ఎలా భరిస్తారో!" సుభద్ర కింద పగిలిన గాజుముక్కల్ని ఏరుతూ అంది.

కీర్తికి బాధగానే వుంది. తండ్రి మనసు ఎంత సున్నితమో ఆమెకి తెలుసు! కళ్ళనిండా నీళ్ళతో తునాతునకలైన బొమ్మనే చూస్తూ నిలబడింది.

"సుభద్రా...." సాంబమూర్తి లోపలికి వస్తూ పిలిచాడు.

కీర్తి కళ్ళెత్తి భయంగా తండ్రివైపు చూసింది. ఎన్నో ఏళ్ళు పైబడిన వాడిలా ఆయన నీరసంగా కనిపించాడు.



సుభద్ర లేచి నిలబడి సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లుగా "అది చూసుకోలేదండీ, చెయ్యి జారిపోయింది" అంది.

సాంబమూర్తి తీక్షణంగా కూతురివైపే చూస్తూ నిలబడ్డాడు.

కీర్తి తండ్రిని అలా ఎన్నడూ చూడలేదు. నాలిక తడబడుతుండగా "నాన్నా! నన్ను క్షమించండి" అంది.

సాంబమూర్తి నిస్సత్తువగా కుర్చీలో కూలబడ్డాడు.

"ఏ తప్పుకి క్షమార్పణలు అడుగుతున్నావు తల్లీ?" అన్నాడాయన.

"మీకు ఎంతో ఇష్టమైన గాజుబొమ్మ పగలగొట్టానుగా నాన్నా!" అంది కన్నీళ్ళతో కీర్తి.

సాంబమూర్తి బాధగా చూశాడు.

"ఈరోజు చాలా బద్దలయ్యాయి తల్లీ! అందులో ఇదొకటీ. అన్నింట్లోకీ అల్పమైన విలువ కలది యిదే" అన్నాడు.

సుభద్రా, కీర్తీ ఆశ్చర్యంగా ఆయన మొహంలోకి చూశారు.

"నా ఉద్యోగాన్ని పోగొట్టుకున్నాను! పరువునీ ప్రతిష్టనీ కూడా!"

"ఆ!....ఏమైందండీ?" అని అడుగుతున్న సుభద్రని ఆగమని సైగచేశాడు.

"నా గౌరవాన్ని, నా నమ్మకాన్ని బద్దలుకొట్టాలని ఎవరో తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అదే జరిగితే, ఈ నాన్న నీకు వుండడమ్మా!"

కీర్తి మొహంలోకి భయం ఒక్క వుదుటున ఎగదన్నుకొచ్చింది. క్రొటాటలా బిగుసుకుపోయి తండ్రివైపు చూస్తూ నిలబడింది.

"కీర్తీ....గాజుబొమ్మకన్నా సున్నితమైనదమ్మా నీ మనసు. నాకు తెలుసు! కానీ, ఆ విషయంలో నా జీవితాన్ని ముడివేశాడా పెద్దమనిషి. అంత పెద్ద నింద నీమీద వేసేముందు క్షమార్పణలు అడుగుతున్నాను."

కీర్తి వూపిరి బిగబట్టి ఆయన వేసే ప్రశ్న కోసం ఎదురుచూస్తూ నిలబడింది.

"నిందా? ఏమిటండీ....నాకు అర్థమయ్యేటట్లు చెప్పండి" సుభద్ర గాభరాగా అడిగింది.

ఆయన ఆవిడ్ని ఆగమన్నట్లు కళ్ళతో సైగచేశాడు.

"కీర్తీ....నువ్వు ఉదయ్‌కన్నా ముందే ఎవరినైనా ప్రేమించావా?"

కీర్తి హృదయానికి గండిపడినట్లయింది.

'ఉదయ్‌కన్నా ముందే ప్రేమిస్తే....' క్షమించెయ్యగల ఔదార్యం ఆయన కంఠంలో పలికింది. కానీ, నిజం తెలిస్తే....

"చెప్పమ్మా...." ఆతృతగా అన్నాడాయన.

"అయ్యో.... అదేం ప్రశ్నండీ?" ఏడుపుగొంతుతో అంది సుభద్ర.

ఆయన కళ్ళలోకి కళ్ళుపెట్టి చూసే ధైర్యంలేనట్లు కీర్తి కళ్ళు వాల్చేసింది. అబద్ధం చెప్పటం పాపం అని నేర్పిన తొలిగురువు, తండ్రికి అబద్ధం చెప్పడమా....లేక విజం చెప్పి ఆయన్ని కుప్పకూల్చేయడమా!

"అదేమిటండీ, కీర్తి సంగతి మీకు తెలీదూ? మనకి తెలియకుండా ఏ విషయమైనా అది దాచగలదా? మార్కులు తక్కువ వస్తే ఏ పిల్లలైనా దాచిపెట్టేస్తారు. కానీ అది మార్కులు ఎక్కువ వచ్చినప్పుడు దాచిపెట్టి, తక్కువ వచ్చినప్పుడు మీ ఒళ్ళో తల పెట్టుకొని ఏడ్చే పిల్ల. అలాంటిది ఉదయ్‌ని కాకుండా ఎవరినో ప్రేమించి ఉదయ్‌తో నిశ్చితార్థం చేసుకుంటుందా? మనపిల్ల గురించి మనమే ఇలా మాట్లాడితే ఎలాగండీ?" సుభద్ర కన్నీళ్ళతో ఆవేశంగా అంది.

కీర్తి కళ్ళు గట్టిగా మూసుకుని ఆలోచించింది. తల్లిదండ్రులు పిల్లలకి ఎన్నో వస్తువులు డబ్బుతో కొనిస్తారు. అవన్నీ పిల్లలు పెద్దయ్యాక వాళ్ళకి ఖరీదైనవి చూసి కొనిచ్చేయచ్చు. కానీ నమ్మకం, ఆలంబనా ఇవి తిరిగి అందించడం కష్టమైన పని ఇవే వాళ్ళకి పెద్దవయసులో అవసరం కూడా!

"నాన్నా....మీ ప్రశ్నకి జవాబు చెప్తాను. కానీ మీరు ముందు నేను అందించే మజ్జిగ తాగాలి!"

సుభద్ర తెల్లబోతూ చూసింది.

తడారిపోయిన గొంతుతో నీరసంగా కూర్చున్న సాంబమూర్తి ఆశ్చర్యంగా చూశాడు.

"అసలు చెప్పడానికి ఏం వుందే?" సుభద్ర ఏదో అనబోయింది.

కీర్తి ఆమెని ఆగమని సైగచేసి వంటింట్లోకి వెళ్ళి దేవుడి మందిరం



ముందు నిలబడి చేతులు జోడించి "నాకు-మా నాన్నకి నిజం చెప్పగలిగే ధైర్యం ఇవ్వు తండ్రీ!" అని ప్రార్థించింది. ఆ తర్వాత మజ్జిగ గ్లాసులోకి ఒంపి తీసుకొచ్చి అందించింది.

సాంబమూర్తి ఆమె కళ్ళల్లోకి సందేహంగా చూశాడు.

"మీరు తాగితే చెప్తానన్నాగా" ఆయన కాళ్ళ దగ్గర కూర్చుంటూ అంది.

చిన్నప్పుడు ఏదైనా కావాలని అడగాలన్నా, ఏదైనా తప్పుచేసినట్లు అనిపించినా కూడా ఇలాగే కూర్చునేది.

సాంబమూర్తి కూతురి మాట కాదనలేక గటగటా మజ్జిగ తాగాడు. కడుపులో చల్లగా అనిపించింది. అసలే ఎసిడిటీ వున్న తండ్రికి చల్లని మజ్జిగిచ్చి మండకుండా చేసిన కూతురివైపు చూస్తుంటే ఆయనకి పొద్దుటి నుండి పడ్డ బాధంతా ఉపశమించినట్లు అయి, పోయిన ధైర్యం, పోతున్న నమ్మకం తిరిగి రాసాగాయి.

"ఎక్కడో చదివాను నాన్నా! జీవితంలో మనం ఎన్నిసార్లు భయపడ్డామో లెక్కపెట్టుకుంటే, అన్నిసార్లు మనం భయాన్ని జయించినట్లుట. ఎందుకంటే, తర్వాత కూడా బ్రతికే వున్నాం కాబట్టి."

ఆయనమీద ఆ మాట బాగా పనిచేసింది.

"మీ ప్రశ్నకి నేను సమాధానం చెప్పేముందు ఒకటి తెలుసుకోవాలనుంది నాన్నా! నా సందేహాలన్నీ ఇప్పటివరకూ మీరే తీర్చారు కాబట్టి ఇదీ మీరే తీర్చాలి....తీరుస్తారా?"

ఆయన తల వూపాడు.

"ప్రేమంటే ఏమిటి నాన్నా?"

ఆయన ఉలిక్కిపడ్డాడు.

సుభద్ర తుళ్ళిపడింది.

కీర్తి ఆర్తిగా చూసింది.

"ఒక మనిషి మీద భరించరానంత ఇష్టం కలగడం" అన్నాడు.

"అలా ఎన్నోసార్లు చిన్నప్పుడు చెల్లెలిమీదా, తమ్ముడిమీదా, మనం పెంచుకునే బుజ్జికుక్కమీదా, పూజించే కృష్ణుడిమీదా కలిగేదేగా నాన్నా! అప్పుడు అది తప్పు అనలేదుగా!"

"వయసొచ్చాక యువతీ యువకులు ఇష్టం అనే ఆకర్షణలో పడి ఒకరితో ఒకరు కలిసి తిరగడం, శారీరక వ్యామోహంలో పడి హద్దుల దాటడం....ఇది ఇప్పుడు నేనడిగే ప్రేమంటే! అలా నువ్వు ఉదయ్‌కన్నా ముందు ఎవరినయినా ప్రేమించావా?" కఠినంగా అడిగాడు.

కీర్తి తల వాల్చుకుని అంది. "ఉదయ్‌ని నేను మీరుచెప్పిన విధంగా ఎప్పుడూ ప్రేమించలేదు నాన్నా!"

"ఆ!" సుభద్ర నోరు నొక్కుకుంది.

"నేను ఉదయ్‌తో నిశ్చితార్థం ముందే ఎవర్నీ ప్రేమించలేదు."

సుభద్ర నోటిమీద నుండి చెయ్యి తీసి గుండెలమీద వేసుకుని— "నేను చెప్పలేదండీ....అదీ...." అని మాట్లాడబోయింది.

"పూర్తిగా వినమ్మా!" అంది.

సాంబమూర్తి కుర్చీలో ముందుకి ఒంగి కూతురివైపు ఆత్రంగా చూడసాగాడు.

కీర్తి కళ్ళెత్తి ఆయనవైపు సూటిగా చూస్తూ—"విశాలి పెళ్ళికి వెళ్ళి వస్తుంటే...." అని చెప్పసాగింది.

● ● ● ●

"మీరు నమ్మినా నమ్మకపోయినా ఒకే ఒక్కసారి మేం ఇద్దరం కలుసుకుని మాట్లాడుకున్నాం నాన్నా! అప్పుడే నేను జీవితంలో మ ఇంకెప్పుడూ కలుసుకోకూడదని అతని దగ్గర మాట తీసుకున్నాను. అత నా మాటకి విలువిచ్చాడు. ఆ తర్వాత ఏమయ్యాడో నాకు తెలీదు. కల రానంత ఇష్టం కలగడమే ప్రేమైతే, నేను ప్రేమించాను నాన్నా....సిద్ధా ప్రేమించాను."

సుభద్ర అప్పటికే కీర్తి పక్కన కూర్చుని వెక్కి వెక్కి ఏడు స్తోంది. సాంబమూర్తి దిగ్భ్రాంతి చెందినట్లు కీర్తివైపు చూస్తున్నాడు.

"ప్రేమించుకున్నాం కాబట్టి, మేం కలిసి తిరగలేదు. రోజూ గంట తరబడీ కబుర్లు చెప్పుకోవడంలేదు. ఉత్తరాలు రాసుకోవడంలేదు. కల చూసుకోవాలని కూడా ప్రయత్నించడంలేదు! నా మనసులో ఎవరికీ తెలీ ఓ మూల అతని రూపాన్ని ప్రతిష్ఠించుకుని ప్రేమిస్తున్నాను. ఆ భావ తప్పా? నాకు ఇష్టమైన రంగు బట్టలు, బొమ్మలు, ఇష్టమైన కూర—అన్నీ



అందివ్వాలనుకున్నారు మీరు. అవి చూసినప్పుడు నా కళ్ళల్లో కదలాడే ఆనందాన్ని చూసి నువ్వూ,అమ్మా మురిసిపోయారు. ఇప్పుడు నా ఇష్టాన్ని గౌరవించలేకపోతున్నారా నాన్నా....నా మనసులో ఒక మూలనున్న ఆ రూపం, మీకేం అడ్డుపడిందనీ అదో నేరంగా భావిస్తున్నారూ?"

సాంబమూర్తి చెయ్యి కుర్చీ కోడుమీద బిగుసుకుంది. "ఎదురుదెబ్బ తగిలినచోటే మళ్ళీమళ్ళీ తగుల్తూ వుంటుందమ్మా! అదే ఇప్పుడు జరిగింది" అన్నాడు.

"నేను కావాలని ఏమీ చెయ్యలేదు నాన్నా!" స్థిరంగా అంది కీర్తి.

"నోర్ముయ్ ముదనష్టపుదానా! నాకు పెళ్ళి కుదిరింది. ఇంకొక పిల్లని చూస్కో అని, అతనితో అప్పుడే చెప్పకుండా, మనసులో అతని రూపాన్ని ప్రతిష్ఠించుకోవడం తప్పుకాదా....?" సుభద్ర కోపంగా అరిచింది.

కీర్తి అసహాయంగా చూస్తూ "అది నా చేతిలో లేదమ్మా!" అంది.

"నాలిక చీరేస్తాను మళ్ళీ మాట్లాడావంటే" సుభద్ర కీర్తి జుట్టుపట్టుకుని చెయ్యి ఎత్తుతూ అంది.

"సుభద్రా!" సాంబమూర్తి వారించాడు.

దాన్ని వదిలిపెట్టు....ఇప్పుడు ఏం చెయ్యమంటుందో చెప్పమను. ఆ పిల్లవాడి తండ్రి ఇంకెప్పుడూ తన కొడుకు పేరు ఎత్తననీ, అతన్ని ప్రేమించడం మానేస్తాననీ, దీనిచేత రేపు తనతో చెప్పించమంటున్నాడు. ఆయన కొడుకు జాడ కూడా దీనికి తెలుసని అనుమానిస్తున్నాడు. అలా గనక చెప్తే...." అని ఆగిపోయాడు.

"చెప్తే...." సుభద్ర ఆగలేనట్లు అడిగింది.

"నేను దొంగతనం చెయ్యలేదని మా ఎం.డి.కి ఆధారాలతో చెప్పి నామీద పడ్డ నింద మాపుతాడుట. లేదా మన జీవితాన్ని నేలరాచేస్తాడుట" అని కీర్తివైపు చూసాడు.

"అయ్యో భగవంతుడా! ఎంత దుర్బుద్ధి పుట్టించావు దీనికి నాయనా! నాకింకా ఇద్దరు పిల్లలున్నారే....నీ మొహంమండా....నేను ప్రేమించలేదనీ....ఇకముందు అతగాడ్ని ప్రేమించననీ అనవేమే? వెళ్ళు....వెళ్ళి ఆ పెద్దాయన కాళ్ళమీద పడి మీ నాన్నగారి గౌరవాన్ని కాపాడు. లే...."

అంది ఏడుస్తూ సుభద్ర.

కీర్తి అసహాయంగా చూస్తూ అంది.

"ఆయన ముందుకెళ్ళి ఏం చెప్పమంటారు? సిద్ధార్థని ప్రేమించననా? అది ఆయనని ఏం బాధపెడుతోందనీ? సిద్ధార్థ అనే వ్యక్తి ఎక్కడ వున్నాడో నాకు తెలియదనా? ఆ విషయం తెలిస్తే....ఎందుకు ఆయనకి ఫోన్ చేస్తానూ?"

సాంబమూర్తి అడిగాడు- "నీకు నేనంటే ప్రేమలేదా?"

"నాన్నా!" దెబ్బతిన్నట్లు చూసింది కీర్తి.

"ఉంటే....నేను చెప్పినట్లుగా ఆయనతో చెప్పు. మీ అబ్బాయిని నేను ప్రేమించను. నన్ను నమ్మండి. మా జోలికి రాకండి, అని చెప్పు.... పద."

కీర్తికి అప్పుడొచ్చింది గుండెల్లోంచి ఆపుకోలేనంత దుఃఖం.

"ప్రపంచం మునిగిపోతోంది, ఒకేఒక్క ఫోన్‌కాల్ చేసే సమయం మాత్రం మనుషులకి వుంది అని ఎవరైనా చెపితే జనమందరూ ఫోన్లదగ్గర ఒకరిని ఒకరు తోసుకుంటూ అవతల వ్యక్తికి ఒకే ఒక్క వాక్యం చెప్పడానికి తహతహలాడరూ! ఆ వాక్యం 'ఐ లవ్ యూ!' ప్రాణాలు నిలిపే ఆ ప్రేమని నా ప్రాణం తీయడానికి వాడమంటారా నాన్నా! నా ప్రేమ ఆయనకి ఏ విధంగానూ నష్టం చెయ్యదని చెప్తాను."

"నువ్వు అతన్ని ప్రేమించడం మానవా?" సుభద్ర కోపంగా అడిగింది."

"మానేస్తాను అని చెపితే నువ్వు నమ్మేస్తావని నాకు తెలుసు. కానీ అంత నమ్మకద్రోహం నేను చేయలేను. మీ అందరికీ ఒట్టేసి చెపుతాను. సిద్ధార్థని కలుసుకోను, మాట్లాడను. నన్ను నమ్మండి" కీర్తి అంది బాధగా.

"మేమంటే అంత ప్రేమ వున్నదానివి....అతన్ని ప్రేమించడం మానెయ్యొచ్చుకదే" సుభద్ర తల బాదుకుంటూ అంది.

"అయ్యో! ఇదేమయినా సినిమాలు మానెయ్యడమా, అన్నం మానెయ్యడమా....మానేస్తానని అందుకు ట్రైచేయడానికి. ఒక్కనిమిషం కూడా ఎడతెరిపి లేకుండా మనసులో ముసిరే అతని తాలూకు ఆలోచనల్ని! రూపాన్ని దేనితో తుడవనూ? ఎలా ఆపగలనూ? అర్థం చేసుకోరే" కీర్తి



రెండు చేతులతో తల పట్టుకుని కూర్చుంది.

సాంబమూర్తి లేచి ఆమె దగ్గరగా వచ్చి తలమీద తన చేతిని వుంచి అన్నాడు—

"కోపంతో వెనక్కి తిరగకు. భయంతో ముందుకు చూడకు. చుట్టూ వున్న పరిస్థితుల్ని అకళింపు చేసుకుని సాగిపోవాలమ్మా! నీ చుట్టూ నీ వాళ్ళంతా వున్నారు. మీ అమ్మ, తమ్ముడు, చెల్లి....వీళ్ళల్లో ఎవరికయినా, ఏమయినా జరగకూడనిది జరిగితే....నువ్వు భరించగలవా? అది నీవల్లే జరిగిందని తెలిస్తే తట్టుకోగలవా....? ఆ రాజారావు చాలా పట్టుదలగల వ్యక్తిలా వున్నాడు. అహంకారీ, కోపిష్టి! అతని కోపాన్ని, అహాన్ని నువ్వు ఒక్కమాటలో ఉపశమింపచెయ్యగలవు. ఆ సిద్ధార్థని ప్రేమించడం లేదని చెప్పడంద్వారా" అని ఆగాడు.

వంశీ క్రికెట్ బ్యాట్ భుజాన పెట్టుకుని ఏడుస్తూ వచ్చాడు.

"చూశావా నాన్నా....మా పీ.టీ. సార్ ఏం చేసాడో" అంటూ వచ్చి తండ్రి భుజానికి తల ఆన్చాడు.

ఏం చేసాడురా?" సాంబమూర్తి గొంతు వణికింది.

"నేషనల్స్‌కి సెలెక్ట్ అయ్యానని చెప్పానా ...ఈ రోజు ఎవరో పెద్దాయన వచ్చి ఏదో మాట్లాడి వెళ్ళాడు. మేం ప్రాక్టీసు చేస్తుంటే వచ్చి నన్ను పిలిచి 'వంశీ! రేపట్నుంచి క్రికెట్ గ్రౌండ్‌వైపు రాకు. నిన్ను జట్టులోంచి తీసేస్తున్నాను' అన్నాడు. "ఎందుకు సార్?" అని అడిగితే, నా తలమీద చెయ్యివేసి- 'రాజారావుగారు మన స్కూల్ ఛైర్మన్‌గారికి కావలసినవారు. ఆయనతో ఏమైనా గొడవలుంటే త్వరగా రాజీపడమని మీ నాన్నగారితో చెప్పు. లేకపోతే స్కూలులోంచి నువ్వు వెళ్ళవలసివస్తుంది' అని వెళ్ళిపోయాడు. ఎవరు నాన్నా....ఈ రాజారావు?" వంశీ ఏడుస్తూ అడిగాడు.

సాంబమూర్తి కీర్తివైపు చూపిస్తూ— "మీ అక్కనే అడుగు" అన్నాడు.

"ఎవరక్కా! నా భవిష్యత్తుని ఇలా ఒక్కమాటలో నాశనం చేసిన ఆ స్కౌండ్రల్?" వంశీ కీర్తి రెక్కపట్టుకుని కుదుపుతూ అడిగాడు.

"ఏమండీ....ఏమిటండీ ఇది?" సుభద్ర గుండె పట్టుకుని బాధతో

మెలికలు తిరగసాగింది.

"సుభద్రా....సుభద్రా...." సాంబమూర్తి ఆమెని గబుక్కున పట్టుకుని గుండెమీద రాస్తూ "ఏమైంది సుభద్రా?" అన్నాడు.

కీర్తి స్పృహలోకి వచ్చినట్లుగా "వంశీ! డాక్టర్ని తీసుకురా" అని తల్లి దగ్గరగా వచ్చింది.

సుభద్ర మాట్లాడలేక చేతులు తిప్పుతూ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తోంది.

"ఏమిటమ్మా! ఏం చెప్పాలనుకుంటున్నావు?" అడిగింది కీర్తి.

"మంచినీళ్ళు కావాలా?" వంశీ ఏడుస్తూనే కంగారుగా అడుగుతున్నాడు.

"సుభద్రా! కళ్ళు మూసుకోకు. మాట్లాడు. వంశీ! డాక్టరుగారిని వెంటపెట్టుకురా" అన్నాడు సాంబమూర్తి.

"ప్రీతి....ప్రీతి....ఇంకా ఇంటికి రాలేదంటే, నాకేదో భయంగా వుంది."

ఆ మాటకి కీర్తి కళ్ళు చీకట్లయ్యాయి. దీనంగా తండ్రివైపు చూసింది.

పట్టుకోడానికి ఏ ఆలంబనా లేనివాడిలా నీళ్ళు నిండిన కళ్ళతో ఆయన భార్య తలని నిమురుతూ వుండిపోయాడు.

కీర్తి చటుక్కున లేచి చెప్పులేసుకుని బయటకి పరుగుతీసింది.

* * * *

సాంబమూర్తి సుభద్రని మంచంమీదకి చేర్చాడు.

"నా పిల్లలు....నా పిల్లలు...." అ ఒక్కముక్కే అంటోంది ఆయాసపడుతూ సుభద్ర.

వంశీ డాక్టర్ని తీసుకువచ్చాడు.

ఆయన సుభద్ర పల్స్ చూసి వెంటనే ఇంజెక్షన్ ఇచ్చి "బలహీనంగా వుండటంబట్టి తట్టుకోలేక పోయారు. ఎందుకైనా మంచిది ఒకసారి అన్ని టెస్టులూ చేయించండి" అని ప్రిస్కిప్షన్ రాసిచ్చి ఫీజు తీసుకుని వెళ్ళిపోయాడు.

డాక్టర్ ఇచ్చిన ఇంజెక్షన్వల్ల సుభద్ర నిద్రపోయింది.



చీకటి పడిపోయింది. సాంబమూర్తి మనసంతా ముసిరేసినట్లు వుండటంవల్ల బయట చీకట్లు తెలియడంలేదు.

పాతకాలం గోడ గడియారం తంగు....తంగున ఎనిమిది గంటలు కొట్టింది. ఆయన ఉలిక్కిపడి లేచి చూసాడు. కీర్తి, ప్రీతి ఇంకా రాలేదు.

వంశీ తల్లి మంచం పక్కనే ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి నిద్రపోతున్నాడు.

ఆడపిల్లలిద్దరూ ఏమయ్యారూ? తమ కుటుంబాన్ని రోడ్డున పడెయ్యడానికి ఇంకా ఏం పన్నాగాలు పన్నాడో ఆ రాజారావు. చెయ్యని తప్పులకి ఏవిటిన్ని శిక్షలు? కష్టాలు పిరికివి....ఒంటిగా రావు. కూడగట్టుకుని వచ్చి మనిషిని చుట్టుముడతాయి. మనుషుల సాహసంమీద వాటికి గట్టి నమ్మకం.

తొమ్మిదింటికి సాంబమూర్తి లేచి పిల్లలకోసం బయలుదేరుతుండగా గేటు చప్పుడైంది.

"ప్రీతి....కీర్తీ...." అని చీకట్లోకి చూస్తూ ఆశగా పిలిచాడు.

"నేనండీ....వివేకానందని" వివేకానంద వెలుగులోకి వచ్చాడు.

సాంబమూర్తి దుఃఖం ముప్పిరిగొనగా....

"వివేకా! పిల్లలిద్దరూ ఇంకా ఇంటికి రాలేదయ్యా. నాకు భయంగా వుంది" అన్నాడు.

"భయం దేనికి?" అడిగాడు వివేకానంద.

"భయం దేనికా?" సాంబమూర్తికి ఏం చెప్పాలో, ఎక్కడనుంచి చెప్పాలో పాలుపోక మాట తడబడి "అదీ....అదీ" అని ఆగిపోయాడు.

వివేకానంద ఆయన్ని దగ్గరగా తీసుకుని–

"మంచివార్త తీసుకొచ్చాను. మన కీర్తి అదృష్టవంతురాలు. వంచదార ఎక్కడుందో చెప్పండి నోరు తీపి చేస్తాను" అన్నాడు.

అలిసిపోయిన సాంబమూర్తి అతని మాటలు అర్థంకానట్లుగా చూసాడు.

"మన ఉదయ్ బ్రతికేవున్నాడు బాబాయ్...." సంతోషంగా అన్నాడు.

సాంబమూర్తి నమ్మలేనట్లు చూసాడు.

"అవును. ఢిల్లీలో వున్నాడట. ఎవరో ఒకతను మన ఉదయ్‌ని టైంకి ఆస్పత్రికి తీసుకెళ్ళి, తన రక్తం యిచ్చి రక్షించాడుట. అతనే ఢిల్లీ కూడా తీసుకెళ్ళాడుట. ఇంకో వారంలో ఇక్కడికి తీసుకొస్తాం" ఆయన భుజంమీద చెయ్యివేసి ఎంతో ఉత్సాహంగా చెప్పాడు.

సాంబమూర్తి పైకి చూస్తూ చేతులు జోడించాడు. "భగవాన్....! మమ్మల్ని కాపాడు" అన్నాడు.

"ఆ! భగవంతుడే బహుశా మానవ రూపంలో మన ఉదయ్‌ని కాపాడి వుంటాడు. ఆ అబ్బాయి మనవాడ్ని భుజాన వేసుకుని పద్దెనిమిది మైళ్ళు నడిచి తెల్లవారేసరికి ఆస్పత్రిలో చేర్పించాడుట. ఒక్క గంట ఆలస్యం అయినా మన ఉదయ్ మనకి దక్కేవాడు కాదట. మీరేంటీ అలా వున్నారూ? కూర్చోండి. ఏమిటంత టెన్షన్? కీర్తి, ప్రీతి ఎక్కడికి వెళ్ళారూ?" ఆయన్ని లోపలికి నడిపిస్తూ అన్నాడు వివేకానంద. అతనితో ఏం చెప్పాలో, ఏం చెప్పకూడదో తోచని పరిస్థితి సాంబమూర్తిది.

"పిన్నిగారికి ఒంట్లో బాలేదా అప్పుడే పడుకున్నారూ?" అడిగాడు వివేకానంద.

"పిల్లలు, ఆడపిల్లలు.... ఇంకా ఇంటికి రాలేదు. వెళ్ళి చూసొద్దామని బయలుదేరుతుంటే నువ్వొచ్చావు...." మాట రాకుండా గొంతు పూడిపోతోంది సాంబమూర్తికి.

"నే వెళ్ళి చూసిరానా?"

వివేకానంద అడిగిందే తడవుగా ఆయన తల వూపాడు.

"ఎటువైపు వెళ్ళారూ?" అడిగాడు అతను.

"ప్రీతి కాలేజీనుండి ఇంకా రాలేదని కీర్తి చూసిరావడానికి వెళ్ళింది. నేనూ వస్తాను...." ఆయన కంగారు తట్టుకోలేనట్లుగా నడుస్తూ అన్నాడు.

"ఒద్దు! మీరుండండి" వివేకానంద బయటికి నడుస్తూ అన్నాడు- "ఇంత రాత్రి వరకూ కాలేజీలో ఏం చేస్తోందబ్బా!"

సాంబమూర్తి వూపిరి బిగపట్టి అతను స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయేదాకా ఆపుకుని, అతను వెళ్ళిపోగానే బిగ్గరగా చేతుల్లో ముఖం దాచుకుని ఏడవసాగాడు.



"నాన్నగారూ!" కీర్తి కంఠం వినిపించింది.

కీర్తి వెనగ్గా తల వంచుకుని నడుస్తూ ప్రీతి వచ్చింది.

సాంబమూర్తికి అంత సంతోషం ఎన్నడూ కలిగివుండదు.

"తల్లీ! ఎక్కడికి వెళ్ళావు....? మేమంతా ఎంత కంగారుపడ్డామో తెలుసా?" అన్నాడు కన్నీళ్ళతో.

"అదీ....ఫ్రెండ్ పుట్టినరోజని బలవంతంచేస్తే వాళ్ళింటికి వెళ్ళిందట. అసలే భయపడ్తోంది. ఏమీ అనకండి. ప్లీజ్!" తండ్రి చెయ్యి పట్టుకుని అంది కీర్తి.

సాంబమూర్తి కీర్తి తలమీద చెయ్యివేసి నిమురుతూ "తల్లీ! నువ్వు ఎంత అదృష్టవంతురాలివో తెలుసా....? మన ఉదయ్ బ్రతికే వున్నాడట. ఎవరో మహానుభావుడు కాపాడాడట" అన్నాడు.

"ఆ!" కీర్తీ, ప్రీతి సంతోషంగా చూశారు.

ఆయన ఆవేశంగా అన్నాడు. "నా తల్లి పాదమహిమ వల్లే వాడు బ్రతికాడు! నోటికొచ్చినట్టల్లా కూసిన వాళ్ళకి గడ్డిపెట్టాలి" అన్నాడు.

"ఊర్కోండి నాన్నా!" అంది కీర్తి.

సుభద్ర కొద్దిగా కదులుతూ "ప్రీతీ....ప్రీతి వచ్చిందా?" అంది.

ప్రీతి "అమ్మా!" అంటూ వెళ్ళి తల్లి దగ్గర కూర్చుంది.

సాంబమూర్తి భార్యతో చెప్పాడు.

"ఇందాక వివేక్ వచ్చాడు. మన ఉదయ్ బ్రతికే వున్నాడట.... సుభద్రా" అన్నాడు ఆనందంగా.

ఆమె మొహంలో వెలుగొచ్చింది. "నిజంగా?" అంది.

మరునిముషంలో చేతులు జోడించి "అంతా ఆ ఏడుకొండలవాడి మహిమ. వెంటనే కీర్తికీ, ఉదయ్‌కీ పెళ్ళి జరిపించెయ్యండి. అసలు సమస్యలన్నింటికీ తెర పడ్తుంది" అంది.

ప్రీతి లేచి లోపలికి వెళ్ళింది.

కీర్తి మౌనంగా వంటగదిలోకి నడిచింది.

వివేకానంద వచ్చాడు. ప్రీతి వచ్చేసిందని తెలిసాకా తేలిగ్గా నిట్టూర్చి, ఉదయ్‌ని కాపాడిన అబ్బాయి మంచితనాన్ని పొగిడాడు.

"రేపు శకుంతలని తీసుకుని ఢిల్లీ వెళ్తాను. ఉదయ్‌ని వెంటపెట్టు

కుని వస్తాం" అన్నాడు.

"నూరేళ్ళు బ్రతుకు నాయనా...." సుభద్ర కళ్ళు తుడుచుకుంటూ అంది.

వివేకానంద కాస్సేపు కూర్చుని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాడని నిర్ధారించుకున్నాక కీర్తి బయటకి వచ్చింది. ఆమె కళ్ళు రెండూ ఏడ్చి ఏడ్చి ఉబ్బి వున్నాయి.

"రేపు రాజారావు ఇంటికి వస్తున్నావా?" తండ్రి అడిగాడు.

"ఇంత జరిగాకా రాకుండా వుంటుందా?" అంది సుభద్ర.

కీర్తి ప్రీతివైపు చూసింది.

"వస్తాను" అంది.

సాంబమూర్తీ, సుభద్రా కొండంత బరువు దించుకున్నట్లు తేలిగ్గ నిట్టూర్చారు.

"భగవంతుడు చల్లగా చూసాడు" సుభద్ర భక్తిగా అంది.

సాంబమూర్తి లేచి నిలబడుతూ అనుకున్నాడు. 'జీవితం సైకిల్ లాంటిదే....మన కాళ్ళు చక్రం తిప్పినంత కాలమూ బ్యాలన్స్ కోల్పోయి పడిపోము.'

కీర్తి ఆ రాత్రి ప్రీతి పక్కనే పడుకుంది. ఒక రాత్రివేళ ప్రీతి నిద్రలో భయపడి కలవరిస్తుంటే దగ్గరగా తీసుకుంది.

"అక్కా....వాళ్ళెవరో నాకు తెలియదక్కా. చాలా దూరం నన్ను వెంబడించి ఆ తర్వాత నన్ను చుట్టుముట్టారు. నాకు భయం వేసి వెక్కి వెక్కి ఏడ్చాను. ఒకడు నా జడ పట్టుకుని లాగి, 'దోర జామకాయ లాగున్నావు....' కానీ ఈరోజు ఏం చెయ్యకూడదని అర్ధరు. రేపు పరిస్థితులు సరికాకపోతే, ఎక్కడున్నా నిన్ను పట్టి తీసుకుపోతాం. మీ అక్కతో చెప్పు!' అని వదిలేసాడు. నాకేమీ అర్థంకాలేదక్కా!" అంటూ కీర్తిని కౌగిలించుకుని చెప్పింది సాయంత్రం.

కీర్తి చెల్లెల్ని గుడిలోకి తీసుకెళ్ళి పూరడించి, జరిగింది తండ్రికి చెప్పొద్దని హెచ్చరించి, పరిస్థితులని చక్కబరుస్తానని మాటిచ్చి ఇంటికి తీసుకొచ్చింది.

బహుశా ఆ కర్కోటకులే ప్రీతి కలలోకి వచ్చుంటారు అనుకో



గానే ఆమెకు రాజారావు మీద చెప్పలేనంత అసహ్యం కలిగింది. 'ఇదంతా అవసరమా....ఆయనకి డబ్బుంటే వున్న బలహీనత చాటుకోడానికా లేక ఏమైనా చెయ్యగలనన్న బలం చాటుకోడానికా....? ఛీ.... పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం వేసేవాడూ ఒక మనిషేనా?' అనుకుంది.

సిద్ధార్థ గుర్తొచ్చాడు. ముగ్ధమోహనంగా నవ్వుతున్నాడు.

"ఎటువంటివాడికి పుట్టావు సిద్దూ! అందుకు శిక్షగా నిన్ను....నా మనసులోంచి తుడిచేసే ప్రయత్నం చేస్తున్నాను. ఇంకెప్పుడూ నా తలపుల్లోకి కూడా రాకు!" అని గట్టిగా కళ్ళు మూసుకుంది.

* * * *

"అతనికి స్పృహ వచ్చింది. కానీ నువ్వు రెండు నిమిషాలకన్నా ఎక్కువసేపు అతనితో మాట్లాడకూడదు...." డాక్టర్ నాయక్ సిద్ధార్థతో చెప్పాడు.

సిద్ధార్థ సంతోషంగా డాక్టర్‌కి నమస్కారం చేసాడు. "థాంక్యూ డాక్టర్! కానీ అతనితో నేను మాట్లాడాల్సిందేంలేదు. నా పని పూర్తయింది. వాళ్ళ వాళ్ళు కూడా రేపు రాత్రికి వస్తారు. ఇంక నేను వెళ్ళాలి....!" అన్నాడు.

అతని మనసు ఆ రోజు ెందుకో వ్యాకులంగా వుంది. ఉదయ సమయ కాంతులతో సంధ్యాకాంతులలో సైతం ఒకే వెలుగుతో, అదే చిరునవ్వుతో అతని మనోవీధిలో సంచరించే ఆమెరూపు ఎందుకనో దిగులుగా, కన్నీళ్ళతో కనిపిస్తోంది. ఏదో విపత్తులో చిక్కుకుంది కీర్తి అన్న వూహే అతన్ని నిలువనీయడంలేదు.

డాక్టర్ అతని భుజంమీద చెయ్యివేసాడు. "కానీ....అతను నిన్ను చూడాలనుకుంటున్నాడు. స్పృహ రాగానే ఒకేమాట అడిగాడు. నేను ఎలా బ్రతికాను? అని. సిద్దార్థ అనే కుర్రవాడు నిన్ను బ్రతికించాడు అని చెప్పాను. వెంటనే 'అతన్ని పిలవండి వెంటనే' అని కళ్ళు మూసుకున్నాడు. కాబట్టి నువ్వు లోపలికి వెళ్ళి అతనికి కనబడి రా....!" అన్నాడు.

సిద్ధార్థ చిరునవ్వుతో లోపలికి అడుగుపెట్టాడు. వారం రోజులుగా అతన్ని అంటిపెట్టుకుని వున్న సిద్దార్థకి ఉదయ్ చాలా దగ్గరగానే అని

పించాడు తప్ప పరాయిగా అనిపించలేదు.

ఉదయ్ సిద్ధార్థ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నట్టుగా వున్నాడు.

"హౌ ఆర్ యూ మై ఫ్రెండ్?" అని సిద్ధార్థ నవ్వుతూ అడిగాడు.

ఉదయ్ కళ్ళనిండా నీళ్ళతో "యూ ఆర్ మైగాడ్! ఇలా సాధ్యమా? అని ఇంకా....ఆశ్చర్యంగా వుంది. మనిషికి ఇంకొక మనిషి ఏమీకాక పోయినా ఇంత శ్రమ తీసుకుని కాపాడడం అనేది జరగడం చూస్తుంటే, మానవత మీద నమ్మకం కలుగుతోంది...." కష్టంమీద పలుకుతూ అన్నాడు.

సిద్ధార్థ అతని గుండెలమీద చెయ్యివేసాడు. దైవత్వాన్ని నమ్మక పోయినా మనుషులు బతికెయ్యగలరు. కానీ మానవత్వాన్ని నమ్మకపోతే బతకలేరు. డోంట్ గెట్ ఎగ్జయిటెడ్. మీ సిస్టర్, బ్రదర్ ఇన్‌లా రేపు సాయంత్రానికి వచ్చేస్తారు. టేక్ రెస్ట్. అలాగే ఇంక నాకూ సెలవిప్పించు" అన్నాడు.

ఉదయ్ తన చెయ్యి సాచి సిద్ధార్థ చేతిని అందుకుని అన్నాడు. "ఈ రుణం ఎలా తీర్చుకోనూ!"

సిద్ధార్థ చిన్నగా నవ్వాడు.

"చెప్పనా?" అడిగాడు.

"ఊ!"

"నేను ప్రేమ అనే వరాన్ని ఆశించి తపస్సు చేస్తున్నాను. అందులో నాకు మోక్షం దొరకాలని నీ భగవంతుడ్ని కోరుకోవటం ద్వారా నీ రుణం తీర్చుకో. ఎందుకంటే నీ దేవుడు చాలా గొప్పవాడు. నీమాట వింటాడు."

"అలా అని ఎలా చెప్పగలుగుతున్నారూ?"

"నీకోసం నన్ను ఎవరో ఈడ్చుకొచ్చినట్లుగా తెచ్చి ఈ తెలియని ప్రదేశంలో వదేసాడుగా! అందుకు."

"మీ గొప్పతనాన్ని కూడా ఆ దేవుడికే కట్టబెడుతున్నారా? యూ ఆర్ గ్రేట్!" చిరునవ్వుతో అన్నాడు ఉదయ్.

"నిన్ను ఎక్కువసేపు మాట్లాడించకూడదని తెలుసు. అయినా



దేవుడి ప్రసక్తి వచ్చింది కాబట్టి ఓ కథ చెప్పబోతాను. నిన్నరాత్రి నాకు ఓ కల వచ్చింది. ఇసుకలో నడుస్తున్న నా పాదముద్రల పక్కగా ఇంకో జత పాదముద్రలు పడుతున్నాయి. దేవుడు నాతో నడుస్తున్నాడని తెలిసి, ఆనందంగా, ఆశగా 'స్వామీ! కడదాకా తోడొస్తావా?' అని అడిగాను. ఆయన చిన్నగా నవ్వి 'కడదాకా వస్తాను బిడ్డా!' అన్నారు. ఆ తర్వాత పాటలు పాడుతూ వుల్లాసంగా చాలాదూరం నడిచాను....అలిసిపోయాను. ఒడ్డు ఇంకా చాలాదూరం కనిపిస్తోంది. పాదముద్రలు రెండు జతలు లేవు! నా గుండె గుభిల్లుమంది.

'స్వామీ! కడదాకా తోడొస్తానని మాట తప్పావా....'

'వస్తున్నాను బిడ్డా!'

"మరి నీ పాదముద్రలేవీ?'

"నువ్వు చూస్తున్నవి నావే! అలిసిపోయిన నిన్ను ఎత్తుకుని నడుస్తున్నాను బిడ్డా!" అన్నాడు దయామయుడు. ఈ కథ మా అమ్మ చెప్పింది. ఒంటరిగా వున్నప్పుడల్లా నా పక్కన యింకో జత పాదాలని వూహించుకుంటాను" అని ముగించాడు సిద్ధార్థ.

ఉదయ్‌కి ఆనందంతో కన్నీళ్ళు వచ్చాయి.

"అటువంటి తల్లికి పుట్టిన మీరు ధన్యులు. అందుకు మీకు ఎప్పుడూ విజయం కలుగుతుంది. నేను భగవంతుడ్ని నా గురించి ఎప్పుడూ యిది కావాలీ అని ప్రార్థించలేదు. ఆ అవసరం కూడా రాలేదు. కానీ మీ ప్రేమ జయించాలీ అని మాత్రం ఇకనుండీ ప్రార్థిస్తాను" అన్నాడు.

సిద్ధార్థ జేబులోంచి తన విజిటింగ్ కార్డుతీసి అతని దిండు క్రింద పెడుతూ అన్నాడు. "కాస్త ఓపిక రాగానే ఫోన్ చెయ్యి! ఇంక నేను వస్తాను."

ఉదయ్ వదలలేనట్లుగా అతని చేతిని పట్టుకుని దాన్ని తన కళ్ళ దగ్గరకి తెచ్చుకున్నాడు.

"ఇట్స్ ఓ.కే! ఎక్కువ ఎమోషనల్ అవకు. నేను నిన్ను పద్దెనిమిది మైళ్ళు ఈ భుజాలమీద ఎత్తుకుని మోసి కాపాడుకున్నాను. నీమీద నీకన్నా నాకే ఎక్కువ హక్కుంది తెలుసా?" నవ్వుతూ అతని కళ్ళు తుడిచాడు సిద్ధార్థ.

"మీరు వెళ్ళిపోతుంటే దిగులేస్తోంది. కానీ మీరు చెప్పిన కారణం విన్నాక ఇంకా ఆపడం అన్యాయం అనిపించి వూరుకుంటున్నాను. వెళ్ళి రండి. నేను ఫోన్ చేసినప్పుడు మీ పెళ్ళి వార్త చెప్పాలి. సరేనా....!" అన్నాడు.

సిద్ధార్థకి నిస్పృహతో కూడిన నవ్వొచ్చింది.

"వస్తాను ఫ్రెండ్...." అనిఅక్కడినుండి కదిలాడు.

హాస్పిటల్ ఛార్జెస్ మొత్తం చెల్లించి డాక్టర్ నాయక్‌కి మరోసారి కృతజ్ఞతలు చెప్పుకుని ఎయిర్‌పోర్ట్‌కి బయల్దేరాడు.

'కీర్తి తనని కలవద్దనీ, చూడద్దనీ ఆంక్షలు పెట్టింది. తను ఆమెని హృదయ పేటికలో దాచుకుని ఎక్కడెక్కడో తిప్పాడు. ఆమెచుట్టూ తన ఆలోచనల గూడుని అల్లుకుంటూ వచ్చాడు. ఏం కలగన్నా....ఏ వూహని దిద్దుకున్నా ఆమె అందులో అభినేత్రి. కానీ, ఎంతగా చేతులు చాచినా ఒక్కసారీ ఆమె అందలేదు. పిచ్చిది....తనని చూడద్దంది! మనుషుల మాట వింటారు. కానీ మనసులు వింటాయా?' అని నవ్వుకున్నాడు.

పక్షులు పాటలు పాడుతూ వస్తాయి. తన గూడు చేరుతున్న ఆనందంలో. పగలంతా తిండిగింజల కోసం పడినపాట్లు మరిచిపోతాయి. ఆనందానికి బాధలు అంటనీయవు. పాటలో విషాదం అనే చివరను చేర స్తాయి. చివరి చరణం ఎప్పటికీ పాడవు!

ఆ ఇంటి మెట్లు ఎక్కుతుంటే కీర్తికి నిస్పృహతో కూడిన నవ్వొచ్చింది.

'నేను చేసే ప్రతి యుద్ధంలో నీకు విజయం లభించాలి. మృత్యువు ఎదురైతే నీ మిత్రుడుగా తలచి పట్టాభిషేకం చేస్తాను. సమస్త లోకాల్ని పాలించే అధినేత నాకు అనుంగు మిత్రుడయితే ఇంక భయం ఏమిటి! బొమ్మల కొలువులాంటి ఈ లోకంలో మిగతా బొమ్మలను చూస్తే నాకు నవ్వొస్తోంది.

కూతురి ముఖంమీద మెరిసిన నవ్వు చూసి భయంగా ఆమె చుట్టూ తన చేతిని వేశాడు సాంబమూర్తి.

కీర్తి మౌనంగా తల వంచుకుని ఆ గుమ్మంలోంచి కుడికాలు పెట్టి లోపలికి నడిచింది.



"రండి....మీ కోసమే ఎదురుచూస్తున్నాను" గంభీరంగా అన్నాడు రాజారావు.

"ఈయనే రాజారావు" అన్నాడు కొత్త నిరసనగా కీర్తితో సాంబమూర్తి.

కీర్తి రెండు చేతులూ జోడించి వినయంగా నమస్కరించింది.

"కూర్చో" అన్నాడాయన.

కీర్తి కూర్చోలేదు. నిలబడే వుంది.

"ఇరవై నాలుగు గంటలలో మీరు చాలా చేసి చూపించారు. మీకున్న శక్తి ఏపాటిదో మాకు తెలిసింది. పసిపిల్లల ఆటల్లో, ఆడపిల్లల మానాభిమానాల మీద మీ ప్రతాపం చూపించారు, ఇంతగా మిమ్మల్ని భయపెట్టిన విషయం నా మీద మీ అబ్బాయికున్న ప్రేమే అయితే, మీరు భయపడాల్సిన అవసరంలేదు. అంతా మీరు కోరుకునట్టే జరుగుతుంది. నేను అతనితో ఇకమీదట మాట్లాడను కూడా మాట్లాడను."

రాజారావు కోపంగా అన్నాడు.

"నీలాంటి వాళ్ళ నోటి మాటలమీద నాకు నమ్మకంలేదు."

సాంబమూర్తి మొహం ఎర్రబడింది. ఆయన కలగచేసుకునేలోపే కీర్తి ఆయనవైపు మాట్లాడవద్దన్నట్లు చూసింది.

"నాలాంటివాళ్ళు ఏం చేస్తే మీలాంటి వాళ్ళు మా మీద దౌర్జన్యాన్ని చూపించకుండా వుంటారో చెప్పండి" అంది.

"టైప్ చేయించిన మేటర్ రెడీగా వుంది. సంతకం చెయ్యి" అన్నాడాయన.

కీర్తికి ఆయన చేతిలో రెపరెపలాడుతున్న కాయితం చూస్తే ఆపుకోలేనంత నవ్వొచ్చింది. బహుశా మొదటిరాత్రి భార్యచేత కూడా 'నీకు కట్టుబడి వుంటాను' అని సంతకం చేయించాడేమో అనిపించింది.

ఆమె చెయ్యి చాపింది.

సాంబమూర్తి భయంగా "అందులో ఏం రాసారో చదువమ్మా!" అన్నాడు.

"మీ ఆస్తులేం రాయించుకోలేదు. జీవితంలో మా అబ్బాయిని మీ

అమ్మాయి కలుసుకోకూడదనీ, మాట్లాడకూడదనీ రాయించాను. ఒకవేళ మాట తప్పితే కోర్టుకి ఈడుస్తాను. ఇది బ్రీచ్ ఆఫ్ కాంట్రాక్ట్ కేసు లాంటిదే" అన్నాడు.

కీర్తి కాయితం టేబుల్‌మీద పెట్టి సంతకం చేసింది. అది తీసుకొని ఆయనవైపు నడిచింది.

"ఇంకో యాభై ఏళ్ళు గడిచాక కూడా మీరుంటే....మీరిప్పుడు ఎలాంటి కారులో వెళ్ళారో, ఎటువంటి భవనంలో వున్నారో, ఎంత ఆస్తి కలిగి వుండేవారో, ఎంత రాజసంగా నిలబడేవారో ఏమీ మిగలదు. మీ తరవాతి తరాలు....అంటే ముని మనుమలకి చెప్పుకోడానికి తాతగారు చేసిన మంచి పనులు రెండైనా వుండాలి. చెడు గురించి తలుచుకుని సిగ్గుపడే పరిస్థితి మాత్రం రాకూడదు" అంది.

"నోర్ముయ్! నాకు చెప్పేటంత దానివా?" అరిచాడు కోపంగా రాజారావు.

సాంబమూర్తి ముందుకి అడుగువేస్తూ "మర్యాద ఇచ్చి పుచ్చుకో!" అన్నాడు.

"దొంగలకి కూడా మర్యాదా?" హేళనగా నవ్వాడు రాజారావు.

"ఏం కూశావ్?" సాంబమూర్తి చెయ్యి లేపబోయాడు.

"నాన్నా" కీర్తి తండ్రి చేతిని గట్టిగా పట్టుకుంది.

"మేం వచ్చిన పని అయింది. మీరూ మాట మీద నిలబడి మా నాన్నగారి గురించి నిజం వాళ్ళ ఎం.డి.గారికి చెప్పండి. నా కుటుంబానికి ఎటువంటి హానీ తలపెట్టకండి....ప్లీజ్" అని అర్థింపుగా చూసింది.

"మా సిద్ధూకి శృతి అనే కోట్లకి వారసురాలితో పెళ్ళి జరగాలి. అప్పటిదాకా నిన్ను మావాళ్ళు వేయి కళ్ళతో కనిపెట్టే వుంటారు. నేను ఇచ్చిన మాట తప్పను....వెళ్ళు" అన్నాడు రాజారావు.

కీర్తి చేతులు జోడిస్తూ అంది- "మా మానాన మేం బతికే హక్కు మళ్ళీ మాకు ఇస్తున్నందుకు ధన్యవాదాలు."

"పదమ్మా!" అన్నాడు సాంబమూర్తి.

"ఉండు" అన్నాడు రాజారావు.

సాంబమూర్తీ, కీర్తీ ఒకేసారి వెనక్కి తిరిగి చూశారు.



రాజారావు జేబులోంచి ఒక చెక్ తీసి అందిస్తూ అన్నాడు- "లక్ష రూపాయలు....నీ స్థాయికి గ్రాండ్‌గా పెళ్ళి చేయచ్చు నీ కూతురికి, అభిమానపడకు తీసుకో!"

సాంబమూర్తి కళ్ళల్లోకి రక్తం వుబికి వచ్చినంతగా ఎర్రబడ్డాయి. ఆ అలిసి, ఒంగిపోయిన బక్క దేహంలోకి అంత శక్తి ఎలా వచ్చిందో గానీ—

"రేయ్...." అంటూ ముందుకు ఉరికి రాజారావు కాలర్ పట్టుకున్నాడు.

"రంగయ్యా....నాయర్....రండిరా...." అంటూ రాజారావు కేకలు పెట్టాడు.

"నాన్నా.... వదిలిపెట్టు" కీర్తి విడిపించడానికి ప్రయత్నిస్తూ అంది.

"వీడు నా ఒంటిమీద కొట్టినా ఇంత బాధపడేవాడ్ని కాదమ్మా. నా అభిమానం మీద పదేపదే కొడుతున్నాడు. ఇలాంటి వాడిని బతకనీయను" ఉద్రేకంగా రొప్పుతూ అన్నాడు సాంబమూర్తి.

ఈలోగా నాయర్, రంగయ్యా పరిగెత్తుకుంటూ వచ్చి విడిపించారు.

చెయ్యేస్తావా ఈ అణాకాని వెధవ" రాజారావు రంకెలు వేశాడు.

"పద నాన్నా వెళ్ళిపోదాం" కీర్తి తండ్రిని బలవంతంగా చెయ్యి పట్టి లాక్కెళుతూ అంది.

"ఆడపిల్లల్ని కన్నది డబ్బు సంపాదించడానికే గదరా. మళ్ళీ ఎందుకంత పౌరుషం?" రెచ్చగొడుతూ అన్నాడు రాజారావు.

"ఆ మాటంటే చంపేస్తాను" సాంబమూర్తి కీర్తి చెయ్యి విడిపించుకుంటూ అన్నాడు.

నాయర్ రాజారావుని వెనక్కి లాగుతున్నాడు.

"ఏం చేస్తావురా....నా ఇనప్పెట్లో రూపాయి నోట్లు గట్టిగా వూదితే ఆ గాలికి కొట్టుకుపోతార్రా నీలాంటివాళ్ళు" రాజారావు అరిచాడు.

సాంబమూర్తిని కీర్తి గుమ్మం దాటిస్తుండగా వినిపించింది. "కోట్లకి ఎరవేసాడు పాపం ఈ ముసలాడు....లక్ష ఇస్తే ఎందుకు ఒప్పుకుంటాడూ? ఈ రాజారావంటే ఏమిటో తెలిపిందనుకుంటా ఇప్పుడు."

కీర్తి తండ్రి చేతిని వదిలిపెట్టి వెనక్కి నడిచింది.

ఆమె సూటిగా తన కళ్ళల్లోకి చూస్తూ నడిచి తనవైపు వస్తుంటే రాజారావు ఆశ్చర్యంగా మిగిలిన మాటలు మింగేసాడు. నా అంతస్థెక్కడ, మీ అంతస్థెక్కడా? అంతరం చూడకుండా....”

కీర్తి అతని దగ్గరగా వచ్చి చెయ్యెత్తింది.

రాజారావు నిలువుగుడ్లు వేసుకుని చూశాడు.

ఆమె చిటికె వేసి చూపుడువేలు ఆడిస్తూ చెప్పింది "నీ కొడుకుని ఇనప గొలుసులు వేసి కూడా బంధించి నీ ఆధీనంలో పెట్టుకోలేక పోయావు. కానీ నా తండ్రి కనుసైగ చాలు. ఆయన బిడ్డలు ఆయన చెప్పినట్లు వినడానికి. నీకూ, నా తండ్రికీ పోలికా? ఆయన ప్రేమాభిమానాల పెట్టుబడిగా పెట్టి మమ్మల్ని పెంచాడు. నువ్వు ఇనపనాణాలూ, కరెన్సీ కాయితాలూ ఖర్చుపెట్టి నీ కొడుకుని పెంచావు. ఆయనది మేరుపర్వతం స్థాయీ, నీది నీ ఇంటిముందున్న తుప్పతొట్టి స్థాయీ. మాటలు మీరకు. నువ్వు ఇంకొక్కసారి కలలో నా కుటుంబానికి కీడు తలపెట్టినా సరే నేను వదలను. నీ అంతుచూస్తాను. జాగ్రత్త!"

రాజారావు నిశ్చేష్టుడై ఆమె హెచ్చరించి వెళుతుంటే చూస్తూ నిలబడిపోయాడు. ఒంగిన సాంబమూర్తి వెన్ను నిటారుగా అయింది. రాజారావు వంక చూసి మునివేళ్ళతో మీసం నిమురుకుంటూ నవ్వాడు. రాజారావుకి ఆ నవ్వు నషాళానికి అంటింది.

"ఛీ! అది అన్ని మాటలంటుంటే ఎవరూ ఏమీ అనరేమిట్రా?" అని పనివాళ్ళమీద విసుక్కుపడుతూ లోపలికి వెళ్ళాడు.

తండ్రి చెయ్యి పట్టుకుని గడపదాటిన కీర్తి ఎదపకాలు ముందుగా వేసింది.

తల ఎత్తి స్థాణువే అయింది. సిద్ధార్థ నిలబడి వున్నాడు.

"కీర్తీ!" అతని కళ్ళనిండా ఆనందం ప్రోది చేసుకుని పిలిచాడు.

కొద్దిగా మాసిన గెడ్డంతో, నలిగిన బట్టలతో కూడా ఠీవిగా, రాకుమారుడిలా, ముఖ్యంగా చెంపమీద కొడితే ఇంకా పాలు కారేటట్లుగా వున్న సిద్ధూని సాంబమూర్తి ఆశ్చర్యంగా చూసాడు. కీర్తికి అప్పుడొచ్చింది భరించలేని నిస్సత్తువ.



హఠాత్తుగా ఏదో ఒక మధురక్షణం తప్పక వస్తుందనే వాగ్దాన పరిమళాలు నా చుట్టూ వీస్తుండగా ప్రతిక్షణం పిచ్చిగా ఎదురుచూసాను. రహస్యంగా నా మదిలో ప్రవేశించి, నీ శాశ్వత ముద్రని నా క్షణమాత్ర జీవనంపై వదిలి వెళ్ళావు. ప్రతిచోటా అంగుళం వదలకుండా నువ్వు నంతకాలు చేసిన ఈ జీవన క్షణాల్ని ఎవరికో తాకట్టు పెట్టాక ఏమీ ఎరగనట్టు వచ్చి వాకిట్లో నిలబడ్డావు. నీకు ఇవ్వడానికి యిక నాకంటూ ఏం మిగిలి వుందనీ?"

"కీర్తీ! నీ కోసం ఎక్కడెక్కడో వెదకాలనుకుంటూ వచ్చాను. ఇలా గుమ్మంలో వరాలిచ్చే దేవతలా కన్పిస్తావనుకోలేదు. ఇలా వచ్చావేమిటీ?" సంతోషంగా అడిగాడు.

ఆమె నవ్వింది.

"దేవతల దగ్గరకి మానవులు వెళ్ళే రోజులు పోయాయి. డబ్బుంటే చాలు, దేవతల్ని కూడా తమ దగ్గరకే పిలుచుకోగలరు మీలాంటివాళ్ళు. సిద్ధార్థా! మీ నాన్నకి నేను రాతపూర్వకంగా నిన్ను కలవననీ, మాట్లాడననీ మాటిచ్చాను. మాట తప్పడం మా ఇంటావంటా లేదు. మమ్మల్ని వెళ్ళనీయండి. పద నాన్నా" ఆమె తండ్రి చెయ్యి పట్టుకుంటూ అంది.

సిద్ధార్థకి మతిపోయినట్లు అన్పించింది.

"కీర్తీ... నువ్వు మాట్లాడేదేమిటో నాకు అర్థం కావటంలేదు. మా నాన్నకి నువ్వు రాసి ఇవ్వడం ఏమిటి?" ఆత్రుతగా వాళ్ళకి అడ్డం వస్తూ అన్నాడు.

సాంబమూర్తి వాడిగా అన్నాడు. "వెళ్ళి మీ నాన్నని అడుగు. మా దారిన మమ్మల్ని పోనీ....అడ్డు తప్పుకో."

కీర్తి తల వంచుకుంది. ఎక్కడ తన కన్నీళ్ళు అతని కంటపడతాయో అన్న భయంతో. ఆమె తండ్రి చెయ్యి ఆయనకి ఆలంబన యివ్వడానికి కాదు, తన అడుగు ముందుకు పడడానికి ఆసరాగా పట్టుకుని, వడివడిగా నడిచి వెళ్ళిపోయింది.

సిద్ధార్థ ఖిన్నుడై నిలబడిపోయాడు.

అతని నుండి ఆమె దూరంగా....చాలా దూరంగా వెళ్ళిపోతోంది. దోసిలినిండా పూలని నింపుకుని ఆలయ ద్వారం మూసివేస్తారేమోనని పరి

గెడుతూ వచ్చి చూసుకుంటే, ఒక పువ్వు కూడా మిగలని ఖాళీ దోసిలి వెక్కిరించినట్లయింది. మూసివున్న ద్వారం ముందు మళ్ళీ ఎన్నాళ్ళ పడిగాపులు! అతను వెంటనే ఆమె వెనగ్గా పరిగెత్తాలనుకున్నాడు. "కీర్తీ.... కీర్తి ఆగు" అంటూ ముందుకి వెళ్ళబోయాడు.

"సిద్దూ!" అన్న తండ్రి స్వరం వినపడింది..

"రా నాన్నా! రా లోపలికి రా" రాజారావు ప్రేమ కురిపిస్తూ పిలిచాడు.

సిద్ధార్థ రాజారావు పులిక్కిపడేటట్లు అరిచాడు.

"ఏం చేసావు? నా కీర్తి చేత ఎందుకు సంతకం పెట్టించావు? చెప్పు."

"చెప్తాను. ముందు లోపలికి పద. నాయర్, బాబుకి స్నానానికి నీళ్ళు సిద్ధం చెయ్యి. ఎప్పుడు తిన్నాడో ఏమో, చూడు. ఎలా చిక్కిపోయావో" అతని భుజంమీద చెయ్యివేసి లోపలకి తీసుకొస్తూ అన్నాడు రాజారావు.

సిద్ధార్థ తండ్రి చేతిని విదిలించుకుంటూ అరిచాడు. "ముందు చెప్పు. కీర్తిని ఎందుకు పిలిచావు? ఆమెకి ఏమైనా అపకారం తలపెట్టారో నీ కొడుకు వుండడు. జాగ్రత్త" బెదిరిస్తున్నట్లుగా అన్నాడు.

"లేదురా! అపకారం ఏం చెయ్యను, నువ్వు లోపలికిరా. వాళ్ళ నాన్నగారికి ఉపకారమే చెయ్యాలని పిలిచాను. బాగా పొగరుబోతు మనుషులు. చూడు నేను ఇచ్చిన చెక్‌ని ఎలా విసిరికొట్టి పోయారో...." కింద పడ్డ చెక్‌ని తీసి కొడుక్కి చూపిస్తూ అన్నాడు

"అంతేకాదు! ఆ అమ్మాయి నన్ను అనరాని మాటలంది. మన అంతస్తుకే కాదు, అసలు సంప్రదాయానికే అలాంటి పిల్లని కోడలుగా చేసుకోవడం సరిపడదు. నువ్వు చిన్నపిల్లవాడివి. ఇవన్నీ నీకు అర్థం కావు. రా చెప్తాను" అంటూ సిద్ధార్థని బలవంతంగా సోఫాలో కూర్చోపెట్టాడు.

సిద్ధార్థ ఆయన కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు. "నిజం చెప్పు. నేను వెళ్ళాక ఏం జరిగింది? కీర్తి గురించి మీకు ఎలా తెలిసింది? ఆమెని పిలిపించి మీరేం మాట్లాడారు?" రాజారావు కొడుకుమీద నుండి చెయ్యి తీస్తూ



చెప్పాడు.

"ఆ అమ్మాయి నీకు తగ్గ పిల్ల కాదని తెలుసుకున్నాను. ఆ అమ్మాయికీ ఆమె తండ్రికీ ఈ ఇంటి ఆస్తిమీదే తప్ప నీమీదేం ఆపేక్ష లేదు. అసలు ఆ ముసలాడు నేరస్థుడు. ఇరవై లక్షల రూపాయల లంచం తీసుకున్నాడని అతన్ని ఉద్యోగం నుండి తీసేసారు. ఆ పిల్ల చెల్లి కూడా మంచి ప్రవర్తనగల పిల్ల కాదుట....మనవాళ్ళు మొత్తం వివరాలు సేకరించారు. అసలు ఈ అమ్మాయికి ఇలా గొప్పింటి కుర్రాళ్ళని ఎరవేసి పట్టడంలో చాలా నేర్పు...."

"నాన్నా!" సిద్ధార్థ భరించలేనట్లు చెయ్యి చూపించాడు.

"నేను లేనప్పుడు వాళ్ళ కుటుంబాన్ని ఎన్ని కష్టాలుపెట్టారో నాకు అర్థమైంది. ఇంకేం చెప్పద్దు."

"నేను చెప్తున్నదంతా...."

"ఒద్దు! ఇంకా చెప్పి నా దృష్టిలో మరీ దిగజారిపోకు నాన్నా! ఇందాకా ఈ గడపదాటి వెళ్ళిందే, ఆ అమ్మాయికి శీలం, సిరిసంపదలు రెండు పాదాలు. అవి ఈ ఇంటిని వదిలిపోయినందుకు విచారించు! నువ్వనుకునే సిరిసంపదలు, నీ ఖజానాలో వుండచ్చు. కానీ నేననే "సిరిసంపదలు మనిషిలోని మంచి గుణాలు! ఇది నీకు అర్థం కావడానికి బహుశా ఈ జీవితకాలం సరిపోదేమో పాపం."

సిద్ధార్థ హేళనగా చూసి, విసురుగా తన గదిలోకి వెళ్ళాడు. నౌకరు నెమ్మదిగా అతని వెనకాలే నడిచాడు.

రాజారావు ఆలస్యం చెయ్యకుండా ఫోన్ అందుకుని శృతికి డయల్ చేసాడు.

* * * *

"ఇలా జరిగిందేమిటీ?" మైత్రి కన్నీళ్ళతో కీర్తి చెయ్యి పట్టుకుని భారంగా అంది.

కీర్తి చిన్నగా నవ్వి "పెళ్ళికూతురివి, కాసేపట్లో గౌరీపూజ చెయ్యబోతున్నావు. కంటతడి పెట్టకు" అని ఆమె కళ్ళు తుడిచింది.

పట్టుచీరలో, నుదుట కళ్యాణ తిలకంతో, పూలజడ భారంతో వంగిన తలతో కూర్చున్న మైత్రి– కీర్తి చెప్పిన విషయాలకి తట్టుకోలేన

ట్లుగా ముందుకి ఒంగి కీర్తి భుజంమీద వాలిపోయింది.

"హాయిగా వుండే నువ్వు ఈ ఊబిలాంటి ప్రేమలో కూరుకుపోవడానికి కారణం నేను కాదుగదా" అంది

"ఎవరూ దేనికీ కారకులు కారు! జరగాల్సింది జరుగుతూ వుంటుంది. మనం ప్రేక్షకులం మాత్రమే. కానీ మైత్రీ! ఈ రాత్రీపగలూ గుండెని కాల్చేసే బాధలో కూడా ఏదో హాయి వుందే....ప్రపంచంలో ఏ కష్టం అయినా దీనికన్నా చిన్నదే అనిపిస్తోంది. మనుషులు అశాశ్వతమైన ఆనందాల గురించీ అతి చౌకబారు ఆస్తుల గురించీ మాట్లాడుతుంటే, గొప్ప సంపదని నా హృదయంలో దాచుకున్నట్లు గర్వంగా అనిపిస్తోంది" కన్నీళ్ళు మెరుస్తుండగా అంది కీర్తి.

మైత్రి జాలిగా చూసింది.

తను ఎంతగానో కావాలనుకుని తపించిపోయిన అనుభూతి ఒద్దని ఈసడించుకున్న కీర్తిని చుట్టుకుంది. తన పని ఏమిటో తెలియజేసి కానీ వదలదు. ప్రేమ మధురంగా మొదలయి, రాను రాను బాధాకరంగా పరిణమిస్తుంది ఎంతగా ప్రేమిస్తే అంత బాధని మిగులుస్తుంది.

ప్రేమకి పునాది ఆకర్షణ!

ప్రేమకి రుజువు నమ్మకం!"

"పెళ్ళికుమార్తెని మేనమామలు బుట్టలో కూర్చోబెట్టి తీసుకురావాలి నాయనా!" పురోహితుడి కేక వినిపించింది.

కీర్తి ముందుకి ఒంగి మైత్రి నుదుటిమీద చుంబించింది.

"మైత్రీ! ప్రేమని ప్రతిక్షణం పాదులు చేసి మొక్కని పెంచినట్లు పెంచుకో. ఆ ఫలాలు తియ్యగా వుంటాయి. నువ్వు నాకెంతో ఇచ్చావు. నీకు నేనేం ఇవ్వగలనూ?" అంది బాధగా.

కీర్తి చేతిని గట్టిగా పట్టుకుంది మైత్రి.

"మైత్రీ! రెడీయా?" అంటూ వాళ్ళ వాళ్ళు దగ్గరకొస్తున్నారు

"కీర్తీ! సిద్దూకి దూరం అవకు. నీలాంటి ఆత్మధైర్యంగల పిల్ల ఇంత పిరికిగా పారిపోనక్కర్లేదు."

కీర్తి మాట రానట్టు చూస్తూ నిలబడింది.

బుట్టకోపాటు పైకి లేస్తున్న మైత్రి చెయ్యి కీర్తి చేతిని గట్టిగా



నొక్కి- "ఇదే నాకు నువ్విచ్చే బహుమానం!" అని ఆమె చేతిని వదిలేసింది.

మేళాలు హోరున మ్రోగుతుండగా ఊరేగింపుకి బయల్దేరిన అమ్మవారిలా కళకళలాడుతూ మైత్రి పెళ్ళి పందిరిలోకి అడుగిడింది.

కీర్తి కలలో నడుస్తున్నట్లు పందిట్లోకి వెళ్ళి ఆ పెళ్ళి తంతు చూస్తూ నిలబడింది.

వయసు పైబడిన ముత్తైదువల నుదుటి ముడతల్లో దాగిన ఎన్నెన్ని శృంగార పర్వాలో! ఒంగిన నడుములు ఎన్నెన్ని భావోద్వేగపు సమాగమాల సాక్ష్యాలో!

అమ్మాయి పెళ్ళిలో మేకపోతు గాంభీర్యం నటించే మేనమామలూ, అతిశయం మాటున అభిమానం దాచుకున్న అత్తయ్యలూ, చీర కుచ్చిళ్ళు పైకి దోపి హడావిడిగా తిరిగే చిన్నమ్మలూ, పెద్దతనాన్ని పైట కొంగుగా దోపి అజమాయిషీ చేసే పెద్దమ్మలూ, ముందు తరాల ముత్యాల తలంబ్రాల్ని కండువాలో భద్రంగా మోసుకొచ్చి వధూవరుల తలలమీద వాటి బదులు ఆనందభాష్పాలు కురిపించే తాతయ్యలూ, అమ్మమ్మలూ!

పెళ్ళంటే బాజాలూ, లడ్డూలూ అనుకుని పేచీలు పెట్టే రాలుగాయి పిపిండ్రీలూ, పెళ్ళంటే జీవితానికి పూసుకునే అత్తరు పరిమళం అనుకునే కన్నెపిల్లలూ! పెళ్ళంటే సిగ్గుకి ఆనకట్ట కాదు, సౌభాగ్యానికి వారధి అని కొంటెగా చూపులతో సైగచేసే కుర్రకారుతో....ఎంతో సందడి....అందరి మనసుల్లో మధురమైన సన్నాయి రాగాలే!

పెళ్ళంటే....రెండు ప్రేమైక హృదయాల జీవితకాలపు ఒడంబడిక.

కీర్తి కళ్ళల్లో సిద్దార్థ రూపం మెదులుతోంది.

"కలలు కంటున్నావా? ఇంకో రెండు నెలల్లో నువ్వూ పెళ్ళిపీట లెక్కుతావు....ఉదయ్‌తో!" మైత్రి అక్క కీర్తి భుజం నొక్కి నవ్వుతూ అంటోంది."

కీర్తి తల మీద ఎవరో జల్లిన అక్షింతలు టపటపా పడ్డాయి!

'కలలు కూడా కనే స్వతంత్రం నాకు లేదా!' అనుకుంది బాధగా.

* * *

కళ్ళు తెరుస్తూంటే సూదులు గుచ్చుకున్నంత బాధగా అనిపించింది

సిద్ధార్థకి. నెమ్మదిగా విడివడిన రెప్పలకి మసకగా ఓ రూపం కనిపించింది

దాహంతో గొంతు ఎండిపోయినట్లుగా వుంది. పెదవులు తెరిచి పిలవాలంటే తన స్వరం తనకే వినిపించనంత బలహీనంగా వుంది. లేవాలని చూస్తే కాళ్ళు రెండూ కదవలేనంత బరువుగా అనిపించాయి. అతి కష్టంమీద కళ్ళు క్రిందకి వాల్చిచూస్తే, కుడికాలికి ప్లాస్టర్ వేసి వుంది! చెయ్యి కదుపుతూ వుంటే బాగా నెప్పిగా అనిపించినా.... ఆ ప్రయత్నం సఫలం అయి పక్కనున్న సెలైన్ స్టాండ్ కదిలి చప్పుడు చేసింది.

ఆ శబ్దానికి ఎదురుగా కూర్చున్న రూపం ఉలిక్కిపడ్డట్లు కళ్ళుతెరిచి ముందుకి వచ్చింది.

"మే ఐ హెల్ప్ యూ?"

సన్నని ఆ కంఠస్వరం ఓ ఆడపిల్లదని తెలిసి కళ్ళు ఆర్పి మళ్ళీ తెరిచి ఆమెవైపు చూసాడు సిద్ధార్థ.

"డాక్టర్ గారు సెడెటివ్స్ ఇచ్చారు. అందుకే మీకు మత్తుగా వున్నట్లుంది. మంచినీళ్ళు తాగుతారా?" గ్లాసు అతని పెదవులకి అందిస్తూ అడిగింది.

సిద్ధార్థ లేవలేక అవస్థ పడుతుంటే దిండు సరిగా పెట్టి అతని వీపు వెనకాల చెయ్యేసి లేవదీసి మంచినీళ్ళు త్రాగించింది.

"థాం.... క్యూ!" అస్పష్టంగా అన్నాడు.

"ఇట్స్ ఓ!కే! కాసేపు పడుకోండి. డాక్టర్ గారు సాయంత్రం వచ్చి చూస్తారు" అంది.

సిద్ధార్థ వీపుమీద మృదువుగా నిమురుతున్న ఆమె చెయ్యి ఇంకా అలాగే వుంది.

"నేను.... ఏ హాస్పిటల్లో వున్నానూ?" అని అడిగాడు.

"హాస్పిటల్ కాదు, ఇది ఇల్లే!" ఆమె నవ్వుతూ అంది.

సిద్ధార్థ ఆశ్చర్యంగా చూసాడు.

హాస్పిటల్లో రెండురోజులు అపస్మారకంగా పడున్నారు. కాలికి ఫ్రాక్చర్ అయింది. ఒంటినిండా గాయాలయ్యాయి. మూడోరోజు కళ్ళు తెరిచారు. కానీ ఎక్కువసేపు స్పృహలో లేరు. ఆ వాతావరణంకన్నా ఇల్లు బెటర్ అని నేను తీసుకొచ్చేసాను!" అంది అతన్ని జాగ్రత్తగా



మంచంమీద పడుకోబెడుతూ.

"మీరెవరూ?" ఇంకా ఆశ్చర్యంగానే చూస్తూ అడిగాడు సిద్ధార్థ.

"నేను ఒక స్కూల్ టీచర్ని. మీరు దారిలో పడిపోయివుంటే చూసి తీసుకొచ్చాను" అంది.

"చాలా థాంక్స్" అన్నాడు సిద్ధార్థ.

"ఫరవాలేదు. మీకేం కావాలన్నా ఈ బజర్ నొక్కండి. పనివాళ్ళు వస్తారు. నేవెళ్ళి మీకు బ్రేక్‌ఫాస్ట్ తీసుకొస్తాను" అని ఆమె వెళ్ళిపోతూంటే అడిగాడు.

"మీ పేరూ?"

"నా పేరు పింకీ" అని ఆమె వెళ్ళిపోయింది.

సిద్ధార్థ ఆ రూం ఇంటీరియర్ డెకరేషన్నీ, వాల్ పెయింటింగ్స్‌నీ ఆశ్చర్యంగా చూసాడు. ఒక్క స్కూలుటీచర్ ఇల్లులా లేదనిపించింది. పక్కనే వున్న టీపాయ్‌మీద మేగజైన్స్ కనిపించాయి. వాటిని తిరగేస్తూ కూర్చున్నాడు.

"బ్రేక్‌ఫాస్ట్ రెడీ!" అంటూ ఆమె వచ్చింది.

సిద్ధార్థ ఆమె ప్రతి కదలికనూ పరీక్షగా చూసాడు. తెల్లని నైటీలో గొప్ప రాజసంగా వుంది. పాతికేళ్ళలోపే వుండచ్చు.

ఆమె బ్రెడ్‌కి బటర్ రాసి ఆమ్లెట్‌తో కలిపి పెట్టింది.

సిద్ధార్థ అందుకుని "మీకెందుకు ట్రబుల్.... వెళ్ళిపోతాను...." అన్నాడు.

"నథింగ్ డూయింగ్, బాగా కోలుకునేవరకూ నేను వెళ్ళనివ్వనుగా!" అంది.

సిద్ధార్థ నోటికి ఏమీ సహించలేదు. కన్నీళ్ళతో గడపదాటిన కీర్తి గుర్తొస్తోంది.

"నాకు చాలా అర్జెంట్ పనులున్నాయి. నేను వెంటనే వెళ్ళాలి" అన్నాడు.

"సరే! వెళ్ళండి. ఊ! లేవండి" ఆమె చేతులు కట్టుకుని సీరియస్‌గా అంది.

సిద్ధార్థ లేవబోయాడు. అప్పుడు గుర్తొచ్చింది. తన కాలు విరిగిన

సంగతి. బాధగా చూసాడు.

"నాలుగు వారాలపాటు మీరు ఈ రూంలో ఖైదీ!" ఆమె నవ్వుతూ అంది.

"నేను ఎవరో, ఏమిటో తెలియకుండా మీరు ఇంత సహాయం చెయ్యడం ఆశ్చర్యంగా వుంది" అన్నాడు.

ఆమె నవ్వింది.

"మీరు ఎవరో తెలుసు. ఏమిటో తెలుసు "

"తెలుసా?"

"ఊ! సాటిమనుషులని తెలుసు. అభిమానస్తులని అర్థమైంది. ఇంకా ఏం తెలియాలి?" చిలిపిగా అంది.

"అయినాసరే. మా ఊరిదే. నే వెళ్ళిపోతాను" అన్నాడు.

"సైలెన్స్! మాట్లాడకూడదు. పడుకోవాలి!" ఆజ్ఞలా అంది.

"అదికాదు...."

"నాకు మాట వినని పిల్లల్ని దారికి తెచ్చుకోవడం చాలా సరదా. టీచర్ని కదా" అని అతనికి ఫ్లాస్కులోంచి కాఫీ ఒంపి ఇచ్చింది.

సిద్ధార్థ మాట్లాడకుండా తాగేసాడు.

"నేను సాయంత్రం స్కూల్నుండి వచ్చేదాకా అండాళ్ళు అనే పనిమనిషి మీ అవసరాలు చూస్తుంది. మీరు చెప్పేది వింటుందికానీ, మీకు జవాబు లివ్వలేదు. మూగది పాపం!" అంది.

సిద్ధార్థ 'అయ్యో!' అన్నట్లు చూసాడు.

"సో....ఇంక నేను వెళ్ళచ్చా?" అడిగింది.

సిద్ధార్థ ఉత్సుకతగా "ఇంకా ఇంట్లో ఎవరు వుంటారు?" అని అడిగాడు.

"ముగ్గురు మీరూ, నేనూ, అండాళ్ళూ" అని లేచి వెళ్ళిపోయింది.

సిద్ధార్థ వింతగా చూస్తూ పడుకున్నాడు.

కలంతా దిమ్ముగా వుంది. మాటి మాటికీ కీర్తి గుర్తొస్తోంది.

'ఎంత పిచ్చిదీ! భయపడి నన్ను కలవనసీ, మాట్లాడనసీ కాయితం మీద రాసి సంతకం పెట్టమంటే పెట్టడమేనా? అసలంత భయపడాల్సిన పరిస్థితులు కల్పించిన నాన్నని ఏమనాలి?' అనుకున్నాడు.



గదిలో అటూ ఇటూ ఫోన్కోసం చూసాడు.

లేదు!

కాలు కదపలేని తన పరిస్థితికి తనమీద తనకే జాలేసింది. బజర్ నొక్కాడు. అండాళ్ళు వచ్చి నిలబడింది.

"ఫోన్ కావాలి" అన్నాడు.

ఆమె లేదన్నట్లు చెయ్యి ఆడించింది.

సిద్ధార్థ తల పట్టుకున్నాడు.

"ఊ....ఊ...." "ఇంకా ఏమయినా కావాలా?" అన్నట్లు సైగ చేసింది.

"ఒద్దు....వెళ్ళు" అని నీరసంగా వెనక్కి వాలి పడుకున్నాడు. కళ్ళు క్రిందకు వాల్చిచూస్తే సిమెంట్ ప్లాస్టర్ వేసిన తన కాలు కనిపించింది.

'అసలు నన్ను కొట్టిన ఆ రౌడీలు ఎవరు? ఎవరికి నామీద అంత పగ?' అనుకున్నాడు.

తండ్రి నియమించిన వాళ్ళయితే కాళ్ళు విరగ్గొట్టి, ఇంట్లో పడేసి వెళ్ళేవారుగా....ఇలా ఇక్కడ ఎందుకు తేలతాడూ?'

ఈ పింకీ ఎవరు?

అతనికి తల బద్దలైపోతున్నట్లు అనిపించింది. గట్టిగా చేత్తో అదుముకుని 'కీర్తి....నిన్ను వెంటనే చూడాలి. ఎలా?'

కనుకొలకుల నుండి రెండు కన్నీటిబొట్లు వెచ్చగా జారాయి.

గుండె మంటలార్పే చన్నీళ్ళు కన్నీళ్ళు!

• • • •

కీర్తి, సాంబమూర్తి, సుభద్రా, శకుంతల ఇంటిముందు ఆటో దిగారు.

"కీర్తి! జరిగిన సంగతులేవీ వాళ్ళకి తెలియకూడదు. మీరు కూడా ఏమీ నోరు జారకండి" సుభద్ర భర్తని కూడా హెచ్చరిస్తూ అంది.

కీర్తి తల వంచుకుని తల్లి వెనకాల నడిచింది.

వివేకానంద ఎదురొచ్చి "రండి....రండి.... శకుంతలా మీ మావయ్యా వాళ్ళు వచ్చారు" అన్నాడు.

శకుంతల వంటింట్లోంచి వచ్చి "ఉదయ్ గదిలో వున్నాడు. ఎక్కువ సేపు మాట్లాడకూడదన్నారు డాక్టర్ గారు!" అంది.

"దేవుడు చల్లగా చూసి మన బిడ్డ మనకి దొరికాడు...." అన్నాడు చేతులు జోడిస్తూ సాంబమూర్తి.

సుభద్ర, ఉదయ్ గదిలోకి వెళ్ళి మంచం పక్కనే కూర్చున్న వరలక్ష్మిని పలకరించింది. "ఎలా వుంది వదినా బాబుకి?"

వరలక్ష్మి కంటతడి పెడుతూ- "అసలింత గండం ఎందుకు రావాలమ్మా నా బిడ్డకి? వాడిలా మంచంలో పడివుంటే నేనెలా తట్టుకోగలనూ?" అంది.

ఉదయ్ కొద్దిగా పైకిలేచి కూర్చుంటూ "ష్....ఇప్పుడు ఏడవటం ఎందుకూ? బతికిబయటపడ్డానుగా! అత్తయ్యా! మీరంతా ఎలా వున్నారూ?" అని అడిగాడు.

సుభద్ర జవాబుగా ఉదయ్ దగ్గరకెళ్ళి మీద చెయ్యివేసి బావురుమని ఏడ్చేసింది.

"వాడ్ని యిబ్బంది పెట్టకు...." అంటూ సాంబమూర్తి గదిలోకి వచ్చాడు.

"కీర్తి వచ్చిందా మావయ్యా?" అడిగాడు ఉదయ్.

"ఆ....కీర్తీ....రామ్మా!" అన్నాడు సాంబమూర్తి.

కీర్తి బెదురుగా లోపలికి వచ్చింది.

"రా కీర్తీ!" అన్నాడు నవ్వుతూ ఉదయ్.

"మీరు మాట్లాడుతూ వుండండి. రా వదినా...." అంటూ సుభద్ర వరలక్ష్మి చెయ్యి పట్టుకుని బయటికి తీసుకెళ్ళింది.

సాంబమూర్తి కీర్తి వైపు ఓసారి చూసి తనూ వెళ్ళిపోయాడు.

కీర్తి మంచం దగ్గరగా కూర్చుని "ఎలా వుంది బావా?" అంది.

"భగవంతుడు మానవ రూపంలో వచ్చి రక్షించడం అంటే తెలిసింది కీర్తీ!" అన్నాడు.

"అతను ఎక్కడున్నా సుఖంగా వుండాలి" అంది మనస్ఫూర్తిగా కీర్తి.

"అతని ప్రేమ ఫలించాలని కోరుకో....!" అన్నాడు వెంటనే



ఉదయ్.

"ప్రేమా!" ఉలిక్కిపడింది కీర్తి.

"అవును కీర్తీ.... నీకూ నాకూ తెలీదుగానీ.... ప్రేమ అనే దాని కోసం పిచ్చివాళ్ళుగా మారిపోయే వాళ్ళు వుంటారని అతన్ని చూశాకే నాకు తెలిసింది. నేనూ రోజూ దేవుడ్ని అతని ప్రేమ సఫలం చెయ్యమనే కోరుకుంటున్నాను. నువ్వూ అదే కోరుకో!" అన్నాడు.

కీర్తి కళ్ళు మూసుకుని 'ప్రేమ!' అనుకోగానే, సిద్ధార్థ రూపం కళ్ళముందు మెదిలింది.

"నిన్ను పెళ్ళి చేసుకోవాలని రాసిపెట్టి వున్నట్లుంది. అందుకే బతికాను!" నవ్వుతూ అన్నాడు.

ఆమె తక్కున కళ్ళు తెరిచింది.

ఉదయ్ నెమ్మదిగా చెయ్యిజాపి ఆమె చేతిని అందుకున్నాడు.

కీర్తి చేతివేళ్ళు ఒణుకుతున్నాయి. అప్రయత్నంగా చేతిని దూరంగా జరిపేసింది.

"ఇంత సిగ్గేమిటి కీర్తీ ఇంకా...." అన్నాడు.

ఉదయ్‌కి తనని స్పర్శించినప్పుడు ఎటువంటి ఉద్రేకం కలగకుండా ఎంతో మామూలుగా వుండడాన్ని ఆమె విస్మయంగా గమనించింది. ఓ పదేళ్ళు కాపురం చేశాక కలిగే అలవాటు లాంటిది ఇప్పుడే కలిగిందా అనిపించినా....అతని శారీరక స్థితి బాగాలేక అలా వున్నాడేమోలే అనికూడా అనిపించింది.

కాసేపు ఉదయ్ తన ఆరోగ్యం గురించీ, యాక్సిడెంట్ గురించీ మాట్లాడాడు. కీర్తి వింటూ కూర్చుంది.

శకుంతల కాఫీ కప్పులతో గదిలోకివచ్చి "అయ్యాయా కబుర్లూ?" అంది.

సుభద్రా, వరలక్ష్మి కూడా వెనకాలే వచ్చారు.

"కీర్తిని వుంచి వెళ్ళండి అత్తయ్యా!" అన్నాడు ఉదయ్.

కీర్తి గొంతుకేదో అడ్డుపడ్డట్టయింది. పది నిమిషాలపాటైతే ఏదో నటిస్తూ గడిపేయవచ్చు! కానీ ఇక్కడ రోజులపాటు వుండాలంటే ఎలా? ఒకసారి కాకపోతే ఒకసారైనా తన మనసులో ఏం వుందో ఉదయ్‌కి తెలి

సేట్లు పట్టుపడిపోదూ!

"అలాగే వుండనీ బాబూ! దానికి మార్పుగా వుంటుంది!" సుభద్ర కీర్తిని ఒక్కమాటైనా అడక్కుండానే తన అంగీకారం తెలియజేసింది.

కీర్తి మౌనంగా, భారంగా ఇంట్లో తిరుగుతూంటే ఆవిడ భరించలేకపోతోంది. అందరి పాత తరం తల్లులలాంటిదే సుభద్రానూ! ఉదయ్‌కి దగ్గరగా వుంటూ వుంటే వారిద్దరి మధ్య ఆపేక్ష పెరుగుతుందని ఆవిడ నమ్మకం. ఆ ఇద్దరికీ మధ్య ఓ పసుపుతాడొస్తే గట్టిగా జీవితాంతం కట్టిపడేసినట్లే అన్నది ఆమె ప్రగాఢ విశ్వాసం!

"శకుంతల ఒక్కతే ఇంటి పనులూ, ఉదయ్ పనులూ చూసుకోలేకపోతోంది. నేనేమో రోగిష్టిదాన్ని. అందుకే కీర్తి కాస్త ఉదయ్‌ని చూసుకుంటుందనీ మా ఆశ!" అంది వరలక్ష్మి.

"దానిమీద మీకు పూర్తి హక్కుంది వదినా!" అంది సుభద్ర. ఆమె మనసుకి కీర్తి ఇక్కడ వుంటేనే భద్రత అనిపిస్తోంది.

శకుంతల కూడా కీర్తి పక్కనే కూర్చుని, "అంతా కీర్తి అదృష్టమేగా అత్తయ్యా! మా ఉదయ్ మళ్ళీ మామూలు మనిషయ్యాడంటే....!" అంది.

తన అదృష్టం, దురదృష్టం అన్నీ వాళ్ళే నిర్ణయించడం కీర్తికి నిరక్తితో కూడిన నవ్వుని తెప్పించింది.

ఆరోజు ఉదయ్ పోయాదనుకుని తనది దురదృష్ట పాదం అన్నారు. వీటన్నింటికీ తనేవిధంగా బాధ్యురాలో ఆమెకి అర్థంకావడంలేదు!

అందరూ తలో మాటా మాట్లాడుతున్నారు.

సాంబమూర్తి మాత్రం వెళ్ళేముందు కీర్తితో "నీకు యిక్కడ వుండటం ఇష్టమేనా తల్లీ?" అని అడిగాడు.

కీర్తికి కళ్ళనిండా నీళ్ళొచ్చాయి.

"ఇష్టమే....అక్కడ మాత్రం అది చేసేదేముంది? ఇక్కడైతే ఉదయ్ అవసరాలు చూడొచ్చు!" అని సుభద్ర ఆయన్ని కళ్ళతోనే హెచ్చరించింది.

సాంబమూర్తి మందలింపుగా "సుభద్రా! దాన్ని చెప్పనీ!" అన్నాడు.

కీర్తికి నవ్వొచ్చింది. అక్కడేం వుందనీ? ఇక్కడేం వుందనీ?



సిద్ధార్థ తన మనసులో ఎక్కడైనా వుంటాడు!

"నీ బట్టలు ప్రీతితో పంపిస్తాను. జాగ్రత్త....!" సుభద్ర కీర్తి చేతులు పట్టుకుని అంది.

'జాగ్రత్త!' అన్న పదం ఎందుకో కీర్తికి అర్థమైంది. దొంగతనం బయటపడకుండా జాగ్రత్తపడటమా? అంత దొంగపని తనేం చేసింది?

'అసలు ఒక మనిషిని ప్రేమించడం, ప్రేమించకుండా వుండడం మన చేతిలో పనా?'

"వెళ్ళొస్తాం...." అంటుంటే సాంబమూర్తి గొంతు గద్గదికంగా మారింది.

"అప్పుడే అప్పగింతలు పెడ్తున్నట్లు బాధపడిపోతున్నావేంటి మావయ్యా?" అంది నవ్వుతూ శకుంతల.

"పిల్లల్ని వదిలిపెట్టి మీ మావయ్య ఎప్పుడూ వుండలేదమ్మా...." అని సమర్థించుకుంది సుభద్ర.

"పోనీలే....అలవాటవనీ!" అంది వరలక్ష్మి.

'ఆడపిల్లల తండ్రులకి ఇంకా చాలా అలవాటవ్వాలి. శాంతం, సహనం, బాధ, దుఃఖం....ఒంటరితనం!' అనుకుంది కీర్తి.

సుభద్రా, సాంబమూర్తీ కీర్తిని వదిలి భారమైన మనసులతో వెళ్ళిపోయారు.

కీర్తి- కార్తీక్‌తో ఆటలాడుతూ ఎక్కువసేపు గడుపుతోంది.

ఉదయ్‌కి ఏం కావాల్సివచ్చినా "కీర్తీ" అని ఆమెనే పిలుస్తున్నాడు.

కీర్తి అన్నీ నిర్లిప్తంగా చేస్తోంది. ఆమె అంతరంగంలో మాత్రం అనుక్షణం తను వచ్చేస్తుంటే బాధపడుతూ చూసిన సిద్ధార్థ చూపులే వెన్నాడుతున్నాయి.

* * * *

"నాకు తెలుసు! మీరు స్కూల్ టీచర్ కాదు!" తన గదిలోకి వచ్చిన పింకీని అన్నాడు సిద్ధార్థ.

ఆమె నవ్వి "ఏం?" అంది.

సిద్ధార్థ తన పక్కనే వున్న బిజినెస్ మేగజైన్స్ చూపిస్తూ

అన్నాడు. "ఇవి చెప్తున్నాయి మీరు ఏమిటో?" అన్నాడు.

"అది నా హాబీ! పారిశ్రామిక రంగంలో వచ్చే ఏ మార్పు అయినా టెక్నాలజీకి సంబంధించి ఏ డీటైల్స్ అయినా తెలుసుకోవడం నాకు ఇష్టం!" అంది.

"అబద్ధాలు చెప్పకండి. ఓ సామాన్యమైన స్కూల్ టీచర్ ఇలాంటి వసతులున్న భవంతిలో వుండదు. మెర్సిడెజ్ కారుల్లో తిరగదు!" అన్నాడు

"నేను ఎవరైతే మీకెందుకూ? మీకు ఇక్కడేం ఇబ్బందిలేదుగా?" బత్తాయిపండ్లు స్వయంగా రసంతీస్తూ అడిగింది.

"నాకు ఫోన్ కావాలి" అన్నాడు.

"ఎవరికి చెయ్యాలి?" అడిగింది.

"మా ఇంటికే...."

"మీ నాన్నగారితో మాట్లాడాలా?"

"కాదు. మా నౌకర్‌తో మాట్లాడి ఒక నెంబర్ తెలుసుకోవాలి."

"ఎవరి నెంబర్?"

"ఆమె....ఎవరని చెప్పను? నా ప్రాణం. నా సమస్తం. నా అస్తిత్వం. తను లేని నా లైఫ్ వేస్ట్!" ఉద్రేకంగా అన్నాడు.

ఆమె మామూలుగా చూసి జ్యూస్ అందించింది.

"ఫోన్ కావాలి" చిన్నపిల్లాడిలా అన్నాడు సిద్ధార్థ.

"అలాగే! ముందు జ్యూస్ తాగండి" అంది.

సిద్ధార్థ గ్లాసు అందుకుని సిప్ చేస్తుండగా అడిగింది. "ఆమెలో అంత ప్రత్యేకత ఏం వుందో చెప్పగలరా?"

అతను విచిత్రంగా చూశాడు.

"విపరీతమైన అందగత్తె....నాకంటే కూడా!" అతనికి ఎదురుగా నిలబడి చేతులు కట్టుకుని అడిగింది.

పాలరాతి శిల్పానికి ప్రాణప్రతిష్ఠ జరిగినట్లు వుంది ఆమె. ముట్టుకుంటే మాసిపోతోందేమో అనిపించే రంగు. తేనె కళ్ళు, పలుచని పెదాల చెక్కినట్లు ఆకృతి. నల్లని కురులు. చూపుల్లో రాజసం, ఊహూ! కీర్తిలో ఇవన్నీ లేకపోయినా....ఏదో వుంది.



అదేమిటో అతను చెప్పలేకపోయాడు.

మౌనంగా చూశాడు.

"పోనీ! చాలా తెలివైనదా?" అడిగింది మళ్ళీ!

సిద్ధార్థకి అమాయకమైన ఆమె రూపం మదిలో మెదిలింది.

"కాదు!" అన్నాడు.

"ఆమెలో మరి ఏ ప్రత్యేకత మిమ్మల్ని అంతగా ఆకర్షిస్తోంది?" వాడిగా అడిగింది.

"ఇదీ అని చెప్పలేం. ఆమె లేకపోతే నా జీవితాన్ని నేను ఊహించలేకపోతున్నాను. ఆమెని ప్రతిక్షణం చూడాలనీ, దగ్గరగా వుండాలనీ, అసలు ఆమె ఎప్పటినుండో నాకు చెందిన మనిషనీ అనిపిస్తుంది. అంతకన్నా గొప్ప, అందమైన తెలివైన అమ్మాయి వచ్చినా నాకు వద్దు. కీర్తే కావాలి."

"మీరు ఇమెచ్యూర్‌గా ప్రవర్తిస్తున్నారు. మనం ఎంచుకున్న దాని కన్నా గొప్పది దొరికినా వద్దనడం తెలివితక్కువ" కాస్త పరుషంగా అంది.

సిద్ధార్థ నవ్వాడు.

"ఎందుకా నవ్వు?"

"నాకో కథ గుర్తొచ్చింది. చెప్పనా? సంతలో ఒక చిన్నపిల్లవాడు తప్పిపోయాడుట. 'అమ్మ కావాలీ! అని ఏడుస్తున్నవాడ్ని ప్రతివాళ్ళూ 'మీ అమ్మ ఎలా వుంటుందో' వర్ణించమని అడిగారు. దానికితోడు 'మా అమ్మంత అందమైనవాళ్ళు ఇంకెవరూ వుండరు. చాలా బావుంటుంది' అని చెప్పాడుట. బావున్న స్త్రీలందరి దగ్గరకీ వాడ్ని ఎత్తుకెళ్ళి చూపించారుట. సాయంత్రానికి వాళ్ళమ్మ ఏడుస్తూ పరుగెత్తుకొచ్చి 'నా తండ్రీ....నాయనా ఎక్కడకెళ్ళిపోయావురా....? నువ్వు లేకపోతే నేనెలా బతుకుతాననుకున్నావురా?" అంటూ వచ్చి చుట్టుకుపోయిందిట.

పిల్లాడు ఆవిడ్ని గట్టిగా కౌగిలించుకుని "చూసారా మా అమ్మలా ఎవరయినా వుంటారా?" అడిగాడుట. చూసినవాళ్ళు ఒకింత అందవికారంగా, బలహీనంగా వున్న ఆవిడ్ని చూసినవాళ్ళు ముక్కున వేలేసుకున్నారుట. ఆ పిల్లవాడి కళ్ళకే మాత్రం వాళ్ళ అమ్మ ఆత్మసౌంద

ర్యమే కనిపిస్తోంది. ఎంత అందగత్తె వచ్చినా వాడికి అమ్మ కాలేదు" అన్నాడు.

"అది అమ్మ విషయంలో రైటేమోగానీ, ప్రేయసి విషయంలో అలా అనుకునేవాళ్ళుంటారా?" ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

"ప్రేమ....అనేది ఒక శక్తి! సమ్మోహన శక్తి! అది ఇద్దరి మనుషుల మధ్య ఏర్పడ్డాక వారిద్దరికీ ఇక మిగతా ప్రపంచం....అప్పటిదాకా వున్న తల్లీ, తోబుట్టినవాళ్ళూ, స్నేహితులూ అందరూ పరాయిగానూ, వాళ్ళిద్దరూ మాత్రం ఒకటిగా కనిపిస్తారు. ఈ ప్రపంచంలో నాదన్నది ఏవుందని అడిగితే, కీర్తి అని జవాబిస్తాను...." కళ్ళు మూసుకుంటూ అన్నాడు.

"ఇన్నాళ్ళనుంచీ దగ్గరగా వున్నాను. నేనంటే మీకు ఆకర్షణ కలగడంలేదా?"

అతి దగ్గరగా వినపడ్డ ఆ మాటలకి అతడు కళ్ళు తెరిచాడు.

ఆమె ముఖం అతని ముఖానికి దగ్గరగా వుంది. పెదవులతో అతని పెదవుల్ని సున్నితంగా రాస్తూ అంది.

"పింకీ....ఏవిటిది?"

అతని మాటలు పూర్తవకుండానే ఆమె తన పెదవులతో అతని పెదవుల్ని మూసేసింది. సిద్ధార్థ ఉక్కిరిబిక్కిరయ్యాడు. అమృతం గ్రోలుతున్నట్లు ఆమె కళ్ళు మత్తెక్కాయి.

"ఐ లవ్‌యూ సిద్దూ" అని పలవరించింది.

ఆమె వేసుకున్న లోనెక్ బనీన్‌వైపు చూడకుండా వుండడానికి అతను ప్రయత్నిస్తూ.

"ప్లీజ్....దూరంగా వుండండి" అన్నాడు.

"నాకేం తక్కువ సిద్దూ?" పింకీ అతని షర్ట్ బటన్స్ విప్పి గుండెల మీద చేత్తో రాస్తూ అడిగింది.

సిద్ధార్థ వూపిరి బిగపట్టి ఆమెనుండి విడివడడానికి ప్రయత్నించాడు.

ఆమె శరీరం మెత్తగా అతని తనువుని ప్రతి అంగుళం స్పృశిస్తోంది. కొండలమీద నుండి పారే జలపాతంలో పడి కొట్టుకుపోతున్నట్లుగా



వుంది అతని స్థితి.

"ప్లీజ్....లీవ్‌మీ" అనరిచాడు.

"అలా అనచ్చా?" కవ్విస్తూ అతన్ని మరింతగా హత్తుకుపోయింది.

సిద్ధార్థ బలంగా ఆమెని దూరంగా నెట్టాడు. అతికష్టంమీద లేచి నిలబడ్డాడు. ఆమె రోషంగా రొప్పుతూ అతనివైపు చూస్తోంది.

"సారీ! నాకు....నాకు కీర్తి తప్ప ఎవరూ వద్దు!" అతను ఒంటికాలి మీద కుంటుతూ ఆ గది బయటికి నడిచాడు.

ఆమె పెదవిని మునిపంట బిగపట్టి అవమానాన్ని దిగమింగుకుంటున్నట్లుగా నిలబడింది.

* * * *

"ఏమైంది? నువ్వు పింకీ అని పేరుపెట్టుకున్న శృతకీర్తివని తెల్సిపోయిందా?" రాజారావు కంగారుగా అడిగాడు.

శృతి మొహం అవమానంతో ఎర్రబడింది. కోపంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి.

"చెప్పమ్మా....ఏం జరిగిందీ?" బతిమాలుతున్నట్లు అడిగాడు రాజారావు.

"మీరు చాలా తెలివైనపని చేసాననుకుంటున్నారా? కాయితంమీద అతన్ని చూడనూ, కలవనూ అని రాసినంత మాత్రాన మీ అబ్బాయికి ఆమె దూరమయిపోతుందా? అతని మనసు ఈ ఎడబాటువల్ల ఇంకా గాఢంగా ఆమెని ప్రేమిస్తోంది" పత్తిపలుకుతూ కసిగా అంది.

"అయితే....ఏం చెయ్యను?" ఆయన దిక్కుతోచనట్లు అడిగాడు.

"ఆమె సిద్ధార్థని ప్రేమించకూడదు. మానసికంగా కూడా దూరం అవ్వాలి. వెంటనే పెళ్ళి జరిపించండి వాళ్ళ బావతో. లేదు ఇంకేమైనా చెయ్యండి" అక్కసుగా అంది.

రాజారావు నసుగుతూ "వాళ్ళ నాన్న ఉద్యోగం పోగొట్టాము. మళ్ళీ వేయిస్తానన్నా నీ సాయం నాకేం వద్దు అన్న అభిమానధనుడాయన గారు. ఈసారేం చేసి ఈ అమ్మాయికి త్వరగా పెళ్ళిచేయడానికి ఒప్పించగలం?" అన్నాడు.

శృతి కోపంగా "అదంతా నాకేం తెలీదు. ఆ అమ్మాయి మాన సికంగా కూడా సిద్ధూకి దూరమయిపోవాలి. నా వ్యవహారాలన్నీ మానుకుని, మీ అబ్బాయికి సేవలుచేస్తూ ఇప్పటికే చాలా టైం వేస్టు చేసుకున్నాను. ఇంక నావల్ల కాదు. మీరేం చేయలేకపోతే మీ వాడ్ని తీసుకెళ్ళి ఆ పిల్ల కిచ్చి పెళ్ళిచేయండి" అంది.

"అయ్యో! అంత మాటనకమ్మా. నువ్వే నా కోడలివి. ఈ ప్రేమా దోమా అన్నీ నాలుగు రోజుల్లో మాసిపోతాయి. మన అంతస్తూ, ప్రతిష్ఠ ఇవే కలకాలం నిలిచివుంటాయి. నేను ఏదో ఒక ఉపాయం ఆలోచిస్తాగా. నువ్వు నిశ్చింతగా వుండు" అని ఆమెని శాంతపరిచాడు.

"అదీ చూస్తాను!" అని శృతి విస విసా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

అద్దంలో తన అందం చూసుకున్నప్పుడల్లా సిద్ధార్థ తిరస్కారం ఆమె ఒళ్ళంతా జ్వాలలు రేపుతోంది.

"సిద్ధార్థా....సిద్ధార్థా...." అని శృతి గట్టిగా పిలుస్తూ అన్ని గదులూ కలియతిరిగింది.

అండాళ్ళు ఒణికిపోతూ ఓ పక్కగా నడిచింది.

శృతి ఆమెవైపు చూసి అరిచింది- "అతన్ని కనిపెట్టి వుండమంటే వుండకుండా ఏం చేస్తున్నావే? అసలు గేట్లకి వేసిన తాళాలు వేసినట్లే వున్నాయి. ఎలా వెళ్ళాడు?"

అండాళ్ళు భయంగా నోరు కదపబోయి ఆగిపోయింది. తన నోటికి కూడా మూగదన్న తాళం వేసిందని ఆమెకి గుర్తొచ్చింది.

శృతి కాంపౌండ్‌వాల్ దగ్గర నడుస్తున్నదల్లా ఓచోట ఆగిపోయింది. అక్కడ గోడకి గుచ్చిన గాజుపెంకులు ఎర్రగా వున్నాయి. రక్తం బొట్లుగా కారినట్టు క్రిందకి జారిన చార కన్పించింది. సూక్ష్మదృష్టిగల శృతి కంటికి ఆ రంగు కనిపించింది.

"కాలికి కట్టుతోనే....గోడదూకి పారిపోయాడన్నమాట! ఎంత దూరమని వెళతాడులే" అని వేగంగా కారెక్కి స్టార్ట్ చేసింది.

• • • •

సిద్ధార్థ కష్టం మీద ముందుకి కదులుతున్నాడు. తనని బంధించాల్సిన



అవసరమేమిటో అతనికి అర్థంకావడంలేదు. పింకీ పట్ల తనెంతో కృతజ్ఞతతో వుంటే....ఆమె తనపట్ల ఆ విధంగా ప్రవర్తించడం కూడా ఆశ్చర్యంగా వుంది.

ఇంక అడుగుతీసి అడుగువేసే శక్తిలేక ఆగిపోయాడు. కారొచ్చి పక్కన ఆగింది.

"నడిచింది చాలు....ఇంక కారెక్కండి" డోర్ తెరుస్తూ అంది శృతి.

సిద్ధార్థ వాడిగా ఆమెవైపు చూస్తూ అన్నాడు- "నేను నీతో రాను. నన్ను నీ పంజరంలో చిలకని పెంచుకున్నట్టు వుంచుకోవాలని అనుకుంటు న్నావేమో!"

"ఆ చివరిది నిజం" ఆమె నవ్వింది.

"స్త్రీ అంటే నాకు చాలా గౌరవం. ప్లీజ్....దాన్ని పోగొట్టకు" అన్నాడు.

"నీ గౌరవాన్ని పెంచుతానుగానీ....ప్లీజ్ సిద్ధూ నాతో రా" అమె బతిమాలింది.

"ఒద్దు. ఇంటికి వెళ్తాను. పనుంది" అన్నాడు.

"నేను తీసుకెళతాను."

"నేను నమ్మను."

"నీ కీర్తి ఎడ్రెస్ కావాలంటే కారెక్కు" చాలా మామూలుగా ఉంది ఆమె స్వరం.

సిద్ధార్థ ఉలిక్కిపడ్డట్టు చూశాడు.

"నీకు నాకీర్తి తెలుసా?"

ఆమె నవ్వింది. "జీవితానికి శృతి లేని శృతకీర్తి కూడా తెలుసు. రా...."

• • • •

"ప్రేమని ఇంద్రజాలంతో పోలుస్తారు. కానీ ఇంద్రజాలం కేవలం కనికట్టు మాత్రమే అన్నది నా నమ్మకం. అందుకే నేను ఒక రాత్రి ట్రైన్‌లో కలిసి ప్రేమించిన నీ ప్రేమని నమ్మలేకపోతున్నాను. నీ గురించి ఏమీ తెలియని, ఓ మధ్యతరగతి అమ్మాయి నీ జీవితంలోకి వచ్చి నీకు ఏ

ఆనందాలని ఇవ్వగలదని భావిస్తున్నావు. ఆ అమ్మాయి విషయానికొస్తే.... అందనివి అన్నీ అద్భుతంగానే వుంటాయి. ఫెయిరీ టేల్స్‌లో సిండరెల్లా కథ చదువుకోలేదా? కానీ నీ ఖరీదైన అలవాట్లూ, ఆనందాలూ ఆమె నీతో కలిసి ఆనందించగలదా? నీతో స్కీయింగ్‌కొస్తుందా? పబ్‌లో ఫ్రీగా కూర్చోగలదా? కనీసం నీ జెన్‌ని డ్రైవ్ చెయ్యగలదా? నువ్వు అరవైవేలు పెట్టి ఒక పెయింటింగ్ కొని కానుకగా ఇంటికి తీసుకొస్తే ఖరీదు గురించి ఆలోచించకుండా సంతోషపడగలదా? ఇవన్నీ డిఫరెంట్ లైఫ్ స్టయిల్స్ మధ్య వచ్చే సంఘర్షణలు. చూడు సిద్ధూ! లోకంలో ఎన్ని వర్ణాలూ, మతాలూ, కులాలూ వున్నాయో నాకు తెలీదు. కానీ ...నాకు తెలిసినవల్లా రెండే కులాలు! డబ్బున్న వారి కులం, డబ్బులేని వారి కులం. జీవితాన్ని సాఫీగా గడపడానికి మనం మనని అర్థంచేసుకుని మన జీవిత విధానం తెలిసిన వారినే ఎన్నుకోవాలి. నేను నీ విషయంలో అదే చేసాను. ఇది 'ప్రేమ' అనను. కానీ ఎంపిక. ఇష్టమైన దానినే ఎంచుకుంటాం కదా."

శృతకీర్తి చెప్పేదంతా సీరియస్‌గా విన్నాడు సిద్ధార్థ.

వారి వెనక జలజలమంటూ కృత్రిమ జలపాతం తన పని తాను చేసుకుపోతోంది. జీవిత భాగస్వామిని ఎంచుకునేటప్పుడు ఆలోచించవలసిన విధానాన్ని అతి తేలిగ్గా చెప్పేసుకుపోయిన ఆ బిజినెస్ మేగ్నెట్‌ని మెచ్చుకుంటున్నట్టు అతను కళ్ళు ఎగురవేశాడు.

"శృతీ! యూ ఆర్ రైట్! నువ్వు చెప్పేది నిజం" అన్నాడు.

ఆమె గర్వంగా చూసింది.

"ప్రేమ అనే అద్భుతవరం నీకు జీవితంలో లభించనంతవరకూ ఇలాగే ఆలోచిస్తావు ఇది నీ తప్పు కాదు" అన్నాడు.

ఆమె విసుగ్గా అతని కళ్ళల్లోకి చూసింది.

ఆండాళ్ళు అందమైన టీ సెట్టుతో వచ్చి టీ సర్వ్ చెయ్యబోయింది.

శృతి ఒక వేలితో ఆమెని వెళ్ళమని సైగ చేసింది. తనే టీ కలుపుతూ సిద్ధూ చెప్పబోయే దానికోసం చూసింది.

"ఒక మనిషిని అధికారంతో బంధించడానికీ.... అనురాగంతో కట్టివెయ్యడానికీ వున్న తేడా! నువ్వు నా కాళ్ళు విరగ్గొట్టించి, ఈ ఇంట్లో ఖైదు చేసి, స్వంతం చేసుకున్నాను అనుకున్నావు. ఇంకా కాస్త ముందుకి



వెళ్ళి మగవాడి మనసులో ప్రేమకీ, శరీరపు ఆకలికీ సంబంధం లేదని ఆ ప్రయత్నంలోనూ నన్ను పరీక్షించావు."

"నో....నో" అరిచింది శృతి. ఆమె చేతులు వణుకుతున్నాయి. కప్పు టీపాయ్‌మీద పెట్టేస్తూ కంగారుగా అంది. "నేను నీ కాళ్ళు విరగ్గొట్టించానా? అలా భావిస్తున్నావా? తప్పు. నిజంగా నిన్ను ఏక్సిడెంటల్‌గా చూసే తీసుకొచ్చాను. కానీ సిద్ధార్థవని మాత్రం తెలుసు. అందుకే ఇక్కడికి తీసుకొచ్చాను. అంతే! నన్ను నమ్ము. నిన్ను నేను కొట్టించలేదు. ప్లీజ్....బిలీవ్‌మీ" వేడికోలుగా అంది.

"అయితే అంత నిర్దాక్షిణ్యంగా నన్ను కొట్టించాల్సిన అవసరం ఎవరికుంది?" వాడిగా అడిగాడు.

"బహుశా మీ నాన్న ఈ పనిచేసి వుండవచ్చు" టీ అందిస్తూ అంది.

సిద్ధార్థ తల అడ్డంగా వూపాడు.

"ఆయన నా కోసం ఇతరులని హింసిస్తాడేమో కానీ, నన్ను హింసించాలనుకోడు" అన్నాడు.

శృతకీర్తి నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"ఆస్తికోసం అన్నదమ్ముల్ని చంపేవాళ్ళనీ, కన్నపిల్లల్ని అమ్ముకునే వాళ్ళని, అక్కచెల్లెళ్ళని చెరపట్టే వాళ్ళనీ నేను చూశాను ఈ డబ్బు అనేది ప్రేమకన్నా థౌజండ్ టైమ్స్ ఎక్కువ కిక్ ఇస్తుంది. నా ఆస్తి ఎంతో ఆడిటర్ అయిన ఆయనకే బాగా తెలుసు. ఇలాంటి కోడల్ని చేజారిపోనివ్వకుండా వుండేందుకు, ఆయన ఏమైనా చేయగలడు. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు. వయసులకి గౌరవం ఇవ్వడం, మనుషులకి విలువ ఇవ్వడం నేను తగ్గించేసింది ఇలాంటి మనుషులని చూశాకే."

సిద్ధార్థ బాధగా జుట్టు చెరుపుకున్నాడు. నెమ్మదిగా అన్నాడు.

"అయ్యో! మీకు నేనెలా చెప్పగలను? ప్రేమంటే....ఆధారపడటం, అధికారం కాదు. సాహచర్యం అంటే జీవితభద్రత మాత్రమే కాదు, స్త్రీ-పురుష సంగమం. ఒప్పందం కాదు. కట్నాలూ, కానుకలూ, వాగ్దానాలు కానేకావు."

శృతి కళ్ళల్లోకి గుచ్చిగుచ్చి చూస్తూ చెప్పాడు.

"మీ ఓటమిని పరిణతితో తల పైకెత్తుకుని ఎదుర్కొండి. చిరునవ్వుతో దాన్ని తల విదిలించి వదిలెయ్యండి. అంతేకానీ చిన్నపిల్లాడిలా ఉక్రోషంతో రగిలిపోతూ వేరొకరి జీవితాల్ని శపించకండి. జీవనాధారం అయిన సూర్యరశ్మి కూడా ఎక్కువగా సోకితే చర్మాలు కాలిపోతాయి. ఆత్మ అనే తోటలో ప్రేమ అనే మీ పుష్పాలు మీరే పూయించుకోండి–వేరొకరు తెస్తారని ఆశపడకుండా. మీకు శక్తుంది. మీరు బలవంతులు. మీరూ విలువైన వారే. ఇతరులకి ఉపయోగపడతారు. ఏదైనా పరిశ్రమతో సాధించవచ్చు. డబ్బూ, కీర్తీ, ఆనందం అన్నీ. కానీ అతి కఠోర పరిశ్రమతో మాత్రం సాధించగలిగేది కేరెక్టర్. అందుకే ఈజీగా సంపాదించిన ఏదైనా వదులుకో. అతి కష్టంమీద సాధించిన అమూల్యమైన 'కేరెక్టర్ని' కాదు."

చివరి మాట చెపుతూ అతను లేచాడు.

"కంసాలి కొలిమిలో కాలి వచ్చిందే స్వచ్ఛమైన బంగారం."

శృతి రెండు చేతులూ కలిపి చప్పట్లు కొడుతూ నవ్వింది.

సిద్ధార్థ ఆశ్చర్యంగా చూశాడు.

"ప్రేమ గురించిన నీ నమ్మకానికి కొడుతున్నాను ఈ చప్పట్లు" అంది.

"నా నమ్మకం నాకు గెలిచే శక్తినిస్తుంది" అన్నాడు.

"ఒకవేళ ఓడిపోతే నా దగ్గరికి రా సిద్ధూ" అంది.

"ఎందుకూ? నీ ఇంట్లో బంగారు చెయిన్‌తో కట్టి పడెయ్యడానికా?"

"కాదు....జీవితంలో నేను నేర్చుకోని 'ప్రేమ' అనే సబ్జెక్టుని నాకు టీచ్ చేయడానికి" అంది.

సిద్ధార్థ నవ్వాడు. మనస్ఫూర్తిగా నవ్వాడు.

"తెలిసే రోజున చెప్పేవాళ్ళు కూడా వాళ్ళంతట వాళ్ళే వస్తారు. బై...." అని కదిలాడు.

"డాక్టర్‌కి ఫోన్ చేశాను. వచ్చి కట్లు విప్పుతానన్నారు" అంది.

"ఈ కట్లు నేనే విప్పుకుంటాను. ఇంకో పెద్ద కట్టుంది, దాన్ని విప్పుకోడానికెళ్ళాను అని చెప్పు" పాకెట్ నైఫ్ తీసి ప్లాస్టర్ని ఊడదీసే ప్రయత్నం చేస్తూ అన్నాడు.



శృతకీర్తి టీ సిప్‌చేస్తూ అతన్నే చూస్తూ కూర్చుంది.

'కొండ శిఖరాన్ని అధిరోహించానన్న ఆనందం ఏం వుంటుంది. మనిషికి?

మధ్యలో భయంకరమైన లోయలు లేకపోతే?'

* * * *

"కీర్తీ....ఇలారా?"

ఉదయ్ పిలుపు వినిపించగానే కీర్తికి భయం మొదలయింది. అతను ఇంట్లో ఒక్కడే వున్నాడు. అత్తయ్య, వదినావాళ్ళు గుడికి నన్నూ తీసుకెళ్ళినా బావుండేది అనిపించింది ఈమధ్య ఉదయ్ తీరు మారిపోయింది

"కీర్తీ!" ఉదయ్ గట్టిగా పిలిచాడు.

"ఆ....వస్తున్నా" అంటూ లేచి వెళ్ళింది.

"నీకు ఒక్కసారి పిలిస్తే వినిపించడంలేదేమిటీ? ఏమంత దూరంగా వున్నావనీ? కొంపదీసి చెవిటిపిల్లని కానీ అంట కట్టడంలేదుకదా నాకూ" అన్నాడు.

ఆమె మౌనంగా నిలబడింది.

"ఈ షర్ట్‌కి బటన్ కుట్టిపెట్టు" గుండెలమీద వేలుపెట్టి చూపిస్తూ అన్నాడు.

"విప్పెయ్య" అంది.

"ఇలాగే కుట్టు" అన్నాడు.

ఆమె ఇబ్బందిగా చూసింది.

"త్వరగా" అంటూ తొందరపెట్టాడు.

కీర్తి వెళ్ళి దారపురీలూ, సూదీ తెచ్చి కుట్టసాగింది.

అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆమెని సోకుతున్నాయి.

"కీర్తీ!" తమకంగా పిలిచాడు ఉదయ్.

ఆమె భయంగా చూసింది.

"ఎంత అందంగా వున్నావో తెలుసా? ఇంత ఏకాంతంలో నిన్ను ఇంత దగ్గరగా చూస్తుంటే.... నిగ్రహించుకోవడం నావల్ల కావడంలేదు."

ఆమెని ఒకచేత్తో బలంగా దగ్గరకి లాక్కుంటూ అన్నాడు.

"కెవ్వు"మని అరిచింది కీర్తి.

"ఏమైందీ?" కంగారుగా అడిగాడు.

"సూది....సూది....చేతిలో గుచ్చుకుపోయింది బావా...." విదిపించుకోవాలని చూస్తూ అంది.

"కీర్తీ! దూరంగా జరగకు. ఎలాగూ కాబోయే భార్యాభర్తలమేగా. అందరికీ పెళ్ళి అయ్యాక శోభనం జరుగుతుంది. మనకి పెళ్ళికిముందే.... అంతే! తప్పేంలేదు. దగ్గరకి రా" ఉదయ్ ఆమెని గుండెలకి హత్తుకుంటూ అన్నాడు.

కీర్తికి ఉక్కిరిబిక్కిరిగా ఒళ్ళంతా ముళ్ళు గుచ్చుకున్నంత బాధగా అనిపించసాగింది.

"ఒద్దు ...బావా....ఒద్దు....నీకు దండం పెడతాను. వదిలెయ్...." అంది.

"కీర్తీ! నాకు కోపం వస్తుంది చెప్తున్నా" అన్నాడు.

అతను ఆవేశంతో ఎర్రబడ్డాడు. ఉద్రేకంతో ఉన్మత్తంగా వున్నాడు. ఆమె లేత శరీరం సోకిన పారవశ్యంలో వున్నాడు. కాబోయే మొగుడినే కదా అన్న ధీమాలో వున్నాడు.

"భగవాన్! నన్ను రక్షించు' అనుకుంది పెనుగులాటలో అలిసిపోయిన కీర్తి.

ఉదయ్ మీదకి వచ్చేస్తున్నాడు.

"ఒద్దు....వదులు....వదులు...." నిస్సహాయంగా పోరాడుతూ అంది కీర్తి.

"ఏం ఫరవాలేదు...." ఉదయ్ క్రిందపడ్డ ఆమెని ఆక్రమిస్తూ అన్నాడు.

కీర్తి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. అతన్ని తోసెయ్యడానికి బలమంతా చేతుల్లోకి తెచ్చుకుని ప్రయత్నిస్తూనే వుంది.

అతని ముఖం ఆమె ముఖం దగ్గరగా వచ్చి ఆగింది.

ఆ తర్వాత జరగబోయేది ఆలోచించి, ఆమె రెండుకళ్ళూ గట్టిగా మూసేసుకుంది.

ఈ స్పర్శకి సిద్దార్థ తాకిన తనువు అల్లల్లాడిపోతున్నట్లు అన్పిస్తోంది.



'ఈ గడ్డిపూవుని నీ చేతితో తాకి గౌరవించావు. పరిమళం లేని పూవే కావచ్చు. కానీ నీ పూజకై ఆశపడింది. అలోగానే ధూళిలో కలిసిపోతోంది. నన్ను క్షమించు' అనుకుంది

ఎక్కడెక్కడో సంచరిస్తాయనుకున్న ఉదయ్ చేతివేళ్ళు ఆగిపోయాయి. పెదవులమీద కలగాల్సిన ఒత్తిడి కలగలేదు. శరీరం మీదనించి భారం తొలగిపోయింది. నెమ్మదిగా కనురెప్పలు విప్పి విస్మయంగా చూసింది కీర్తి.

అతను లేచి దూరంగా వెళ్ళి నిలబడ్డాడు.

ఆమె నెమ్మదిగా లేచి కూర్చుని కుచ్చిళ్ళు సవరించుకుంది.

"నేనంటే నీకు ఇష్టంలేదా?" చాలా తీవ్రంగా ఆమె కళ్ళల్లోకి చూడకుండానే అడిగాడు.

కీర్తి నోరు తెరిచి జవాబు చెప్పలేకపోయింది.

"మాట్లాడవేం?" గద్దించాడు.

"ఇ....ఇష్టమే" తడబడుతూ చెప్పేసింది.

ఉదయ్ ఆమెవైపు తిరిగి నిశితంగా చూస్తూ అన్నాడు. "అయితే ఇదంతా భయమేనా? అయిష్టంకాదా?"

ఆమె కొంగు నిండా కప్పుకుంది.

"వెళ్ళి టీ తీసుకురా!" అన్నాడు.

కీర్తి వడివడిగా అక్కడినుండి వెళ్ళిపోయింది.

టీ కలుపుతూ ఆలోచించింది. ఈ రోజుకి తప్పించుకున్నాను. కానీ రేపెలా? పెద్దలు ముహూర్తాలు పెట్టిస్తున్నారు. పెళ్ళయ్యాక బ్రతుకంతా ఎలా? రాత్రయితే భర్త దగ్గరకొస్తాడని భయపడే ఆడపిల్లల జీవితంకన్నా నరకం ఏవుంటుంది? ప్రతిసారీ పోట్లాడుకునే పిల్లుల్లా ఆ సంసారం ఈదవలసిందేనా? హృదయం అనే కటకటాల్లో ప్రేమని బంధించేసుకున్న ప్రతివాళ్ళు జైల్లో వున్నట్లే, మొదటిసారి బడికెళ్ళే పిల్లవాడికి పెద్ద పెద్ద గేట్లు చూడగానే తెలియని భయం కలిగి పెద్దగా ఏడుస్తాడు. ఆ భయం ప్రతిసారీ తాళాలు తగిలించిన తలుపులని చూస్తే కలుగుతూనే వుంటుంది. అలాగే హృదయానికి తాళం వేసుకుని బ్రతకటం తలుచుకుంటేనే చాలా భయం వేస్తోంది! ఇప్పుడేం చెయ్యాలి? బ్రతకడమా.... ఓడిపోయానని బ్రతుకుని

సమాప్తం చేసుకోడమా?

విధి బలంగా క్రిందికి పడదోసింది. కష్టపడి లేవడమా.... కళ్ళు మూసుకుని పడుండడమా? ఏం చెయ్యాలి?

బాధతో కూడిన ప్రేమ హృదయాన్ని కదిలించి దానిలో దైన్యాన్ని నింపుతోంది. ఈ హృదయ స్పందన జీవించడానికి సంకేతమా లేక ప్రతిక్షణం మరణించడానికి మార్గమా?

'సిద్ధూ.... నువ్వు తప్ప ఎవరు తాకినా ఎదురుతిరిగే ఈ తనువుని ఏం చెప్పి ఓదార్చను? ఏ విధంగా బుజ్జగించను?'

* * * *

"ఐయామ్ సిద్ధార్థ" చెయ్యి ముందుకి జాపుతూ అన్నాడు. ముక్కు మీదకి కళ్ళజోడు పెట్టుకున్న బట్టతల పెద్దాయన నవ్వుతూ చెయ్యి జాపాడు.

"కూర్చో! నీ రెజ్యూమ్ చూశాను. నా దగ్గర నువ్వు ఆడిటర్‌గా చెయ్యాలనుకోవడం నాకు సంతోషమే. కానీ ఇద్దరున్నారు" ఆయన కాస్త నొచ్చుకుంటున్నట్లు అన్నాడు.

సిద్ధార్థ రిక్వెస్టింగ్‌గా "నాకు ఎకౌంటెంట్ పోస్ట్ ఇచ్చినా ఫర్లేదు సార్! ఐ నీడ్ ఎ జాబ్" అన్నాడు.

రామ్మోహన్‌రావు కళ్ళద్దాలు పైకి తోసుకున్నాడు.

బోయ్‌తో కాఫీలు తెప్పించాడు.

"తీసుకో బాబూ!" అన్నాడు.

"థాంక్యూ" సిద్ధార్థ నోటి దగ్గరికి కప్ తీసుకెళుతుండగా అన్నాడు.

"మీ నాన్నగారిని ఈ వయసులో బాధపెట్టకు బాబూ! నీకు ఉద్యోగం చెయ్యడం ఏం కర్మ? విశ్వనాథం మేనకోడల్ని చేసుకుంటే, నువ్వే బోలెడు మందికి ఉద్యోగాలిస్తావు."

సిద్ధార్థ కప్పు టేబుల్‌మీద పెట్టేసి లేచాడు.

"అయ్యో! లేచావేమిటి....కూర్చోబాబూ!" కంగారుగా అన్నాడు ఆయన.

"సారీ! మీకు సిద్ధార్థ రాజారావుగారి అబ్బాయిగానే తెలుసని నాకు తెలీదు. నేనేమిటో కొత్తగా పరిచయం చేసుకుని, అప్పుడు ఉద్యోగం సంపాదిస్తా. వస్తా" చిరునవ్వుతోనే చెప్పి బయటకి నడిచాడు.



సిద్ధార్థ వెళ్ళిపోయేసరకూ చూసి రామ్మోహనరావు రాజారావుకి డయల్ చేశాడు.

"హలో రాజారావ్ హియర్."

"మీవాడొచ్చాడోయ్! ఉద్యోగం కావాలన్నాడు."

"ఇవ్వకపోయావా?" ఆయన ఆత్రంగా అన్నాడు.

"ఇచ్చేముందు నిన్ను బాధపెట్టొద్దని రెండు ముక్కలు నచ్చచెప్పబోయాను లేచి వెళ్ళిపోయాడు."

"ఛ! తప్పుచేశాను. చేతిలో డబ్బు లేకుండా ఏం అవస్థలు పడుతున్నాడో ఏమో!" ఆయన బాధగా అన్నాడు.

"నాకూ అదే అనిపించి నీకు చేస్తున్నాను. ఎండ కన్నెరగకుండా పనిళ్ళలో పెరిగిన పిల్లలు బయటకెళితే బాధేస్తుంది.

"అవును! థాంక్యూ....నేను ఎంక్వైరీ చేస్తాను. బై!" రాజారావు ఫోన్ క్రెడిల్ చేసేశాడు.

రామ్మోహన్‌రావు కూడా ఫోన్ పెట్టేస్తూ 'ఇంకా అరవయ్యోపడి దాటినా డబ్బు సంపాదించటానికి రాత్రింబగళ్ళు యింత అవస్థ పడుతున్నాం. సునాయాసంగా వచ్చే డబ్బుని ఆ ప్రేమ అనే రెండక్షరాల కోసం ఈ కుర్రాడు ఎలా వదులుకోగలుగుతున్నాడబ్బా?' అనుకున్నాడు.

* * * *

'మేనేజర్!' అని రాసున్న రూంలోకి ఎంటర్ అయ్యాడు సిద్ధార్థ.

"ఎస్! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?" చాలా గంభీరంగా అడిగాడాయన.

ఆ యాభై ఏళ్ళ పెద్దమనిషి తన జీవితంలో ఎప్పుడూ నవ్వి వుండలేదేమో అనిపించింది సిద్ధార్థకి.

"మీ షాపింగ్ మాల్ అంతా చూసాను సార్! క్రాకరీ పెట్టిన వైపు బాగా దుమ్ముపట్టి వుంది. డస్ట్ ఎలర్జీ...బ్రోంకైటీ వున్న వాళ్ళు అటు వెళ్ళడం ఎందుకులేఅని కావాల్సినా కొనకుండా మానుకునే ప్రమాదం వుంది. పైగా టాయ్స్ అనేవి అంత వెనగ్గా పెడితే లోపలదాకా వచ్చిన వాళ్ళకు తప్ప కనిపించవు. చిన్నపిల్లలు అమ్మానాన్నల చెయ్యి పట్టుకుని షాప్ ముందునుండి వెళుతుంటే టాయ్స్ కనిపించేలా పెట్టాలి. అప్పుడిక

వాళ్ళు పేచీపెట్టి, కాళ్ళు బాదీ ఎలాగైనా పెద్దవాళ్ళని లోపలకు లాక్కొస్తారు. వస్తువులతో ఇచ్చే ఫ్రీ గిఫ్టులేమైనా వుంటే అవి బోర్డు రాసి డిస్ప్లేలో పెట్టాలి. ఇంకా...."

మొదట విసుగ్గా వింటున్న ఆయన కాస్తా నెమ్మది నెమ్మదిగా ప్రసన్నంగా మారి వింటూ సిద్దార్థని కూర్చోమని తన ఎదురు కుర్చీ చూపించాడు.

థాంక్యూసర్ ....ఇంకొక విషయం చెప్తే తప్పుగా అనుకోకండి. మీ 'మాల్'లో పనిచేసే అమ్మాయిలంతా కూడా మీలాగే గంభీరంగా వున్నారు. మే బీ దే ఆర్ వెల్ ఎడ్యుకేటెడ్. కానీ....మొహంలో చిరునవ్వు లేకపోతే వేస్టండీ! ముఖ్యంగా సేల్స్ లైన్లో అదెంతో ముఖ్యం! సారీ సర్! అతిగా మాట్లాడానా?" సందేహంగా అన్నాడు.

ఆయన ముఖంలో చిన్నగా నవ్వు తొంగిచూసింది.

"లేదు. మీరేం చేస్తూ వుంటారు?"

"ఇదివరకు....అది ఎందుకులెండి. మీరు ఏదైనా పని ఇప్పిస్తే చేసుకు బతుకుతాను" అన్నాడు.

ఆయన మళ్ళీ గంభీరంగా మారాడు.

"అయితే మీరు ఉద్యోగం కోసం వచ్చారా?"

సిద్దార్థ వెంటనే అడ్డుపడుతూ అన్నాడు. "మీదగ్గర ఉద్యోగం కోసం మిమ్మల్ని పడెయ్యడానికి ఇదంతా చెప్పలేదు. సిన్సియర్‌గా ఫీలయ్యే చెప్పాను. ఎందుకంటే...." అతను ఆగి ఒక్కసారి కళ్ళు ఆర్పి మళ్ళీ తెరుస్తూ అన్నాడు. "చిన్నప్పుడు మా అమ్మతో తరచూ ఇక్కడికి వస్తూ వుండేవాడిని. మూక్కుపొడుం పీల్చే ఒక వ్యక్తి సిమెంట్‌తో బొమ్మ నడిచేట్లు చేసి ఇక్కడ షోకేస్‌లో పెట్టేవారు. దాన్ని చూడడం కోసం మారాంచేసి మా అమ్మని ఇక్కడికి లాక్కొచ్చేవాడిని నేను బొమ్మనే చూస్తూ నిలబడితే, అమ్మ హాయిగా షాపింగ్ చేసుకునేది. ఆ మూల...." అతను వెనక్కి తిరిగి ఒక మూలకి వేలు చూపిస్తూ అన్నాడు.

"అక్కడ ఒక అమ్మాయి ఎడంచేత్తో అద్దం పట్టుకుని కుడిచేత్తో బొట్టు దిద్దుకుంటున్న పెద్ద ఎడ్వర్‌టైజ్‌మెంట్ బొమ్మ వుండేది. ఇప్పుడు ఆ భంగిమలో బొట్టు పెట్టుకునే వారని ఆడపిల్లలకి తెలియదనుకోండి.



కౌంటర్ దగ్గర సీసాలో సంత్రా తొనల్లాంటి పిప్పరమెంట్లు పోసి పెట్టుకుని....నాలాంటి చిన్నపిల్లలకి ఒక చెయ్యి పడితే కోప్పడి మరీ రెండు చేతులూ పట్టించి నిండా పోసేవారు ఓ పెద్దాయన. ఇప్పుడు మా అమ్మ లేదు. ఈ షాప్ ముందునుండి వెళుతుంటే అప్పటి రష్ కూడా లేదని తెలిసింది. అందుకే ఇంత సేపు చెప్పాను. మీ టైం వేస్ట్ చేస్తే క్షమించండి."

"అదేం లేదు!" పెద్దాయన కూడా కళ్ళద్దాలు తీసి ఒక్కసారి కళ్ళు తుడుచుకుని పెట్టుకుంటూ అన్నాడు. "అప్పుడు మా నాన్నగారు చూసుకునేవారు. ఆయన పోయాక ఈ బాధ్యత నామీద పడింది. "కొత్త కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌లొచ్చాక దీనివక్కకి ఎవరూ పెద్దగా రావడం లేదు కూడానూ. నా కొడుకులు ఇంజనీరింగ్, ఎం.బి.ఏ.లు చదివి ఎక్కడో ఉద్యోగం చేసుకోవడానికి తప్ప, దీని అభివృద్ధిమీద ఇంట్రెస్టు చూపించటంలేదు. అందుకే నేనూ అమ్మేయాలనుకుంటున్నాను" అన్నాడు.

"నో....అలా చెయ్యకండి. ఇప్పటి స్పీడ్ యుగంలో ఇంత స్పేషస్‌గా, సెంటర్లో షాపింగ్ మాల్ దొరకటం అదృష్టం! చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే దీన్ని అద్భుతంగా చెయ్యొచ్చు. సేల్స్ కూడా పెంచవచ్చు. ప్రతిరోజూ లక్కీడీప్ ద్వారా బహుమతులివ్వడం చాలామంది చేస్తుంటారు. కానీ మనం ప్రతి వాళ్ళకీ ఒక టోకెన్ ఇచ్చి ఆ నెంబరున్న అర తెరిచి ఆ వస్తువు పట్టుకెళ్ళేటట్లుగా పాకెట్ నైఫ్ నుండి లాకెట్ చైన్ వరకూ పెట్టామనుకోండీ....మనకి పెద్ద నష్టం వుండదు. ఆడవాళ్ళకి ఫ్రీగా కర్చీఫ్ ఇచ్చినా సంతోషంగా వుంటుంది. ఈలోగా పక్కింటి ఆవిడకి గోల్డ్ బ్యాంగిల్స్ వచ్చాయని చెప్పిందనుకోండి....ఈవిడ అవసరం వున్నా ప్రతిరోజూ షాపింగ్‌చేసి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది" చెప్తూ ఆగి అన్నాడు. "నాకు వుద్యోగం ఇవ్వకపోయినా ఫర్లేదు. ఇలాంటివి చేసి చూడండి. అప్పుడు మీరే నన్ను పిలిపిస్తారు! వస్తానండీ."

ఆయన ఏం మాట్లాడలేదు.

సిద్దార్థ లేచి వెనక్కి తిరుగుతుండగా పిలిచాడు.

"మీ పేరేమిటి?"

"సిద్దార్థ."

"సిద్ధార్థా! మీరు ఇక్కడ ఏం పని చెయ్యదల్చుకున్నారూ?"

సిద్ధార్థ మొహంలో సంతోషం కనిపించింది. "ఏదైనా.... సేల్స్ బోయ్, ఎకౌంటెంట్, ఫ్లోర్ క్లీనర్....ఏమైనా ఫర్లేదు."

"మీరు ఇంగ్లీష్ ధారాళంగా మాట్లాడగలరా?"

"ఎస్ సర్! ఐయామ్ ఫ్రం ద్యూక్స్ పబ్లిక్ స్కూల్."

"వెరీగుడ్! ఏ సేల్స్‌మెన్ నీడ్స్ గుడ్ కన్‌వర్‌సేషనల్...." అని ఆగి సిద్ధార్థ నవ్వడం గమనించి అడిగాడు. "ఎందుకు నవ్వుతున్నావు?"

"ఏం లేదు్సర్....నేనొక పార్టీకెళ్ళాను. మీలాంటి పెద్దాయన ఒకాయన కుక్కల పెంపకం గురించి మాట్లాడ్డం మొదలుపెట్టాడు. నా ఫ్రెండ్సంతా నెమ్మదిగా వదిలించుకుని జారుకున్నారు. నేను మాత్రం గౌరవంకొద్దీ నవ్వు పులుముకుని వింటూనే కూర్చున్నాను. పార్టీ అయిపోయి లాస్ట్ గెస్ట్ కూడా వెళ్ళిపోయాక ఆయన నన్ను వదిలిపెడుతూ.... హోస్ట్‌తో నా గురించి–"నైస్ చాప్! గుడ్ కన్‌వర్‌సేషనలిస్ట్!" అన్నాడు. ఆ మొత్తం ఈవినింగ్ నేను అసలు నోరు విప్పిందే లేదు!"

సిద్ధార్థ చక్కని ఇంగ్లీష్‌లో చెప్పి నవ్వుతుంటే ఆయన కూడా నవ్వాడు.

"సో....నువ్వు ఈరోజు రెండు పాఠాలు నేర్పావన్నమాట నాకు!" అన్నాడు.

"నేనా?" అన్నాడు సిద్ధార్థ.

"ఎస్ మై బోయ్! 'స్మైల్ చెయ్యడం రానిదే షాపు తెరవకు' అన్నది చైనా సామెత. నువ్వు దానితోపాటు ఇతరులు చెప్పేది వినగలిగినవాడే మంచి సేల్స్‌మెన్ అని నేర్పించావు. ఐ లైకిట్. ఎప్పటినుంచి చేరతావూ?"

"ఈ క్షణం నుండీ నేను మీ ఎంప్లాయీనండీ!"

"గుడ్! జీతం నేను ఎక్కువగా ఇవ్వలేను. ప్రస్తుతానికి రెండువేలు మాత్రం ఇవ్వగలను."

సిద్ధార్థకి తను వెయ్యిరూపాయలు వెయిటర్‌కి టిప్‌గా ఇవ్వడం గుర్తొచ్చి నవ్వొచ్చింది. కష్టాల్లో వున్నప్పుడు సుఖాలు తలుచుకుని బాధపడడం కన్నా నవ్వుకోవడం నేర్చుకుంటే ఎక్కువ రిలీఫ్‌గా వుంటుంది.



"థాంక్యూ సార్!" వినయంగా అన్నాడు.

"నువ్వెళ్ళి అన్ని డిపార్ట్‌మెంట్సూ తిరిగి ఏ మార్పులు చేయ్యాలో, చేస్తే లాభం ఏమిటో రాసి నా దగ్గరికి వస్తూ....ఆల్ ది బెస్ట్!"

"ఓ.కె. సార్!" సిద్ధార్థ స్పీడ్‌గా వెళ్ళడం చూసి వెనక్కి వాలి సిగార్ నోట్లో పెట్టుకున్నాడు త్రిపాఠీ.

ఆయన కళ్ళల్లో గాజు అరలో ముక్కుపొడుం పీల్చే బొమ్మ.... పిప్పర్‌మెంట్లు పిల్లలకి పంచుతూ ఆనందించిన తండ్రీ మెదిలారు. తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు.

• • • •

ఏ మనిషికైనా సృష్టిలో మధురమైనవి రెండే, తన గురించీ, తనవాళ్ళ గురించీ ఇతరులు చెప్పే మంచి మాటలు.

ఈ విషయాలు ఏ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సుల వాళ్ళూ సిద్ధార్థకి చెప్పలేదు. అతని తల్లి చెప్పింది.

"యదునందనా....నందకిశోరా....మన ద్వారకలో అందరూ కుశలమేనా?" అని అడిగితే కృష్ణుడే అక్కర్లేదు. ఎవరైనా ఆ ప్రేమకు దాసు అవ్వాల్సిందే! నా....తనా....అనే విషయాలు ఎంత మధురమైనవీ" ఆ మాటే మరోసారి ఇరానీ హోటల్‌లో కూర్చుని సమోసాలూ, టీ తెప్పించుకుని కీర్తిని తలుచుకుంటూ అనుకున్నాడు.

'లైఫ్ స్టయిల్‌లో డిఫరెన్సులుండడమే పెద్ద కష్టం అంది శృతి. అదే నాకు వరమైంది. నెలకి రెండువేలు సంపాదించే ఈ సిద్దూని నువ్వు ఇదివరకటిలాగే ఇష్టపడ్తావు కదూ కీర్తీ!

• • • •

"కీర్తీ....అత్యంత ప్రియమైనవాళ్ళకి ఒక గిఫ్ట్ ఇవ్వాలనిపిస్తే ఎలాంటిది కొనచ్చూ?" బజార్లో నడుస్తున్నవాడల్లా సడెన్‌గా కీర్తి వైపు చూస్తూ అడిగాడు ఉదయ్.

కీర్తి జవాబు చెప్పలేనట్లు చూసింది.

ఉదయ్ నవ్వి "బడ్జెట్ గురించి ఆలోచిస్తున్నావుకదూ. ఖరీదైనదే. అత్యంత ప్రియమైన వాళ్ళకి అని చెప్పానుగా!" అన్నాడు.

"డయిరీ" అంది.

ఉదయ్ ఆశ్చర్యంగా చూశాడు.

"మనిషికి తన గురించి ఆలోచించడం, ఒకప్పుడు జరిగిన సంఘటనలు తలుచుకోవడం తప్పించి ఇష్టమైనవి ఏవుంటాయి. అందుకు పనికొచ్చే డయిరీ కొనివ్వు. ప్రతిరోజూ వాడుతూ నిన్ను తలుచుకుంటారు" అంది.

"గుడ్ ఐడియా! పద.... ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లోకి వెళ్ళి వెదుకుదాం" అన్నాడు.

"ఎవరికి బావా?"

ఉదయ్ నవ్వాడు. సస్పెన్స్!" అన్నాడు.

కీర్తి అతని వెంట నడిచింది.

"ఒకవైపంతా పుస్తకాలు అరల్లో వరసగా పేర్చి వున్నాయి. కీర్తి ఒక్కొక్క పుస్తకమే తీసి పేర్లు చదువుతూ ముందుకి నడవసాగింది.

"కీర్తీ! నువ్వు డైరీలు చూస్తుండు, నేను అటువక్కగా వెళ్ళి మంచి పైలు వున్నాయేమో చూసొస్తాను" అని ఉదయ్ వెళ్ళాడు.

కీర్తి పైనున్న నీలిరంగు డైరీని అందుకోబోయేసరికి బొత్తులుగా పేర్చిన పుస్తకాలన్నీ వరుసగా పక్కకి ఒరిగిపోయాయి. ఆ పుస్తకం వెనక వైపున్న సిద్ధార్థ ఓసారి ఇటు చూసి తల తిప్పుకోబోయి ఆగిపోయాడు. మొదట భ్రమేమో అనుకొన్నాడు.... కాదు, నిజమే!

కీర్తి మొహంలో క్షణంలో వెయ్యోవంతు సేపు కనిపించి మాయమైంది. ఆమె క్రింద కూర్చునే పుస్తకాలు వెదుకుతోంది.

సిద్ధార్థ కేవలం పది గజాలదూరంలో నిలబడి పుస్తకాలర్యాక్ క్రింద నుండి కనిపిస్తున్న ఆమె చీర కుచ్చిళ్ళు చూస్తున్నాడు. గబుక్కున అటు పరిగెత్తి "కీర్తీ!" అంటూ ఆమెని లేవదీసి గుండెలకు హత్తుకోకుండా వుండడానికి చాలా కంట్రోల్ అవసరం అవుతోంది.

కీర్తి నెమ్మదిగా లేచింది.

పుస్తకాల మధ్యలోంచి ఆమె మొహం చంద్రవంకలా సగం మాత్రమే కనిపిస్తోంది.

నల్లని కళ్ళు.... విషాదాలని పూర్తిగా దాచుకున్నట్లు అతి నల్లగా వున్నాయి. ప్రపంచంలోని ప్రతి రహస్యాన్ని దోచుకున్నట్లుగా కను



పాపలు గంభీరంగా వున్నాయి. అందాలని దాచుకున్న అమ్ములపొదిలా కనురెప్పల వెంట్రుకలు తీక్షణంగా వున్నాయి. మనసులో భావాల్లా హరివిల్లులాంటి కనుబొమలు సన్నగా ఒంపుగా తిరిగి వున్నాయి. ఆ కళ్ళు.... వెలుగుకోసం వేదనని భరించే రాత్రుల్లా నిశ్శబ్దంగా వున్నాయి.

ఎండిన బీడులా పగుళ్ళు బారిన పృథ్విలాంటి అతని మనసుకి తొలకరి జల్లులా వుంది సగం కనిపిస్తున్న ఆమె రూపం.

'ఎక్కడ మనసులో అనుకున్నది నిర్భయంగా చెప్పగలమో, ఎక్కడ అగాధమైన సత్యాలు తలెత్తి చాటుబడతాయో, ఎక్కడ పరిశుద్ధ వాంఛ విశ్వాసపు ఎడారిలో ఇంకిపోదో, ఎక్కడ ప్రపంచం ముక్కలై ఇరుకైన గోడల మధ్య క్రమ్మిపోదో, ఎక్కడ ఈ దీర్ఘయాత్ర అంతమై నిన్ను చేరి నిశ్చింతగా కన్ను మూస్తానో అక్కడికి నిన్ను ఎత్తుకుని పారిపోనా?' అనుకున్నాడు.

"కీర్తి....!"

ఆ పిలుపుకి ఆమె వెనక్కి తిరిగింది. ఆ పిలుపొచ్చిన దిశగా నడిచింది.

'అయితే కీర్తి ఒంటరిగా రాలేదన్నమాట. మంచిదయింది. త్వరపడి పలకరించలేదు' అనుకున్నాడు సిద్ధార్థ.

అక్కడే వున్న గవ్వల బొమ్మలు సర్దుతున్నవాడల్లా ఒక గవ్వని అరచేతిలో ఒత్తి పట్టుకున్నాడు.

కీర్తి తనకి పది గజాల దూరంలో వుంది. శరీరంలో ప్రతి అణువూ అటు పరుగెత్తమని తొందరచేస్తోంది. కానీ ఆమె శాసింపు అతని కాళ్ళకి సంకెళ్ళు వేస్తోంది. పరిగెడుతున్న మనసుని బంధించడం కోసం తనని తను గాయపరుచుకుంటున్నాడు.

అరచేతిలో దిగుతున్న పదునైన గవ్వ- బొట్టుబొట్టుగా అతని రక్తాన్ని చిందిస్తోంది. ఆ నెప్పిలో.... తెలియని పెవ్వనని పొందుతూ అడుగు కదపకుండా నిలబడడానికి ప్రయత్నిస్తున్నాడు సిద్ధార్థ. అయినా ఆమె వైపు పరిగెత్తకుండా, ఆమెని చూడకుండా వుండడం దుస్సహంగా వుంది.

"సిద్ధార్థగారూ...." అన్న పిలుపుతో బాటు భుజంమీద చెయ్యి

పడింది.

పళ్ళ బిగువున బాధ భరిస్తూ కళ్ళెత్తి చూసాడు సిద్ధార్థ.

ఉదయ్ వెలిగిపోతున్న మొహంతో ఎదురుగా నిలబడి, రెండు చేతులూ జాపి "వాట్ ఎ ప్లెజంట్ సర్‌ప్రైజ్!" అంటూ గట్టిగా కౌగిలించుకున్నాడు.

సిద్ధార్థ నవ్వుతూ అతని వీపుమీద చెయ్యి వెయ్యబోయి ఆగిపోయాడు....చేతికంతా రక్తం. గబుక్కున దాన్ని వెనక్కి దాచేసుకున్నాడు.

ఉదయ్ ఆనందంగా అన్నాడు. "మీరు నమ్ముతారో లేదోకానీ, మీకు ఓ గిఫ్ట్ కొందామనే ఈ కాంప్లెక్స్‌లోకి వచ్చాం. ఎల్లుండి మీ ఎడ్రెస్ తీసుకుని మిమ్మల్ని కలవడానికి వద్దాం అనుకున్నాను. ఎందుకంటే, ఆ రోజు నా బర్త్‌డే! మరోసారి బర్త్‌డే జరుపుకునే అవకాశం. కొత్తజన్మ ఇచ్చిన మీ దగ్గరికి రావాలనిపించింది" అన్నాడు.

సిద్ధార్థ ఉదయ్ తలమీదుగా కీర్తికోసం వెదుకుతూనే వున్నాడు. "ఎలా వున్నావ్ ఉదయ్? ఒంట్లో బావుందా?" మర్యాదకి అడిగాడు.

ఉదయ్ ఎక్సైటెడ్ అయిపోతూ అతని చేతిని పట్టుకుని వూపుతూ "మీ దయ! నౌ ఐయామ్ పర్‌ఫెక్ట్ ఆల్‌రైట్! త్వరలో పెళ్ళి కూడా చేసుకోబోతున్నాను. అన్నట్లూ నా వుడ్‌బీ కూడా వచ్చింది. అటు లేడీస్ ఎంపోరియమ్ వైపు వెళ్ళినట్లుంది. రండి చూపిస్తాను" అన్నాడు.

సిద్ధార్థకి అస్సలు వెళ్ళాలని లేదు.

"ఇక్కడే వుండండి!" అంటూ కీర్తికోసం వెదుకుతూ పుస్తకాల ర్యాక్స్ వెనగ్గా నడిచాడు. అక్కడ నిలబడ్డ అమ్మాయి కీర్తి కాదు! కీర్తి ఇందాక నిలబడ్డ ప్రదేశం వెలవెలబోతూ కనిపించింది.

ఆమెకోసం వెదుకుతూ ఒక్కొక్క డిపార్ట్‌మెంటే దాటుతున్నాడు.

"సార్! అదిగో....మేడమీద నిలబడ్డ అమ్మాయే నా వుడ్‌బీ. అటు వెళదాం రండి" ఉదయ్ వచ్చి పక్కన నిలబడి అన్నాడు.

"వెళదాం! ఈలోగా ఒక విఐపీని నేను మిస్ అవుతానేమో. అందుకే వెదుకుతున్నాను...." అవిశ్రాంతంగా అటూ ఇటూ వెదికేస్తూ అన్నాడు సిద్ధార్థ.



"ఎవరు సార్? అంత విఐపి?" కుతూహలంగా అడిగాడు ఉదయ్.

"ఆమె...." అని ఆగిపోయాడు సిద్ధార్థ.

"ఆమె! ఓ! మీరు చెప్పారే మీ జీవితానికి అర్థం....ఆవిడేనా?" ఆశ్చర్యంగా అడిగాడు ఉదయ్.

"అవును! ఇక్కడే చూసాను. ఇంతలో మాయమైంది...." బాధగా అన్నాడు.

ఉదయ్ నవ్వి "అంతేసార్....సంతోషం మన ఇంట్లో చెట్టుమీద అప్పుడప్పుడూ వాలే పాలపిట్టలా అపురూపమైనదట, విషాదం పెరటిగోడ మీద గోలచేసే కాకిలాంటిదట!" అన్నాడు.

"ఇప్పుడే వస్తాను ఉదయ్! అటు టాయ్స్ పెట్టినవైపు వెళ్ళిందేమో చూసొస్తాను."

"నేనూ వస్తాను. ఆ....ఆవిడ ఎలా వుంటారు సార్....? మీలా అందంగా వుంటారుకదూ?"

"కాదు!"

"మరి!"

"నాకన్నా ప్రపంచంలో అందరికన్నా అందంగా వుంటుంది.... నా కళ్ళు పెట్టుకుని చూస్తే!"

"సరే. ఇంత పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో వెదకడం కష్టమే ఐనా, మీరు చెప్పేటంత అందమైనవాళ్ళు తక్కువే వుంటారు కనుక తేలికే. సార్! అందులో నా వుడ్ బీ కూడా వుంటుంది" అని నవ్వాడు.

సిద్ధార్థ కూడా నవ్వి "బ్యాడ్‌లక్! ఆమెని మళ్ళీ మిస్ అయ్యాను ఉదయ్!" అన్నాడు.

"బట్, నాది గుడ్‌లక్! మిమ్మల్ని కలుసుకున్నాను. మీరు చూపెట్టకపోయినా, నా వుడ్‌బీని నేను చూపిస్తాను రండి!" అంటూ కదిలాడు ఉదయ్.

సిద్ధార్థ అతని వెంట నడుస్తూనే చుట్టూ చూస్తున్నాడు.

ఎదురుగా ఆకుపచ్చ చీరలో వస్తున్న ఆమెని చూడగానే "ఉదయ్!" అన్నాడు ఆనందంగా.

"యూ ఆర్ రైట్ సార్! షి ఈజ్ కీర్తి! నా వుడ్ బీ! కీర్తి....

ఇట్టా! ఈయన నా ప్రాణం రక్షించిన దేవుడని చెప్పానే ఆయనే.... సిద్దార్థ!" ఆనందంగా చెప్పాడు ఉదయ్.

తలమీద పిడుగు పడ్డట్టు చూస్తూ బలవంతంగా చేతులు జోడించాడు సిద్దార్థ.

అంతకన్నా పదింతల దెబ్బతిని అచేతనమైనదానిలా వున్న కీర్తి అతని చేతినుండి కారుతున్న రక్తాన్ని చూడగానే అప్రయత్నంగా-

"అయ్యో....రక్తం!" అంటూ అతని చేతిని పట్టుకుంది.

సిద్దార్థ విస్మయంగా చూసాడు.

ఆమె అతని రక్తం చూడలేనట్లు కర్చీఫ్ తీసి చేతికి చుట్టేసింది.

సంభ్రమంగా చూస్తూ "కీర్తీ!" ఉదయ్ పిలిచాడు.

ఆమె తెప్పరిల్లి సిద్దార్థ చేతిని చటుక్కున వదిలేసింది.

"రక్తం వస్తుంటే...." అంది.

"ఆ రక్తం చాలా నా శరీరంలోనూ ప్రవహిస్తోంది!" అన్నాడు ఉదయ్.

సిద్దార్థ కీర్తినీ, ఉదయ్‌నీ పక్కపక్కన చూస్తూ విషయాన్ని జీర్ణం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

"సిద్దార్థా! వచ్చే శుక్రవారం మా పెళ్ళి. మీరు తప్పకుండా రావాలి. రానాలేంటి? అసలు మీ చేతుల మీదుగానే జరగాలి. ఏమంటారు?" ఉదయ్ గడగడా మాట్లాడేస్తున్నాడు.

'కీర్తి ఉదయ్ భార్యగా మారుతోందా?'

సిద్దార్థకి వూబిలో కూరుకుపోతున్నట్లునా వుంది.

కీర్తికి సిద్దార్థని చూస్తుంటే తన ప్రాణం అతనిలో విలీనమవుతున్నట్లు అనిపించి బలవంతంగా వెనక్కి తీసుకోడానికి ప్రయత్నిస్తోంది.

"ఏం మాట్లాడరూ? మా పెళ్ళికి రెండు రోజుల ముందుగా రావాలి. సరేగానీ, నా కాబోయే శ్రీమతి ఎలావుందీ? మీ ఫియాన్సీ అంత బాలేదా!" నవ్వుతూ అడిగాడు.

సిద్దార్థ కీర్తి కళ్ళల్లోకి చూసాడు.

కీర్తి తల వంచుకుంది.

"ఎవరు బావుంటారో ఇద్దర్లో చెప్పండి?" ఉదయ్ సరదాగా అడిగాడు.



"నీ కీర్తే!" 'నీ' అని ఒత్తి పలికాడు సిద్దార్థ.

గుండెల్లో మేకు కొట్టినట్టు విలవిలలాడింది కీర్తి.

"ఇంతకీ మీ ప్రేయసి కనిపించిందన్నారు. ఎలా మాయమైందీ?" అడిగాడు ఉదయ్.

"ఇక్కడే వుంది. నీ ఎదురుగానే" అన్నాడు సిద్దార్థ.

కీర్తి ఉలిక్కిపడి భయంగా చూసింది.

"ఎక్కడా?" ఆశ్చర్యంగా అడిగాడు ఉదయ్.

"ఇక్కడ...." తన గుండెవైపు వేలుపెట్టి చూపిస్తూ అన్నాడు సిద్దార్థ. ఆమె ఎప్పుడూ ఇక్కడే వుంటుంది."

ఉదయ్, కీర్తివైపు తిరిగి నవ్వి అన్నాడు- "ఆమెమీద నాకే జెలసీగా వుంది. ఇలాంటి మనిషి ప్రేమని ఆ మోతాదులో పొందుతున్నందుకు. కానీ ఆవిడ మాత్రం ఇంకా అనుగ్రహించలేదట. నేను మాత్రం ఆయన ప్రేమ సఫలం అయి ఆ ఇద్దరూ ఒకటి కావాలని ప్రతిరోజూ భగవంతుడ్ని వేడుకుంటూనే వున్నాను" అన్నాడు.

సిద్దార్థ పెద్దగా నవ్వాడు.

కీర్తికి భూమి రెండుగా చీలి తను అందులోకి కూరుకుపోతే బావుండున్న అనిపించింది.

"పెళ్ళికి అట్టే వ్యవధిలేదు. త్వరగా చేసుకుని వెళ్ళి డ్యూటీలో జాయిన్ అవ్వాలి. ఆలోగా మీరు మాయం అవకుండా మీ సెల్‌నెంబర్ ఇవ్వండి" అన్నాడు ఉదయ్.

సిద్దార్థ నవ్వి "సెల్ మెయిన్‌టెయిన్‌చేసే పొజిషన్‌లో నేను లేను ఉదయ్. ఇక్కడ నేను మేనేజర్ని మాత్రమే. నిన్ననే మా ఓనర్ నాకు ఐదువందలు ఇంక్రిమెంట్ ఇచ్చారు. నా జీతం రెండువేల ఐదువందలు మాత్రమే!" అని కీర్తివైపు చూసాడు.

ఆమె కళ్ళు సజలాలయ్యాయి.

సిద్దార్థ ఇంటి కారు డ్రైవర్‌కి కూడా మూడు వేలపైనే జీతం వుంటుందని ఆమెకి తెలుసు.

కోటీశ్వరుడి ఒక్కగానొక్క కొడుకు!

"అదేమిటి? మీరు...." అని ఉదయ్ ఆశ్చర్యంగా అడిగే ప్రశ్నకి జవాబుగా సిద్ధార్థ అతని భుజంమీద తట్టి నవ్వుతూ అన్నాడు.

"గీతాంజలి చదివావా?"

"లేదు."

"ప్రేమతో నా సర్వస్వాన్నీ నీ ఇచ్ఛకు సమర్పించే శక్తి నాలో ప్రేరేపించు. సగర్వంగా తలెత్తి రోజువారీ చిల్లర కష్టాలను చూసి నవ్వే తత్వాన్ని నాకు కలుగజేయి అంటాడు టాగోర్. ఇప్పుడు నేనూ ఆ ఆనందాన్ని అనుభవిస్తున్నాను. నెప్పి వున్నచోట మనకి తెలియకుండానే వేలితో నొక్కి నెప్పి ఎక్కువచేస్తాం. వేలు తియ్యగానే వచ్చే రిలీఫ్ కోసం.

అలాగే నా మానసిక కష్టాలని శారీరక కష్టాలు ఉపశమింపజేస్తున్నాయి. ఓ.కే. విష్ యూ మెనీ మోర్ హేపీ రిటర్న్స్....మీకు నా ఆశీస్సులంటేనే బావుంటుందేమో." అన్నాడు.

"ఉదయ్ కీర్తితో- "ఆయనకి కొన్న బహుమతి ఏది కీర్తీ?" అన్నాడు.

ఆమె చేతిలో అంతవరకూ పట్టుకుని వున్న నీలిరంగు అందమైన డైరీ అతని ముందు పెట్టింది.

"మీరు కనిపిస్తారని అనుకోలేదు. అయినా మీ కోసమే ఈ ట్రెజర్ వరల్డ్‌లోకి అడుగుపెట్టాం. చిన్న బహుమతి అందుకోండి. మా కీర్తి సెలక్షన్" అన్నాడు ఉదయ్.

సిద్ధార్థ ఆమె చేతిలోని డైరీని చూసాడు.

"జ్ఞాపకాల దొంతరలతో నిండిపోయిన దాన్ని ఎక్కడ పెట్టుకోనూ?" అన్నాడు.

ఉదయ్ ఆశ్చర్యంగా "అది ఖాళీది సార్! కొత్తది" అన్నాడు.

సిద్ధార్థ తనవైపే చూస్తున్నాడని తెలీక కీర్తి కళ్ళు పైకెత్తింది. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి.

'ఇది ఖాళీదా? ఇందులో ఏ జ్ఞాపకాల పరిమళాలు లేవూ? నా హృది గదిలో వెలిగించిన అగరొత్తుల ఆవిరులలాంటి నీ తలపులు ఏ తలుపులు తీసి పారద్రోలనూ?' అని అతని కళ్ళు సూటిగా ప్రశ్నిస్తున్నట్లున్నాయి.



ఆ డైరీని విసిరిపారేసి, 'నా సిద్దూ! నిన్ను నేను ఎంతగా కష్టపెడుతున్నానూ, ఈలోకంలో నన్ను ప్రేమిస్తున్నాం అని భ్రమపడే వారందరూ నా ఆలోచనలకీ, శరీరానికీ కాపు కాస్తూ నన్ను బంధించి వుంచుతున్నారు. కానీ నువ్వు మాత్రం అలా చేయవు. చిన్న సంకెల....ప్రేమ అనే ముడివేసి వదిలావు. ఆ సంకెల నాకు కడదాకా తోడుండాలి. ఆ బంధనం నాకు బ్రతుకుమీద ఇష్టం కలగజేస్తోంది. ఆత్మహత్య చేసుకోవాలని ఒక్కసారి అనిపించనీయకుండా అడ్డుపడుతోంది. నువ్వు సంచరించే ఈ భూమిమీద నేనూ బ్రతికి వుంటే జాలి తలచి ఏ శీతల పవనమో నీ వూసులని నాదాకా ఒక్కనాడైనా మోసుకురాదా అన్న ఆశ నన్ను బ్రతకమంటోంది, అని అతని చెంపలు నిమిరి దగ్గరను హత్తుకుని చెప్పాలనిపించింది.

ఆ కళ్ళల్లోకి చూడలేనట్లు తల తిప్పేసుకున్నాడు సిద్ధార్థ.

"మా ఇంటికి రండి, అమ్మకి నన్ను బ్రతికించిన దేవుడ్ని చూపించాలి" అన్నాడు ఉదయ్.

కీర్తి గుండె లయ తప్పుతోంది. అతని విశాలమైన బాహువులు, నుదుటిమీద నిర్లక్ష్యంగా వదిలేసిన ముంగురులూ, ఒత్తయిన మీసకట్టూ, పెదవి విరిచి నవ్వే నవ్వూ, ఆ భావాల గనుల్లాంటి కనులూ, ఆమెలో ఏవో అలజడి కలగజేస్తున్నాయి. ఆ చేతులు నన్ను స్పృశించాయి అన్న భావనే పులకింతని కలగజేస్తోంది. అడుగుదూరంలో వున్న అతను అందరాని వాడన్న ఆలోచనే గుండెని పిండేస్తోంది. అందుకే నువ్వు నాకు ఎదురుపడకూడదనుకున్నాను సిద్ధార్థా! అనుకుంది బాధగా.

"మీ ఇంటికి ఇలాకాదు ఉదయ్, మీ పెళ్ళికి వస్తాను. ఇప్పుడు వదిలెయ్" అన్నాడు సిద్ధార్థ.

కీర్తి మనసు కుదుటపడింది.

"సరే....తప్పకుండా రావాలి. నేనొచ్చి పట్టుకుపోతాను మరి. ఇంక బయల్దేరదామా కీర్తీ!" అడిగాడు ఉదయ్.

కీర్తి తల వూపింది.

"అతనిది అతనికి ఇవ్వకుండా నీతో పట్టుకుపోతావా?" అడిగాడు ఉదయ్.

ఆమె కలవరంగా చూసింది.

"జ్ఞాపకాలు" నవ్వాడు ఉదయ్.

సిద్దార్థ ఉలికిపాటుగా చూసాడు.

"డైరీకి ఆయన పెట్టిన ముద్దుపేరు అదేగా!" అన్నాడు ఉదయ్.

కీర్తి తేలిగ్గా నిట్టూర్చి డైరీని అందించింది.

సిద్దార్థ చెయ్యిజాపి ఆమె పట్టుకొన్న వైపు కాకుండా ఇంకో కొనలో పట్టుకుని డైరీని అందుకున్నాడు.

"థాంక్స్ ఉదయ్! ఇంక రాసుకోవడానికి నాకు ఏమీ మిగిలిలేవు. కానీ ఈరోజు నేను నా ప్రేమదేవతని చూసాను. బహుశా ఇకమీదట చూడలేనేమో! అందుకే ఆ సంగతి మాత్రం రాసుకుంటాను. నాకు ఇది అమూల్యమైన బహుమతి తెలుసా?" అన్నాడు.

కీర్తికి దుఃఖం ఆపుకోవడం శక్తికి మించిన పనిగా వుంది. అంత మంది జనం చూస్తూండగా ఒక్కసారిగా అతని గుండెలమీద వాలిపోతేనో? అనే పిచ్చి వూహ వూపేసింది.

"వెళదామా?" ఉదయ్‌ని అడిగింది.

"ఊ...వస్తాం" సిద్దార్థకి చెయ్యి కలుపుతూ అన్నాడు ఉదయ్.

కీర్తి కూడా 'వస్తాను' అనొచ్చుగా. 'వెళ్తాను' అంటుందే! బాధగా అనుకున్నాడు సిద్దార్థ.

'వెళ్తాం' అంటే....వుండమని అనొచ్చుగా....కాసేపు దగ్గరగా నిలబడి ఆ ఆత్మీయ సమీరాలు నన్ను తాకనివ్వచ్చుగా....మళ్ళీ ఈ రూపం ఎప్పటికయినా కనిపిస్తుందా అసలు? అయ్యో, ఎలా వదిలిపెట్టిపోను. వెళుతున్నది నా మనసులేని కట్టె సిద్దూ. మనసంతా ఇక్కడే నీ పాదాల దగ్గరే వదిలిపోతున్నాను అనుకుంది కీర్తి.

"పద" కీర్తి భుజం తాకుతూ అన్నాడు ఉదయ్.

సిద్దార్థకి అప్పటిదాకా వున్న విగ్రహం సడలిపోయినట్లు మనసులో కలుక్కుమంది.

'ఉదయ్! ఆమె నాకే చెందుతుంది నా సర్వస్వం. కావాలంటే ఆ కళ్ళని అడుగు. పెదవుల్ని అడుగు. నేను స్పృశించిన అరిపాదాల్ని అడుగు. ఆమె నాది నాకే దక్కాలి. ప్లీజ్! నీకు నేను ప్రాణదానం చేసా



న్నావు. నా ప్రాణాన్ని నిర్దయగా పట్టుకుపోకు! అని అరుస్తానేమో అనిపించగానే గిరుక్కున వెనక్కి తిరిగి, వేగంగా అక్కడినుండి నడుచుకుంటూ మేనేజర్ రూంవైపు వెళ్ళిపోయాడు.

ఆటో ఎక్కగానే ఉదయ్ అడిగాడు.

"సిద్దార్థ....ఎలా వున్నాడూ? చాలా అందంగా లేడూ?"

కీర్తికి ఏడుపు తన్నుకొస్తోంది. ఉగ్గబట్టుకుంది. ఆటోలోంచి ఏ క్షణాన్నైనా క్రిందకి దూకి వెనక్కి పరుగెడతానేమో అనిపించి పైటకొంగు వేలికి ముడులేస్తూ కూర్చుంది.

"నేను చెప్పినంత అందంగా లేడా...?" ఆత్రుతగా అడిగాడు ఉదయ్.

"ఊ!" తల వూపింది.

"ఊ....అంటే లేడనా, వున్నాడనా?"

"దేవుడు బాలేదని ఎవరనగలరూ?" అంది.

"మాట మార్చి చెపుతున్నావు. చాలా అందంగా వున్నాడు. నువ్వు కొత్తరకంగా అతన్ని చూసావు. నువ్వలా చూడడం నేనెప్పుడూ చూడలేదు. నిజం చెప్పు కీర్తీ....నేనేం అనుకోను."

కీర్తి తడబాటుగా "అదీ....అదీ...." అంది.

"ఫర్లేదు. మగాడ్ని నేనే మొదటిసారి అతని అందాన్ని రెప్ప ఆర్పకుండా చూసానంటే నమ్ము. కానీ ఆ ప్రియురాలు మాత్రం చాలా దురదృష్టవంతురాలు....అతన్ని ఇంతగా ఏడిపిస్తున్నందుకు నాకైతే కన్పిస్తే కాల్చి పారేయ్యాలనిపిస్తోందనుకో" కోపంగా అన్నాడు.

'కాలి.... కాలిపోతోంది ఇంకా ఏం కాలుస్తావులే!' అనుకుంది భారంగా కీర్తి.

• • • •

"వా....ఆడిటింగ్‌లో కూడా నీకు ఇంత అనుభవం వుందా సిద్దూ? త్రిపాఠీ ఆశ్చర్యంగా ఆడిట్ రిపోర్ట్స్ చూస్తూ అన్నాడు.

సిద్దార్థ నవ్వి వూరుకున్నాడు.

"సిద్దార్థా! ఈ సూపర్ మార్కెట్ అమ్మేసి తమ దగ్గరకి రమ్మని ఆస్ట్రేలియాలోని పెద్దబ్బాయీ, జర్మనీలో చిన్నబ్బాయీ పిలుస్తున్నారు.

నాకూ వయస్సైపోయింది. అందుకే అమ్మేయాలనుకున్నాను. కానీ నువ్వొచ్చాకా నాకు కొత్త ఆశలు కలుగుతున్నాయి. ముఖ్యంగా మన అనే నేలనీ, మన వాళ్ళ జ్ఞాపకాలనీ వదిలిపోడానికి మనసు ఒప్పుకోవడంలేదు. అందుకే నేనో నిర్ణయం తీసుకున్నాను—" అని ఆగి సిద్ధార్థ మొహంలోకి చూసాడు.

"చెప్పండి."

"ఇవాల్టినుంచి నువ్వు నా పార్ట్‌నర్‌వి. లాభాలు చెరిసగం తీసుకుందాం. పెట్టుబడి నీ తెలివీ, నా డబ్బూ!"

సిద్ధార్థ నమ్మలేనట్లు చూసాడు.

"కాదనకు, నా పిల్లలకి ఈ దేశం వచ్చే ఆలోచన ఎలాగూ లేదు. వెళితే....నేనూ రాలేనేమో- అందుకే" అని సిద్ధార్థ చేతిమీద చెయ్యివేసి నొక్కాడు.

"థాంక్యూ సర్!"

"సే అంకుల్ సిద్ధూ!" అన్నాడు త్రిపాఠీ.

"థాంక్యూ వెరీమచ్ అంకుల్."

సిద్ధార్థ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కొన్ని బంధాలు వద్దన్నా చుట్టుకుంటాయి. కొన్ని కావాలన్నా కొట్టుకుపోతాయి. ఇంత పిచ్చి స్క్రీన్‌ప్లే ఎందుకు రాస్తున్నాడో ఆ పైవాడు.

"నీకు విశ్వనాథం అనే లాయర్ తెలుసా?" అడిగాడు త్రిపాఠీ.

"తెలుసు....ఏం?" సిద్ధార్థ అడుగుతూ వుండగానే—

"సర్! మేనేజర్‌గారికోసం ఎవరో వచ్చారు" రిసెప్షనిస్ట్ వచ్చి చెప్పింది.

"నో మేనేజర్ సార్....హీ ఈజ్ ది మేనేజింగ్ డైరెక్టర్ ఫర్ ఆల్ త్రిపాఠీ ఎంటర్‌ప్రైజెస్....ఈ రోజునుండి ఆయన్ని ఎం.డీ. గారనాలి" అన్నాడు త్రిపాఠీ.

ఆమె నవ్వి "కంగ్రాట్స్ సార్!" అంది.

"థాంక్యూ.... ఎక్స్‌క్యూజ్‌మీ సర్!" అని బయటికి నడిచాడు సిద్ధార్థ.

విశ్వనాథ్ టాపిక్ త్రిపాఠీతో అక్కడే ఆగిపోయింది.



'ఎవరై వుంటారా' అని ఆశ్చర్యంగా చూసిన సిద్ధార్థకి చేతులు వెనక్కి పెట్టుకుని పచార్లు చేస్తున్న తండ్రి కనిపించాడు.

సిద్ధార్థని చూడగానే "సిద్ధూ...." అంటూ ఆత్రంగా దగ్గరకి వచ్చి ఒకసారి పైనుండి కిందదాకా చూసుకుని, గాఢంగా కౌగిలించుకున్నాడు రాజారావు.

సిద్ధార్థ ఏ స్థాయీభావం ప్రదర్శించకుండా గంభీరంగా చూశాడు.

"కన్నా....నాన్నని చూడకుండా ఇన్ని రోజులు ఎలా వుండిపోగలిగావురా....పద నాన్నా! ఇంటికి పద.... లంకంత ఇల్లూ, కార్లూ, ఆస్తీ అన్నీ వుంచుకుని ఇలా పరాయి పంచన జీతంరాళ్ళకి ఆశపడి పనిచేసే ఖర్మ నీకేంటిరా-" అన్నాడు బాధగా.

"ఒద్దు....నన్ను ఇక్కడే వుండనీ.... నాకు ఆస్తి, డబ్బూ ముఖ్యం కాదు. స్వేచ్ఛ కావాలి. ఇక్కడ వీస్తున్న గాలి అక్కడలేదు. అంతా డబ్బు కంపు" వెగటుగా ముఖంపెట్టి అన్నాడు సిద్ధార్థ.

"అదంతా నీ కోసమే కదరా!" అన్నాడు రాజారావు.

"అవును నాన్నా! కన్నకొడుకు ప్రేమించిన అమ్మాయి కుటుంబాన్ని బజారుకీడ్చి, వాళ్ళ మానాభిమానాలతో ఆడుకోవడం, ఆ అమ్మాయిచేత నీ కొడుకుని కలవననీ, మాట్లాడననీ స్టాంప్ పేపర్ మీద సంతకం పెట్టించుకోవడం....చివరికి కొడుకు ఇంట్లో పడుండాలనీ, నువ్వు చూపించిన అమ్మాయి మెళ్ళో తాళి కట్టాలనీ, రౌడీల్ని కిరాయికి తెచ్చి కాళ్ళు విరగ్గొట్టించడం....వాహ్! ఏ కన్నతండ్రి చేయగలడు నాన్నా ఈరోజు కొడుకు కోసం ఇవన్నీ?" హేళనగా అని నవ్వాడు సిద్ధార్థ.

రాజారావు ఆ చివరి మాటకి ఖిన్నుడయినట్లు తలెత్తి చూసి "నువ్వు శృతిని పెళ్ళిచేసుకుంటే కోట్ల ఆస్తి కలిసొస్తుందని చెప్పి, నువ్వు చెప్పినట్లు ఆ కీర్తిని అవమానించడం, అంక్షలు పెట్టడం నిజమే. కానీ నీ కాళ్ళు నేనెందుకు విరగ్గొట్టిస్తానురా...అసలు శృతి ఆ విషయం చెప్పగానే ఎంతగా ఏడ్చానో తెలుసా? నాకు ఈ లోకంలో వున్నది ఎవరురా.... నువ్వు తప్ప?" దుఃఖపు జీర ఆయన కంఠంలో అడ్డుపడుతుండగా అన్నాడు.

సిద్ధార్థ తల వెనక్కి వంచి పెద్దగా నవ్వాడు.

"నాన్నా....నువ్వు మంచి ఏక్టర్‌వి కూడా అని ఇప్పుడే తెలిసింది.

అనవసరంగా ఇంకో డ్రామా స్టార్ట్ చెయ్యొద్దు. మీరు కోరుకున్నట్లుగానే మీ కొడుకు జీవితంలో ప్రేమ అనే అధ్యాయం అర్ధాంతరంగా ముగిసిపోయింది. ఆ అమ్మాయికి పదిరోజుల్లో పెళ్ళి! నేను కీర్తిని మర్చిపోయి, ఎవరో ఒకరి మెళ్ళో తాళి కట్టడం జరిగేపనికాదు. కాబట్టి మీ వంశం... నాతోనే ఆగిపోతుంది. ఇంక కోట్లు సంపాదించాలనే పేరాశ విడిచిపెట్టండి. తినడానికి వారసులు వుండరు కాబట్టి, మనిద్దరికీ ఏ మఠం వాళ్ళో ఇంత అన్నం పడెయ్యకపోరు. ఎదురెదురుగా కూర్చుని భజన చేసుకుందాం. మీరు కావాలంటే రూపాయినోట్లు బొంతలా కట్టుకుని దానిమీద పడుకోండి. మీరు తాగే టీ కూడా రూపాయల చితుకుల మంటమీదే కాచుకోండి. రేపు అంతిమ యాత్రకి కూడా గంధపుకట్టెల బదులుగా కరెన్సీ కట్టల మీదనే...."

"సిద్ధూ!" బాధగా అన్నాడు రాజారావు.

"ఇంక చాలురా....నా మాట నమ్ము, కిరాయి రౌడీలచేత నిన్ను కొట్టించేటంత దుర్మార్గుడుకాదురా నీ తండ్రి."

"ఎంత దుర్మార్గుడో ఎలా అంచనా వెయ్యడం నాన్నా? నీతి, నిజాయితీ శరీరంలో రెండు భాగాలుగా పరువు మాత్రమే కూడబెట్టుకుంటూ యాభై ఆరేళ్ళు బ్రతికిన పెద్దమనిషివి.... నీ నీచమైన కుట్రతో మొదలంటూ నరికేసావే! పసిపిల్లాడని చూడకుండా ఒక చిన్నపిల్లాడి భవిష్యత్తుని సూర్కాల్లో కూల్చేయడానికి పన్నాగం పన్నావే.... ఆడపిల్ల శీలానికున్న విలువేంటో విస్మరించి పసిపిల్లని నడిబజార్లో గూండాలచేత పరాభవించబోయావే....ఇక కీర్తికి చేసిన ద్రోహం లెక్క కట్టేదా నాన్నా? నావైపు చూసి పన్నెత్తి పలకరించడానికి లేకుండా కాయితంమీద సంతకం పెట్టించావే.... అదే నువ్వయితే ఆ సంతకానికి విలువిచ్చేవాడివా? వ్యాపారాల్లో ఎన్ని దొంగ సంతకాలు సృష్టించావు.... ఎన్ని దొంగ లెక్కలు రాయలేదూ.... మాటమీద నిలబడే పిల్లనేగా నీ ధీమా? ఏ కోర్టులోనైనా ఆ కాయితం చెల్లుతుందా నాన్నా.... అసలు ఎదురుతిరిగితే, మీ పెద్దరికం ఏమౌతుంది?"

సిద్ధార్థ అడుగుతున్న ప్రశ్నలకి జవాబులు చెప్పలేనట్లు తల దించుకున్నాడు రాజారావు



"ఈ దుర్మార్గాలన్నీ ఒక ఎత్తు, ఇంకో పెద్ద దుర్మార్గం ఒకటీ ఇంకో ఎత్తూ నాన్నా!"

"ఏనిటి?" వణుకుతున్న గొంతుతో అడిగాడు.

"నువ్వు శృతికి చేసిన ద్రోహం నాన్నా!"

"శృతికా?"

"అవును! ఒంటరి ఆడపిల్ల ఆస్తి మొత్తం కబ్జా చెయ్యడానికి కాదా నాన్నా! నువ్వు ఎవర్నో ప్రేమించిన కొడుక్కి ఆ అమ్మాయిని బలవంతంగా కట్టబెట్టి ఆ అమ్మాయి జీవితం కూల్చాలనుకుంటున్నావు.... పిచ్చిది.... నీలాగే ప్రేమంటే ఏమిటో తెలియనిది కాబట్టి నన్ను ఎలాగైనా పెళ్ళిచేసుకుని తన ఆధిపత్యం నిరూపించుకోవాలనుకుంటోంది. దానివల్ల జీవితంలో మకరందంలాంటి ప్రేమ అనే రుచిని కోల్పోతుందని తెలుసుకోవడంలేదు! అసలు ప్రేమంటే నీకు తెలుసా నాన్నా?"

"తెలుసు కన్నా! నువ్వులేని ఇంట్లో నాకు నిమిష నిమిషం తెలిసింది. ఎవరికోసం సంపాదించాలి? ఎవరికోసం బ్రతకాలి అనే ప్రశ్న.... నన్ను క్షణ క్షణం చంపిందిరా....ఐ లవ్ యూ రా సిద్ధూ....ఐ లవ్ యూ" కన్నీళ్ళతో అన్నాడు.

"అర్థం అవుతుందా నాన్నా! మనం కావాలనుకున్నది దూరం అయినప్పుడు మనసుకి కలిగే బాధ" చిన్నగా నవ్వి అడిగాడు సిద్ధార్థ.

"అర్థం అయింది! నువ్వు కావాలంటే నేను ఆ అమ్మాయి తండ్రి కాళ్ళు పట్టుకుని కీర్తిని నా ఇంటి కోడలుగా చేసుకుంటారా. నన్ను నమ్ము!"

సిద్ధార్థ విరక్తిగా నవ్వాడు.

"వద్దులే నాన్నా! మళ్ళీ ఆ అమ్మాయి జీవితాన్ని ఇంకోసారి అతలాకుతలం చెయ్యకు. మనసు రాయిచేసుకుని బావని పెళ్ళి చేసుకుంటోంది. మళ్ళీ పీటలమీద పెళ్ళి చెడగొట్టి, వాళ్ళ కుటుంబం సామూహికంగా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రానియ్యకు.... వదిలెయ్. వాళ్ళ జోలికి పోకు, నా జోలికిరాకు. ఇలా మమ్మల్ని బ్రతకనియ్యి" అన్నాడు.

"సిద్ధూ....అయితే నువ్వు ఇంటికి రావా?"

"రాను! నాకు ఇల్లు అనే భావం ఆ ప్రదేశంలో కలగడంలేదు."

రాజారావు సిద్ధార్థ దగ్గరగా వచ్చి అతని తలమీద చెయ్యివేస్తూ-అన్నాడు. "నిన్ను నేను కొట్టించలేదురా....నీమీద ఒట్టు! అంత కఠినమైన గుండె లేదురా నీ తండ్రికి. నువ్వు ఇక్కడ బన్‌రొట్టె తిని టీనీళ్ళు తాగి, ఫ్యాన్ కూడా లేని కొంపలో వుంటున్నావని నాయర్, రామయ్యా చెప్తే, అక్కడ తిండి, నిద్ర మానేసి ఎంతగా ఏడ్చానో నీకెలా తెలుస్తుంది?" కంటినుండి నీళ్ళు కారుతుండగా అన్నాడు.

సిద్ధార్థ ఆయన కంటనీరు తుడుస్తూ అన్నాడు. "నీ కన్నీటి వెచ్చదనమే నీ ప్రేమ నిజం అని చెప్పింది నాన్నా. నేను నమ్ముతున్నాను.... వెళ్ళు."

"అసలు ఎందుకొచ్చానో తెలుసా?"

"ఊహూ!"

"రేపు మీ అమ్మ పోయినరోజు."

"తెలుసు నాన్నా! గుళ్ళో బీదలకి అన్నదానం చేయించడానికి ఏర్పాట్లు చేసాను. మీకు వీలైతే ఏ అనాథ శరణాలయానికో వెళ్ళి ప్రేమదానం చేయండి. ఇంకా వీలైతే మంగళసూత్రాలు చేయించి ప్రేమ జంటల్ని కలపండి. అమ్మ ప్రేమ కోసం కలవరించే చనిపోయింది కాబట్టి, వచ్చే జన్మలోనైనా మీకు ప్రేమ విలువ తెలిసేట్లు చెయ్యమనీ, ప్రేమికులకి అడ్డు పడకుండా చూడమనీ ఆ దేవుడ్ని వేడుకోండి."

వాడిగా అనేసి వెనక్కి తిరిగి స్వింగ్ డోర్ వేసేసి వెళ్ళిపోయాడు సిద్ధార్థ. 'అయితే రౌడీలని ఎవరు నామీద ప్రయోగించినట్లూ?' అన్న ప్రశ్న అతనిలో మొదలైంది.

నడుం విరిగేటంత దెబ్బతిన్నవాడిలా ఒంగి నడుస్తూ మెల్లగా వెళ్ళిపోయి ఆగి....

Life is sacrifice-offer it.

Life is love-enjoy it–

అని గోడమీద పెద్దపెద్ద అక్షరాల్లో రాసి వుండడాన్ని గమనించి 'అవును!' అని గొణుక్కున్నాడు రాజారావు.

• • • •



కీర్తిని పెళ్ళికూతుర్ని చేశారు. ఉదయ్ శుభలేఖలతో వచ్చి "కీర్తీ!" అని పిలిచాడు.

పడుకుని వున్న కీర్తి లేచి సర్దుకుని "ఏవిటి బావా?" అంది.

"మొదటి శుభలేఖ సిద్ధార్థకి ఇచ్చివద్దాం వస్తావా?" అడిగాడు.

"నువ్వు వెళ్ళు. నేనింక రాకూడదు" అంది.

ఉదయ్ ఆమెని పరిశీలనగా చూసాడు.

బుగ్గన చుక్క, కళ్యాణపు బొట్టుతో రావలసిన పెళ్ళికళ ఎందుకో ఎక్కడో దాక్కున్నట్లు అనిపించింది.

"కీర్తీ...." అంటూ మీద చెయ్యి వేయబోయాడు.

చటుక్కున పక్కకు జరిగింది.

"ఎందుకలా తప్పుకుంటావు?" ఆమె చేతిని గట్టిగా తన చేతిలో బిగిస్తూ అడిగాడు.

అతని చేతిలో బందీ అయిన తన చేతివైపు నిస్సహాయంగా చూసుకుంది కీర్తి.

చల్లని మంచుముక్కలాంటి ఆమె చేతిని నెమ్మదిగా వదిలిపెట్టేసి లేచి వెళ్ళిపోయాడు ఉదయ్.

కీర్తి ఉదయ్ వెళ్ళిన తరువాత కూడా చాలాసేపు ఏడుస్తూ వుండిపోయింది. ఇంకో నలభై ఎనిమిది గంటలు మాత్రమే తను కీర్తిగా వుంటుంది....ఆ తర్వాత నిర్వేదమైన గృహ్యాకంలోకి నిరాసక్తమైన హృదయంతో ఇల్లాలుగా అడుగుపెడుతుంది. మంగళవాద్యాలు తన ప్రేమకి మంగళం పాడతాయి. పెద్దల అక్షింతలు నెత్తిన బాధ్యతల బరువుని మోపుతాయి. మెడలో తాళి ముక్కుతాడులా రౌతు చేతిలో వుంటుంది. ఆఖరి నిమిషందాకా ఎటు లాగితే అటు పరుగెత్తాలి. పశువులని ఎవరైనా అడుగుతారా పాపం....నీకు అటు వెళ్ళడం, పరిగెత్తడం ఇష్టమేనా అని?

సిద్ధార్థ! మనసంతా అతని రూపంతో నిండిపోయింది. ఉదయ్ ఈ పాటికి వెళ్ళి శుభలేఖ ఇచ్చే వుంటాడు. అప్పుడు అతని మనసు ఎంత చిత్రవధ అనుభవిస్తుందో తనకెవరూ చెప్పక్కర్లేదు. ఎందుకు తనిలా చీకటిలో కూర్చుని ఏడవడం, ఈ బంధనాలన్నీ వదిలించుకుని ఒక్కసారిగా

పరిగెడ్తేనో....ఆమెకి ఆనందంగా పెళ్ళి పనులు చేస్తున్న తల్లిదండ్రులు గుర్తొచ్చారు.

"మీ మాటమీద నాకు నమ్మకంలేదు. కాయితం మీద రాసి సంతకం పెట్టు" అన్న సిద్దార్థ తండ్రి జ్ఞాపకం వచ్చాడు.

నేను బందీని....పరాజితని....నిస్సత్తువగా వెనక్కివాలి ఏడుస్తూ వుండిపోయింది. తనని మాట అనే రాటకి కట్టేసాశారీ పెద్దవాళ్ళు.

"కీర్తీ! నీ కోసం నీ స్నేహితురాలు ఎవరో వచ్చింది. కార్లో వచ్చిందే" పిన్ని వరసావిడ వచ్చి చెప్పింది. 'కార్లో' అన్న మాటని ఒత్తి పలుకుతూ.

బహూశా మైత్రేమో....మైత్రి ఈ సమయంలో రావడం ఉపశమనంగా అనిపించి, లేచి కూర్చుంది.

"హలో!" ఆ పలకరింపుతోబాటు గదంతా పరిమళాలు నిండిపోయాయి.

కీర్తి అప్రయత్నంగా ఆమెని చూస్తూ లేచి నిలబడింది.

అందానికి నిర్వచనంలా నిలబడ్డ శృతకీర్తి....కీర్తిని పరీక్షగా చూపింది.

ముగ్ధత్వానికి సిగ్గు చీరకట్టి, వయ్యారానికి జడగంటలు పెట్టి, శృంగారానికి పల్లెవాటు వేసినట్లు కావ్యనాయకలా వుంది సిద్దార్థ కలలు కన్న కీర్తి.

"నేను సిద్దార్థ...."

శృతకీర్తి మాట పూర్తవకముందే కీర్తి ఆమెని ఎప్పుడు చేరిందో కానీ "మీకు సిద్దార్థ తెలుసా?" ఆమె కన్నీళ్ళతో ఆమె చేతిని పట్టి లాగి తన దగ్గరగా కూర్చోపెట్టుకుంది.

"సిద్దార్థ ఫ్రెండ్‌ని. సిద్దార్థ మిమ్మల్ని ఎంతగా ప్రేమిస్తున్నారో తెలుసా?" నెమ్మదిగా ఆమెకే వినపడేటట్లుగా అంది శృతి.

కీర్తి కన్నీళ్ళమాటున నవ్వింది.

"ప్రతి నిమిషం అతను నాలో, నేను అతనిలో వుంటాము. అతని గుండె శబ్దం ఇక్కడ వినిపిస్తుంది మీకు...." తన హృదయం చూపిస్తూ అంది.



"అయితే....ఇంక నేను చెప్పాల్సిందేంలేదు. బహూశా మీ పెళ్ళి అయిపోగానే మేం పెళ్ళి చేసుకుంటాం. మీరు రావాలి" అంది శృతి.

"కీర్తి శృతి మొహాన్ని తన రెండు చేతుల్లోకి తీసుకుని ఆ కళ్ళల్లోకి గుచ్చిగుచ్చి చూసింది.

శృతి కాస్త జంకినట్లు "ఏమిటలా చూస్తున్నారూ?" అంది.

అకస్మాత్తుగా కీర్తి శృతి ముఖాన్ని దగ్గరగా తీసుకుని గాఢంగా ముద్దుపెట్టి వదిలింది.

శృతి షాక్ అయినట్లు "కీర్తీ!" అంది.

"ఈ నా కన్యాత్వపు మొదటి ముద్దు మీ మొదటిరాత్రినాడు సిద్దూకి అందివ్వండి. ప్లీజ్!" చేతులు జోడిస్తూ అంది.

శృతి చేష్టలుడిగినట్లు చూస్తుండిపోయింది.

• • • •

ఉదయ్ వెళ్ళేసరికి సిద్దార్థ స్నానంచేస్తున్నాడు.

"హలో....నేను ఉదయ్‌ని. ఇంక చేసిన స్నానం చాలుగానీ రండి సార్!" చనువుగా బాత్‌రూం దగ్గర నిలబడి అరిచాడు ఉదయ్.

"కూర్చో ఉదయ్! వచ్చేస్తున్నా" అని బదులిచ్చారు సిద్దార్థ.

"శుభలేఖ మొదటగా మీకే ఇవ్వాలని వచ్చాను, రండి సార్!" అని ఉదయ్ అతని గదంతా పరికించి చూడసాగాడు. అలమరలో వివేకానందా, రామకృష్ణ పరమహంస, జిడ్డు కృష్ణమూర్తిలు బుద్ధిగా పేర్చబడి వుండటం చూసి నవ్వుకున్నాడు.

టేబుల్‌మీద పెన్ మధ్యలో క్యాప్ లేకుండా వదిలేసిన నీలిరంగు డయిరీ, గాలికి రెపరెపలాడుతోంది.

ఆ శబ్దానికి అటు తిరిగి చూసాడు ఉదయ్.

పెన్ నుండి ఇంక్ లీక్ అయి డయిరీలో పేజీని తడుపుతోంది. అప్రయత్నంగా పెన్ తియ్యబోయి ఆగిపోయాడు.

'కీర్తికి ఉదయ్‌తో పెళ్ళి జరగబోతోంది. ఇంకో నలభై ఎనిమిది గంటల్లో నా కీర్తి శాశ్వతంగా నాకు దూరమైపోతుంది. భరించే స్థయిర్యాన్ని ప్రసాదించు భగవాన్!' ఉదయ్‌కి అర్థమయ్యీ కానట్లు వుంది. గబగబా డయిరీని చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పాడు.

* * * *

శృతకీర్తి ఇంటికి వచ్చేసరికి విశ్వనాథం ఆమె కోసం ఎదురుచూస్తూ కూర్చుని వున్నాడు. అతని మొహం ఎందుకో ఎర్రబడి వుంది.

"గుడ్ ఈవెనింగ్ అంకుల్!" అంది శృతి.

"గుడ్ ఈవెనింగ్....ఎక్కడికెళ్ళావు శృతీ?" అనడిగాడు.

"ఫ్రెండ్ దగ్గరకి" అని లోపలికి వెళ్ళబోయింది శృతి.

"సిద్ధార్థ నిన్ను పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకున్నాడట. నిజమేనా?" అడిగాడాయన.

శృతి విస్మయంగా చూసింది.

"మీకు ఏమైనా అభ్యంతరమా అంకుల్?"

"ఛ! అదేమిటమ్మా. సంతోషంగా వుంటేనూ, చూడు నీ కోసం స్వీట్స్ తెచ్చాను. ఆగ్రా పేడా అంటే నీకు ఇష్టంగా. అందుకే తెప్పించాను" ప్రేమగా అన్నాడు.

"నేను స్వీట్స్ లైక్ చెయ్యనుగా అంకుల్! చాలా టైర్డ్‌గా వున్నాను. కాసేపయ్యాకా నేను మిమ్మల్ని కాల్ చేస్తాను" అంది.

"శృతీ! నాకోసం ఒక్క స్వీట్ అయినా తినవచ్చుగా" రిక్వెస్టింగ అడిగాడు.

"అక్కడ పెట్టండి అంకుల్" అని మేడమీదకి వెళ్ళిపోయింది.

"ఆండాళ్ళూ! ఇవి గదిలో పెట్టు" విశ్వనాథం స్వీట్ బాక్స్ ఆండాళ్ళుకి అందించాడు.

* * * *

"సారీ ఉదయ్! కాస్త లేటయింది" అంటూ సిద్ధార్థ బాత్‌రూంలోంచి బయటకొచ్చాడు.

అక్కడ ఉదయ్ కనిపించలేదు.

"ఉదయ్....ఉదయ్...." బయటదాకా వెళ్ళి చూసొచ్చాడు.

ఉదయ్ జాడలేదు.

'శుభలేఖ అయినా వదిలి వెళ్ళలేదేం....ఏమైందీ?' అనుకున్నాడు.

మూసి వున్న నీలిరంగు డయిరీ తనకేం తెలీనట్లు మౌనంగా చూస్తోంది.



ఇంతలో ఫోన్ రింగయింది.

ఉదయే అయివుంటాడు. బహుశా అర్జెంటు పనిమీద బయటికి వెళ్ళి అది చెప్పడానికే చేస్తూ వుండివుంటాడు అనుకుని.

ఫోన్ తీసి "హలో...." అన్నాడు.

అవతలనుండి వినిపించిన వార్త! "వాట్?" అని కేకపెట్టి—"ఇప్పుడే వస్తున్నాను" అని నిమిషం ఆలస్యం చెయ్యకుండా రిసీవర్ పెట్టేసి బయల్దేరాడు

* * * *

"ఉదయ్! నీ ఫ్రెండ్స్ అందరికీ శుభలేఖలిచ్చావా నాయనా?" పాండుమూర్తి ఉదయ్ చేతిలో కార్డ్స్ చూస్తూ అడిగాడు.

"మావయ్యా....కీర్తితో మాట్లాడాలి. కాసేపు ఎవరూ అటు రాకండి" ఉదయ్ అన్న తీరుకి ఆయన కంగారుగా చూసాడు.

"కీర్తీ....కీర్తీ...." ఉదయ్ ఆమె గదిలోకి అడుగుపెట్టాడు.

కీర్తి చీకట్లో గోడకి చేరగిలబడి కూర్చుని అతన్ని నిస్తేజంగా చూసింది.

ఉదయ్ గది తలుపు బోల్ట్ పెట్టి ఆమెవైపు నడిచాడు.

* * * *

విశ్వనాథం టీ కప్పు నోటి దగ్గర పెట్టుకోబోతుండగా పెద్ద శబ్దంతో తలుపుని ఒక తన్ను తన్ని లోపలికి అడుగుపెట్టాడు సిద్ధార్థ.

"సిద్ధార్థా....నువ్వా....రా....కూర్చో" అంటున్న ఆయన్ని కాలర్ పట్టుకుని లాగి....

"వయసుకి గౌరవం ఇవ్వడం కూడా నీలాంటి వాడికి అన్యాయం. పద నీ కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు" అన్నాడు.

విశ్వనాథ్ కోపంగా "ఏం మాట్లాడుతున్నావో, ఎవరితో మాట్లాడుతున్నావో తెలుస్తోందా?" అన్నాడు.

"ఒక నరరూప రాక్షసుడితో, నయవంచకుడితో మాట్లాడుతున్నాను. పద. మిగతాదంతా కోర్టులో చెప్పుకుందువుగాని" అన్నాడు సిద్ధార్థ

"సిద్ధార్థా! పరువునష్టం దావా వేస్తాను. నా గురించి ఏం తెలుసని ఇలా నోరు పారేసుకుంటున్నావు?" అన్నాడు కోపంగా విశ్వనాథం.

"ఆండాళ్ళు అంతా చెప్పేసింది ఇన్స్పెక్టర్ కి. మిగతాది త్రిపాఠీ చెప్పారు" అన్నాడు సిద్ధార్థ.

సిద్ధార్థ వెనకనుండి త్రిపాఠీ వస్తూ" ఇంకో నెలలో కొన్ని కోట్ల ఆస్తి నీ స్వంతం కాబోతోందనీ, ఇరవై ఐదో సంవత్సరం రాకుండానే నీ మేనకోడలు మరణిస్తే ఆస్తి దక్కుతుందనీ లేదా తెరిసా ట్రస్ట్ కి పోతుందనీ, అందుకే మొదటి దానికే ఏర్పాట్లు చేస్తున్నాననీ మొన్న క్లబ్ లో నాకు చెప్పలేదూ?" అన్నాడు.

"ఏదో తాగిన మైకంలో నోటికొచ్చినట్లు వాగివుంటాను. అంతా నమ్మెయ్యడమేనా?" భయంగా చూస్తూ అన్నాడు విశ్వనాథం.

"ఆండాళ్ళు....నువ్వు సీట్స్ లో విషం కలిపిపెట్టి శ్రుతికి తినిపించినట్లు వాంగ్మూలం ఇచ్చింది. అసలు డబ్బుకోసం మొత్తం కుటుంబాన్నే తుడిచిపెట్టేయాలని కార్లో బాంబు పెట్టించావే! అదెంత నీచం? అసలు నిన్ను పోలీసులకి పట్టివ్వడం కాదు. కొట్టికొట్టి కొద్దికొద్దిగా చంపాలి" సిద్ధార్థ ఆపుకోలేని ఆవేశంలో విశ్వనాథం కాలరు పట్టుకుని గుంజి ఎడాపెడా కొడుతూ అన్నాడు.

"వదిలెయ్ సిద్ధూ! వదిలెయ్" త్రిపాఠి విడదీస్తూ అన్నాడు.

"ముసలితనంలో జైలుగోడల మధ్య మగ్గాల్సొస్తోంది. అంతకన్నా నరకం ఏం వుంది. పోనీ! వాడి పాపానికి వాడే పోతాడు."

"కానీ అంకుల్! శ్రుతికి....చాలా ప్రమాదంగా వుంది. ఈ రాత్రి గడిస్తేకానీ డాక్టర్ ఏ సంగతీ చెప్పలేం అంటున్నారు" కంగారుగా అన్నాడు.

"అదిగో పోలీసులొచ్చారు. ఇంక మనం వీడిని వాళ్ళకి అప్పగించి, హాస్పిటల్ కి పోదాం" అన్నాడు త్రిపాఠీ.

విశ్వనాథం గోలగోలగా పోలీస్ ఇన్స్పెక్టర్ తో ఏదో చెపుతూనే వున్నాడు. పాపం ఆడాళ్ళు మూగదని నమ్మి ఆయనా పప్పులో కాలేశాడు.

"మీరు చేసిన వెధవ పనికి సాక్ష్యాధారాలతో సహా పట్టుబడ్డారు. విశ్వనాథం! పదండి, మాకు శ్రమ ఇచ్చి మీరు బాధపడకండి" అన్నాడు ఇన్స్పెక్టర్.

విశ్వనాథం జీప్ ఎక్కుతుంటే చూసి బాధగా త్రిపాఠీతో అన్నాడు



సిద్ధార్థ— "అనవసరంగా నాన్ననీ, శ్రుతినీ అనుమానించాను, నన్ను రౌడీలతో కొట్టించారని. ఇది కూడా వీడి పనే అని ఆండాళ్ళు చెప్తేకానీ ఊహించలేదు. సమయానికి శ్రుతిని ఆండాళ్ళు హాస్పిటల్ కి తీసుకెళ్ళి మనకు ఫోన్ చేసింది కాబట్టి సరిపోయింది."

"బహుశా నీ మీద శ్రుతి ఆశపడుతోంది కాబట్టి శాశ్వతంగా నిన్ను తొలగించుకోవాలనుకున్నాడు. సమయానికి నువ్వు లక్కీగా శ్రుతి కంటబడడంతో రక్షింపబడ్డావు. వదిలేసి పారిపోయారు రౌడీలు. చాలా ఏళ్ళుగా నాకీ విశ్వనాథం తెలుసు. క్రిమినల్ మైండ్" అన్నాడు త్రిపాఠీ.

"అవును. గుంటనక్కలా ఎప్పుడూ శ్రుతిని వెన్నంటే వుండేవారు. ఇన్ని నక్కజిత్తులు పన్నుతున్నాడని అనుమానమే రాలేదు ఎవరికీ."

"అక్కడే పొరబడ్తున్నావు సిద్ధూ! శ్రుతి తన పీడని కూడా నమ్మేది కాదు. ముసలాడిని ఎక్కడ పెట్టాలో అక్కడే పెట్టేది. అందుకే పెత్తనం, డబ్బూ తన చేతిదాకా రావడంలేదని వుడికిపోయేవాడు. ఇంకా నమ్మి అంతా చేతిలో పెడితే ఎప్పుడో ఆ పిల్లని గొంతు నులిమి చంపి వుండేవాడు. ఇవన్నీ నాకు విశ్వనాథం చెప్తేనే తెలిసేది."

"డబ్బు చాలా చెడ్డది అంకుల్!" విరక్తిగా అన్నాడు సిద్ధూ.

కారు స్టార్టుచేస్తూ "మంచిచెడ్డలు మన వాడకాన్నిబట్టి వుంటాయి సిద్ధూ! ప్రపంచంలో ఏదీ చెడ్డదికాదు. మనిషి మనసుతప్ప" అన్నాడు.

"రోజు రోజుకీ సమాజంలో తక్కువైపోతున్న మానవతా విలువలు....ప్రేమా, ఇవన్నీ చేయిస్తున్నాయి. అసలు సాటివారిని ప్రేమించడం గురించి క్లాసులు కండక్ట్ చేస్తేనో?" అడిగాడు సిద్ధార్థ.

"టీనేజర్స్ ఎడ్మిషన్ల కోసం పోటీలుపడతారు" అని నవ్వి....

"సిద్ధూ....నాట్ బాడ్ ఐడియా....!" అన్నాడు ఆలోచనగా త్రిపాఠీ.

"ఇచ్చట ప్రేమించడం నేర్పబడును" అన్న బోర్డూ, పక్కనే ఎడ్మిషన్లకోసం పోటీలుపడే కుర్రకారూ ఆయన బిజినెస్ మైండ్ లో మెదిలాయి.

సిద్ధార్థ మాత్రం ఇవన్నీ ఆలోచించే స్థితిలో లేదు. ఇంకో ఇరవై నాలుగు గంటల్లో ప్రాణాలు వదులుతుందో, బతికి వుంటుందో తెలియని

తనని ప్రేమించిన అమ్మాయీ! ఇంకో ఇరవై నాలుగు గంటల్లో తనకి శాశ్వతంగా దూరమయిపోతున్న తను ప్రేమించిన అమ్మాయీ అతని మస్తిష్కంలో మెదులుతున్నారు.

మనిషి వ్యక్తిత్వం తెలిసేది అతనికి ఏం చెయ్యాలో పూర్తిగా తెలియడం చూస్తే కాదు, ఏం చేయాలో పాలుపోని స్థితిలో అతని ప్రవర్తన చూసి తెలుసుకోవాలి.

• • • •

"శృతీ....శృతీ....కళ్ళు తెరు. నువ్వు మైకంలోకి జారకు. చూడు. నువ్వు చెయ్యాల్సిన పనులన్నీ అర్ధమధ్యలో ఆగిపోయాయి. అవన్నీ శృతి తప్ప ఎవరూ చేయలేరు. ప్లీజ్ కళ్ళు తెరు, కళ్ళు తెరమ్మా" సిద్దార్థ ఆర్తిగా శృతి తల నిమురుతూ పిలుస్తూనే వున్నాడు.

ఆమె కళ్ళు తెరవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. అయినా కళ్ళు మూసుకుపోతున్నాయి. విషప్రభావంవల్ల ఆమె శ్వాసకోసం బలహీనంగా పనిచేస్తోంది. ఏ నిమిషానైనా ఆగిపోయేట్లు వుంది.

అమాయకంగా పావురాయిలా ఒదిగి పడుకునుంది శృతి. లోకంలో అడుగడుగునా వేటగాళ్ళుంటారని తెలిసీ తప్పించుకోలేకపోయింది.

రాత్రంతా ఆమె తల దగ్గర కూర్చుని జాగారం చేస్తూనే వున్నాడు సిద్దార్థ. రాజారావు వచ్చి తను వుంటాను, ఇంటికి వెళ్ళమని బతిమాలినా వెళ్ళలేదు. సిద్దార్థచేత త్రిపాఠీ భోజనం తినిపించాలని ప్రయత్నించి లాభం లేదని వూరుకుండిపోయాడు.

ఆ యువకుడి కళ్ళల్లో ఆయనకి కనిపిస్తున్నది దయా....క్షమా కాదు....ప్రేమ! సాటి మనిషిపట్ల హృదయంలో పెల్లుబికే ప్రేమ! మరో సిద్దార్థుడిగా ఈ తరానికి ఆదర్శమయితే ఎంత బావుండూ అనిపించింది. పక్కనే కూర్చున్న రాజారావు భుజం తట్టి అభినందనగా అన్నాడు. "మీ జన్మ ధన్యం రాజారావుగారూ! నాకూ ఇలాంటి క్వాలిటీస్ వున్న కొడుకు వుంటే ఎంతగా సంతోషించేవాడినో. ప్రతి చర్యవల్ల డబ్బురూపకంగా ఎంత లాభం వస్తుందీ? ప్రతి సెకనూ డబ్బు సంపాదించడానికి ఎలా వాడుకోవాలీ అని ఆలోచించే నా కొడుకుల దగ్గరకి వెళ్ళడంకంటే, సిద్దార్థ లాంటి వాళ్ళే వున్న ఈ దేశంలో వృద్ధాశ్రమంలో వుండడం మేలు"



అన్నాడు.

రాజారావు హృదయం గర్వంతో వుప్పొంగింది.

"నా కొడుకు ఎంత ఆస్థి సంపాదించాడో చూస్తుంటే గర్వంగా వుంది త్రిపాఠీగారూ!" అన్నాడు.

శృతకీర్తి జుట్టులో చెయ్యి దూర్చి మంద్రంగా "శృతీ....శృతీ...." అని పిలుస్తూనే వున్నాడు సిద్దార్థ.

తెల్లవారుతుండగా ఎక్కడో ఒక కూజితం సన్నగా కూసింది. ప్రత్యూషం భూపాలరాగానికి పరవశించి కన్ను విప్పింది.

బంగారు కిరణం తెలిమంచులో స్నానమాడి శుచిగా భూదేవిగా ప్రణమిల్లింది. ఆ అందమయిన ప్రభాతంలో అతి నెమ్మదిగా కళ్ళు విప్పింది శృతి.

తన తలమీద చెయ్యివేసి నిమురుతూ ఆత్రంగా తన కళ్ళలోకి చూస్తున్న సిద్దార్థ కనిపించాడు.

"రాత్రల్లా ఇలాగే కూర్చున్నావా?" అడిగింది.

"విశ్వనాథం అంకుల్....నా వాళ్ళని కూడా ఆయనే చంపించి వుంటాడు" అంది ఏడుస్తూ.

"శృతీ! నువ్వు....నువ్వు మాట్లాడావు. అంతేచాలు" ఆనందంగా అన్నాడు సిద్దార్థ.

"చాలు సిద్దూ!" అతని చేతిని పట్టుకుని కళ్ళు మూసుకుని అంది. "ప్రేమని ఒక్కసారైనా అనుభవించకుండా పోతానేమోనని భయపడ్డాను. కానీ ఆ అనుభూతినీ నాకు దక్కించావు.

ప్రేమకోసం నువ్వూ....కీర్తి అంతగా ఎందుకు విలవిలలాడిపోయారో నాకు ఇప్పుడు అర్ధమైంది. కీర్తిని కలిశాను. సంపూర్ణమయిన అనురాగ స్వరూపాన్ని కలిశాను. మనసా, వాచా, కర్మణా ప్రేమించడం, ప్రేమకి కట్టుబడటం అంటే ఏమిటో తెలిసింది.

You can give without loving....
but you cannot love without giving....

అన్నది మీ ఇద్దర్నీ చూస్తే అర్ధమైంది. మీ ప్రేమ కన్నవాళ్ళనీ, చుట్టుపక్కల వాళ్ళనీ హింసించే, బాధించే విప్లవాత్మకమయిన ప్రేమకాదు.

కఠిన శిలని కూడా కోసే కాడులాంటి పవిత్రమైన ప్రేమ! మిమ్మల్ని మీరే నిశ్శబ్దంగా కాల్చుకుని ఆ సెగలకి రగిలారే కానీ, ఎదుటివారికి ఆ వేడిని పంచలేదు. ఉన్నంతలో కాంతినే పంచారు. కీర్తికి నేనేం చెప్పానో తెలుసా?" ఆయాసంతో ఒక్క క్షణం ఆగింది.

"ఏం చెప్పావు?"

"మనం త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాం అని...." సిద్దార్థ విస్మయంగా చూసాడు.

శృతి నవ్వింది. "ఆ అమ్మాయి ఈర్ష్యపడి తిట్టలేదు, బాధతో ఏడవలేదు. ఆనందంతో ఏం చేసిందో తెలుసా?"

సిద్ధార్థ చెప్పమన్నట్లుగా చూసాడు.

"నన్ను గట్టిగా ముద్దుపెట్టుకుని తన కన్యత్వపు మొదటి ముద్దు-తొలిరాత్రి నాడు నీకు అందించమంది. పడిపోయాను సిద్దూ! ఆ నిస్వార్థమయిన, ఈర్ష్యారహితమైన అచంచల ప్రేమకి పూర్తిగా ఆమె పాదాలమీద పడిపోవాలనిపించింది. ఆపుకున్నాను....నాకన్నా చిన్నదన్న కారణాన ఆపుకున్నాను. ఏం సిద్దూ? కీర్తితో అబద్ధం చెప్పినందుకు నామీద కోపం వచ్చిందా?"

సిద్ధార్థ అదే ప్రేమపూర్వకమైన చూపులతో చిరునవ్వు నవ్వాడు.

"కీర్తి కనీసం ఆ ఆనందంతో పెళ్ళిపీటలు ఎక్కుతుంది. మంచిపని చేశావు శృతీ" అన్నాడు.

"మీ ఇద్దరూ....ఇద్దరే సిద్దూ!" శృతి నవ్వుతూనే కళ్ళు తుడుచుకుంది.

• • • •

సాంబమూర్తి ఆతృతగా మూసి వున్న గది తలుపులవైపే చూస్తున్నాడు.

సుభద్ర అటూ ఇటూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది. మధ్యమధ్యలో భర్తని "లోపల ఏం జరుగుతోందో ఏమో, తలుపు కొట్టండి" అని సైగలు చేస్తోంది.

లోపలనుండి ఎటువంటి గొడవా వినిపించడంలేదు, నిశ్శబ్దంగా వుంది.



"నాకు చాలా కంగారుగా వుంది. సిద్ధార్థ సంగతి తెలిసిపోలేదుకదా" అంది భర్తతో.

సాంబమూర్తికీ అలాగే వుంది. అయినా భార్యకి కళ్ళతోనే ధైర్యం చెప్పాడు.

వివేకానంద లోపలికొస్తూ "ఈ ఉదయ్ ఎక్కడున్నాడు బాబాయ్! ప్రొద్దుటనగా ఇంట్లోంచి బయల్దేరాడు" అన్నాడు.

సాంబమూర్తి సంకోచంగానే మూసివున్న తలుపులకేసి చూపించాడు.

"లోపల కీర్తి కూడా వుందా?" ఆశ్చర్యంగానే అడిగాడు వివేకానంద అంతలోనే నవ్వుతూ-"న్యూ జనరేషన్ కదా పిన్నీ...." అన్నాడు సుభద్రతో.

"నాకు మాత్రం భయంగా వుంది బాబూ! ఒక్కసారి నువ్వు పిలిచి చూడు" అంది సుభద్ర.

"వద్దు. ఇంకో ఐదు నిమిషాలు చూద్దాం. ఏమైనా మాట్లాడుకుంటున్నారేమో" అన్నాడు వివేకానంద.

"పెళ్ళికి ముందు ఏమైనా మాట్లాడుకోవలసినవి వుంటే మాట్లాడుకోవడమే మంచిదిలే నాయనా!" అన్నాడు లోతుగా ఆలోచిస్తూ సాంబమూర్తి. అనుభవం మిగిల్చిన ముడతలతో ఆయన మొహం గంభీరంగా వుంది.

• • • •

"అదీ జరిగింది బావా!" అంది మొత్తం పూసగుచ్చినట్లు చెప్పిన కీర్తి.

ఉదయ్ చేతులు కట్టుకుని నిలబడి "ఊ! నాకు ఇప్పుడు అర్థమవుతోంది!" అన్నాడు శాంతంగా.

"ఏమిటీ?" కీర్తి భయంగా అడిగింది.

"నిన్ను నేను తాకినప్పుడు, శరీరం అలా నిర్జీవంగా ఎందుకు మారిందో ఇప్పుడు అర్థం అయింది. పూర్తిగా ఇంకొక వ్యక్తి వశం అయిన నీ మనసూ, శరీరం అలా కాక స్పందిస్తాయా! మరి నా పిచ్చికాకపోతే....నేనే కళ్ళుండి గుడ్డివాడిలా, బుద్ధిలేనివాడిలా ప్రవర్తించాను!"

"బావా....నన్ను క్షమించు, నిన్ను మోసం చెయ్యాలని నాకు ఏ కోశానా లేదు. కానీ నాన్న, అమ్మా ఈ విషయం నీతో చెప్పొద్దని నాచేత ప్రమాణం చేయించుకున్నారు. అసలు సిద్ధార్థని నేను ప్రేమించాననే భావం తప్ప....ఇద్దరం కలుసుకోవడం, మాట్లాడుకోవడం, ఒకర్ని ఒకరు తాకడం....అస్సలు అలాంటివేమీ చెయ్యలేదు బావా!"

"అలాంటివి చెయ్యకుండా ఈ పెద్దలు అడ్డుపడ్డారు. కానీ మీ మనసుల్లో ప్రేమ అనే భావం కలగకుండా, అది ఆగిపోవడానికి ఏమైనా చెయ్యగలిగారా?"

"అసాధ్యం బావా!" నిర్భయంగా చెప్పింది కీర్తి.

"మనసు పరాధీనమై యున్న నిన్ను నేను ఎందుకు చేసుకోవాలి కీర్తీ?" సూటిగా అడిగాడు ఉదయ్,

కీర్తి జవాబు చెప్పలేనట్లు చూసింది.

"పద...." కీర్తి చెయ్యి పట్టుకుని లాగుతూ అన్నాడు.

"ఎక్కడికి బావా?" భయంగా అడిగింది.

"చెప్తాను పద!" ఆమెని చరచరా లాగుతూ అన్నాడు.

తలుపులు తెరుచుకోగానే అందరూ అదిరే గుండెలతో అటు చూశారు.

ఉదయ్ అందరివంకా ఒకసారి గంభీరంగా చూసి "పద కీర్తీ!" అంటూ ఆమెని లాక్కుని వెళ్ళాడు.

"ఉదయ్....ఎక్కడికి?" అని వివేకానంద అడిగాడు.

ఉదయ్ ఆగలేదు. "సిద్ధార్థ దగ్గరకి" అని జవాబిచ్చాడు.

"నాకు భయంగా వుంది. మీరు కూడా వెళ్ళండి!" అంది కంగారుగా సుభద్ర.

"అతని ఎడ్రెస్సు నాకు తెలుసు. పదండి" సాంబమూర్తితో అని వివేకానందా బయలుదేరాడు.

* * * *

హాస్పిటల్ రూమ్.

లోపలకొస్తున్న ఉదయ్‌నీ, పెళ్ళికూతురి అలంకరణలో వున్న కీర్తినీ సిద్ధార్థ ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.



శృతకీర్తి కూడా బెడ్‌మీద లేచి కూర్చుని విస్మయంగా చూసింది.

ఉదయ్ సిద్ధార్థ దగ్గరకొచ్చి చటుక్కున అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుని అన్నాడు.

"నేను ఎంత అదృష్టవంతుడిని సార్! నా దేవుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించుకోగలుగుతున్నాను. ఇంటికెళితే మీరిక్కడున్నారని ఇంటివాళ్ళు చెప్పారు" అన్నాడు.

"ఏమంటున్నావు ఉదయ్?" సంభ్రమంగా అన్నాడు సిద్ధార్థ.

"నాకు మీ డయిరీ అంతా చెప్పింది. మీ డయిరీ చదివినందుకు క్షమించండి. కానీ చదవకపోతే ఆ దైవం కూడా క్షమించలేని నేరం చేసి వుండేవాడిని. మీ ప్రేమదేవత మా కీర్తి అని తెలిస్తే, ఏనాడో ఆనందంగా మిమ్మల్నిద్దర్నీ ఏకం చేసుండేవాడిని. ఇప్పటికైనా తెలిసినందుకు నాకు చాలా సంతోషంగా వుంది. నేను వేడుకున్న దేవుడు నాకు అన్యాయం చెయ్యలేదు. చూశారా?"

"కీర్తీ! తోడబుట్టినవాళ్ళకీ, మనకీ పెద్ద తేడా లేదు. అలా కలిసి పెరిగాం. మనసు విప్పి నాతో విషయం నువ్వు చెప్పుండాల్సింది. చెప్పలేదు. పోనీ సిద్ధార్థ అయినా తెలిశాక ఒక్కమాట చెప్పాల్సింది. ఎంతో ఉన్నతమైన సంస్కారం కల అతను చెప్పలేకపోయాడు. కానీ, దేవుడు నా ముందున్నాడు. అందుకే నాచేత చేయరాని పాపం చేయించకుండా అడ్డుపడ్డాడు. ఇదిగో...."

కీర్తిని చెయ్యి పట్టుకుని సిద్ధార్థ పక్కకి తీసుకొచ్చి నిలబెడుతూ అన్నాడు. "సిద్ధార్థగారూ! మీ కీర్తి....మీ పేరు వింటే పులకరించి, మీ దర్శనంతో వెలిగిపోయి, మీ స్పర్శతో పునీతమయ్యే కీర్తి! ఈ చేతిని పట్టుకోండి. ఎన్నటికీ, ఎవరికీ విడిచి వదిలిపెట్టకండి. ప్లీజ్!" వేడుకోలుగా అన్నాడు.

సిద్ధార్థ కీర్తివైపు చూశాడు.

ఆమె కళ్ళనిండా నీళ్ళతో "ఇది జరగని పని బావా....నేను మాటిచ్చాను. నా కన్నవాళ్ళకి మచ్చ తెచ్చే విధంగా నా సంతోషం కోసం నేను ఈ పెళ్ళికి ఒప్పుకోలేను. స్టాంప్‌పేపర్ మీద నేను పెట్టిన సంతకం కన్నా, నా తండ్రి మనసులో నేను సంపాదించుకున్న నమ్మకం గొప్పది. ఈ

జీవితానికి ఈ వరం లేదు. ఇది జరిగేపని కాదు!" అంది.

"ఉపకారికి ప్రత్యుపకారం చెయ్యలేకపోతే మానెయ్, అపకారం చెయ్యకూడదు కదా కీర్తీ! ఏపీ కాని ఒక అపరిచితుడివి నిలువెల్లా గాయాలతో, భుజంమీద వేసుకుని తెలియని ప్రదేశంలో గమ్యం కోసం వెతుకుతూ ఆ రాత్రి అన్ని మైళ్ళు నడిచి ఈ అద్భుత వ్యక్తి నన్ను కాపాడి వుండకపోతే.... ఈ ఉదయ్ యిక్కడ వుండేవాడు కాదుకదా....ఆ తుప్పల్లో ప్రాణాలు విడిచేవాడు! తన రక్తం కూడా దానంచేసి నన్ను బ్రతికించిన మనిషికి అతని జీవితాన్ని అతని నుంచి లాక్కుని, అంత మహాపరాధాన్ని నా నెత్తిన వేసుకుని జీవితాంతం కుమలమంటావా? నా పరిస్థితిలో నువ్వుంటే ఏంచేస్తావు కీర్తీ....?" అనునయంగా అడిగాడు ఉదయ్.

సిద్ధార్థ ఉదయ్ భుజంతట్టి "ఇంత పెద్ద స్టెప్ తనని అడగకుండా ఎందుకు తీసుకున్నావ్ ఉదయ్?" అన్నాడు.

"కొన్ని కొన్నిసార్లు పెద్ద స్టెప్పే తీసుకోవాలి సార్! పెద్ద అగాధాన్ని చిన్నచిన్న అడుగుల్లో విడగొట్టి దాటుతానంటే ఎలా వీలవదో, ఇదీ అంతే! కీర్తి మనసంతా మీరే నిండి వున్నారు, అందుకు సాక్ష్యం ఆమె శరీరం. నేను చెయ్యి పట్టుకున్నా మంచుముక్కలా ఏ స్పందనా లేకుండా నిర్జీవంగా మారే ఆమెని భార్యగా చూడలేను సార్! కాదనకండి" బతిమలాడు కన్నీళ్ళతో ఉదయ్.

సాంబమూర్తీ, సుభద్రా, వివేకానంద లోపలికి వచ్చారు.

"మావయ్యా! నేను నిన్ను అడగకుండానే కీర్తి పెళ్ళి సిద్ధార్థ గారితో జరిపించాలనే నిర్ణయం తీసుకున్నందుకు మన్నించు. కానీ నీకు ఓ కొడుకున్నా ఇప్పుడు ఇలాగే వుండేవాడు. అందుకే ఆ స్థానంలో కొచ్చి నేనీ పని చేస్తున్నాను. కాదనకు!" సాంబమూర్తితో చెప్పాడు ఉదయ్.

సుభద్ర నోటిమీద చెయ్యి వేసుకుని "అయ్యో....అయ్యో....ఆ అబ్బాయి తండ్రి....ఏమీలేకుండానే ఉత్త పుణ్యానికి మా కుటుంబాన్ని వీధికీడ్చి రచ్చ చేసాడురా. ఇప్పుడు ఏకంగా నువ్వు పెళ్ళి చేస్తానంటే పూరుకుంటాడా?" అంది.

"మీకు ఆ భయంలేదు. మా అంకుల్ ఇప్పుడు చాలా మారి



పోయారు. సిద్ధార్థ కోసం ఏమైనా చెయ్యడానికి సిద్ధంగా వున్నారు. కావాలంటే మీరే చూడండి" అన్న శృతకీర్తి సెల్ తీసి రాజారావుకి డయల్ చేసింది.

రాజారావు లైన్‌లోకి రాగానే "అంకుల్! మీరు అర్జెంట్‌గా హాస్పిటల్‌కి రండి, మనం చేసిన పొరపాటుని సరిదిద్దుకోవాలి. కీర్తీ, సిద్ధూలని ఒకటి చెయ్యాలి. అవును, అదే! వాళ్ళ అమ్మ, నాన్నగారూ, అందరూ ఇక్కడే వున్నారు, బయలుదేరండి" అని ఫోన్ పెట్టేసింది.

సాంబమూర్తికి ఆనాడు జరిగిన అవమానం గుర్తుకొచ్చి మొహం మ్లానమైంది.

"బాబూ, మీరు ఉదయ్‌ని కాపాడిన దేవుడే! కాని మీ ఇంటి కోడలిగా వచ్చే అర్హతలేవీ నా కూతురిలో లేవు. మీ నాన్నగారు ఎప్పుడో చెప్పేసారు. మేం మీ తాహతుకి తూగలేము. చాలా బీదవాళ్ళం....!" అన్నాడు.

సిద్ధార్థ నవ్వి "మీరు మా అందరికన్నా భాగ్యవంతులు. ఎందుకంటే మీ దగ్గర కీర్తి వుంది. మాట తప్పని ప్రతిష్ట వుంది. ఎన్నున్నా కీర్తిలేని నేను విర్భాగ్యుడ్నే సార్!" అన్నాడు.

అతను ఆ మాటలు పలికిన తీరుకి సాంబమూర్తి మనసు విలవిలలాడింది.

"అదికాదు బాబూ! మీ నాన్న."

"దుర్మార్గుడు....దుష్టుడు....కాసుకి ఆశపడి కన్నకొడుకునే అమ్ముకునే ధనదాహంగల లోభి. ఉచితానుచితాలు చూడకుండా మీలాంటి మంచి వ్యక్తిని అవమానించినందుకు నాకు ఈ బిరుదులన్నీ దక్కాల్సిందే బావగారూ!" అన్నాడు అప్పుడే వచ్చిన రాజారావు.

'బావగారూ!' అన్న సంబోధనకి ఆశ్చర్యంగా చూసారు సుభద్రా, సాంబమూర్తీ, కీర్తీ.

రాజారావు ముందుకి వచ్చి "ఆనాడే నా కొడుకు చెప్పాడు ఇప్పుడు ఇంట్లోంచి కన్నీళ్ళతో నడిచి వెళ్ళిన అమ్మాయికి సిరిసంపదలూ, గుణ

శిలాలూ రెండు పాదాలని! వెర్రివాడినై, కళ్ళు మూసుకుపోయి ప్రవర్తించాను. ఆనాటి నుండీ నా ఇంటిదీపం వెలగలేదు. ఆనందంగా కడుపుకి తిన లేదు. కంటికి నిద్రలేదు....నమ్మండి."

కీర్తిని దగ్గరకు తీసుకున్నాడు. "మీ కూతురు మీ కనుసన్నల్లో నడుస్తుంది. ఎంత ప్రేమించినా మిమ్మల్ని కాదని నా కొడుకు కోసం రాలేదు! కానీ, నా కొడుకుని ప్రేమ అనే సంకెళ్ళతో పూర్తిగా బంధించి తనవాడిగా చేసుకుంది. వాడు నాకు దక్కాలంటే, మీరు మీ అమ్మాయికి 'అమ్మా! సిద్ధార్థని పెళ్ళిచేసుకో! ఆ ముసలి తండ్రిని క్షమించూ!' అని చెప్పాలి....నాకు తెలుసు! ఇదిగో నేను చేసిన పాపం" రాజారావు చేతిలో గుండ్రంగా చుట్టివున్న కాయితాన్ని చూపిస్తూ అన్నాడు "దీన్ని ముక్కలుగా చింపి మీ పాదాలమీద పోస్తాను. నన్ను మన్నించండి" కాయితాన్ని చింపి, కీర్తి సంతకం పెట్టిన ఆ ముక్కల్ని ఒంగి సాంబమూర్తి పాదాల దగ్గరపోస్తూ అన్నాడు కన్నీళ్ళతో రాజారావు.

"అయ్యో! ఎంత పని బాబూ!" సాంబమూర్తి వంగి రాజారావుని లేవదీసాడు.

రాజారావు కీర్తినీ, సిద్ధార్థనీ రెండు చేతులతో దగ్గరకి తీసుకున్నాడు.

సుభద్ర ఆనందం, దుఃఖం ఏకకాలంలో కలిగి ఆపుకోలేక కొంగు నోట్లో కుక్కుకుంది.

"నేను మొదట్లోనే గ్రహించాను. నా లెక్క తప్పలేదు" గొణుక్కున్నాడు వివేకానంద.

సాంబమూర్తి గర్వంగా చూసుకున్నాడు కూతుర్నీ, సిద్ధార్థనీ.

"ఎవన్నారండీ ఈకాలం పిల్లలు బొత్తిగా పెద్దవాళ్ళంటే గౌరవం, మన్ననా, ఒక సంప్రదాయం, పద్ధతి లేకుండా పెరుగుతున్నారనీ....మన కీర్తి, శృతి, ఉదయ్, సిద్ధార్థలు ఈ కాలం పిల్లలేగా. మనకంటే పెద్ద మనసుతో ఆలోచించి, ప్రవర్తించారు. ఏమంటారు?" అన్నాడు రాజారావుతో.



"అవును! నరకంలో ఇనప మూకుడులో మసిలే నూనెలో వున్న స్థలం ఎవరికోసం రిజర్వ్ చేయబడి వుంటుందో మీకు తెలుసా?" అడిగాడు రాజారావు.

"ఎవరికోసం?" అడిగాడు సాంబమూర్తి.

"పక్కవాడు కష్టంలో వున్నప్పుడు పట్టించుకోకుండా, తనకోసం ప్రాకులాడే వాళ్ళకోసం" అన్నాడు రాజారావు.

అందరూ నవ్వేసారు.

సిద్దార్థ అప్పుడే చూసాడు కీర్తి కళ్ళలోకి.

అతను అభిముఖంగా నిలబడితే తనని పూర్తిగా కప్పేస్తున్న విశాలమయిన ఛాతీని ఓరగా చూస్తుంటేనే కీర్తి మనసులో ఏవేవో చిలిపి ఊహలు కలిగి, చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

శృతి పెద్దగా చప్పట్లుకొడుతూ "మొత్తానికి Iove story without romance....ఈ రోజుతో పూర్తయింది" అంది.

ఒకరిని ఒకరు మనస్ఫూర్తిగా చూసుకోడానికి కూడా పరిచయమైన నాటినుండీ దడిసిన కీర్తీ, సిద్ధార్థా ధైర్యంగా ఒకరివైపు ఒకరు ఆర్తిగా చూసుకున్నారు.

"ప్రేమలేఖలు లేవు. స్వీట్ నథింగ్స్‌లేవు.... షికార్లులేవు.... ఫోన్ కాల్స్ లేవు. పూర్ రొమాన్స్!" శృతి ఇంకా ఆట పట్టిస్తూ అంది సిద్ధార్థని.

కీర్తి బుగ్గలు ఇంకా ఇంకా మంకెనలయ్యాయి. సిగ్గు చింతాకే అయి రెండు చేతులతో మొహాన్ని కప్పుకుంది.

"కీర్తీ! ఆ చేతులు తియ్యి చెప్తాను. అదీ.... ఇప్పుడొచ్చింది...." అన్నాడు ఉదయ్ కీర్తి చేతులు పట్టుకుని తొలగిస్తూ.

"ఏమిట్రా ఆ అవస్థ?" అంది సుభద్ర.

"పెళ్ళికళ అత్తయ్యా!" అన్నాడు ఉదయ్.

"ప్లీజ్ ఎక్స్క్యూజ్ అజ్ ఫర్ ఫ్యూ మినిట్స్...." అన్నాడు సిద్ధార్థ అందర్నీ చూస్తూ.

"ఓ! హీరోకి రోషం వచ్చిందే!" అంది శృతి అల్లరిగా.

సిద్ధార్థ తండ్రినడిగి కారు కీస్ తీసుకుని, కీర్తి చెయ్యి పట్టుకుని హఠాత్తుగా బయటికి లాక్కెళ్ళాడు.

కీర్తి ఆ హఠాత్ సంఘటన నుండి తేరుకోకముందే "గెట్ ఇన్" అంటూ కారులో ఎక్కించి, తనూ ఒక్క అంగలో కారులో కూర్చుని స్టార్ట్ చేసాడు.

కారు దూరాన్ని కోస్తూ.... గమ్యాన్ని చూపిస్తూ సాగిపోతోంది. చాలాదూరం వెళ్ళేవరకూ ఎవరూ మాట్లాడలేదు.

సడెన్‌గా కారాపి కీర్తివైపు తిరిగాడు సిద్ధార్థ.

"ఇంతదూరం ఎందుకు?"

"నువ్వే దగ్గరకు రావచ్చుగా?"

"ఇందుకే నేను ఇన్నాళ్ళు ఎదురుచూసింది!"

అతని చేతులు ఆమె భుజాల మీదనుండి క్రిందకి జారి నునుపైన చోట ఆగిపోయాయి.

ముక్కుని ముక్కు ఆటపట్టిస్తూ 'చూసావా.... ముక్కు చివర కోపం వుంటే ఎలా పోగొట్టొచ్చో!" అంటోంది.

ఈలోగా పట్టుతప్పుతున్న ఆమె సున్నిత దేహం స్వల్పంగా చలించింది.

'నేనున్నాగా' అన్నట్టు అతని విశాల వక్షం తనలో పొదువుకుంది!

అధరాలు చనువు పెరిగి పరామర్శలనుండి అడుగు ముందుకి వేసి తలుపు తెరిచి లోనికి ఆహ్వానించాయి. ఇంతలో పిలవని చుట్టంలా హఠాత్తుగా పదునైన అతని నాలుక లోపలికి చొరబడింది.



గుండె గొంతులొక్కటిగా మారడం అంటే తెలిసినట్లు ఆమె హృదయం అంతా ఎంగిలి చెయ్యబడింది.

అదుపు తప్పిన శరీరాన్ని స్వాధీనపరచుకోడానికి పెదవులని పెదవులతో నొక్కిపట్టి ప్రయత్నిస్తూనే వున్నాడు.

పిలవని చుట్టంలా వచ్చి ప్రేమకావ్యాలు లిఖిస్తున్న అతని నాలుక— అప్పటిదాకా అల్లరి నవ్వులకి మాత్రమే పరిమితమైన ఆమె పెదవుల తాకిడికి నిర్ఘాంతపోయి.... ఓడిపోయి.... ఆమెకి బందీగా పట్టుబడిపోయింది!

ఎన్నో రోజులుగా దాచుకుని పేర్చుకున్న కబుర్లన్నీ ఒక్కసారిగా అతని ముందు కుప్పపోసినట్లు.... గుండె గొంతుతో చెప్తూనే వుంది!

అతని కళ్ళు ఆమెలోకంటా దూసుకుపోతూ అగాథాలని స్పృశిస్తున్నాయి.

ఆ చూపుకి ఆమె అప్రయత్నంగా ఇంకా దగ్గరకి జరిగింది.

శరీరానికీ భాష వుంది! అది ప్రేమించే మనసుకి మాత్రమే అర్థమవుతుంది.

మౌనంగా చూస్తే....'నిన్ను ఎంతగా మిస్ అయ్యానో తెలుసా?'

'చెయ్యి మొహాన్ని తడిమితే.... నాకోసం ఎంతగా తపించిపోయావో తెలిసిందిలే!'

అతని గుండెలో తలదూరిస్తే.... 'నీ హృదయంలో బాధని నాకు తెలియకూడదని దాస్తున్నావుగా!'

చేతివేళ్ళలోకి చేతివేళ్ళు జొనిపి గట్టిగా బంధిస్తే.... 'ఇంక నిన్ను ప్రాణం పోయినా విడవనుగా!'

అతని చేతివేళ్ళు ఆమె తలని నిమురుతే.... 'నాకు నీ శరీరమే కాదు, మనసూ ముఖ్యమే!'

ఆమె చేతివేళ్ళు అతని జుట్టుని చెరిపితే.... 'ఒక్కసారి ముద్దు పెట్టుకో. చాలా సేపయింది!'

గాఢంగా ముద్దుపెట్టుకుంటూ వీపుని మధ్యలో కొద్దిగా నొక్కితే....
'ఐ లవ్ యూ!'

కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూస్తూ నాలిక కొనతో మెత్తగా స్పృశిస్తే....
'నిన్ను మొదటి చూపులోనే ప్రేమించాను తెలుసా?'

గుండె కొట్టుకునే వేగం పెరిగిపోతే.... 'మనం ఇంక దూరంగా వుండలేము పద!'

కీర్తి కళ్ళు మౌనంగా మాట్లాడుతూ సిద్ధార్థతో అన్నాయి కదా-

"Press your lips against mine
and try to catch me....
I'm Falling....I'm falling."

—: అయిపోయింది :—